సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 19 సంచిక: 40

శనివారం 2-5-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

33 సంవత్సరాలుగా లక్షలాదిమంది విభిన్న రంగాల విజేతల రూపకల్పన! అందుకే... బ్రైట్ కెరీర్ ఏదైనా 'కేశవరెడ్డి' నెంబర్ వన్ స్టేయర్

కేశవరెడ్డి విద్యాసంస్థలు

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ

91003 30121, 91000 65505

మొన్నటి TG SSC-2026 ఫలితాల్లో

స్టేట్ టాప్ 597/600 సాధించిన నలుగురు విద్యార్థుల్లో ఇద్దరు కేశవరెడ్డి విద్యార్థులే!...

ఆ పైనా అదే ఆధిక్యం...ఇలా స్టేట్ టాప్ మార్కుల్లో తిరుగులేని మోనోపోలీ!

స్టేట్ టాప్ 100 లో 72% కేశవరెడ్డి విద్యార్థులు!

ఇలా ఓవరాల్ రిజల్ట్ లోనూ సాటిలేని మెగా 'షేర్'!!

నిన్నటి AP SSC-2026 ఫలితాల్లోనూ

స్టేట్ టాప్ మార్కులతో పాటు మరెవ్వరికీ సాధ్యం కాని ఆల్ టైం రికార్డ్స్

నిజానికి.... ఒక్క SSC ఫలితాలలోనే కాదు...



వందల ఎకరాల సువిశాల క్యాంపస్‌లు

రేపటి సవాళ్లకు ధీటుగా గ్లోబల్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్

గేమ్స్, స్పోర్ట్స్, ఫైన్ ఆర్ట్స్ తో కంప్లీట్ ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్

అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే టాప్ IIT-JEE & NEET ఫౌండేషన్

సమగ్రమైన కాన్సెప్ట్స్ ఇచ్చేందుకు CBSE-ICSE-State ఇంటిగ్రేటెడ్ సిలబస్



మెమరబుల్ స్కూల్ లైఫ్ అందించేలా స్టేట్ బెస్ట్ రెసిడెన్షియల్ స్కూలింగ్

ఇలా ఒక సరైన స్కూలింగ్‌కు సంబంధించిన అన్ని అంశాలను లోతుగా విశ్లేషిస్తే తెలిసొచ్చే వాస్తవం...

33 సంవత్సరాలుగా ... AP అయినా ... TG అయినా ...

పోటీ లేదు ... పోలికా లేదు ... స్కూల్ ఎడ్యుకేషన్ అంటే

వన్ & ఓన్లీ 'కేశవరెడ్డి'

రాష్ట్ర స్థాయి విజయం... ఎప్పటి లాగే దాసోహం

స్టేట్ 'టాప్' స్కోర్

J ABISHIKTH 597 2619121922	M AFSHEEN FATHIMAH 597 2619125795	U SAFIYA FALAK 596 2624121442	M PRANITHA 596 2622103716	A V PHANINDRA REDDY 596 2622108606	BHUMA MOHIT REDDY 596 2622104019	CHITRA THANUJA 596 2625107623	P LAKSHMI SOWMYA 596 2622100255	MADUR HARIKA 596 2622102111	KURUVA SAHASRA 595 2622102909
K GEETHANJALI 595 2622104111	MEKALA GANESH 594 2622108457	Y SRIYA REDDY 594 2625107619	S GIRISH LEKHYA 594 2625101727	PABBISETTY AMRUTHA 594 2625106006	YERASI VASAVI 594 2622108293	SHAIK AYERA FATHIMA 594 2625106502	U P THANVITHA 594 2622108717	A SEEMA REDDY 593 2619125304	B ASRITHA REDDY 593 2622103057
G HARINI 593 2620102401	Y CHINNA SEETHANNA 593 2622101653	G BHAVANA REDDY 593 2622102917	SK MD SALMAN 593 2622103880	K.B. BAVANA REDDY 593 2620100159	C NAGA ROHITHA 593 2622103107	K SHAMATHA 593 2625101864	P NAVYA SREE 593 2619124174	P GEETHIKA 593 2620102941	R KIRAN REDDY 592 2622108345
C MOULEESWARA REDDY 592 2622108359	PACHI PALA HEMA SREE 592 2622108693	T SAI SIDDARTHA 592 2622108368	N HARSHITHA 592 2620102445	C NAGA CHAITANYA 592 2622108469	GUJJAR DEVA DATTA RAO 592 2622103702	SHAIK RIDA SIMRA 591 2621104496	M BHANU TEJA SREE 591 2622103360	K VENKATA KARTHIK 591 2622108291	A CHANDANA GAYATHRI 591 2621107137
CHINNAMMI SIROHI 591 2622101519	A SREE VAISHNAVI 591 2622108288	P SARAN TEJA 591 2622101589	J ASHRITHA 591 2601105426	Y VINUTHNA SAI 591 2622103175	T VISWA TEJA 591 2620102628	N ARAVIND 590 2621105262	K DEEKSHITHA 590 2622108498	A SAI JEEVANA 590 2622108290	JAJAVA POOJITH 590 2619126487
SHAIK FOUZIYA SULTHANA 590 2625108123	PALUGARI JAYA KETHAN 590 2622108365	MOODE RANJEET KUMAR 590 2622108738	A HARSHA VARDHAN 590 2622108302	GANGULA KAVYASRI 590 2622108631	MITTA GANGA KUSUMA 590 2622108267	K THARUN RAM 590 2620101921	P AKSHARA 590 2620102624	D BHAVYA SREE 590 2625100333	P AARADHYA REDDY 590 2624120946

ఏ కొద్దిమందిదో కాదు ఘనత... ప్రతి విద్యార్థి ఒక తిరుగులేని విజేత

స్టేట్ బెస్ట్ స్కోర్

స్టేట్ టాప్ లో 275 మంది విద్యార్థులు

ప్రతి 5 గురిలో ఇద్దరికి 540 ఆ పైగా మార్కులు

ప్రతి 5 గురిలో ముగ్గురికి 500 ఆ పైగా మార్కులు

100/100 మార్కులు 705

మార్కులు సగటున 84% లాంగ్వేజెస్ 86% గ్రూప్స్

హై ఫస్ట్ క్లాస్ మార్కులు 95% విద్యార్థులకు

ఈ అద్భుత విజయంలో భాగస్వాములైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతాభినందనలు!

Since 1993

కేశవరెడ్డి విద్యాసంస్థలు

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ

డే - సెమి రెసిడెన్షియల్ - రెసిడెన్షియల్

తెలుగు రాష్ట్రాలలో 30 అద్భుతమైన క్యాంపస్‌లు

అడ్మిషన్ల వివరాలకు +91 91003 30121, 91000 65505

www.keshavareddy.edu.in

atomadvtg@gmail.com

PARROT 9246532157

TRADITION
MEETS
TOMORROW
BBA - MBA
AI
ARTIFICIAL INTELLIGENCE
DATA SCIENCE
BUSINESS ANALYTICS
MACHINE LEARNING
FAMILY BUSINESS
ఆంధ్రప్రదేశ్ అనాదిగా అభివృద్ధి చెందుతున్న వ్యాపారాలకు నిలయంగా ఉంది.
హస్తకళల నుండి చేనేత వరకు, RETAIL నుండి WHOLESALE వరకు,
వినోదరంగం నుండి నిర్మాణరంగం వరకు, రైసుమిల్లుల నుండి పొగాకు,
ప్రత్తి, మిరప, పసుపు వ్యాపారరంగాల వరకూ..
కానీ నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ
వేగంగా మార్పు చెందుతున్న తరుణంలో సంప్రదాయం మాత్రమే సరిపోదు.
వ్యాపార నిర్వహణను బోధించడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా
విస్తరించటానికి, మన ఆలోచనా విధానాన్ని మార్చే బిజినెస్ స్కూల్
మనకు అవసరం.
విద్యార్థులు వారి మూలాలను గౌరవిస్తూ ARTIFICIAL INTELLIGENCE,
DIGITAL FINANCE, GLOBAL STARATEGY AND SUSTAINABLE BUSINESS
MODELS వంటి అంశాలపై పట్టు సాధించడానికి ఆంధ్రప్రదేశ్‌కు
ఒక మంచి బిజినెస్ స్కూల్ అవసరం ఉంది.
ఆ కళాశాల మన వారసత్వ ఆత్మను ప్రబోధిస్తూ,
భవిష్యత్తులోనికి మనల్ని నడిపించాలన్న
సదుద్దేశంతో...
APPA
SCHOOL OF BUSINESS
BBA - MBA
ARTIFICIAL INTELLIGENCE
Admissions Open
JOIN NOW
Absolute Discipline
మన
VVIT
UNIVERSITY
VASIREDDY VENKATADRI
INTERNATIONAL TECHNOLOGICAL UNIVERSITY
Absolute Education
NAMBUR, GUNTUR, A.P, INDIA - 522 508. ✆: 83410 98336, 81794 88336, 77029 43336. WWW.VVITU.AC.IN

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 19 సంచిక: 40

శనివారం 2-5-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

ఢిల్లీ గెలిచిందోచ్...

రాజస్తాన్‌పై 7 వికెట్లతో గెలుపు.. రాణించిన రాహుల్, నిసాంక, స్టార్క్ -11లో

అదరగొట్టిన భారత్

థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో విజయం -11లో



అతిపెద్ద డ్రగ్స్ దందా గుట్టురట్టు

ముంబైలో రూ.1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్‌సీబీ పట్టుకుందని హోం మంత్రి అమిత్ షా తెలిపారు.

వివరాలు 6లో ▸



'మహేంద్రగిరి' స్వదేశీ సిరి

శక్తివంతమైన ఆయుధ వ్యవస్థ కలిగిన స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ 'మహేంద్రగిరి'ని భారత నేవీకి అప్పగించారు.

వివరాలు 6లో ▸

బారియర్‌లెస్ టోల్ వ్యవస్థ

దేశంలోనే తొలి బారియర్‌లెస్ మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో టోల్ వ్యవస్థను సూరత్ సమీపంలో కేంద్ర మంత్రి గడ్కరీ ప్రారంభించారు.

వివరాలు 6లో ▸

ఇరాన్ ప్రతిపాదన నచ్చలేదు

యుద్ధాన్ని పూర్తిగా ముగించడానికి ఇరాన్ చేసిన కొత్త ప్రతిపాదన తనకు నచ్చలేదని ట్రంప్ చెప్పారు.

వివరాలు 6లో ▸

టెన్త్ సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల

2లో

పరీక్షల నిర్వహణ: మే 25 నుంచి జూన్ 4 వరకు

పరీక్షా సమయం: ఉదయం 9: 30 నుంచి మధ్యాహ్నం 12: 45 వరకు

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ 12లో

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ	మే 30
ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల	జూన్ 12

ధ్రువపత్రాల పరిశీలన తేదీలు

నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లకు	జూన్ 19, 20
ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు	జూన్ 22, 23
ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు	జూన్ 5 నుంచి 8 వరకు

ట్రిపుల్ ఐటీల్లో విద్యార్థుల ప్రవేశం: జూలై 1

రాష్ట్రంలో చంద్రబాబు సర్కారు దోపిడీకి సరికొత్త దారులు వెతుకుతోంది.. పూటకో నిర్ణయంతో రాజధాని నిర్మాణ వ్యయాన్ని కనీవినీ ఎరుగని రీతిలో ఇష్టారాజ్యంగా పెంచేస్తోంది. ఇప్పటికే కాంట్రాక్టుకు ఇచ్చిన పనిని మళ్లీ ముక్కలు ముక్కలుగా చేసి అదనంగా దోచి పెడుతోంది.. ప్రజల సొమ్మును అందినకాడికి దండుకోడానికి ఇంతగా బరితెగించడం నిర్మాణ రంగ నిపుణులను విస్మయ పరుస్తోంది.. ఇంతటి అవినీతి బహుశా ప్రపంచంలో ఎక్కడా ఉండదని అధికారవర్గాలు నివ్వెరపోతున్నాయి.

అవినీతిలో అ'ధర'హో!

విజనరీ పాలనలో శాశ్వత సచివాలయ నిర్మాణం ఒక్క చదరపు అడుగు ▸ రూ.18,413

టవర్లకు అద్దాలు అమర్చేందుకు రూ.2,540 కోట్లతో పరిపాలన అనుమతులు

వాటికి మూడు ప్యాకేజీల కింద టెండర్లు

ఫలితంగా రూ.9,612.85 కోట్లకు చేరుకున్న నిర్మాణ వ్యయం

2లో

- 2018లో ఐదు టవర్ల నిర్మాణ పనులకు మూడు ప్యాకేజీల కింద టెండర్లు
- చ.అ రూ.4,350.42 చొప్పున షాపూర్‌జీ పల్లోంజీ, ఎన్‌సీసీ, ఎల్ అండ్ టీకి పనులు అప్పగింత
- 2024లో ఆ కాంట్రాక్టు ఒప్పందాలను రద్దు చేసిన చంద్రబాబు ప్రభుత్వం
- భారీగా పెంచిన కొత్త రేట్లతో అనుకూల కాంట్రాక్టర్లకు దోచిపెట్టే ఎత్తుగడ
- నాటికీ నేటికీ స్టీల్, సిమెంటు ధరల్లో పెద్ద వ్యత్యాసం లేదు.. ఇసుక ఉచితం
- కానీ అంచనా వ్యయం భారీగా పెంచేసి పాత సంస్థలకే పనుల అప్పగింత
- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో ఫైవ్ స్టార్ వసతులతో చదరపు అడుగు రూ.4000-4,500
- భారీ ముడుపుల కోసమే అంచనా వ్యయం పెంచేశారంటున్న నిపుణులు
- అప్పగా తెచ్చిన నిధులను కాంట్రాక్టర్లతో కలిసి దోచుకుంటున్న వైనం

'బండ' బాదుడు

వాణిజ్య సిలిండర్‌పై రూ.993 పెంపు

సిలిండర్ ధర రూ.3,315కు చేరిక

ఈ నేపథ్యంలో మెనూ రేట్లలో 10 శాతం పెంపు

ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రకటన

సాక్షి, అమరావతి : వాణిజ్య సిలిండర్ ధర అమాంతంగా పెరిగిపోయింది. ఒక్కసారిగా రూ.993 పెరిగింది. గడిచిన 22 నెలల్లో ఈ గ్యాస్ ధర మూడుసార్లు పెరిగినట్లయింది. తాజా పెరుగుదలతో 19 కిలోల వాణిజ్య సిలిండర్ రూ.3,315 పలుకుతోంది. కాగా, రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ సంక్షోభం, వాణిజ్య గ్యాస్ రేట్ల భారీ పెంపుతో హోటల్ రంగం కుదేలయ్యిందని స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితులతో హోటళ్ల యజమానులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. హోటల్ వ్యవస్థను కాపాడుకోవడానికి మెనూ ధరల్లో 10 శాతం పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పన్ను రాయితీలు, సబ్సిడీలిచ్చి హోటల్ రంగాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వేలాది మంది కార్మికుల ఉపాధిని కాపాడటానికి, హోటళ్లను ఆర్థిక నష్టాల నుంచి బయటపడేయటానికి గత్యంతరంలేని పరిస్థితుల్లో రేట్లు పెంచుతున్నామన్నారు. వంట నూనెలు, నిత్యావసరాలు, ప్యాకింగ్ మెటీరియల్ ఖర్చులు భారీగా పెరిగాయన్నారు.

త్వరలో పెట్రో బాదుడు!

- పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.4 నుంచి రూ.5 పెంపు
- వంట గ్యాస్ సిలిండర్‌పై మరో రూ.50
- సంకేతాలిచ్చిన ప్రభుత్వ వర్గాలు.. ముడి చమురు రేట్ల పెరుగుదలతో నష్టపోతున్న దేశీయ ఆయిల్ కంపెనీలు
- నష్టాలను పూడ్చక తప్పదంటున్న ప్రభుత్వం

6లో

న్యూస్‌రీల్

చండ ప్రచండ భానుడు! 12లో

రాష్ట్రంలో ఎండలు మరింత తీవ్రతరమయ్యాయి. మండుతున్న ఎండలకు తోడు వడగాడ్పులు, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 252 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కోర్టులు చివాట్లు పెట్టినా.. మారని పోలీసులు 12లో

పోలీసులు ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాలను విస్మరిస్తూ.. ప్రభుత్వ పెద్దల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నారని సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి విమర్శించారు. కాగా, వైఎస్సార్‌సీపీ నేత పూడి శ్రీహరికి రిమాండ్‌ను తిరస్కరిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది.

కమీషన్ల 'వైద్యం'!

వైద్య ఆరోగ్యశాఖలో రూ.40 కోట్ల ప్రాజెక్టులో గోల్‌మాల్

- ఏబీడీఎంలో అనుభవం తప్పనిసరి అని బిడ్‌లు దాఖలుకు ముందు షరతు
- ప్రీ-బిడ్‌లో పోటీ లేకుండా కట్టడి చేసిన ప్రభుత్వ పెద్దలు
- అస్మదీయ కంపెనీతో బిడ్ వేయించి అక్రమంగా ఆమోదం
- ఎల్ 1 కాకుండా క్యూసీబీఎస్ విధానంలో ఆర్‌ఎఫ్‌పీ రూపకల్పన
- ఇవాల్యూయేషన్‌లో ఎక్కువ మార్కులు వేసి ప్రాజెక్టు కట్టబెట్టేందుకు సిద్ధం

3లో

జీఎస్టీ ఢమాల్

- ఏప్రిల్‌లో 2.7 శాతం తగ్గిన రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు
- రూ.4,686 కోట్ల నుంచి రూ.4,323 కోట్లకు పడిపోయిన ఏప్రిల్ జీఎస్టీ వసూళ్లు
- వరుసగా మూడో ఏడాది తిరోగమనంతో ప్రారంభం
- పొరుగు రాష్ట్రాల్లో టాప్ గేర్‌లో జీఎస్టీ వసూళ్లు
- దేశవ్యాప్తంగా ఏప్రిల్ జీఎస్టీ వసూళ్లలో 4.3 శాతం వృద్ధి

12లో

ఈ షాడో మంత్రి ఓ కంత్రి!

విద్యాశాఖలో మంత్రి ఓఎస్డీ ఓవరాక్షన్

- అంతా నాకు తెలియాలి.. నువ్వు ఎవరైతే నాకేంటి అన్నట్లుగా వ్యవహారశైలి
- ప్రొటోకాల్, సంస్కారాన్ని మరిచి ఇష్టానుసారం వ్యాఖ్యలు
- మంత్రితో వ్యవహరించినట్లే తనతోనూ నడుచుకోవాలంటూ హుకుం
- అర్ధరాత్రి.. అపరాత్రి తేడాలేకుండా సమాచారం పేరుతో వేధింపులు
- ఫైల్ ప్రొసీడింగ్స్‌ను పక్కనపెట్టి అనధికారికంగా నోటి మాటలతోనే పనులు చేయాలంటూ ఒత్తిడి
- గతంలోనే ఈ ఓఎస్డీ కాండక్టుపై నెగిటివ్ రిపోర్టు ఇచ్చిన ఇంటెలిజెన్స్
- అయినా పట్టించుకోకుండా ఓఎస్డీగా నియమించుకున్న విద్యాశాఖ మంత్రి

12లో

నేటి గ్రుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గ్రుడ్ల రిటైల్ ధర ₹75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	118 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	210 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	145 కిలో	స్కిన్ లెస్	239 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ సంగతి

క్రెడిట్ చోరీ, డీజిల్ చోరీ, కొత్త అప్పులు, కేసులు, వేధింపులు.. ఇవేనా సార్ మన లక్ష్యాలు, కొత్త లక్ష్యాలు!

కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు కష్టాలు

3లో

- పంటలు కొనుగోలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలం
- ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్
- గంపలగూడెం మార్కెట్ యార్డులో ధాన్యం రాశుల పరిశీలన

కుట్ర 'పన్ను'.. కొల్లగొట్టు!

రవాణాలో 'ట్యాక్స్' డీల్

- కీలక నేతకు రూ.18కోట్ల ముడుపుల మూట..!
- ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.100కోట్ల గండి
- ట్రావెల్ బస్సులపై పన్ను తగ్గింపునకు ప్రతిపాదన
- కేంద్రం తాజా విధానాన్ని సద్వినియోగం చేసుకోని రాష్ట్రం
- ట్రావెల్స్ సిండికేట్‌తో కీలక నేత సెటిల్‌మెంట్

12లో

అడ్వాన్సుగా రూ.7,862.32 కోట్లు ఇచ్చినా పోలవరం

పడకేనా?

- కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు అసహనం
- ఇంధనం కొరతతో పనులు చేయలేకపోయామన్న అధికారులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేసుకోలేదంటూ నిలదీత
- నిర్వాసితులకు పునరావాసం కల్పన, భూసేకరణ తీరుపై అసంతృప్తి
- పనుల ప్రగతిపై రోజువారీ.. వారం వారం నివేదిక ఇవ్వాలని వ్యాప్కోస్‌కు ఆదేశం

2లో



Rc. No. 01/2026/JA/MSGO, Dt. 29-04-2026 Office of Mandal Praja Parishad , PARAWADA.

PROCEEDINGS OF THE MANDAL PARISHAD DEVELOPMENT OFFICER, PARAVADA

PRESENT: SRI B RAMESH NAIDU

Sub : MPDO – Anakapalli District & Division – Paravada Mandal – Monitoring Lorries without Tarpaulin – Assignment of duties to certain staff – Orders Issued – Regarding

Read :- Instructions of the District Collector and Magistrate, Anakapalli

ORDER:-

As per the instructions of Honourable District Collector, Anakapalli due to heavy traffic of unprotected fly ash transport through lorries and deposition of black smoothly fly ash across the roads and dwellings of the routes travel, causing serious health hazards to human beings and animals, pot holes on the road also leading to accidents due to heavy carrying loads of fly ash. In this regard SGSW staff were instructed by Honourable District Collector madam to Observe, Watch, Monitor and Report the vehicles which are not properly protected and covered with tarpaulins misting and sprinkling on the road, by the causing authorities, cleaning of the roads periodically by the causing authorities

సచివాలయ ఉద్యోగులకు లారీలను పరిశీలించే విధులు అప్పగిస్తూ పరవాడ ఎంపీడీవో జారీ చేసిన ఉత్తర్వులు

రోడ్డుపై లారీలను పరిశీలించే విధులూ సచివాలయ ఉద్యోగులకే.. 3లో

టార్పాలిన్ లేకుండా వెళ్లే లారీల వివరాలు సేకరించాల్సిందే

సచివాలయ ఉద్యోగుల పట్ల

ప్రభుత్వం తీరు దారుణం

- ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు
- హక్కులను హరిస్తున్నారు
- పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు తక్షణమే విడుదల చేయాలి.. పదోన్నతులు కల్పించాలి
- సచివాలయ ఉద్యోగులను ఇతర శాఖల్లోకి డిప్యుటేషన్ మీద కాకుండా శాశ్వత ప్రాతిపదికన విలీనం చేయాలి
- 15 రోజుల్లోగా సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిద్ధం
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నేత మధుబాబు

3లో

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

క్లుప్తంగా...

గౌతమ బుద్ధుడి మాటలు నేటికీ ఆచరణీయం

బుద్ధ పూర్ణిమ సందర్భంగా వైఎస్ జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ బుద్ధపూర్ణిమ శుభాకాంక్షలు తెలియజేశారు. 'మన ఆలోచనలను సరిచేసుకుంటే, మన జీవితం మారుతుందనే మహోన్నత సందేశాన్ని ప్రపంచానికి అందించిన గౌతమ బుద్ధుడి బోధనలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఆ మహనీయుడు చెప్పిన మాటలు నేటికీ ఆచరణీయం. గౌతమ బుద్ధుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ బుద్ధపూర్ణిమ శుభాకాంక్షలు' అంటూ వైఎస్ జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కార్మికులకు వైఎస్ జగన్ మే డే శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: కార్మికులకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. 'కార్మికులు.. సమాజ హితమే ధ్యేయంగా శ్రమించేవారు. దేశాభివృద్ధికి ప్రగతి రథచక్రాలు వారు. ఆర్థిక రంగానికి వెన్నెముక లాంటి వారు. అభివృద్ధి వెలుగులకు జీవం పోసే కనిపించని హీరోలు నా శ్రామికులు. కార్మిక సోదరులందరికీ మే డే శుభాకాంక్షలు' అంటూ వైఎస్ జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

'మన్యం'లో రోడ్డు ప్రమాదంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ–సీతంపేట ఘాట్ రోడ్ వద్ద లోయలో ఆటో పడి నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుభకార్యానికి వెళ్లి వస్తున్న వారు ఈ ప్రమాదంలో మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో వారికి ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రహదారి భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సంబంధిత అధికారులకు వైఎస్ జగన్ సూచించారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

హనుమప్ప (ఫైల్)

బొమ్మనహాళ్: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వడ్డే హనుమప్ప(50) పది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మిరప సాగు చేస్తున్నాడు. పెట్టుబడి, కుటుంబ అవసరాలకు రూ.30 లక్షల వరకు అప్పులు చేశాడు. రెండేళ్ల నుంచి దిగుబడి బాగా తగ్గింది. అరకొర పండిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చే మార్గం, చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక భరోసా లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ విజయ్ తెలిపారు.

25 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

- జూన్ 4 వరకు నిర్వహణ
- షెడ్యూల్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మే 25 నుంచి జూన్ 4 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. సబ్జెక్టుల వారీగా పరీక్షల టైమ్ టేబుల్ ఇచ్చింది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొంది. భౌతిక, జీవశాస్త్రాల పరీక్షలు 50 మార్కులు, కాంపోజిట్ కోర్సులు 30 మార్కుల పరీక్షలకు మాత్రం 11.30 గంటల వరకే సమయం కేటాయించింది. మే 25న ప్రథమ భాష పేపర్–1 (గ్రూప్–ఏ), (కాంపోజిట్ కోర్సు) 26న ద్వితీయ భాష, 28న ఆంగ్లం, 29న గణితం, 30న భౌతిక శాస్త్రం, జూన్ 1న జీవ శాస్త్రం, 2న సాంఘిక శాస్త్రం, 3న ప్రథమ భాష పేపర్–2 (కాంపోజిట్ కోర్సు), ఓరియంటల్ ముఖ్య భాష పేపర్–1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్), జూన్ 4న ఓరియంటల్ ముఖ్య భాష పేపర్–2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) ఉంటాయని వెల్లడించింది.

అవినీతిలో అ'ధర'హో!

అప్పుగా తెచ్చిన నిధులను కాంట్రాక్టర్లతో కలసి దోచుకుంటున్న వైనం

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో శాశ్వత సచివాలయం టవర్ల నిర్మాణ వ్యయాన్ని చంద్రబాబు సర్కార్ మళ్లీ పెంచేసి సరికొత్త రికార్డు సృష్టించింది. డయాగ్రిడ్ విధానంలో 39 అంతస్తులతో నిర్మిస్తున్న నాలుగు టవర్లు.. 49 అంతస్తులతో నిర్మిస్తున్న మరో టవర్‌కు అద్దాలను అమర్చడం (గ్లాస్, క్లాడింగ్, క్రౌన్, ఆట్రియం, కాలమ్ క్లాడింగ్, స్కైలైట్), ఫొటో వోల్టాయిక్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు, బిల్డింగ్ మెయింటెనెన్స్ యూనిట్ (బీఎంయూ)లు ఏర్పాటు చేసే పనులు చేపట్టేందుకు రూ.2,540 కోట్లతో పరిపాలన అనుమతి ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ పనులకు మూడు ప్యాకేజీల కింద టెండర్లు పిలవడానికి అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏజీఐసీఎల్)కు అనుమతి ఇచ్చింది. దాంతో.. డిజైన్‌లతో కలిపి శాశ్వత సచివాలయం నిర్మాణ వ్యయం రూ.9,612.85 కోట్లకు చేరుకుంది. ఐదు టవర్ల నిర్మిత ప్రాంతం 4,85,000 చదరపు మీటర్లు (52,20,496 చదరపు అడుగులు). దీన్ని బట్టి శాశ్వత సచివాలయ టవర్ల నిర్మాణ వ్యయం చదరపు అడుగు రూ.18,413.68కు చేరిందని స్పష్టమవుతోంది. ఇక అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ) పేరుతో సచివాలయం టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలను నిర్మిస్తున్న 1,575 ఎకరాల లేవుట్‌లో రోడ్లు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించే పనులను రూ.1057.62 కోట్లతో చేపట్టింది. దీన్ని కూడా కలుపుకుంటే.. సచివాలయం టవర్ల నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.20,439.58కు చేరుకుంది. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి మహా నగరాల్లో ఫైవ్ స్టార్ సదుపాయాలు, ఇటాలియన్ మార్బుల్స్‌తో నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.4 వేల నుంచి రూ.4,500కు మించడం లేదని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అంటే.. శాశ్వత సచివాలయం కాంట్రాక్టు పనుల్లో భారీ ఎత్తున కమీషన్లు చేతులు మారాయన్నది స్పష్టమవుతోందని ఆరోపిస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో నిర్మించినా.. డయాగ్రిడ్ విధానంలో నిర్మించినా, నిర్మాణ వ్యయంలో పెద్దగా తేడా ఉండదని ఇంజినీరింగ్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డయాగ్రిడ్ విధానంలో అంతస్తులు పెరిగే కొద్దీ నిర్మాణ వ్యయం తగ్గుతుందని స్పష్టం చేస్తున్నారు. అయినా సరే శాశ్వత సచివాలయం టవర్ల నిర్మాణ వ్యయం ఇంతింతై.. అన్నట్టుగా నానాటికీ పెరుగుతుండటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు తెచ్చి.. నీకింత-నాకింత

రాజధాని నిర్మాణం కోసం అంతర్జాతీయ, జాతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థల వద్ద అధిక వడ్డీలకు అప్పుగా తెచ్చిన నిధులను కాంట్రాక్టర్లతో కలిసి ప్రభుత్వ పెద్దలు దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2016లో తాత్కాలిక సచివాలయం నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,350తో మొదలై.. పూర్తయ్యే సరికి రూ.19,183 చొప్పున బిల్లులు చెల్లించారు. శాశ్వత సచివాలయం టవర్ల నిర్మాణం పూర్తయ్యే సరికి వ్యయం ఇంకెంతకు చేరుతుందోనని లెక్కలు వేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, కేఎఫ్‌డబ్ల్యూ, హడ్కో వంటి సంస్థల నుంచి రాజధాని నిర్మాణానికి అధిక వడ్డీలకు అప్పుగా తెచ్చి.. వాటిని కాంట్రాక్టు సంస్థలకు దోచిపెడుతూ.. నీకింత నాకింత అంటూ ముఖ్య నేత పంచుకుతినేలా కుట్ర పన్నారంటూ సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

అప్పుడు, ఇప్పుడు అదే కాంట్రాక్టర్

శాశ్వత సచివాలయం టవర్ల నిర్మాణాన్ని 2018 లోనూ.. ఇప్పుడూ డయాగ్రిడ్ విధానంలోనే నిర్మించేలా కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది. అప్పటితో పోల్చితే సిమెంట్, స్టీల్, డీజిల్, పెట్రోల్, నిర్మాణ సామగ్రి ధరల్లో పెద్దగా వ్యత్యాసం లేదు. పైగా ఇప్పుడు ఇసుక ఉచితం. అదీ నాలుగైదు కిలోమీటర్ల దూరంలోనే కృష్ణా నదిలో కావాల్సినంత దొరుకుతుంది. వీటిని పరిగణనలోకి తీసుకుంటే.. 2018తో పోల్చితే టవర్ల కాంట్రాక్టు విలువ ఇప్పుడు పెరగడానికి వీల్లేదని అధికార వర్గాలే స్పష్టం చేస్తున్నాయి. ఇదే టవర్ల నిర్మాణ పనులను 2018 ఏప్రిల్ 26న చదరపు అడుగు రూ.4,350.42 చొప్పున రూ.2,271.14 కోట్లకు షాపూర్‌జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ సంస్థలకు అప్పగిస్తూ నాడు ఇదే చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు మళ్లీ అదే సంస్థలకు వాటి నిర్మాణ పనులను రూ.4,354.43 కోట్లకు అప్పగించింది. అంటే.. 2018తో పోల్చితే ఇప్పుడు వాటి కాంట్రాక్టు వ్యయం రూ.2,083.29 కోట్లు పెరిగింది. ఐదు టవర్ల నిర్మిత ప్రాంతం 4,85,000 చదరపు మీటర్లు (52,20,496 చదరపు అడుగులు). అంటే.. చదరపు అడుగు రూ.8,339.12 చొప్పున ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను కాంట్రాక్టు సంస్థలకు అప్పగించినట్టు స్పష్టమవుతోంది. ఈ భవనాలకు హై సైడ్ ఎలక్ట్రికల్ (విద్యుత్ సరఫరా), హెచ్‌వీఏసీ (వాతావరణం స్థిరంగా ఉండేలా చూసే వ్యవస్థ), అగ్నిమాపక వ్యవస్థ, లిఫ్టులు, ప్లంబింగ్ పనులు చేపట్టడం కోసం రూ.2,316.88 కోట్లు మంజూరు చేసింది. దాంతో శాశ్వత సచివాలయం నిర్మాణ వ్యయం రూ.6,671.31 కోట్లకు చేరుకుంది. చదరపు అడుగు నిర్మాణ వ్యయం రూ.12,779.07కు చేరింది. టవర్ల డిజైన్‌ల పనులను రూ.401.54 కోట్లకు పోస్టర్ పార్టనర్స్–హఫీజ్ కాంట్రాక్టర్, జెనిసిస్ ప్లానర్స్‌కు అప్పగించారు. తాజాగా అద్దాలు అమర్చే పనులను రూ.2,540 కోట్లతో చేపట్టారు. దాంతో శాశ్వత సచివాలయ టవర్ల నిర్మాణ వ్యయం రూ.9,612.85 కోట్లకు చేరుకుంది.

గూడుపుఠాణీ కాక మరేంటి?

- సచివాలయం 1, 2 టవర్లను బీ+జీ+39 అంతస్తులతో నిర్మిస్తోంది. ఈ పనులకు రూ.1,423.07 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించి 2025లో చంద్రబాబు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. సచివాలయం 3, 4 టవర్లను కూడా బీ+జీ+39 అంతస్తులతో నిర్మిస్తోంది. ఈ పనులకు రూ.1,247.22 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించి టెండర్లు పిలిచింది. ముఖ్యమంత్రి కార్యాలయం, విభాగాధిపతుల కార్యాలయాల కోసం సచివాలయంలో జీఏడీ టవర్‌ను బీ+జీ+49 అంతస్తులతో నిర్మిస్తోంది. ఈ పనులకు రూ.844.22 కోట్లను కాంట్రాక్టు విలువగా నిర్ణయించి టెండర్లు పిలిచింది.
- 1, 2 టవర్ల నిర్మాణ పనులను 4.50 శాతం అధిక ధరకు అంటే రూ.1,487.11 కోట్లకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన షాపూర్‌జీ పల్లోంజీ దక్కించుకుంది. జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.275.70 కోట్లు రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. అంటే.. 1, 2 టవర్ల కాంట్రాక్టు విలువ రూ.1,762.81 కోట్లు. ఇదే పనులను 2018లో రూ.932.46 కోట్లకే పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏతో షాపూర్‌జీ పల్లోంజీ ఒప్పందం చేసుకుంది. అంటే.. 2018తో పోల్చితే ఇప్పటికే ఈ టవర్ల కాంట్రాక్టు వ్యయం రూ.830.35 కోట్లు పెరిగినట్లు స్పష్టమవుతోంది.
- 3, 4 టవర్ల నిర్మాణ పనులను 4.54 శాతం అధిక ధరకు అంటే రూ.1,303.85 కోట్లకు కోట్ చేసి ఎల్–1గా నిలిచిన ఎల్ అండ్ టీ సంస్థ దక్కించుకుంది. జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.241.70 కోట్లు రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. అంటే.. 3, 4 టవర్ల కాంట్రాక్టు విలువ రూ.1,545.55 కోట్లు. 2018లో ఇదే పనులను రూ.784.62 కోట్లకే పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏతో ఎల్ అండ్ టీ ఒప్పందం చేసుకుంది. అంటే.. 2018తో పోల్చితే ఇప్పటికే 3, 4 టవర్ల కాంట్రాక్టు వ్యయం రూ.760.93 కోట్లు పెరిగినట్లు తేటతెల్లమవుతోంది.
- జీఏడీ టవర్ నిర్మాణ పనులను 4.53 శాతం అధిక ధరకు అంటే రూ.882.47 కోట్లకు కోట్ చేసి ఎల్–1 నిలిచిన ఎన్‌సీసీ సంస్థ దక్కించుకుంది. జీఎస్టీ, సీనరేజీ, న్యాక్ వంటి పన్నుల రూపంలో రూ.163.60 కోట్లను రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. అంటే ఆ పనుల కాంట్రాక్టు విలువ రూ.1,046.07 కోట్లు. 2018లో ఇదే పనులను రూ.554.06 కోట్లకు ఎన్‌సీసీ సంస్థకు సీఆర్‌డీఏ అప్పగించింది. అంటే.. 2018తో పోల్చితే ఇప్పటికే జీఏడీ టవర్ కాంట్రాక్టు వ్యయం రూ.492.01 కోట్లు పెరిగింది.
- నాడు, నేడు టెండర్లలో ఒకే కాంట్రాక్టర్‌కు పనులు దక్కాయి. టెండర్లలో గూడుపుఠాణీ జరిగిందనడానికి ఇదే తార్కాణమని ఇంజినీరింగ్ నిపుణులు ఆరోపిస్తున్నారు.

అసెంబ్లీ భవనం నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.17,356.54

అసెంబ్లీ భవనాన్ని ఏజీసీ 'ఈ' బ్లాక్‌లో బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, 3 అంతస్తుల్లో (బీ+జీ+3) 11,21,975 చదరపు అడుగుల్లో ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ భవన డిజైన్‌ను కూడా ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ సంస్థే రూపొందించింది. ఈ భవన నిర్మాణ పనులకు రూ.590.86 కోట్ల అంచనా వ్యయంతో లంప్సమ్ విధానంలో 24 నెలల్లో పూర్తి చేసి.. మరో మూడేళ్లు నిర్వహించాలనే షరతుతో గతేడాది మార్చి 1న సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ టెండర్‌లో 4.48 శాతం అధిక ధరకు అంటే రూ.617.33 కోట్లకు కోట్ చేసిన ఎల్ అండ్ టీ లిమిటెడ్ సంస్థ చేజిక్కించుకుంది. జీఎస్టీ, న్యాక్, సీనరేజీ వంటి పన్నుల రూపంలో రూ.107.69 కోట్లు అదనంగా ఇస్తామని టెండర్ నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది. అంటే.. అసెంబ్లీ శాశ్వత భవనం నిర్మాణ కాంట్రాక్టు విలువ రూ.725.02 కోట్లు. ఇటీవల ఈ భవనంలో ఎలక్ట్రికల్, హెచ్‌వీఏసీ, అగ్నిమాపక వ్యవస్థ, ప్లంబింగ్, ఈఎల్‌వీ పనులు చేపట్టేందుకు రూ.424.34 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అసెంబ్లీ భవనంలో స్పైర్, పార్కింగ్ రింగ్, రింగ్ రూఫ్ వంటి సివిల్ స్ట్రక్చర్ పనులు చేపట్టడానికి మరో రూ.798 కోట్లతో అనుమతి ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో అసెంబ్లీ భవనం నిర్మాణ వ్యయం రూ.1,947.36 కోట్లకు చేరుకుంది. అంటే.. చదరపు అడుగు రూ.17,356.54కు చేరుకుంది.

అసెంబ్లీ అద్దాలకు రూ.2,540 కోట్లా!?

అమరావతి సోకుల పేరుతో ప్రజల కష్టార్జితం దోపిడీ

- కొత్త మెడికల్ కాలేజీలకు మాత్రం నిధులుండవు
- మిమ్మల్ని రాజకీయంగా సమాధి చేయడం ఖాయం
- పేదలపై కక్షతోనే 50 వేల ఇళ్ల పట్టాల రద్దు
- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్



సాక్షి, అమరావతి: అమరావతి పేరుతో ప్రజల కష్టార్జితాన్ని చంద్రబాబు ప్రభుత్వం విచ్చలవిడిగా దోచుకుంటోందని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ భవనాల అద్దాల కోసం ఏకంగా రూ.2,540 కోట్లు కేటాయించడంపై విస్మయం వ్యక్తంచేశారు. చదరపు అడుగు నిర్మాణానికి రూ.18,500 వరకు ఖర్చుచేయడం ఏ రకమైన పాలనని ప్రశ్నించారు. ఇదంతా చంద్రబాబు తన అస్మదీయులకు సంపద సృష్టించేందుకు వేసిన నిరంతర దోపిడీ ప్లాన్ అని ఆరోపించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రతిపాదించిన మావిగన్ కాన్సెప్ట్‌కు ప్రజల్లో వస్తున్న సానుకూలతను తట్టుకోలేకే చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులతో జర్నలిస్టులను, ప్రతిపక్ష నేతలను వేధిస్తే చూస్తూ ఊరుకోబోమని సజ్జల హెచ్చరించారు. ఆయనింకా ఏమన్నారంటే..

చ.అడుగుకి రూ.18,500

అమరావతిలో భవిష్యత్తులో కట్టబోయే అసెంబ్లీ బిల్డింగుల అద్దాల కోసమే రూ.2,540 కోట్లతో కాంట్రాక్టుకు రెడీ అయ్యారు. బిల్డింగ్ వర్క్, ప్లంబింగ్, డ్రైనేజీ వంటి పనులకు చదరపు అడుగుకి రూ.12 వేల నుంచి రూ.14 వేలు అనుకుంటే.. ముున్ముందు ఇది ఎంతకు పెరుగుతుందో చెప్పలేని పరిస్థితి. రాజధానిలో నిర్మాణం చేపడుతున్న 52 లక్షల చదరపు అడుగులకి ఈ నిర్మాణ ఖర్చు కూడా కలుపుతుంటే.. చదరపు అడుగుకి రూ.18,500 వరకు ఖర్చవుతుంది. అలాగే, పాలవాగును టవర్స్ మధ్యలో తిప్పుతూ కృష్ణానదిలో కలిపేలా డిజైనింగ్ చేస్తారట. ఆ డిజైనింగ్‌కు మరో రూ.వందో, రెండు వందల కోట్లో ఇస్తారు.

రైతుల సందేహాలకు సమాధానంలేదు

ఏడాదికి రూ.1,000 కోట్లు చొప్పున ఖర్చుపెడితే నాలుగైదేళ్లలో పూర్తయ్యే కొత్త మెడికల్ కాలేజీలకు డబ్బుల్లేవని చెబుతూ మరోవైపు.. అమరావతి కోసం ఇష్టారాజ్యంగా బరితెగిస్తున్నారు. మెడికల్ కాలేజీలు, ఆరోగ్యశ్రీ బకాయిలు, రైతులకు మద్దతు ధరల కోసం నిధుల్లేవని చెబుతూ అమరావతి దోపిడీకి మాత్రం భారీగా నిధులు విడుదల చేయడం విడ్డూరం. ఇది ఏ స్థాయికి వెళ్లిందంటే.. రెండో దశ భూములు తీసుకునే ప్రక్రియలో కూడా దోపిడీకి తెరలేపారు. కానీ, రైతులు తమ సందేహాలను అడిగితే వాటికి సమాధానంలేదు. పైగా.. తమకు కావాల్సిన వాళ్లకు, దగ్గరి వాళ్ల లేఅవుట్లకు మాత్రం ఎడాపెడా అనుమతులిచ్చేస్తున్నారు.

అరెస్టులతో అణచివేయలేరు

పూడి శ్రీహరిని సంబంధంలేని వ్యవహారంలో అరెస్టుచేశారు. ఈ విషయంలో చంద్రబాబు, లోకేశ్ ఒకటి గుర్తుపెట్టుకోవాలి.. ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయలేరు. మిమ్మల్ని రాజకీయంగా సమాధిచేసే శక్తి వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉంది. ఇక పేదలకు కేటాయించిన 50 వేల ఇళ్ల పట్టాలను నిర్దాక్షిణ్యంగా రద్దుచేయడం చంద్రబాబుకు పేదలపై ఉన్న కక్షను తెలియజేస్తోంది. కాగా, మెంబర్‌షిప్, ఎస్ఐఆర్‌పై వైఎస్సార్‌సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ ఫోకస్ పెంచాలని పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. పార్టీ కీలక నేతలతో శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

క్వాంటమ్ వ్యాలీలో ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1,208.41 కోట్లు

సాక్షి, అమరావతి: అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీలో రూ.1,208.41 కోట్లతో జంట(ట్విన్) టవర్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కృష్ణా నది కుడి కరకట్టను పటిష్టం చేసే పనులను మూడు ప్యాకేజీల కింద రూ.443.26 కోట్లతో చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో జోన్–11లో భూసమీకరణ కింద భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చేందుకు లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.580 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు టెండర్లు పిలిచేందుకు ఏజీఐసీఎల్‌కు అనుమతి ఇచ్చింది. ఇక రాజధానిలో ఎన్–10 రహదారి నుంచి ఎన్–13–ఈ–11 రహదారుల జంక్షన్ వరకు 220 కేవీ ఎక్స్‌ట్రా హైవోల్టేజీ(ఈహెచ్‌వీ) లైన్‌ను అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటుకు సంబంధించి మిగిలిన పనులకు 8.98 శాతం అధిక ధరకు రూ.1,082.44 కోట్లకు బీఎస్సార్ ఇన్‌ఫ్రాకు గతంలో సీఆర్‌డీఏ అప్పగించింది. ఇప్పుడు ఆ పనుల అంచనా వ్యయాన్ని రూ.1,180.54 కోట్లకు పెంచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఆర్‌డీఏ 60వ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలకు గురువారం కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో వాటిని అమలు చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ శుక్రవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు.

రెండో విడత పూలింగ్ భూములకు కౌలు పెంపు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి అదనంగా భూసమీకరణ కోసం 2025, జూలై 1న జారీ చేసిన ల్యాండ్ పూలింగ్ స్కీం(భూ సమీకరణ పథకం)–2025 విధి విధానాలను ప్రభుత్వం సడలించింది. పల్నాడు జిల్లా అమరావతి మండలం వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి.. గుంటూరు జిల్లాలో తుళ్లూరు మండలం వడ్డమాను, హరిశ్చంద్రాపురం, పెదపరిమి గ్రామాల్లో సమీకరించనున్న 20,494 ఎకరాలకు కౌలును పెంచింది. మొదటి ఏడాది కౌలు ఎకరం మెట్ట భూమికి రూ.30 వేల నుంచి రూ.40 వేలకు పెంచింది. జరీబు భూమికి ఎకరానికి తొలి ఏడాది ఇచ్చే కౌలును రూ.50 వేల నుంచి రూ.60 వేలకు పెంచింది. ఇక 2025, డిసెంబర్ 2లోగా ఆ ఏడు గ్రామాల పరిధిలో ఒక్కో పట్టాదారుపాసు పుస్తకంపై తీసుకున్న పంట రుణాల్లో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు మాఫీ చేస్తామని పేర్కొంది. ఈ మేరకు విధి విధానాలను సడలిస్తూ శుక్రవారం పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

అడ్వాన్సుగా రూ.7,862.32 కోట్లు ఇచ్చినా
పోలవరం పడకేనా?

కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు అసహనం

సాక్షి, అమరావతి: జాతీయ ప్రాజెక్టు పోలవరం పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి 2024–25, 25–26లో నాలుగు విడతలుగా రూ.7,862.32 కోట్లు అడ్వాన్సుగా నిధులు ఇచ్చినా సరే.. ప్రాజెక్టు పనులతోపాటు నిర్వాసితులకు పునరావాసం కల్పన, భూసేకరణ పనులు నత్తనడకేనా..? అంటూ కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు అసహనం వ్యక్తం చేశారు. ఇలాగైతే 2026–27లో పోలవరానికి కేటాయించిన రూ.3,320.39 కోట్లను వినియోగించుకుని, నిర్దేశించిన లక్ష్యంలోగా ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో పనుల ప్రగతిపై రోజు వారీ.. వారం వారం నివేదిక ఇవ్వాలంటూ వ్యాప్కోస్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్‌లో డీజిల్ కొరత తలెత్తిందని.. దీని వల్ల నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు చేయలేకపోయామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పనులను నెల రోజుల క్రితం క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా నిర్వాసితులకు పునరావాసం కల్పన.. భూసేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జల్ శక్తి శాఖ కార్యదర్శి ఆదేశించారు. ఈ నేపథ్యంలో మార్చి 25 నుంచి ఏప్రిల్ 25 వరకూ పనుల ప్రగతిపై వ్యాప్కోస్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి కేఎల్ కాంతారావు శుక్రవారం సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో సీఎస్, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, ఆర్అండ్ఆర్ కమిషనర్ ప్రశాంతి, పీపీఏ సీఈవో సంజీవ్ వోహ్రా, సభ్య కార్యదర్శి రఘురాం, సీడబ్ల్యూసీ చైర్మన్ అనుపమ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలియదా?

ఏప్రిల్‌లో నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు చేయకపోవడంపై అధికారులను కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి నిలదీశారు. పనులు చేయడానికి సరిపడా యంత్రాలు సమకూర్చుకోకపోతే ఎలా? అని ప్రశ్నించారు. దీనిపై ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి స్పందిస్తూ పోలవరంలో సరిపడా యంత్రాలు ఉన్నాయని.. ఏప్రిల్‌లో డీజిల్ కొరత తలెత్తిందని.. దీని వల్ల నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు చేయలేకపోయామని వివరించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డీజిల్‌ను.. పనులు లక్ష్యం మేరకు చేయడానికి అవసరమైన పరికరాలను సమకూర్చుకోవాలి కదా! అంటూ కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పేర్కొన్నారు. నిర్వాసితులకు పునరావాసం కల్పన, భూసేకరణ తీరుపైనా అసహనం వ్యక్తం చేశారు. నాలుగు విడతలుగా అడ్వాన్సుగా ఇచ్చిన నిధులను వినియోగించుకోలేదు..! ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులను ఎప్పుడు విడుదల చేయాలని అడుగుతారు? అని ప్రశ్నించారు. పోలవరం పనుల్లో నాణ్యతపై నెలలో కనీసం మూడు సార్లు తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని సీఎస్ఎంఆర్ఎస్ అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టుపై అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత రాష్ట్రాలతో సమావేశం నిర్వహించి నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీ చైర్మన్ అనుపమ్ ప్రసాద్‌కు సూచించారు.

ఆర్-5 జోన్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో పేదల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రత్యేకంగా ఏర్పాటైన ఆర్–5జోన్‌ను రద్దు చేస్తూ సీఆర్‌డీఏ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు 900 ఎకరాలతో ఆర్–5 జోన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 50 వేల మందికి పైగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలిచ్చారు. దానిని భారీ లేఅవుట్‌గా అభివృద్ధి చేశారు. అధికారంలోకి వచ్చాక రాజధాని సహా రాష్ట్రంలో ఎక్కడా పేదలకు అంగుళం కూడా భూమి ఇవ్వని చంద్రబాబు.. అమరావతిలో పేదల ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసిన ఆర్–5 జోన్‌ను రద్దు చేస్తూ గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రద్దు చేసిన వారికి ప్రత్యామ్నాయంగా ఎక్కడ ఇళ్ల స్థలాలిస్తారో చెప్పకుండా ఏకపక్షంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డుపై లారీలను పరిశీలించే విధులూ సచివాలయ ఉద్యోగులకే..

టార్పాలిన్ లేకుండా వెళ్లే లారీల వివరాలు సేకరించాల్సిందే

సాక్షి, అమరావతి: సచివాలయ వ్యవస్థ లక్ష్యానికి చంద్రబాబు ప్రభుత్వం తూట్లుపొడుస్తోంది. ఉద్యోగులకు సంబంధం లేని బాధ్యతలు అప్పగిస్తూ చిన్నచూపుచూస్తోంది. మొన్నటికి మొన్న పల్నాడు జిల్లాలో సచివాలయ ఉద్యోగులకు పెట్రోల్ బంకుల వద్ద విధులు వేసిన ఘటన మరువక ముందే అనకాపల్లి జిల్లాలో వింత విధులు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. ఎన్టీపీసీ యార్డు నుంచి ఫ్లైయాష్ నింపుకొని వచ్చి పోయే లారీలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు పైఅధికారులకు సమాచారమిచ్చేందుకు కాపలా కాసే బాధ్యత కూడా గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల నెత్తినే పడింది. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం లంకెలపాలెం ఫ్లై ఓవర్ వద్ద గత నెల 30 నుంచి ఈ నెల 8 వరకు ఈ పనిచేసేందుకు 18 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒకరు.. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మరొకరు చొప్పున రోజుకు ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు విధులు అప్పగించారు. ఫ్లై యాష్ లోడుతో వెళ్లే లారీలపై టార్పాలిన్ లేకపోతే ఆ లారీ వివరాలు ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నివేదించాలని పరవాడ ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు. ఫ్లై యాష్ రవాణాతో ప్రజలు, జంతువులకు ఇబ్బంది కలుగకుండా, ప్రమాదాలను నివారించేందుకే సచివాలయాల ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగించామని ఎంపీడీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తీరు దారుణం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నేత మధుబాబు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకుడు, విలేజీ సర్వేయర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బూరాడ మధుబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వలంటీర్లు లేని లోటును భర్తీ చేయడానికి 1.32 లక్షల మంది సచివాలయ ఉద్యోగులను అడ్డంగా వాడుకుంటున్నారే తప్ప, కనీస హక్కులను పట్టించుకోవడం లేదన్నారు. ఇంక్రిమెంట్లు, కనీసం బేసిక్ పే సవరణ కూడా లేకుండా పోయిందని పేర్కొన్నారు. మరోవైపు డిగ్రీ క్వాలిఫికేషన్‌తో ఉద్యోగంలో చేరిన తమకు మరుగుదొడ్లు, పెట్రోల్ బంకుల వద్ద డ్యూటీలు వేయడం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అవుతుందన్నారు. సమస్యలు చెప్పుకుందామంటే ఉప ముఖ్యమంత్రి, మంత్రులు అవకాశమే ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు తక్షణమే విడుదల చేయాలని, పదోన్నతులు కల్పించాలని.. సచివాలయ ఉద్యోగులను ఇతర శాఖల్లోకి డిప్యుటేషన్ మీద కాకుండా, శాశ్వత ప్రాతిపదికన విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త నిరసనలకు సిద్ధమవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఉద్యోగులు 'చలో విజయవాడ', నిరాహార దీక్షలకు పూనుకుంటామని పేర్కొన్నారు.

15 నగరాల్లో లేబర్ అడ్డాలు

- ఇవి స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేంద్రాలుగా ఉంటాయి
- వచ్చే ఏడాది పోలవరం.. 2028 నాటికి బందరు పోర్టు పూర్తి
- కృష్ణాజిల్లా వీరంకిలాకు సభలో సీఎం చంద్రబాబు



పామర్రు/గుడివాడ రూరల్: పనులు లేక కార్మికులు ఎవరూ ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా 15 నగరాల్లో లేబర్ అడ్డాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ లేబర్ అడ్డా కింద మంచి వసతులతో షెల్టర్లు నిర్మిస్తామన్నారు. కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం వీరంకిలాకులో శుక్రవారం జరిగిన ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుడి కొడుకు ఎందుకు పరిశ్రమ స్థాపించకూడదనే ఆలోచనతోనే ఈ అడ్డాలను ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఇవి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా ఉంటాయన్నారు. కష్టజీవులకు చేతినిండా పని ఉంటుందని, నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఆదనంగా ఆదాయం వస్తుందన్నారు. ఇక గోదావరి పుష్కరాలకు ముందే 2027లో పోలవరం.. అలాగే, మచిలీపట్నం పోర్టును 2028లో పూర్తిచేస్తామని చంద్రబాబు చెప్పారు. పోర్టు వద్ద ఇండస్ట్రియల్ హబ్‌గా మూడువేల ఎకరాలు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా అధికారుల పనితీరుపై అసంతృప్తి..

అనంతరం.. జిల్లాలో అధికారుల పనితీరు గురించి కలెక్టర్ డీకే బాలాజీ ద్వారా వివరాలు తీసుకుని ప్రతీ ఒక్కరిని పిలిచి వారి వారి శాఖల్లో పనితీరును ప్రశ్నించారు. అయితే, చాలామంది జిల్లాస్థాయి అధికారులు సీఎం పర్యటనకు హాజరుకాకుండా కిందస్థాయి ఉద్యోగులను పంపించి తప్పుకున్నారు. ఫైర్, మోటార్ వెహికల్, శాప్, దేవదాయ శాఖ, హౌసింగ్, వ్యవసాయ తదితర శాఖల అధికారుల పనితీరుపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తీరు మార్చుకోవాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. అలాగే, ప్రజల సమక్షంలో ఎమ్మెల్యేల పనితీరు తెలుసుకుంటున్నానని తానెప్పుడూ ప్రజల తరపునే ఉంటానని, ఎమ్మెల్యేల తరపున ఉండనన్నారు. ఈ కార్యక్రమంలో మే డే సందర్భంగా కార్మికులకు, యజమానులకు సీఎం ప్రభుత్వ పురస్కారాలు అందచేశారు. ఉత్తమ కార్మికులు, పరిశ్రమల యాజమాన్యాలకు శ్రమశక్తి పురస్కారాలు అందించి వారిని ఘనంగా సత్కరించారు.

ఇదేనా జవాబుదారీతనం బాబూ!?

- దిక్కుతోచని స్థితిలో మొక్కజొన్న, మినుము రైతులు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: గత ఎన్నికలకు ముందు పామర్రుకు చంద్రబాబు వచ్చినప్పుడు చేసిన వాగ్దానాల గురించి ఈరోజు ఎక్కడా ప్రస్తావించలేదని, ఇదేనా ఆయన జవాబుదారీతనమని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రశ్నించారు. పామర్రులో ఐటీ టవర్ కడతానన్నారు.. మహిళలకు పింఛను ఇస్తానన్నారు, ఇచ్చారా? అని నిలదీశారు. అన్ని పంటలకు మద్దతు ధర ఇప్పిస్తానని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. మొక్కజొన్న రైతులు నేడు రోడ్లపై దిక్కుతోచక పడిగాపులు గాస్తున్నారని.. మినుము రైతులకు గతంలో దాదాపు రూ.9,500 వస్తే ప్రస్తుతం రూ.7,500కు అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. డిసెంబరుకు పోర్టు పనులు పూర్తి చేస్తామంటున్నారని, అలా పూర్తిచేయకపోతే మిమ్మల్ని రోడ్డుపై నిలబెట్టే కార్యక్రమాన్ని ప్రజలు చేస్తారని హెచ్చరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మావిగన్ కాన్సెప్ట్ తీసుకొచ్చిన తరువాత చంద్రబాబు పదే పదే మచిలీపట్నం పేరును స్మరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసిన చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డి

సాక్షి, అమరావతి: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలు నమ్మి ప్రజలు అధికారం ఇస్తే ముఖ్యమంత్రి అయిన తరువాత విచ్చలవిడిగా దోచేస్తూ రాష్ట్రాన్ని నిండా అప్పుల్లో ముంచేశారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్ ఎక్కిదిగే విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులతోనే రాష్ట్రం సగం అప్పులపాలైందని చెప్పారు. 23 నెలల్లోనే రూ.3.61 లక్షల కోట్లు అప్పులు చేసి కూడా కనీసం ఒక్క కొత్త పింఛన్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జల్సాలు చాలవన్నట్టు విచ్చలవిడి అవినీతితో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందన్నారు. ఇప్పటికే హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ ఉండగా కొత్తవాటి నిర్మాణం పేరుతో అంచనాలు పెంచేసి దోచుకుంటున్నది సరిపోనట్టు అద్దాలు బిగించే పేరుతో మరో రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామనడం కూటమి అవినీతికి పరాకాష్ట అని మండిపడ్డారు. కూటమి అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ఆ కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో వాదించే పేరుతో కూడా భారీగా బిల్లులు చెల్లిస్తున్నారని చెప్పారు. చంద్రబాబే సంక్షోభాలను సృష్టించి ఆదాయంగా మలచుకోవడం, ప్రజల్లో వ్యతిరేకత వచ్చినప్పుడు సమాధానం చెప్పలేక డైవర్షన్ పాలిటిక్స్ చేయడం ఈ రెండేళ్లుగా జరుగుతున్న ఒకే ఒక్క కార్యక్రమం అని విమర్శించారు. రాష్ట్రంలో ఇంధన కొరతను సృష్టించి రూ.150 కోట్లు దోచుకున్నారని ఆయన ఆరోపించారు.

కమీషన్ల 'వైద్యం'!

వైద్య ఆరోగ్యశాఖలో రూ.40 కోట్ల ప్రాజెక్టులో గోల్‌మాల్

సాక్షి, అమరావతి: ఆరోగ్య శాఖలో రూ.40 కోట్ల విలువైన 'వైద్యం' ప్రాజెక్టును దొడ్డిదారిలో అస్మదీయ కంపెనీకి కట్టబెట్టడానికి ప్రభుత్వ పెద్దలు పన్నిన కుట్ర బట్టబయలైంది. ఇతర కంపెనీలు బిడ్‌లు వేయకుండా పోటీని నియంత్రించడమే కాకుండా అర్హత లేని కంపెనీకి బిడ్‌ను అడ్డదారిలో ఆమోదించడం గమనార్హం. వైద్యశాఖ పరిధిలోని వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌ను ఒకే గొడుగు కిందకు తేవడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) అమలులో ప్రత్యక్ష అనుభవం తప్పనిసరి అని రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ)లో నిబంధన విధించారు.

అయితే ఈ నిబంధనకు బదులుగా ప్రభుత్వ రంగంలో ఈ–గవర్నెన్స్/ఆరోగ్య శాఖ ప్రాజెక్ట్‌లలో అనుభవాన్ని అర్హతగా పరిగణించాలని పలు కంపెనీలు ప్రీ బిడ్ సమావేశంలో ప్రభుత్వాన్ని కోరాయి. ప్రభుత్వ/ఆరోగ్య శాఖలో అనుభవానికి టెక్నికల్ ఇవాల్యుయేషన్‌లో 5 మార్కులు కేటాయించాలని విజ్ఞప్తి చేశాయి. ఇందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ప్రభుత్వం పేర్కొనడంతో పలు కంపెనీలు బిడ్‌లు వేయకుండా టెండర్‌కు దూరంగా ఉండిపోయాయి.

Points of clarification from the Bidder

1. The mandatory requirement pertaining to ABDM solution certification / implementation is restrictive and limits the participation of several technically competent vendors who possess readily deployable solutions. It is therefore recommended that this criterion be replaced with equivalent experience in e-Governance / Health Department engagements in Government sectors. Such an amendment would promote inclusive participation, foster competitive pricing, and ultimately serve the project's objective of securing the best value for the Government.

As the ABDM implementation experience requirement significantly narrows the vendor pool and limits healthy competition, it is requested that equivalent experience in e-Governance / Health Department projects in Government sectors be considered as an eligible qualification. This amendment would enable vendors with proven solutions to participate and offer competitive pricing. The evaluation marking criteria may accordingly be revised to — 'Experience in e-Governance / Health Department in Government Sectors — 5 Marks

ఏబీడీఎం అనుభవాన్ని మినహాయించాలని కోరుతూ కంపెనీలు చేసిన విజ్ఞప్తి

Clarification to queries

Clarification: Since the VAIDYAM platform mandated to be fully compliant with the Ayushman Bharat Digital Mission (ABDM) standards, hands-on experience with ABDM is indispensable. The sole bidder / lead bidder in the consortium must have implemented ABDM-compliant solutions and have familiarity with FHIR standards. This experience is critical for ensuring the new platform's interoperability within the national digital health ecosystem.
The VAIDYAM platform will be made ABDM compliant by the successful bidder along with the department. The bidder should have implemented public digital platforms and have experience in carrying out integration with Digital Platforms of Government of India so that it has a thorough understanding of the Digital Public Infrastructure (DPI) being advanced by Government of India in coordination with the states in a federated architecture.

వైద్యం ప్రాజెక్ట్ ఏబీడీఎం ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్న ప్రభుత్వం

దొడ్డిదారిన ఆమోదం..

ఏబీడీఎం నిబంధనను సవరించబోమని ప్రభుత్వం తేల్చి చెప్పడంతో కేవలం నాలుగు కంపెనీలు మాత్రమే బిడ్‌లు దాఖలు చేశాయి. ఉద్యోగుల ముఖ హాజరు(ఎఫ్‌ఆర్‌ఎస్) సేవలు అందిస్తున్న ఓ కంపెనీ ప్రభుత్వ పెద్దలకు పెద్ద మొత్తంలో కమీషన్లు చెల్లించేలా డీల్ కుదుర్చుకుని బిడ్ వేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ కంపెనీకి ఏబీడీఎం అమలులో కనీస అనుభవం కూడా లేకున్నా అక్రమంగా బిడ్‌ను ఆమోదించేశారు. ఏబీడీఎం నిబంధనను మినహాయించాలని ప్రీ–బిడ్ మీటింగ్‌లో పలు సంస్థలు కోరితే ఒప్పుకోకుండా అర్హత లేని కంపెనీ బిడ్‌ను ప్రభుత్వం ఆమోదించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇక స్కోర్‌లు మేనేజ్..!

'వైద్యం' ప్రాజెక్టు కింద తమకు నచ్చిన కంపెనీకి నిధులు దోచిపెట్టేందుకు ఎల్–1 విధానంలో కాకుండా 'క్యూసీబీఎస్' విధానంలో టెండర్ పిలిచారు. ఇప్పటికే అస్మదీయ కంపెనీ బిడ్‌ను ప్రభుత్వ పెద్దలు ఆమోదించారు. టెక్నికల్ ప్రజంటేషన్‌లో అస్మదీయ కంపెనీకి ఎక్కువ స్కోర్ వేసి కాంట్రాక్ట్ కట్టబెట్టనున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్‌కు పరిపాలన అనుమతులు కూడా లేవని వైద్య శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏబీడీఎంలో కనీస అనుభవం లేని కంపెనీకి ప్రాజెక్టు దక్కేలా డీల్ కుదిర్చిన ఆరోగ్యశాఖ ఉన్నతాధికారి ఒకరు టెండర్ ప్రక్రియలో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు కష్టాలు

ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మార్కెట్ యార్డులో ధాన్యం రాశులను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేతలు

గంపలగూడెం: చంద్రబాబు, కూటమి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆరోపించారు. శుక్రవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో పర్యటించి ధాన్యం కొనుగోలుపై రైతులను ఆరా తీశారు. స్థానిక మార్కెట్‌యార్డులో వారాల తరబడి మొక్కజొన్న, ధాన్యాన్ని ఆరబోసి కొనుగోలు కోసం ఎదురు చూస్తున్న రైతులతో మాట్లాడి చలించిపోయారు. అమ్మిరెడ్డిగూడెంలో పెద్ద ఎత్తున ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ తెలంగాణలో మొక్కజొన్న క్వింటా రూ. 2400 వరకు కొనుగోలు చేస్తుంటే, ఇక్కడ రైతులకు రూ.1500 కూడా దక్కడం లేదన్నారు. ధాన్యం ఎక్కడపడితే అక్కడ రాశులు పోసి కొనుగోలు కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలను పట్టించుకునే నాధుడు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి అధికారులు సైతం చేతులెత్తేసిన పరిస్థితి కనిపిస్తోందన్నారు.

రైతుల ఇబ్బందులు పట్టవా?

సాగు ఖర్చు పెరిగి, గిట్టుబాటు ధర లేక.. చివరికి పండిన పంటలు సైతం కొనేవారు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రులు మాత్రం మలేసియా, సింగపూర్ ట్రిప్పులు వేస్తూ ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. ధాన్యం తరలించడానికి వాహనాలు లేవు, సంచులు లేవు, రైతే ఖర్చు భరించి తరలించాలని అధికారులు సూచనలు చేయడం చంద్రబాబు ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం అన్నారు. గతంలో వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ఆ మాటను నేడు నిజం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులు కన్నీరు పెడుతుంటే మంత్రి లోకేశ్ జాడ తెలియడం లేదని, మిగతా మంత్రులు మాట్లాడే ధైర్యం లేక మౌనం వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని అవినాష్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం స్పందించేంత వరకూ పోరాటాలు చేస్తామన్నారు. ఆయన వెంట తిరువూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాసు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఏలూరు శివాజీ, ఉపాధ్యక్షుడు అత్తనూరి వెంకట శివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్, జెడ్పీటీసీ కోట శామ్యూల్, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



నీలో లోతుగా పాతుకుపోయిన కోరికే నువ్వు.
నీ కోరిక నీ సంకల్పాన్ని, నీ సంకల్పం నీ చర్యను,
నీ చర్య నీ అంతిమ గమ్యాన్ని నిర్ణయిస్తాయి.
– బృహదారణ్యకోపనిషత్

సాక్షి
శనివారం, 2 మే 2026

అక్షరాలా నిప్పుల కొలిమి

ప్రతియేటా ఇంచుమించు మే నెల మొదటి వారానికిగానీ ఉగ్రరూపం దాల్చని మార్తాండుడు ఈసారి ఫిబ్రవరి నెలాఖరునాటికే చెలరేగడం మొదలెట్టాడు. ముందే రావటం, దీర్ఘకాలం తిష్టవేయటం కొన్నాళ్లుగా కనబడుతున్నా ఈ స్థాయిలో ఎండలు మండిపోవటం ఇదే తొలిసారి. మన దేశంలో రుతువులు గతి తప్పి చాన్నాళ్లయింది. గతంలో పొద్దుటిపూట ఒక రకం, రాత్రికి మరో రకం వాతావరణం దర్శనమిచ్చేవి. ఎంత ఎండాకాలమైనా రాత్రికి ఎటునుంచో వచ్చి చల్లని గాలులు తాకేవి. సేదతీర్చేవి. ఇప్పుడు రాత్రింబగళ్లు తేడా లేదు. వేడిగాలుల వెనకే హఠాత్తుగా వాతావరణం మారి, జల్లులు మొదలై వడగళ్లు పడటం రివాజుగా మారింది. అటు తర్వాత కాసేపటికే ఉక్కబోత మొదలవుతోంది. ప్రకృతికి సంబంధించినంతవరకూ ఉత్తర దక్షిణాలన్న తేడా... మధ్య, పశ్చిమ భారత్‌లన్న వ్యత్యాసం లేదు. వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్నదాన్నిబట్టి ప్రస్తుతం 23 రాష్ట్రాలకు వడగాడ్పుల తాకిడి ఉంది. అందులో డజనుకుపైగా తీవ్ర వడగాడ్పులను చవిచూస్తున్నాయి. వందలాది నగరాలు భరించలేనంత ఉక్కబోతతో విలవిల్లాడుతున్నాయి. అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలూ ఇప్పటికైతే ఈ సమస్యకు దూరంగా ఉంటున్నాయి. కానీ పర్యావరణంలో వస్తున్న మార్పుల పర్యవసానంగా భవిష్యత్తులో ఇవి సైతం భానుడి ప్రతాపాన్ని చవిచూడకతప్పదని వాతావరణ శాస్త్రవేత్తలు జోస్యం చెబుతున్నారు.

సాధారణ ఉష్ణోగ్రతలకన్నా కనీసం 5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువుంటే, అది వరసగా రెండ్రోజులు కొనసాగితే వడగాడ్పులు వీస్తున్నట్టు లెక్కేస్తారు. అది 7 డిగ్రీల సెల్సియస్‌కి మించి పెరిగితే తీవ్ర వడగాడ్పులుగా పరిగణిస్తారు. ఒక ప్రాంతం మైదానమా, కొండలతో ఉందా అనే అంశాన్ని కూడా ఈ విషయంలో పరిగణనలోకి తీసుకుంటారు. బొంబాయి ఐఐటీ ఇటీవల చేసిన అధ్యయనంలో గంగా–సింధు మైదానం (ఉత్తర భారతం)లో వేడిగాలులకు స్థానిక నేలలు, ఇతర వాతావరణ పరిస్థితులు కారణమని తేల్చింది. వెలుపలినుంచి వచ్చే వేడిగాలులే ఇందుకు దోహదపడుతున్నాయన్న అభిప్రాయాన్ని తోసిపుచ్చింది. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత పెరగడంతో వేడిగాలులు భూ ఉపరితలానికి దగ్గరగా ఉండిపోతున్నాయి. నగరాల్లోని కాంక్రీట్ కట్టడాలు, తారురోడ్లు పగలంతా తీవ్ర ఉష్ణోగ్రతను స్వీకరించి, రాత్రికి సైతం సెగలు కక్కుతూనేవుంటున్నాయి. అందుకే ఇంతచేటు తీవ్రత!

వరదలు, తుపానులు, భూకంపాల్లాగే వడగాడ్పులు కూడా ప్రకృతి వైపరీత్యమే. కానీ ప్రభుత్వాలు ఒప్పుకోవు. వడగాడ్పులవల్ల ఏటా వందలాది మరణాలు సంభవిస్తున్నా, ఆ విధంగా లెక్కేయటానికి తగిన విధానం రూపొందలేదు. సాధారణంగా శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్ లేదా అంతకన్నా ఎక్కువకు చేరి, శరీరంలో చెమట పట్టడం ఆగిపోయి చర్మం పొడిబారి ఎర్రగా మారితే, స్పృహ కోల్పోవటం లేదా మతిస్థిమితం తప్పడం, మూర్ఛరావడం వంటివి కనబడితే వడగాడ్పు మరణమని చెబుతారు. వీటికితోడు బాధితుడున్న ప్రాంతంలో వడగాలుల హెచ్చరిక ఉందా, అతను మరణించటానికి ముందు ఎండలో పనిచేశాడా లేదా అనేవి కూడా చూస్తారు. ఆ తర్వాతే వడగాడ్పు మరణంగా నిర్ధారిస్తారు. గుండెజబ్బు వగైరాలున్నా, వృద్ధాప్యంలో ఉన్నా ఆ జాబితాలో లెక్కేయరు. ఈ విషయంలో ప్రభుత్వాల వైఖరి మారాలి. వేసవిలో మరణాల రేటు గత కొన్నేళ్లలో ఎలావుందో చూసే విధానాన్ని అంతర్జాతీయంగా అనుసరిస్తున్నప్పుడు మనం మాత్రం ఎందుకు ఆ కొలమానాన్ని తీసుకోవటం లేదు?

పదహారో ఆర్థిక సంఘం నిరుడు ఇచ్చిన నివేదికలో వడగాడ్పుల్ని, పిడుగుపాటుల్ని కూడా ప్రకృతి విపత్తులుగా పరిగణించాలని కోరింది. చాలా రాష్ట్రాలు ఎన్నో ఏళ్లుగా ఈ విషయంలో డిమాండ్ చేస్తున్నాయి. అలా లెక్కేస్తే అందుకు సంబంధించిన నిధుల్ని సహాయ కార్యక్రమాల కోసం వ్యయం చేయటానికి, బాధితులకు తక్షణ సాయం అందించటానికి వీలవుతుంది. వడగాడ్పులున్న ప్రాంతాల్లో భవన నిర్మాణం, సాగు పనుల సమయాలను మార్చటానికి, విద్యాసంస్థలు, కార్యాలయాల పనివేళల్ని సవరించటానికి వీలవుతుంది. అందుకే ప్రభుత్వాలు తక్షణం కదలాలి. అవసరమైన కార్యాచరణ రూపొందించాలి. జనం ప్రాణాలు కాపాడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ పరాభవనామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం; **తిథి:** బ.పాడ్యమి రా.11.01 వరకు, తదుపరి విదియ; **నక్షత్రం:** విశాఖ తె.5.38 వరకు(తెల్లవారితే ఆదివారం), తదుపరి అనూరాధ; **వర్జ్యం:** ఉ.9.31 నుండి 11.16 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.5.38 నుండి 7.18 వరకు; **అమృత ఘడియలు:** రా.8.00 నుండి 9.44 వరకు.

సూర్యోదయం: 5.38
సూర్యాస్తమయం: 6.15
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

బలం

విజయం అనేది తొలి అడుగులోనే సాధ్యమయ్యేది కాదు. నాకు అందుకు 13 సంవత్సరాలు పట్టింది. మధ్యలో కొన్నిసార్లు దుర్బలత్వం ఆవహించవచ్చు. కానీ మనం బలంగా ఉండాలి. కష్టమైన పరిస్థితులను అంగీకరించే ధైర్యాన్ని కలిగి ఉండటమే బలం.

– డేవిడ్ బెక్‌హామ్, ఫుట్‌బాల్ ఆటగాడు

సైన్స్

నాయకత్వంలో ఉన్న మహిళలు మొత్తం సమాజం గురించి ఆలోచిస్తారు. మీరు సైన్స్‌ను ఇష్టపడే అమ్మాయి అయితే ఏ అడ్డంకినీ లెక్క చేయకండి. మీరు ఇప్పుడు ఎదుర్కొంటేనే, రేపు ప్రపంచం ఎదుర్కోబోయే వాటికి మీరు పరిష్కారం కనిపెట్టగలరు.

– సౌమ్య స్వామినాథన్, శాస్త్రవేత్త

స్క్రిప్టు

సినిమా నిర్మాణంలో రచన అనేది అత్యంత బాధాకరమైన భాగం. కానీ అది అత్యంత సరదాగా కూడా ఉంటుంది. మీరు మీ స్క్రిప్టును పదే పదే సవరించుకోవటానికి సిద్ధంగా ఉండాలి. మీరు మారుతూ, నేర్చుకుంటూ ఉండకపోతే ఇక్కడ మీ పనికి కాలం చెల్లినట్లే!

– మహేశ్ నారాయణన్, చిత్ర దర్శకుడు

అక్కర్లేదు



పని కట్టుకుని ఎవరూ సమాజం కోసం పాటు పడనవసరం లేదు. కేవలం మూడు విషయాల మీద దృష్టి పెడితే చాలు. సామాజిక సామరస్యం, స్వయం సమృద్ధి, కుటుంబ విలువలు. ఇవేవీ కాదంటారా... మీ ప్రతి నిర్ణయంలోనూ ప్రకృతికి ప్రాధాన్యం ఇచ్చినా సరిపోతుంది.

– కె.ఎన్. గోవిందాచార్య (83), పర్యావరణ ఉద్యమకర్త

లోపాలు

మీ పేరులో కనిపించే గొప్పతనం వల్ల కాకుండా, మీ పని ఆధారంగా మీకంటూ ఒక గుర్తింపును సంపాదించటమే మీ లక్ష్యం కావాలి. మీలో లోపాలను ఎత్తి చూపేందుకు సంకోచించని వ్యక్తులతో కలిసి ఉండండి. మీరు ఎదగటానికి ఎంతో సమయం పట్టదు.

– నందిని పిరమల్, పిరమల్ ఫార్మా చైర్‌పర్సన్

పతకం



రజత పతకం గెలిచినంత మాత్రాన మీరు స్వర్ణ పతకాన్ని కోల్పోయినట్లు కాదు. మీరు ఇంకా మెరుగు పడాల్సిన అంశాలను కనుగొనటానికి మీకు అవకాశం లభించిందని అర్థం. ప్రతి దిగువ స్థానం కూడా ఆ పైస్థానానికి ఒక పాఠమే తప్ప, అది 'దాదాపు'గా గెలవటమేమీ కాదు.

– ప్రతీక్ష సంతోష్ షిండే, మార్షల్ ఆర్టిస్ట్

వేడెక్కుతున్న వేసవి విడుదులు

విశ్లేషణ

దినేశ్ సి. శర్మ

దేశంలోని చాలా ప్రాంతాల్లో సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఫలితంగా, జనం హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోని వేసవి విడుదులకు ప్రయాణం కడుతున్నారు. సిమ్లా, కులు, మనాలి, నైనితాల్, ముసోరి, ధర్మశాల వంటి టూరిస్టు కేంద్రాలతోపాటు, పర్వత ప్రాంతాలలోని పుణ్య క్షేత్రాలకు కూడా తరలివెళుతున్నారు.

ఏటా 'చార్ ధామ్' (బదరీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి) యాత్ర కూడా వేసవిలోనే మొదలవుతుంది. ఇటీవలి దశాబ్దాలలో ఆ ప్రాంతాలు పర్యావరణ ఉపద్రవాలను చవి చూశాయి. వాతావరణం క్షణానికో రకంగా మార్పులకు లోనవుతోంది. కొండ చరియలు విరిగిపడుతున్నాయి. నేలలు కుంగిపోతున్నాయి. దాంతో అడ్డూఆపూ లేని టూరిజంతో పర్వత ప్రాంతాలపై పడుతున్న ప్రభావం గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

సున్నితమైన ప్రాంతాలు

వివిధ పుణ్య క్షేత్రాలు హిమాలయాల లోపలి ప్రాంతాల్లో ఉన్నాయి. ఆ ప్రాంతాలు సన్నని లోయలు, హిమానీనదాలు ఏర్పరిచిన పల్లపు ప్రాంతాలతో కూడుకుని ఉన్నాయి. భూగర్భంలోని పలకలు కదులుతూంటాయి. వర్షం పడినా, భూకంపనాలు చోటుచేసుకున్నా ఆ ఒత్తిడికి వాలు ప్రాంతాల్లోని రాళ్ళు కిందకు జారిపడిపోతూంటాయి. ఎత్తైన కొండ ప్రాంత గడ్డిభూములు, పర్వతాగ్రాలలోని సరస్సులు, పెళుసైన వృక్షజాల ప్రాంతాలు ఆ రకమైన ఒడుదుడుకులను తట్టుకుని తేలిగ్గా కోలుకోగల శక్తి కలిగినవి కావు. అందుకనే, అనాది నుంచి అక్కడ మానవ ఆవాస ప్రాంతాలు తక్కువ. వాతావరణం అనుకూలంగా ఉండే సీజనులో వచ్చే యాత్రికుల వల్ల కూడా అక్కడి జీవావరణ వ్యవస్థ చెదిరిపోతోంది. పెద్ద సంఖ్యలో వచ్చే కార్లు, బస్సులు కాలుష్యానికి కారణమవుతున్నాయి. వ్యర్థ పదార్థాలను సక్రమమైన రీతిలో జారవిడిచే సదుపాయాలు లేవు. పెరుగుతున్న మానవ కార్యకలాపాల (టూరిజం, నిర్మాణ కలాపాలు, భారీ ప్రాజెక్టులు వంటి వాటి) వల్ల హిమాలయాల జీవావరణ వ్యవస్థకు ముప్పు వాటిల్లుతోంది. కోర్టులు, పర్యావరణ పరిరక్షణ సంస్థల ఒత్తిడి వల్ల ఆ వాస్తవాన్ని విధాన నిర్ణేతలు గుర్తించకపోలేదు. కానీ, క్షేత్ర స్థాయిలో నివారణ చర్యలు అంతంతే.

చార్ ధామ్‌కు వెళ్ళే దినసరి సందర్శకుల సంఖ్యపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం గత ఐదేళ్ళుగా ఒక పరిమితిని విధిస్తున్నా, వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటోంది. ఒక రోజులో బదరీనాథ్‌కు 1,000, కేదార్ నాథ్‌కు 800, గంగోత్రికి 600, యమునోత్రికి 400లకు మించి యాత్రికులను అనుమతించకూడదని 2021లో నిర్ణయించారు. ఆ యా ప్రాంతాలు తట్టుకోగల శక్తిని బట్టికాక, కోవిడ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ నిర్ణయానికి వచ్చారు. ఈ ఏడాది కూడా, సందర్శకుల సంఖ్యపై పరిమితి విధించబోమని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను మాత్రం తప్పనిసరి చేశారు.

◆ 2025లో జరిగిన అధ్యయనం ప్రకారం, ఏటా గంగోత్రి (22.36 మీటర్ల చొప్పున), యమునోత్రి (20 మీటర్లు), బదరీనాథ్ (17.32 మీటర్లు), కేదార్‌నాథ్ (14.14 మీటర్లు) కుంచించుకుపోతున్నట్లు వెల్లడైంది.

ఎంతమందిని అనుమతించొచ్చు?

కేదార్, బదరీ, గంగోత్రి, యమునోత్రి తట్టుకోగలిగిన సామర్థ్యానికి సంబంధించి 'వీర్ చంద్ర సింగ్ గఢ్‌వాలీ ఉత్తరాఖండ్ యూనివర్సిటీ ఆఫ్ హార్టికల్చర్ అండ్ ఫారెస్ట్రీ', 'జి.బి. పంత్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్' సైంటిస్టులు 2025లో ఒక అధ్యయన పత్రాన్ని ప్రచురించారు. ఎత్తు, వాలు, వృక్షజాల వ్యాప్తి అనే మూడు కీలక భౌగోళిక సూచికలను ఆధారం చేసుకుని వారు ఆ పత్రాన్ని రూపొందించారు. ఆ నాలుగు మందిరాల వద్ద, వాటి చుట్టుపక్కలనున్న హిమంతో కప్పుకున్న హిమానీనద ప్రాంతాలను విశ్లేషించినపుడు ఆ హిమనదాలు 2002–2020 మధ్యకాలంలో గణనీయంగా కుంచించుకుపోయినట్లు వెల్లడైంది.

వాటిలో ఎక్కువగా (ఏడాదికి 22.36 మీటర్ల చొప్పున) గంగోత్రి, యమునోత్రి (ఏటా 20 మీటర్లు), బదరీనాథ్ (ఏటా 17.32 మీటర్లు), కేదార్‌నాథ్ (14.14 మీటర్లు) కుంచించుకుపోతున్నట్లు తేలింది. ఆ నాలుగు ప్రాంతాల్లో (1990–2020 మధ్య కాలానికి సంబంధించి) వాతావరణ డేటాను కూడా విశ్లేషించారు. ఆ ప్రదేశాలన్నింటిలోను, మూడు (వర్షాకాలానికి ముందు, వర్షాకాలంలో, వర్షాకాలం తర్వాత) సీజన్లలోనూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న ధోరణి కనిపించింది. నాలుగు ప్రదేశాలు సంరక్షణ ప్రాంతాల లోపల లేదా వాటి చుట్టుపక్కల పరిసరాలలో ఉన్నాయి. బదరీనాథ్ మందిరం 'నందాదేవి నేషనల్ పార్క్' పరిధిలోకి; 'కేదార్‌నాథ్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం' పరిధిలోకి కేదార్‌నాథ్; 'గంగోత్రి నేషనల్ పార్క్' పరిధిలోకి గంగోత్రి; 'గోవింద్ పశు విహార్ నేషనల్ పార్క్ అండ్ శాంక్చురీ' పరిధిలోకి యమునోత్రి వస్తాయి.

ఆ విశ్లేషణను ఆధారం చేసుకుని చార్ ధామ్ దినసరి సందర్శకుల సంఖ్యపై గణనీయమైన పరిమితి విధించాలని పరిశోధకులు ఒక అభిప్రాయానికి వచ్చారు. ఒక రోజులో బదరీనాథ్‌కు (11,833 నుంచి 15,778), కేదార్‌నాథ్‌కు (9,833 నుంచి 13,111), గంగోత్రికి (6,133 నుంచి 8,178), యమునోత్రి (4,620 నుంచి 6,160) సందర్శకులను పరిమితం చేయాలని వారు కోరారు. వాహనాల క్రమబద్ధీకరణ, వ్యర్థ పదార్థాల పునర్వినియోగానికి సంబంధించి కూడా కొన్ని సూచనలు చేశారు. కొండ ప్రాంతాల్లోని ఇతర నగరాలు, పట్టణాలకున్న భరణ శక్తిని గణించేందుకూ ఈ గ్రూపు అభివృద్ధిపరచిన పద్ధతిని వర్తింపజేసుకోవచ్చు. సిమ్లా కూడా దాని శక్తికి మించి సందర్శకులను భరిస్తున్నట్లు కొన్ని మదింపులలో తేలింది.

ఏం చేయాలి?

భరణ సామర్థ్యాన్ని శాస్త్రీయమైన రీతిలో మదింపు చేస్తే, సముచితమైన చర్యలు తీసుకునే వీలుంటుందని సుప్రీంకోర్టు 2024 జూన్‌లో, మొత్తం 13 హిమాలయ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. నగరాలతో సహా వేసవి విడుదులు, పర్యావరణ పరంగా సున్నితమైన మండలాల భరణ సామర్థ్యాన్ని మదింపు చేసేందుకు 2020లోనే మార్గదర్శక సూత్రాలు జారీ చేసినట్టు పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఆ తర్వాత కోర్టుకు తెలియజేసింది. నిపుణుల కమిటీలను నియమించడం లేదా వాయు పరిశీలన పరికరాలను నెలకొల్పడం వంటి పైపై చర్యలకు పరిమితమవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు అరకొర విధానాలనే అనుసరిస్తున్నాయి. పర్వత ప్రాంత రాష్ట్రాలు తమ సమస్యను పరిష్కరించుకునేందుకు సమగ్రమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించుకోవాల్సి ఉంది.

లేదంటే నిష్క్రియాపరత్వానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. కేదార్ నాథ్ వరదల నుంచి జోషీమఠ్ కుంగిపోవడం వరకు ప్రకృతి ఉపద్రవాల పరంపరను ఇప్పటికే చవిచూశాం. తీవ్ర వాతావరణ పరిస్థితులు, మేఘ విస్ఫోటనాలు, కొండచరియలు విరిగిపడటం వంటివాటికి పుడమి వేడిమితో ప్రపంచం మొత్తంమీద వాతావరణంలో వస్తున్న మార్పు, ఆ యా ప్రాంతాల్లోని భౌగోళిక స్థితిగతులు కారణం కావచ్చు. కానీ, టూరిజం, పరిమితికి మించి జనం మీదపడడం, ప్రణాళికాబద్ధత లేని పట్టణీకరణ, అడవులను నరికేయడం, భారీ ప్రాజెక్టులు చేపట్టడం వంటి మానవ ప్రేరేపిత చర్యలు ఉపద్రవాలకు మరింత ఊతం ఇస్తున్న సంగతిని మరువకూడదు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత

రక్షణ రంగానికి ప్రైవేట్ ఇంజిన్

వ్యూ పాయింట్:

పాడ్‌కాస్ట్:
కంట్రోల్ ప్లస్ ఆల్ట్ ప్లస్ డిఫెన్స్

అతిథి:
సుహాస్ తేజస్కంద
టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్, ఏరోస్పేస్ ఇంజినీర్

హోస్ట్:
శివ్ అరూర్, విష్ణు సోమ్
ఎన్డీటీవీ యాంకర్లు

మొదటి దశ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకున్న భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ మానవ రహిత బాంబర్ డ్రోన్ (యుద్ధ విమానం) ఎఫ్‌డబ్ల్యుడి–200బి... దేశీయ స్టార్టప్‌ల సామర్థ్యానికి ఒక బలమైన నిదర్శనమని ఆ బాంబర్‌ను తయారు చేసిన 'ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్' (బెంగళూరు) సంస్థ వ్యవస్థాపకుడు సుహాస్ తేజస్కంద అంటున్నారు.

'పెద్దన్న' సాయం అక్కర్లేదు!

''ఎఫ్‌డబ్ల్యుడి–200బి వైపు చూసినప్పుడు, అది నాకు కేవలం ఒక బాంబర్‌లా మాత్రమే కనిపించదు. మన దేశ సార్వభౌమాధికార ప్రకటనలా అనిపిస్తుంది. చాలాకాలంగా, ఉన్నత స్థాయి సాంకేతికత కోసం భారతదేశం విదేశీ కంపెనీలపైనే ఆధారపడుతూ వస్తోంది. కానీ, ఒక విదేశీ 'పెద్దన్న' సాయం లేకుండానే... 7 మీటర్ల రెక్కల వెడల్పు, 100 కిలోల కంటే ఎక్కువ బరువు మోయగల బాంబర్ విమానాన్ని ఒక భారతీయ స్టార్టప్... డిజైన్ చేసి, నిర్మించగలదని దీని తయారీతో మేము నిరూపించగలిగాం.

రిమోట్‌ల కాలం ముగిసింది!

''నేను నా బృందానికి ఎప్పుడూ, 'మనది కేవలం విమానాలను తయారుచేసే సంస్థ మాత్రమే కాదు, మన దొక ఏఐ కంపెనీ. రిమోట్ కంట్రోల్‌తో నడిచే డ్రోన్ల కాలం ముగిసిపోయింది'' అని చెబుతుంటాను. ఒక పైలట్ 500 కిలోమీటర్ల దూరం నుండి డ్రోన్‌ను మాన్యువల్‌గా నడపాల్సి వస్తే, ఆ సమాచార సంకేతాలను శత్రువులు తేలిగ్గా తెగ్గొట్టే ప్రమాదం ఉంటుంది. అందుకే మేము 'ఎడ్జ్ కంప్యూటింగ్' మీద దృష్టి పెట్టాం. అంటే, నిర్ణయాలు తీసుకునే శక్తిని విమానం లోపలే ఉంచడం. ఒకవేళ సిగ్నల్ తెగిపోయినా, ఆ డ్రోన్ తనంతట తానుగా లక్ష్యాన్ని గుర్తించాలి; సాధారణ పౌరులకు, శత్రువులకు మధ్య తేడాను తెలుసుకోవాలి; మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేయాలి.

శివ్ అరూర్ విష్ణు సోమ్ సుహాస్ తేజస్కంద

వాటికవే గుర్తు పడతాయి

''ఆధునిక యుద్ధాల్లో శత్రువులు చేసే మొదటి పని, జీపీఎస్ సిగ్నళ్లను జామ్ చేసి మనల్ని 'చూపులేని వారిని' చేయడం. ఒకవేళ మీ డ్రోన్ తన ఉనికిని తెలుసుకోవడానికి కేవలం శాటిలైట్ మీద మాత్రమే ఆధారపడితే, సరిహద్దు దాటిన మరుక్షణమే అది కోట్ల రూపాయల విలువైన ఒక 'పనికిరాని ఇటుక' ముక్కలా మారిపోతుంది. అందుకే మేము మా పరిశోధనలను 'ఆప్టికల్ ఫ్లో', 'ఇనెర్షియల్ నావిగేషన్' వైపు మళ్లించాం. దాని వల్ల, చుట్టూ ఉన్న డిజిటల్ సిగ్నళ్లు అన్నీ నిలిచిపోయినా సరే, ఒక మనిషి (పైలట్) నేలని చూసి దారిని ఎలా గుర్తుపడతాడో, అలాగే మన డ్రోన్లు కూడా భూవితలుని, గుర్తులను చూసి కచ్చితమైన దారిలో వెళతాయి.

తక్కువ ఖర్చుతో 'లీడ్ బులెట్లు'

''సైనిక ఆయుధాల విలువను అంచనా వేసే విధానంలో మేము ఒక ప్రాథమిక మార్పును తీసుకువస్తున్నాం. సంప్రదాయ ఫైటర్ జెట్లలాగా అత్యంత ఖరీదైన 'సిల్వర్ బులెట్లు (కేవలం ఐదు లేదా ఆరు విమానాలు) కలిగి ఉండటం కంటే, వందల సంఖ్యలో తక్కువ ఖర్చుతో కూడిన 'లీడ్ బులెట్లు' (మానవ రహిత బాంబర్లు) ఉండాలని మేము భావించాం. ఒక మనిషి నడిపే విమానం తయారీకి అయ్యే ఖర్చులో కేవలం పదింట ఒక వంతు ఖర్చుతో మనం ఒక బాంబర్‌ను తయారు చేసి, అది 80 శాతం పనిని పూర్తి చేయగలిగినా, శత్రువుల లెక్కలు తారుమారైపోతాయి.

వేగమే ఇప్పుడు ఆయుధం!

''మన ముందున్న సవాలు సాంకేతికత కాదు, 'సమయం'! భారతదేశంలో పాత పద్ధతుల్లో ఒక రక్షణ పరికరాన్ని సమకూర్చుకోవాలంటే దాదాపు పదేళ్లు పట్టేది. కానీ మన దేశం దగ్గర ఇప్పుడంత సమయం లేదు. అందుకే మేము 'ఫ్లయింగ్ వెడ్జ్' సంస్థను వేగంగా నిర్ణయాలు తీసుకునేలా తీర్చిదిద్దాం. ఒక పెద్ద కార్పొరేట్ సంస్థ ఒక ప్రాజెక్ట్ సాధ్యమవుతుందో లేదో అని చర్చలు జరిపే లోపే, మేము ఒక 'ప్రోటోటైప్'ను (నమూనాను) ఆకాశంలోకి పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నా ఉద్దేశం, దేశ రక్షణ అవసరాలను వేగంగా తీర్చే ఒక ఇంజిన్‌లా ప్రైవేట్ రంగం పని చేయాలని!

☐ ఎడిటోరియల్ టీమ్

ఆధునిక బందిపోట్లు

ఇన్ బాక్స్

దేశవ్యాప్తంగా ఇసుక మాఫియాల ఆగడాలు పెచ్చు మీరుతున్నాయనీ, వాటిని అరికట్టాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయనీ సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. ఏప్రిల్ 17వ తేదీన సుప్రీంకోర్టు ధర్మాసనం 'నేషనల్ చంబల్ ఘరియల్ అభయారణ్యం'లో సాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు ఆపి పర్యావరణాన్ని కాపాడటానికి 'నిర్దిష్ట చర్యలు' ఒక్క నెలలోపు చేపట్టాలని రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలను ఆదేశించింది.

చంబల్ నది లోతుల్లోకి తవ్వకాలు జరుపుతూ, జాతీయ చంబల్ ఘరియల్ అభయారణ్యంలోని సున్నితమైన ప్రవాహ జీవావరణ వ్యవస్థను నాశనం చేస్తున్న ఇసుక తవ్వకందారులు ఏమాత్రం బలహీనులు కారనీ, వారి వద్ద ఆయుధ సంపత్తి ఉందనీ మధ్యప్రదేశ్ ప్రభుత్వం పదేపదే కోర్టుకు చెప్పింది. దీంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం... 'పోలీసుల కంటే మెరుగైన ఆయుధాలు కలిగి ఉండి, తమకు అడ్డువచ్చిన వారిని నిర్భయంగా చంపేస్తున్న ఇసుక తవ్వకాల మాఫియాయే 'చంబల్ ఆధునిక బందిపోట్లు' అని వ్యాఖ్యానించింది. 'మైనింగ్ మాఫియా చేతిలో ఎంతమంది సబ్–డివిజనల్ మేజిస్ట్రేట్లు, పోలీసులు, అటవీ అధికారులు చంపబడ్డారో చూడండి... కానీ నివారణ, నిర్బంధం అనే చట్టం ఒకటి ఉందని రాష్ట్రం మరిచిపోయింది' అని జస్టిస్ మెహతా వ్యాఖ్యానించారు. 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద గత మార్చి 9న రాజస్థాన్ ప్రభుత్వం 'జాతీయ చంబల్ ఘరియల్ అభయారణ్యం' సరిహద్దులను మారుస్తూ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం చంబల్ నదికి ఇరువైపులా ఉన్న 732 హెక్టార్ల భూమిని ఆంక్షల నుండి విముక్తి చేసింది. దీంతో ఈ నోటిఫికేషన్‌పై సుప్రీం కోర్టు ధర్మాసనం స్టే విధించింది.

ఇసుక మాఫియాల దోపిడీ ఫలితంగా మనకు అపారంగా ఉన్న జలవనరులు నానాటికీ అడుగంటిపోయి మారుమూల ప్రాంతాలలోని గ్రామాల ప్రజలు గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్ళకొలది నడిచి వెళ్లాల్సిన దుఃస్థితిలో ఉన్నారు. విజయవాడ లాంటి నగరాల పక్కన నదులు, కాలవలు ప్రవహిస్తున్నా 200, 300 అడుగుల లోతుకు బోర్లు వేస్తే గాని నీరు దొరకని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కావున ఇసుక మాఫియా దారి దోపిడీకి అడ్డుకట్ట వేసే విధంగా, సహజ సిద్ధంగా ఉన్న జల వనరులను కాపాడుట కోసం ప్రజలు ఎక్కడికక్కడ ఉద్యమాలు సాగించాలి.

– ముప్పాళ్ళ భార్గవ శ్రీ । సీపీఐ ఎంఎల్ నాయకుడు

నష్టకాలంలోనూ సేవ!

డేటా పాయింట్

గత మూడేళ్లలో సగటున నికర నష్టాలను చవి చూసినప్పటికీ, ఇండియాలోని 28 లిస్టెడ్ కంపెనీలు 2025 ఆర్థిక సంవత్సరంలో తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్.)ను కొనసాగించాయి.

నష్టాలు వచ్చినా బాధ్యత మరువని భారత కంపెనీలు

కంపెనీ	గత మూడేళ్ల నికర నష్టం (రూ.కోట్లు)	సి.ఎస్.ఆర్.కు చేసిన వ్యయం (రూ.కోట్లు)
టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్	462.6	26.3
ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్	121.2	4.2
ఎం.ఎస్.పి. స్టీల్ అండ్ పవర్	1.9	1.6
ఇండియా సిమెంట్స్	263.7	1.5
ముకంద్	64.6	1.4
ప్రిజమ్ జాన్సన్	40.4	1.2
పీవీఆర్ ఐనాక్స్	292.4	1
సొలారా యాక్టివ్ ఫార్మా సైన్సెస్	208.1	0.7
స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా	4.2	0.6
జువారీ ఇండస్ట్రీస్	4.5	0.5

సి.ఎస్.ఆర్. వ్యయంలో నిర్వహణ ఖర్చులు, సి.ఎస్.ఆర్. ప్రభావాన్ని అంచనా వేయటం కోసం నిపుణుల చేత సర్వే చేయించటానికి అయిన ఖర్చులు కలిసి ఉన్నాయి. మూడేళ్ల సగటు నికర నష్టాల గణాంకాలను కంపెనీల చట్టంలోని సెక్షన్ 198 ప్రకారం లెక్కించటం జరిగింది.

(ఆధారం: ప్రైమ్ ఇన్ఫో బేస్. కామ్)

సమాచార వారధి



భారతీయ జ్ఞాన సంప్రదాయంలో దేవరుషి నారదుడు ఒక ధ్రువతార. భగవంతుని మేధస్సుకు ప్రతిరూపంగా, ఆధ్యాత్మిక ఉన్నతికి మార్గదర్శకుడిగా ఆయనను పురాణాలు కీర్తిస్తున్నాయి. కేవలం సమాచార వారధిగానే కాకుండా, ప్రజా సంక్షేమమే పరమావధిగా మూడు లోకాల్లో సంచరించే నిరంతర చైతన్య మూర్తి ఆయన. సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో 'రుషులలో నేను నారదుడను' (దేవర్షిణాం చ నారదః) అని ప్రకటించుకొని ఆయన గొప్పతనాన్ని చాటిచెప్పారు. శ్రీమద్భాగవత పురాణం నారదుడిని 'భగవంతుని హృదయం'గా వర్ణించింది. వేద, ఉపనిషత్తులతో పాటు సంగీతం, వ్యాకరణం, ఆయుర్వేదం, జ్యోతిషం, రాజనీతి వంటి సకల శాస్త్రాల్లో నిష్ణాతుడైన నారదుడు, తన వీణాగానంతో భగవంతుని కీర్తిస్తూ లోకంలోని ఆర్తుల బాధలను కడతేరుస్తుంటారు.

నారద మహర్షి కేవలం భక్తుడిగానే కాకుండా, అనేక పురాణ పురుషులకు దిశానిర్దేశం చేసిన గురువుగా నిలిచారు. వాల్మీకి మహర్షిని రామాయణ రచనకు, వేదవ్యాసుడిని శ్రీమద్భాగవత రచనకు ప్రేరేపించినది నారదుడే. ప్రహ్లాదుడు, ధ్రువుడికి చిన్నతనంలోనే ఉపదేశం చేసి వారిని గొప్ప భక్తులుగా తీర్చిదిద్దారు. ఇంద్రుడు, హనుమంతుడు, యుధిష్ఠిరుడు వంటి వారికి ధర్మం, కర్తవ్యాలను బోధించారు. లోక రక్షణ కోసం సాక్షాత్తు విష్ణువు నుంచి సత్యనారాయణ స్వామి వ్రతకథను గ్రహించి భూలోకానికి అందించిన ఘనత ఆయనదే. బ్రహ్మ మానస పుత్రుడైన నారదుడు 'సత్యం శివం సుందరం' అనే సూత్రంతో జీవకోటి మేలును ఆకాంక్షించారు. లక్ష్మీనారాయణుల కల్యాణం జరిపించడం నుంచి జలంధర సంహారం వరకు ఆయన చేసిన ప్రతి కార్యం వెనుక లోకకల్యాణం దాగి ఉంది. ప్రతి ఏటా జ్యేష్ఠ మాస కృష్ణ పక్ష ప్రతిపద నాడు నారద జయంతిని జరుపుకోవడం మన సంప్రదాయం. తన వాక్కుతో, జ్ఞానంతో అధర్మాన్ని తొలగించి, ధర్మాన్ని ప్రతిష్ఠించే నారదుడు నేటికీ మన సంస్కృతికి ప్రకాశవంతమైన దీపస్తంభం.

– పసుపులేటి వెంకటేశ్వరరావు (నేడు నారద జయంతి)

పింఛను కోసం పాట్లు తప్పడం లేదు

రెండేళ్లవుతున్నా ఇప్పటికీ టీడీపీ ప్రభుత్వం ఇంటి వద్దే పింఛన్లు అందించలేకపోతోంది. ఒకటో తేదీ వచ్చిందంటే సచివాలయాల వద్దకు, లేదంటే సచివాలయ ఉద్యోగులు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్లేందుకు పింఛనుదారులు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా నందవరం మండలం ఇబ్రహీంపురంలో ఉదయం 9 గంటలైనా సచివాలయ ఉద్యోగులు రాకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు సచివాలయం మెట్లు ప్రదక్షిణ చేయాల్సి వచ్చింది. ఎండలో వీరంతా చుక్కలు చూడాల్సి రావడం గమనార్హం. – నందవరం

స్వర్ణరథంపై అమ్మవారి దివ్యదర్శనం

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం స్వర్ణరథంపై తిరువీధుల్లో ఊరేగారు. ఏటా ఆలయంలో నిర్వహించే వసంతోత్సవాల్లో భాగంగా రెండోరోజు శ్రీ పద్మావతి అమ్మవారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 9.03గంటలకు భక్తుల కోలాటాలు నడుమ దివ్యమంగళ స్వరూపిణియైన శ్రీపద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఆశీనులై తిరు వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వర్ణరథాన్ని లాగేందుకు మహిళలు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. – చంద్రగిరి

కుమారారామ భీమేశ్వరుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నక్తి సుబ్బారెడ్డి దంపతులు శుక్రవారం కాకినాడ జిల్లా సామర్లకోట బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని కాలభైరవ స్వామి, ఉప ఆలయాలను, మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు, ఈవో స్వామివారి ఫొటో, ప్రసాదం అందజేశారు. అలాగే, జస్టిస్ సుబ్బారెడ్డి దంపతులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలోని మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని కూడా దర్శించుకున్నారు. – సామర్లకోట

క్లుప్తంగా...

బెంగళూరు చరిత్రలో అదే భారీ వర్షం

- గత నెల 29న కుమ్మరించిన వాన
- 11 సెంటీమీటర్లకు పైగా కురిసినట్టు భారత వాతావరణ శాఖ వెల్లడి

బనశంకరి: కర్ణాటక రాజధాని బెంగళూరు చరిత్రలో గత నెల 29న అత్యధిక వర్షపాతం నమోదైన రోజుగా రికార్డుల్లోకి ఎక్కింది. బుధవారం సాయంత్రం బెంగళూరు మధ్య భాగంలో ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురుగాలి, వడగండ్లతో 11 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసిందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

పోటెత్తిన వరద నీరు

అకాల వర్షానికి బెంగళూరులో వరదనీరు పోటెత్తినట్లు అధికారులు గుర్తించారు. 200 చదరపు కిలోమీటర్ల పరిధిలో భారీ వర్షం కురిసిందని గ్రేటర్ బెంగళూరు ప్రాధికార సంస్థ తెలిపింది. 20 నుంచి 22 మిలియన్ ఘనపు మీటర్ల నీరు వచ్చిందని అంచనా వేశారు. భౌగోళికంగా 900 మీటర్ల ఎత్తులో ఉన్న బెంగళూరులో వార్షికంగా 95 సెంటీమీటర్ల నుంచి 110 సెంటీమీటర్ల వర్షం కురుస్తుంది. ఐఎండీ వివరాల ప్రకారం బెంగళూరులో వార్షికంగా కురిసే వర్షం కన్నా సుమారు 10 శాతం అధిక వర్షం కురిసిందని తెలిపింది.

పిడుగుపాటుకు ఇటుక బట్టీ కూలీ దుర్మరణం

మృతుడు రాజుభాయ్(ఫైల్)

పద్మనాభం: విశాఖ జిల్లా పద్మనాభం మండలం మద్ది గ్రామంలో ఇటుక బట్టీల వద్ద శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుకు రాజు భాయ్(35) దుర్మరణం చెందగా సురేంద్ర(18), బరిహ వివేక్(35)అనే మరో ఇద్దరు కూలీలు గాయపడ్డారు. మధ్యాహ్నం నుంచి గాలివానతో పాటు పిడుగులు కురవడంతో బట్టీల వద్ద ఉన్న ఈ కూలీలు తప్పించుకోలేకపోయారు. ఒడిశాకు చెందిన ఈ కూలీలను ఇటుకల బట్టీ యజమాని తీసుకువచ్చినట్టు తెలిసింది. క్షతగాత్రులను 108లో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు వార్డుల వారీగా బీసీ గణన

సాక్షి, అమరావతి: గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ధారించేందుకు ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో వార్డులవారీగా బీసీ గణనను మొదలుపెట్టింది. గ్రామ, వార్డు సచివాలయ శాఖ వద్ద ఉన్న బీసీ కుటుంబాల జాబితాను ఈ నెల 5లోగా అనుసంధానించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా అనుసంధాన ప్రక్రియ పూర్తయ్యేలా డీపీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఇసుక అక్రమ రవాణా కేసుపై లోకాయుక్తలో విచారణ

హైకోర్టు ఆదేశాలను పాటించాలంటూ కేసు మూసివేత

కర్నూలు (సెంట్రల్): ప్రకాశం జిల్లాలో పరిమితికి మించి ఇసుక అక్రమ తవ్వకం, రవాణా చేసిన బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ వ్యవహారంపై లోకాయుక్తలో విచారణ జరిగింది. ఈ కేసులో హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని, చట్టప్రకారం ఆ సంస్థకు జరిమానా విధించాలని ప్రభుత్వానికి లోకాయుక్త సిఫారసు చేసింది. ఈ మేరకు కేసును మూసేస్తూ లోకాయుక్త న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. కాగా, అక్రమ తవ్వకాలపై హైకోర్టు బీఎస్‌సీపీఎల్‌కు రూ.3 కోట్ల జరిమానా విధించడంతోపాటు ముగ్గురు అధికారులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించింది. ఆ మేరకు గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారెడ్డి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బొమ్మిశెట్టి లత, ఎస్సై షేక్ రజియా సుల్తానా బేగంకు రెండు వార్షిక ఇంక్రిమెంట్లను ఇప్పటికే నిలిపివేశారు.

ఇంద్రకీలాద్రిపై చీకట్లు

కనకదుర్గమ్మ సన్నిధిలో అర్ధగంటకుపైగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

అందుబాటులోకి రాని జనరేటర్లు తీవ్ర ఇబ్బందులకు గురైన భక్తులు



కరెంట్ పోవడంతో చీకటిగా మారిన రాజగోపురం ప్రాంతం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కనకదుర్గ అమ్మవారి ఆలయంతోపాటు ఆ పరిసరాల్లో పూర్తిగా అంధకారం నెలకొంది. అర్ధగంట పైగా అమ్మవారి ఆలయంలో కరెంటు లేక కటిక చీకటి అలముకోవడంతో భక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి 8.45 గంటల సమయంలో ఆలయానికి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో దేవస్థానంలో ఏం జరుగుతుందో ఎవరికి ఏం అర్థం కాలేదు. ప్రధాన ఆలయంలో మాత్రం ఇన్వర్టర్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కొండ దిగువన కనకదుర్గనగర్ మొదలు మహామండపం, ఆలయ ప్రాంగణం, రాజగోపురం, ఘాట్‌రోడ్డు, ఘాట్‌రోడ్డులోని ఓం కారం ఇలా అన్ని ప్రాంతాల్లో మాత్రం చాలాసేపు చీకట్లు తొలగలేదు. వైశాఖ పౌర్ణమి, పదోతరగతి పరీక్ష ఫలితాల వెల్లడి, అమ్మవారికి స్వర్ణకవచాన్ని అలంకరించడంతో శుక్రవారం రాత్రి ఆలయం వద్ద పెద్ద ఎత్తున భక్తుల రద్దీ నెలకొంది. పలువురు నూతన వధూవరులు కూడా అమ్మవారి దర్శనానికి వచ్చారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో క్యూలైన్లలోని భక్తులు, మహామండపం లిఫ్ట్‌ల వద్ద భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఇది రెండోసారి

రాష్ట్రంలోని అతి పెద్ద దేవస్థానాల్లో రెండోస్థానంలో ఉన్న కనకదుర్గ ఆలయంలో ఇటువంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ లేవని భక్తులు చర్చించుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 27న విద్యుత్ బకాయిల నేపథ్యంలో విద్యుత్ అధికారులు కరెంటు సరఫరా నిలిపేశారు. తాజాగా శుక్రవారం ఆలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 9.40 గంటల తర్వాత విద్యుత్ సరఫరాను దేవస్థాన సిబ్బంది పునరుద్ధరించారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్లు వేడెక్కి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఆలయ ఈఈ శివనాయక్ చెప్పారు. ఆలయంలో ఆటోమేటిక్ జనరేటర్లు ఆన్ కాకపోవడంతో సమస్య తలెత్తిందని తెలిపారు.

సెల్‌ఫోన్ల లైట్లలో

ఆలయ పరిసరాల్లో అంధకారం నెలకొనడంతో భక్తులు తమ సెల్‌ఫోన్లలోని టార్చ్‌లను ఆన్ చేశారు. ఘాట్‌రోడ్డు పై నుంచి వచ్చే భక్తులు సెల్‌ఫోన్లలోని టార్చ్‌లైట్ల సాయంతో ఆలయ ప్రాంగణం వరకు రావడం కనిపించింది. మరోవైపు మహా మండపం దిగువన ఉన్న జనరేటర్లు ఆన్ కాకపోవడంతో సమస్య మరింత తీవ్రమైంది. దేవస్థానం ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యుత్ సిబ్బంది మహామండపం దిగువకు పరుగున చేరుకుని జనరేటర్లను ఆన్ చేసేందుకు తీవ్రంగా శ్రమించారు.

'కోత'లు నిజమే..కానీ!

- విద్యుత్ కోతలు వాస్తవమేనన్న విద్యుత్ పంపిణీ సంస్థలు
- రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి 2,310 మెగావాట్లు తగ్గడం వల్లే కొరత
- దక్షిణ గ్రిడ్‌పై ఒత్తిడి కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు వెల్లడి

సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి, అమరావతి: దక్షిణ ప్రాంత విద్యుత్ గ్రిడ్‌పై ఏర్పడిన అసాధారణ ఒత్తిడి, ప్రధాన థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో భారీగా పడిపోయిన ఉత్పత్తి, వేసవి ఉష్ణోగ్రతల వల్ల పెరిగిన డిమాండ్ కారణంగా రాష్ట్రంలో విద్యుత్ కోతలు విధించినట్లు డిస్కంలు వెల్లడించాయి. రాష్ట్రంలో ఏర్పడ్డ అనధికార విద్యుత్ కోతలపై 'విద్యుత్ కోతలు స్టార్ట్' శీర్షికతో 'సాక్షి' ప్రచురించిన కథనంపై ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు స్పందించాయి. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. ఏప్రిల్ 22 నుంచి 24 వరకూ థర్మల్ కేంద్రాల్లో బాయిలర్ ట్యూబ్ లీకేజీలు, ఇతర సాంకేతిక సమస్యల కారణంగా ఏపీజెన్‌కో, స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తికి ఆటకం ఏర్పడిందని డిస్కంలు తెలిపాయి. దానివల్ల కృష్ణపట్నంలోని ఎస్‌డీఎస్‌టీపీఎస్–1,2 యూనిట్లలో 1,600 మెగావాట్లు, డా.ఎన్టీటీపీఎస్ యూనిట్–5లో 210 మెగావాట్లు, హిందూజా స్టేషన్‌లో 500 మెగావాట్లు చొప్పున 2,310 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం తగ్గిందని చెప్పాయి. రికార్డు స్థాయిలో వేసవి డిమాండ్ ఉన్న సమయంలోనే ఇలా ఉత్పత్తి ఒకేసారి అందుబాటులో లేకపోవడం వల్ల విద్యుత్ కొరత ఏర్పడినట్లు వివరించాయి. ఇలాంటి అసాధారణ పరిస్థితి 2024 జూన్ తరువాత మళ్లీ ఇప్పుడే ఏర్పడిందని, ఈ కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ, గ్రిడ్ భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు వెల్లడించాయి. అధిక ధరలు ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్న తాత్కాలిక మార్కెట్‌ల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోలు చేసి అంతరాయాలను నివారించేందుకు ప్రయత్నించినట్లు డిస్కంలు పేర్కొన్నాయి. గ్రిడ్ భద్రత దృష్ట్యా, దక్షిణ ప్రాంత లోడ్ డిస్పాచ్ కేంద్రం (ఎస్ఆర్ఎల్‌డీసీ) విధించిన నిబంధనల కారణంగా, సుమారు రెండు గంటల పాటు పరిమితమైన, తాత్కాలిక లోడ్ మేనేజ్ మెంట్ (విద్యుత్ కోత) చర్యలు చేపట్టాల్సి వచ్చిందని అంగీకరించాయి. అయితే తాత్కాలిక అంతరాయాలను ప్రత్యేకంగా ఆక్వా రంగానికే ఆపాదించవద్దని, ఎక్కడెక్కడా ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నాయో, అక్కడ ఫీల్డ్ ఎలక్ట్రికల్ సిబ్బంది వినియోగదారులకు ముందుగానే సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిస్కంలు స్పష్టం చేశాయి.

వైఎస్సార్‌సీపీ నేతపై 'పులివర్తి' అనుచరుల హత్యాయత్నం

- దారికాచి ఇష్టారాజ్యంగా కాళ్లతో తన్నుతూ పిడిగుద్దుల వర్షం
- ముక్కు, నోటి నుంచి రక్తం కారుతున్నా పళ్లు ఊడిపోయి అరుస్తున్నా దాడి
- తీవ్రగాయాలతో చంద్రగిరి పోలీసుస్టేషన్‌కు బాధితుడు
- ఎమ్మెల్యే అనుచరుడు రామిరెడ్డే తనపై హత్యాయత్నానికి కారకుడని ఫిర్యాదు

తీవ్రంగా గాయపడిన మాధవనాయుడు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : తిరుపతి జిల్లా పాకాల మండలం, ఆదెనపల్లి పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవనాయుడుపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని అనుచరులు దాడికి తెగబడ్డారు. చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో తమ బంధువు వివాహానికి ద్విచక్ర వాహనంపై శుక్రవారం మాధవనాయుడు బయల్దేరారు. కల్యాణ మండపం సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న శ్రీసాయిబాబ ఆలయం వద్ద నాని అనుచరులు ఆరుగురు అటకాయించి మాధవనాయుడును ఆపి కాళ్లతో తన్నుతూ విచక్షణారహితంగా పిడిగుద్దులు గుద్దారు. దీంతో అతనికి ముక్కు, నోటి నుంచి రక్తం కారుతున్నా నోట్లో పళ్లు ఊడిపోయి అరుస్తున్నా వదలలేదు. అత్యంత పాశవికంగా చంపేందుకు ప్రయత్నించారు. అయితే, వాహనదారులు దాడిచేస్తున్న వారిని పట్టుకునేందుకు యత్నించగా వారు పరారయ్యారు. తీవ్ర రక్తగాయాలతో మాధవనాయుడు చంద్రగిరి పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు ఆయన్ను చంద్రగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తనపై జరిగిన హత్యాయత్నానికి ఎమ్మెల్యే అనుచరుడు రామిరెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హిజ్రాతో సహజీవనం.. ఆపై హత్య

కందుకూరులో ఘటన

మృతిచెందిన ప్రియ

కందుకూరు: హిజ్రాతో రెండేళ్లపాటు సహజీవనం చేసిన వ్యక్తి అనుమానంతో కడతేర్చిన ఘటన ప్రకాశం జిల్లా కందుకూరులో జరిగింది. డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపిన ప్రకారం... ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం పెదలాటరపికి చెందిన పొట్లూరి అంకయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతనికి కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డికాలనీకి చెందిన రాపూరి పేరయ్య అలియాస్ పేరమ్మ అలియాస్ ప్రియ (26)తో పరిచయమై, ఇద్దరూ సహజీవనం చేశారు. ఇటీవల ప్రియ మరొకరితో ఫోన్‌లో మాట్లాడుతుందంటూ అంకయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో మాట్లాడాలంటూ ప్రియని గతనెల 27న కందుకూరుకు రప్పించాడు. పట్టణంలోని పోతురాజుమిట్ట వద్ద నివాసం ఉంటున్న అంకయ్య పిన్ని ఇంటికి తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుందాం అంటూ ఒత్తిడి చేశాడు. దీనికి ఆమె ఒప్పుకోకపోవడంతో ప్రియ గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. డాక్టర్లు చనిపోయిందని చెప్పడంతో మరో అంబులెన్స్ మాట్లాడుకుని ప్రియ తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించి ఉడాయించాడు. అయితే ప్రియ మెడపై గాయాలు ఉండటంతో అనుమానించిన ఆమె తండ్రి అంజయ్య కనిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. రంగంలోకి దిగిన పోలీసులు అంకయ్యను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో నేరం అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు.

గుడివాడలో కోర్టు హాలు ప్రారంభం

కోర్టు హాలు ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

గుడివాడ టౌన్: గుడివాడ కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటైన అదనపు జిల్లా కోర్టు హాలును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ ప్రారంభించారు. సర్వమత ప్రార్థనల అనంతరం కోర్టును ప్రజలకు అంకితం చేశారు. పెరుగుతున్న కేసులను దృష్టిలో ఉంచుకుని గుడివాడ పరిసర ప్రాంతాల కక్షిదారుల అవసరాల నిమిత్తం 17వ అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు, జస్టిస్ మండవ కిరణ్మయి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి గుత్తాల గోపి, 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదెకరాల భూకబ్జాకు తెగబడిన 'ఈనాడు' విలేకరి

మాట్లాడుతున్న బాధితుడు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రబాబు ప్రభుత్వంలో పచ్చనేతలే కాదు, పచ్చపత్రిక పుత్రులూ కబ్జాలకు తెరతీస్తున్నారు. తిరుపతి జిల్లా, ఓబులవారిపల్లి మండలం, చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 32లో 5.30 ఎకరాల వ్యవసాయ భూమిని అదే మండల ఈనాడు పత్రిక విలేకరి కబ్జా చేసినట్లు బాధితులు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. తమ పూర్వీకులకు చెందిన ఆ భూమిని శంకరాపురానికి చెందిన కొట్టే వెంకటరమణ అనే ఈనాడు విలేకరి అక్రమంగా తన తల్లి పేరుపై ఆన్‌లైన్ చేయించుకొని దొంగ రికార్డులు సృష్టించాడని తెలిపారు. భూహక్కుదారులైన తాము ప్రశ్నించడంతో దౌర్జన్యానికి తెగబడ్డాడని గవిన సుబ్బరామయ్య, అతని భార్య ఈశ్వరమ్మ, కుటుంబ సభ్యులు గిరిధర్, మురారి వివరించారు. ఈ భూమి తమ పేరుపైనే ఉందని, తాము ఎవరికీ విక్రయించలేదని తెలిపారు. మీడియా పేరు అడ్డుపెట్టుకొని తమ భూమిని కబ్జా చేశాడని వాపోయారు. తామెవ్వరం స్థానికంగా లేకపోవడంతో ఇదే అదనుగా భావించి, తమ భూమిని కబ్జా చేశాడని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశామని, రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రైల్లో వివాహితపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడి అరెస్టు

బెర్త్ ఇప్పిస్తానని చెప్పి తీసుకెళ్లి లైంగికదాడి

వివరాలు వెల్లడించిన రైల్వే పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ సీఐ జె.వి. రమణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని విజయవాడ జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లోని జీఆర్‌పీ సీఐ జె.వి. రమణ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా రెంటచింతల గ్రామానికి చెందిన దంపతులు విశాఖలో నివాసముంటున్నారు. వారి స్వగ్రామంలో శుభకార్యానికి వెళ్లేందుకు గత నెల 26న రాత్రి విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ కోచ్ ఎక్కారు. రైలు రద్దీగా ఉండడంతో టాయిలెట్ వద్ద కూర్చొని ప్రయాణిస్తున్నారు. లాండ్రీ సర్వీస్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లాకు చెందిన సౌరవ్ బగ్గి(27) టాయిలెట్‌ల వద్ద ఉన్న దంపతులతో మాటలు కలిపాడు. తాను ఏసీ కోచ్‌కు ఇన్‌చార్జ్‌ని అని, ఖాళీగా ఉన్న బెర్త్ ఇస్తానని భర్తను నమ్మించాడు. టాయిలెట్ వద్ద లగేజీతో తాను ఉంటానని భార్య అయినా సౌకర్యంగా కూర్చుంటుందని భర్త ఆమెను పంపించాడు. కోచ్‌లోని తనకు కేటాయించిన క్యాబిన్‌లోకి తీసుకువెళ్లిన బగ్గి బలవంతంగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం చెప్పొద్దని భయపెట్టడంతో దంపతులు స్వగ్రామం వెళ్లారు. అప్పటి నుంచి ఆమె ముభావంగా కనిపిస్తుండటంతో భర్త, కుటుంబ సభ్యులు ఆరా తీయడంతో జరిగిన దారుణం గురించి తెలిపింది. దీంతో వారు బాధితురాలితో ఏప్రిల్ 30న రెంటచింతల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. ఘటన గుడివాడ–విజయవాడ మధ్య జరిగినట్లు ఫిర్యాదులో తెలపడంతో అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విజయవాడ జీఆర్‌పీకి బదిలీ చేశారు. మూడు బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ వార్త సోషల్ మీడియా, టీవీ చానల్స్‌లో రావడంతో నిందితుడు పనిచేస్తున్న సంస్థ సూపర్‌వైజర్ సోమవారం నిందితుడిని తీసుకువచ్చి విజయవాడ జీఆర్‌పీ పోలీసులకు అప్పగించాడు.

రాజధానిలో టీడీపీ నేతల లేఅవుట్‌లకే అనుమతులేంటి?

బాబు సర్కారుపై వైఎస్సార్‌సీపీ నేత బాల వజ్రబాబు మండిపాటు

సాక్షి,అమరావతి: రాజధాని భూసమీకరణలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మోసపూరితమని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాల వజ్రబాబు మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని కోసం మొదటి దశలో భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వలేదని, ఇప్పుడు భూసమీకరణలోకి రాని టీడీపీ నేతల లేఅవుట్‌లకు అనుమతులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. 'పెద్ద పరిమికి చెందిన టీడీపీ నేతలు, పెదకూరపాడు టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అనుచరులకు ఏప్రిల్ 6న 200 ఎకరాల్లో లేఅవుట్‌లకు అనుమతులు ఇచ్చారు. రాజధాని కోసం రైతు ఎకరం భూమి ఇస్తే కేవలం వెయ్యి గజాలు మాత్రమే ఇస్తున్నారు. కానీ భూసమీకరణలోకి రాని వారికి పూర్తి స్వేచ్ఛతో ప్లాట్లు వేసుకుని అమ్ముకునే అవకాశం కల్పించారు. రాజధానిలో లేఅవుట్ అనుమతులు అందరికీ సమానంగా ఇవ్వాలి. కానీ టీడీపీ నేతలకే ఇవ్వడమేంటి' అని నిలదీశారు. దీనిపై చంద్రబాబు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం రాజధాని భవనాల అద్దాలకే రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తున్నారని, రాజధాని నిర్మాణం పేరుతో ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. రైతులకు అన్యాయం జరిగితే వైఎస్సార్‌సీపీ ఏమాత్రం ఊరుకోబోదని బాలవజ్రబాబు హెచ్చరించారు.

భార్య వేధింపులతో ఆత్మహత్య

నిజాంపేట్: భార్య, ఆమె కుటుంబ సభ్యు ల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ ప్రాంతానికి చెందిన మల్లికార్జున్ (35)కు అశ్విని అనే మహిళతో 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్ల లు ఉన్నారు. పదేళ్లుగా భీరంగూడలోని రాఘవేంద్ర కాలనీలో నివసిస్తూ.. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవలి కాలంలో భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నట్లు సమాచారం. గత ఏడాది మల్లికార్జున్ ఫైనాన్స్ ద్వారా డీసీఎం వాహనం కొనుగోలు చేశాడు. అతని తల్లి పేరుపై ఉన్న పొలం విషయ మై కూడా కుటుంబంలో విభేదాలు నెలకొన్నాయి. భార్య అశ్విని, అత్త సిద్ధమ్మలు ఆస్తిని అమ్మి డబ్బులు తీసుకురావాలని, డీసీఎం వాహనాన్ని కూడా విక్రయించాలని తరచూ ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. గత నెల 26న మల్లికార్జున్ తన డీసీఎం వాహనంతో స్వగ్రామానికి వెళ్లి, 28న తిరిగి వచ్చాడు. అనంతరం 30వ తేదీ రాత్రి నుంచి తెల్లవారుజామువరకు భార్య అశ్విని, అత్త సిద్ధమ్మలు ఆస్తి విక్రయం అంశంపై తీవ్రంగా గొడవ పడి ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన మల్లికార్జున్, బాచుపల్లి మమతా ఆసుపత్రి వెనుక ఉన్న పారిశ్రామికవాడ ప్రాంతానికి వెళ్లి తన డీసీఎం వాహనానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

అటవీ శాఖ అదనపు పీసీసీఎఫ్‌పై వేటు

మడ అడవుల నిధుల గోల్‌మాల్‌పై 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అమరావతి : మడ అడవుల పరిరక్షణ కోసం విడుదలైన జీసీఎఫ్ నిధుల గోల్‌మాల్ వ్యవహారాన్ని సాక్షి బయటపెట్టిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. అటవీ శాఖ అదనపు పీసీసీఎఫ్ (వన్యప్రాణుల విభాగం, హెచ్ఆర్‌డీ) శాంతి ప్రియ పాండేను ఆ పోస్టు నుంచి తప్పించింది. జీసీఎఫ్ ప్రాజెక్టుకు ఆమె నోడల్ అధికారిగా ఉండడంతో ఆమెను బాధ్యురాలిగా ధ్రువీకరించి పక్కన పెట్టినట్లు తెలిసింది. ఆమెను ప్రస్తుతం పని చేస్తున్న బాధ్యతల నుంచి తప్పించి జీఏడీలో రిపోర్టు చేయాలని శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కృష్ణా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో రూ.4.91 కోట్ల గ్రీన్ క్లైమేట్ ఫండ్ నిధులను ఖర్చు పెట్టకుండానే ఖర్చు పెట్టినట్లు యూసీలు సమర్పించడంపై గురువారం సాక్షిలో 'చెడా'మడ' నిధుల గోల్‌మాల్' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనం అటవీ శాఖలో కలకలం రేపింది. దీనిపై విచారణ జరిపిన ప్రభుత్వం పై విధంగా చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. జిల్లా స్థాయిలోనూ పలువురిని బదిలీ చేసినట్లు సమాచారం. మరోవైపు అటవీ శాఖలో పీసీసీఎఫ్ స్థాయి నుంచి సీసీఎఫ్, డిప్యూటీ కన్సర్వేటర్ స్థాయి వరకు పలువురు అధికారులను బదిలీ చేసింది. ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో సీఎంజీగా పనిచేస్తున్న ఎం.రేవతిని పీసీసీఎఫ్ (విజిలెన్స్ – ప్రొడక్షన్)గా నియమించగా, వర్కింగ్ ప్లాన్ విభాగంలో ఉన్న ఎస్.నాగేశ్వరరావును వైల్డ్‌లైఫ్–హెచ్ఆర్‌డీ సీసీఎఫ్‌గా మార్చారు. జూ పార్కుల విభాగంలో ఉన్న వై. శ్రీనివాస్‌రెడ్డిని తిరుపతికి సీసీఎఫ్‌గా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న బీఎస్ఎస్ మూర్తిని సోషల్ ఫారెస్ట్రీ–జూ పార్కుల సీసీఎఫ్‌గా నియమించారు. టి.జ్యోతిని రాజమహేంద్రవరం సీసీఎఫ్‌గా, విశాఖ సీసీఎఫ్‌గా ఉన్న మొహమ్మద్ దివాన్ మైదీన్‌ను పర్యావరణ, అటవీ శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా నియమించగా, గుంటూరు సీసీఎఫ్‌గా ఉన్న ఐకేవీ రాజును విశాఖపట్నానికి మార్చారు. మరికొందరు అధికారులనూ బదిలీ చేశారు.

SRI VENKATESWARA INSTITUTE OF MEDICAL SCIENCES
(A UNIVERSITY ESTABLISHED BY AN ACT OF A.P. STATE LEGISLATURE)
TIRUMALA TIRUPATI DEVASTHANAMS, TIRUPATI
e-PROCUREMENT TENDER NOTICE
SVIMS is inviting e-Tender for supply of Raw-water to the three sumps at various locations in the SVIMS premises through tractor and tanker and / or lorry.
For more details, please visit the website https://tender.apeprocurement.gov.in
For further inquiries, contact phone numbers 0877-2286231 & 2287777 Extn-2227
DONATE LIBERALLY TO "SVIMS GENERAL DONATION SCHEME" SVIMS ACCOUNT NO.62121045670, SBI, IFSC CODE: SBIN0020926, "80G BENEFITS AVAILABLE TO THE SCHEME"
ROC.No.AD(GM)/264/Water Supply/SVIMS/2019, Date: 24.04.2026 Medical Superintendent

యుద్ధనౌక మహేంద్రగిరి

మహేంద్రగిరి స్వదేశీ సిరి

- స్వదేశీ యుద్ధనౌక నావికాదళానికి అప్పగింత
- శత్రు దేశాల యుద్ధ నౌకలు, జలాంతర్గాములపై సులువుగా దాడి చేసే సత్తా సొంతం
- ఆత్మనిర్భరతకు ప్రతీక అని రక్షణ శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: అత్యాధునిక యుద్ధనౌకల డిజైన్, నిర్మాణంలో భారత్ క్రమంగా స్వయం సమృద్ధి సాధిస్తోంది. స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధ నౌకలను తయారు చేస్తోంది. ఇతర దేశాలపై ఆధారపడే అవసరాన్ని తగ్గించుకుంటోంది. శక్తివంతమైన ఆయుధ వ్యవస్థ, అత్యాధునిక సెన్సర్ల సమూహంతో కూడిన స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ 'మహేంద్రగిరి'ని భారత నౌకాదళానికి లాంఛనంగా అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 30న ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్(ఎండీఎస్ఎల్)లో ఈ కార్యక్రమం జరిగినట్లు తెలిపారు. నీలగిరి–క్లాస్(ప్రాజెక్టు 17ఏ) శ్రేణిలో ఇది ఆరో యుద్ధ నౌక కావడం విశేషం. ప్రాజెక్ట్ 17ఏ యుద్ధనౌకలు సముద్ర రంగంలో ఎదురవుతున్న, భవిష్యత్తులో ఎదురు కాబోయే సవాళ్లను పరిష్కరించడానికి రూపొందించిన బహుముఖ, బహుళ–కార్యనిర్వహణ నౌకలు అని రక్షణ శాఖ ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. మహేంద్రగిరి స్టెల్త్ ఫ్రిగేట్ యుద్ధనౌకల నిర్మాణంలో భారతదేశ ఆత్మనిర్భరతకు ఒక ప్రశంసనీయమైన చిహ్నంగా నిలుస్తున్నట్లు హర్షం వ్యక్తంచేసింది. ఈ అత్యాధునిక ఫ్రిగేట్ నావల్ డిజైన్, ఫైర్‌పవర్, ఆటోమేషన్, మనుగడ సామర్థ్యంలో ఒక గొప్ప పురోగతికి ప్రతీక అని వెల్లడించింది.

- మహేంద్రగిరి యుద్ధనౌకను ముంబై ఎండీఎస్ఎల్‌లో చాలావరకు స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు. ఒడిశాలోని తూర్పు కనుమల్లో ఉన్న మహేంద్రగిరి పర్వతం పేరును ఈ నౌకకు పెట్టారు.
- వార్‌షిప్ ఓవర్‌సీయింగ్ టీమ్ పర్యవేక్షణలో వార్‌షిప్ డిజైన్ బ్యూరో(డబ్ల్యూడీబీ) మహేంద్రగిరిని డిజైన్ చేసింది.
- ప్రాజెక్టు 17ఏ కింద తయారైన ఫ్రిగేట్లు స్వదేశీ నౌకా రూపకల్పన, స్టెల్త్ సామర్థ్యం, మనుగడ సాగించే శక్తి, పోరాట సామర్థ్యాలలో గొప్ప ముందడుగును ప్రతిబింబిస్తాయి.
- నిర్దేశిత కాలపరిమితిలోపే నౌకను నావికాదళానికి అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి.
- పీ17 (శివాలిక్ శ్రేణి) నౌకలతో పోలిస్తే పీ17ఏ నౌకలకు అధునాతన ఆయుధాలు, సెన్సర్ల వ్యవస్థను అమర్చారు.
- ఈ నౌకల్లో కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ ప్రొపల్షన్ ప్లాంట్లు అమర్చి ఉంటాయి. వీటిలో ఒక డీజిల్ ఇంజిన్, గ్యాస్ టర్బైన్, ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐపీఎంఎస్) ఉంటాయి.
- శక్తివంతమైన ఆయుధాలు, సెన్సర్ల సమూహంతో శత్రు దేశాల యుద్ధ నౌకలు, జలాంతర్గాములపై సులువుగా దాడి చేయొచ్చు.
- ప్రాజెక్టు 17ఏలో భాగంగా తొలి యుద్ధనౌక(నీలగిరి)ను 2024 డిసెంబర్ 20న భారత నావికాదళానికి అప్పగించారు. కేవలం 17 నెలల వ్యవధిలోనే ఆరో నౌకను సైతం అప్పగించడం గమనార్హం.
- మహేంద్రగిరి స్టెల్త్ ఫ్రిగేట్‌ను అప్పగించడం మన స్వదేశీ రూపకల్పన, నౌకా నిర్మాణం, ఇంజనీరింగ్ సామర్థ్యానికి ప్రతీక అని అధికార వర్గాలు తెలిపాయి.
- 75 శాతం స్వదేశీ భాగస్వామ్యంతో కూడిన ఈ ప్రాజెక్టులో, 200కు పైగా ఎంఎస్ఎంఈలు పాలుపంచుకున్నాయని, తద్వారా సుమారు 4,000 మందికి ప్రత్యక్షంగా, 10,000 మందికి పరోక్షంగా ఉపాధి లభించినట్లు రక్షణ శాఖ తెలియజేసింది.
- సూపర్‌సానిక్ క్షిపణులతో సహా అత్యాధునిక ఆయుధ సంపత్తిని కలిగిన స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ 'తారాగిరి'ని ఏప్రిల్ 3న భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు.
- తాజాగా మహేంద్రగిరి రాకతో భారత నావికాదళం మరింత శక్తివంతంగా మారినట్లు అధికార వర్గాలు స్పష్టంచేశాయి.

త్వరలో పెట్రో బాదుడు!

పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.4 నుంచి రూ.5 పెంపు ● వంట గ్యాస్ సిలిండర్‌పై మరో రూ.50

- సంకేతాలిచ్చిన ప్రభుత్వ వర్గాలు
- ముడి చమురు రేట్ల పెరుగుదలతో నష్టపోతున్న దేశీయ ఆయిల్ కంపెనీలు
- నష్టాలను పూడ్చుక తప్పదంటున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో అతి త్వరలో పెట్రోల్, డీజిల్ తోపాటు గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరల పెంపునకు కేంద్రం ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. పెట్రో ధరల పెరిగే అవకాశాలను కొట్టిపారేయలేమని ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. తద్వారా పెట్రో బాదుడు తప్పదని పరోక్షంగా సంకేతాలిచ్చాయి. పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.4 నుంచి రూ.5 చొప్పున పెరిగే అవకాశాలున్నాయి. ఎల్పీజీ సిలిండర్ ధర రూ.40 నుంచి రూ.50 దాకా పెరగనుంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ దేశంలో గత నాలుగేళ్లుగా రిటైల్ ధరల్లో పెద్దగా మార్పులు జరగలేదు. ధరలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. ముడి చమురు ధరల మంట వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లుతున్నట్లు దేశీయ చమురు కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నష్టాలను పూడ్చడానికి ధరల పెంపు తప్ప మరో మార్గం లేదని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

అగ్గి రాజేసిన ముడి చమురు

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు బ్యారెల్ ధర ఇటీవలే 126 డాలర్లకు చేరింది. ఇది నాలుగేళ్ల గరిష్టం కావడం గమనార్హం. ప్రస్తుతం 110 డాలర్లకు దిగొచ్చింది. అయినప్పటికీ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలపై ఒత్తిడి పెరుగుతోంది. యుద్ధం ప్రారంభం కాకముందు బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 80 డాలర్లు పలికింది. హార్మూజ్ జలసంధి గుండా చమురు నౌకల రాకపోకలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇరాన్ ఓడరేవులను అమెరికా దిగ్బంధించింది. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. రెండో దశ చర్చలు ఆగిపోయాయి. ముడి చమురు ధరలు ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. ముడి చమురు ధరల పెరుగుదల వల్ల దేశంలో ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లు పెట్రోల్‌పై లీటర్‌కు రూ.20, డీజిల్‌పై లీటర్‌కు రూ.100 చొప్పున నష్టపోతున్నారని చమురు మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి గత వారం తెలియజేశారు. 2022 ఏప్రిల్ ఆరంభం నుంచి భారత్‌లో రిటైల్ పెట్రోల్, డీజిల్ ధరలు స్తంభించిపోయాయి. ఆ తర్వాత కొన్ని నెలల్లో చమురు ధరలు పెరగ్గా, మరికొన్ని సమయాల్లో తగ్గాయి. ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు లాభాలు ఆర్జించాయి. ధరలు పెరిగినప్పుడు వచ్చిన నష్టాలను పూడ్చుకోవడానికి ఆ లాభాలను ఉపయోగించుకున్నాయి. కానీ, ఇరాన్‌లో యుద్ధం మొదలైన తర్వాత ముడి చమురు రేట్లు ఒక్కసారిగా భారీగా పెరిగిపోవడం దేశీయ చమురు కంపెనీలకు ఇబ్బంది కలిగిస్తోంది.

ఎన్నికలతో సంబంధం లేదు

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెంచితే రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ప్రత్యామ్నాయాలను అంచనా వేయడానికి, రిటైల్ ద్రవ్యోల్బణంపై ప్రభావాన్ని తగ్గించడానికి అంతర్గత చర్చలు జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడానికి, పెట్రో ధరల పెంపునకు ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇస్తున్నాయి. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, చమురు మార్కెటింగ్ కంపెనీలు ఎదుర్కొంటున్న తీవ్ర నష్టాల కారణంగానే పెంపు నిర్ణయం తీసుకుంటున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. వచ్చే వారమే ఈ పెంపు అమల్లోకి వచ్చే అవకాశాలు లేకపోలేదు. చమురు పరిశ్రమ తరఫున ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) శుక్రవారం ప్రకటన చేసింది. అంతర్జాతీయంగా ధరలు ఎగిసినా దేశీయంగా పెట్రోల్, డీజిల్‌తోపాటు ఎల్పీజీ రేట్లు పెంచలేదని గుర్తుచేసింది. నష్టాల నుంచి గట్టెక్కడానికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు వాణిజ్య ఎల్పీజీ, పారిశ్రామిక డీజిల్, 5 కేజీల ఎల్పీజీ, అంతర్జాతీయ విమానయాన సంస్థలకు విక్రయించే జెట్ ఇంధనం ధరలను పెంచాయి. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా మన దేశంలో పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.25 నుంచి రూ.28 వరకు పెరగవచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. కానీ, పెంపు ఆ స్థాయిలో ఉండకపోచ్చని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

బెంగాల్‌లోని 15 బూత్‌లలో నేడు రీపోలింగ్: ఈసీ

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 29వ తేదీన రెండో విడత ఎన్నికలు జరిగిన దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 15 పోలింగ్ బూత్‌లలో ఈ నెల 2న రీపోలింగ్ జరపాలని ఎన్నికల కమిషన్(ఈసీ) శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో11 బూత్‌లు మగర్హాట్ పశ్చిమ్ అసెంబ్లీ పరిధిలోనివి కాగా, మరో నాలుగు డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోనివని తెలిపింది. రాష్ట్ర పోలింగ్ యంత్రాంగం ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారికి పంపిన లేఖలో ఈసీ పేర్కొంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరపాలని తెలిపింది. కాగా, ఫల్టా నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో అందిన అవకతవకల ఫిర్యాదులపై ఈసీ స్పందించాల్సి ఉంది. ఇటీవల ఎన్నికలు జరిగిన పశ్చిమబెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిల్లో రీపోలింగ్ ఆదేశాలివ్వడం ఇదే మొదటిసారి. ఏప్రిల్ 23వ తేదీన పశ్చిమబెంగాల్ అసెంబ్లీకి మొదటి విడత పోలింగ్‌కు సంబంధించి రీపోలింగ్‌కు ఈసీ ఆదేశాలివ్వలేదు.

జనంపై 'ఎన్నికల బిల్లు'

వాణిజ్య ఎల్పీజీ ధర పెంపుపై రాహుల్ గాంధీ విమర్శలు

రాహుల్

న్యూఢిల్లీ: వాణిజ్య అవసరాలకు ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ల ధర పెంపుపట్ల కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అధికార పార్టీకి ఎన్నికల సమయంలో మాత్రమే సామాన్య ప్రజలు గుర్తుకు వస్తారని, ఆ తర్వాత వారి మానాన వారిని వదిలేస్తారని మండిపడింది. వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధర పెంపు ఒక 'ఎన్నికల బిల్లు'అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. తరువాతి బాదుడు పెట్రోల్, డీజిల్‌పై ఉంటుందన్నారు. ఎన్నికల తర్వాత ద్రవ్యోల్బణం వేడి తగులుతుందని తాను ముందే హెచ్చరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 'ఈ రోజు వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధర రూ.993 పెరిగింది. అతిపెద్ద పెంపు ఇదే. ఇది ఒక ఎన్నికల బిల్లు. కేవలం మూడు నెలల్లో రూ.1,380 పెరిగింది, ఇది 81% పెరుగుదల. టీ స్టాళ్లు, ధాబాలు, హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపులు, రెస్టారెంట్లు ప్రతి వంటగదిపై భారం పెరిగింది. ఇది అనివార్యంగా సాధారణ ప్రజలపై ప్రభావం చూపుతుంది'అని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ధరలు పెంచబోమని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తామని ప్రకటించిన ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోయారని ఎద్దేవా చేశారు. వాణిజ్య సిలిండర్లపై దాదాపు రూ.1000 భారీ పెంపు, జీవనాధారం కోసం చిన్న భోజనశాలలపై ఆధారపడే కోట్లాది మంది భారతీయులను ప్రభావితం చేస్తుందని, కోట్లాది మంది ఈ పెంపు భారాన్ని మోయవలసి వస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోందన్నారు. ఏప్రిల్ 29న అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ ముందే హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం సొమ్ము చేసుకుందని, ధరలు పెరుగుతున్నందున ఇప్పుడు ఆ భారాన్ని ప్రజలపై మోపాలని చూస్తోందని ఆయన విమర్శించారు. 'ఎన్నికల ఉపశమనం ముగిసింది. ద్రవ్యోల్బణం వేడి రాబోతోంది! ఏప్రిల్ 29 తర్వాత జాగ్రత్త – పెట్రోల్, డీజిల్, ప్రతీదీ ఖరీదైపోతుంది. ముడిచమురు చౌకగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను జేబులో వేసుకుంది. ఇప్పుడు అది ఖరీదై, ఆ భారాన్ని మీపై మోపుతుంది'అని రాహుల్ గాంధీ మంగళవారం ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

పంజాబ్ అసెంబ్లీలో దుమారం

- మద్యం మత్తులో సీఎం మాన్
- ఆయనకు ఆల్కహాల్ టెస్ట్ చేయాలి
- అసెంబ్లీలోని ఎమ్మెల్యేలందరికీ కూడా..
- పంజాబ్ ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్
- తోసిపుచ్చిన స్పీకర్ సంధ్వాన్
- వాకౌట్ చేసేందుకే కాంగ్రెస్ ఆరోపణలన్న సీఎం

అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం మాన్

చండీగఢ్: పంజాబ్ అసెంబ్లీలో శుక్రవారం తీవ్ర దుమారం చెలరేగింది. కార్మిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక్క రోజు అసెంబ్లీ సమావేశానికి ముఖ్యమంత్రి భగవంత్ సింగ్‌మాన్ మద్యం మత్తులో వచ్చారంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ చేసిన ఆరోపణ సభలో కలకలం రేపింది. ఆయనకు ఆల్కోమీటర్ టెస్ట్, డోప్ టెస్ట్ చేయించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అంతేకాదు, సభలో ఉన్న అందరు ఎమ్మెల్యేలకు కూడా ఈ పరీక్షలు చేయించాలని డిమాండ్ చేసింది. సభ జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ సభ్యుడు సుఖ్‌పాల్ సింగ్ ఖైరా ఫోన్‌లో మాట్లాడుతున్నారంటూ సీఎం మాన్ అభ్యంతరం లేవనెత్తడంతో వివాదం మొదలైంది. ఖైరా స్పందిస్తూ..అంతకుముందు జరిగిన సెషన్‌లో సందర్శకుల గ్యాలరీలో సీఎం మాన్ భార్య కూర్చోవడాన్ని ప్రస్తావించారు. ఆ సమయంలో మాన్ కాస్త తడబడుతూ 'ఆమె ఈ సభలో సభ్యురాలు కాదు. నువ్వు చివరికి నా కూతురిని కూడా లక్ష్యంగా చేసుకుంటున్నావు. అంతా సోది మాట్లాడుతున్నావు'అంటూ ఖైరాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఖైరా, అసెంబ్లీకి మద్యం మత్తులో వచ్చావంటూ సీఎం మాన్‌పై ఆరోపణలకు దిగారు. ఇందుకు ప్రతిపక్ష నేత ప్రతాప్ సింగ్ బజ్వా సహా ఇతర కాంగ్రెస్ సభ్యులు వంతపాడారు. ఈ వివాదం సమసిపోవాలంటే సీఎం సహా ఎమ్మెల్యేలందరికీ ఆల్కహాల్ పరీక్షలు చేయించాల్సిందేనంటూ పట్టుబడ్డారు. శిరోమణి అకాలీదళ్ సభ్యులు కూడా సీఎం మాన్ మద్యం తాగి సభకు వచ్చారని ఆరోపించింది. నిజం తేలాలంటే డోప్ టెస్ట్ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. వీరి డిమాండ్‌ను స్పీకర్ సంధ్వాన్ తోసిపుచ్చారు. సభ్యుల తీవ్రవాదోపవాదాల నడుమ సీఎం మాన్ మాట్లాడారు. కార్మిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సభ హుందాతనాన్ని సభ్యులు కాపాడాలని కోరారు. ఇదే సమయంలో కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం, బీజేపీ, అకాలీదళ్ సభ్యులు కూడా సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఏదో ఒక వంకతో సభనుంచి వెళ్లిపోవాలన్నదే కాంగ్రెస్ ఉద్దేశమని సీఎం మాన్ ఆరోపించారు.

విశ్వాస తీర్మానం ఏకగ్రీవం

పంజాబ్‌లోని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం శుక్రవారం ప్రవేశ పెట్టిన విశ్వాస తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ నుంచి పంజాబ్‌కు చెందిన ఆరుగురు సహా మొత్తం ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీ పక్షాన చేరిన కొద్ది రోజుల్లోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. సీఎం భగవంత్ సింగ్ మాన్ సభలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో ఆప్ బలంగా ఉందని, మరింత పుంజుకోనుందని ఆయన ప్రకటించారు. ఆప్ పని అయిపోయిందని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు కండువాలు మార్చే అవకాశముందంటూ వస్తున్న పుకార్లన్నీ కల్పితాలంటూ ఆయన స్పష్టం చేశారు. ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఈ పార్టీని, తమ నేత కేజ్రీవాల్‌ను వెన్నంటే ఉంటామని, వదిలిపెట్టి వెళ్లే ప్రశ్నే లేదని ఆయన ప్రకటించారు. ఒక్క రోజు సెషన్ కోసం ఆప్ గురువారం తన సభ్యులందరికీ విప్ సైతం జారీ చేసింది. మొత్తం 117 మంది సభ్యులున్న పంజాబ్ అసెంబ్లీలో ఆప్ పక్షాన 94 మంది ఎమ్మెల్యేలున్నారు. కాంగ్రెస్‌కు 16 మంది, బీఎస్పీకి ఒకరు, శిరోమణి అకాలీదళ్‌కు ముగ్గురు, ఇద్దరు బీజేపీ, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు. సీఎం మాన్ విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సమయంలో సభలో స్వతంత్ర ఎమ్మెల్యే రాణా ఇందర్‌ప్రతాప్ సింగ్ మాత్రమే ఉన్నారు. కాంగ్రెస్ వాకౌట్ చేయగా, మిగతా ప్రతిపక్ష సభ్యులు ఆ సమయంలో సభలో లేరు. అధికార ఆప్‌కు చెందిన 88 మంది ఎమ్మెల్యేలు సభలో ఉండటంతో విశ్వాస తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు స్పీకర్ సంధ్వాన్ ప్రకటించారు. తమ ప్రభుత్వ విశ్వాస తీర్మానం ప్రతిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపిస్తామని సీఎం మాన్ చెప్పారు.

కౌంటింగ్ సూపర్‌వైజర్లుగా కేంద్ర ఉద్యోగులు

ఈసీ నిర్ణయంపై సుప్రీంకు టీఎంసీ

న్యూఢిల్లీ: ఈ నెల 4వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో సూపర్‌వైజర్లుగా కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను నియమించాలంటూ ఎన్నికల కమిషన్(ఈసీ) తీసుకున్న నిర్ణయంపై టీఎంసీ సుప్రీంకోర్టు తలుపుతట్టింది. సత్వరమే విచారణ చేపట్టాలని కోరింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ద్విసభ్య ధర్మాసనం శనివారం విచారణ చేపట్టనుంది. రెండో దశ పోలింగ్ సందర్భంగా టీఎంసీ కార్యకర్తలను వేధించేందుకే బయటి వారిని పరిశీలకులుగా, పోలీసు అధికారులుగా నియమించారంటూ ఈసీపై ఇప్పటికే టీఎంసీ చీఫ్ మమత గుర్రుగా ఉన్నారు. బెంగాల్ అదనపు చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) జారీ చేసిన సర్క్యులర్ ఇందుకు తోడైంది. లెక్కింపు జరిగే రోజున ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్‌వైజర్/కౌంటింగ్ అసిస్టెంట్‌గా కనీసం ఒక కేంద్ర ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగి ఉండాలని అందులో పేర్కొనడాన్ని టీఎంసీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇలాంటివి కేవలం ఎన్నికల కమిషన్ మాత్రమే జారీ చేయాలంది. కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ వైపు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మొగ్గు చూపుతారని అభ్యంతరం తెలిపింది.

ఇరాన్ కొత్త ప్రతిపాదన నచ్చలేదు

ఏం జరుగుతుందో చూద్దాం ● తేల్చిచెప్పిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ట్రంప్

వాషింగ్టన్: యుద్ధాన్ని పూర్తిగా ముగించడానికి ఇరాన్ తమతో కొత్త ప్రతిపాదన చేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అయితే, అందులోని అంశాలపై తాను సంతృప్తి చెందడం లేదని స్పష్టంచేశారు. ఇరాన్ ప్రపోజల్ నచ్చలేదని అన్నారు. అసలు ఈ ప్రపోజల్ ఏమిటి? అందులో పేర్కొన్న అంశాలేమిటి? అనేది ఇంకా తెలియరాలేదు. ''ఒప్పందం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. ఇరాన్ ప్రతిపాదన నాకు సంతృప్తి కలిగించలేదు. కాబట్టి ఏం జరుగుతుందో చూద్దాం''అని శుక్రవారం వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో అన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య ఫోన్ ద్వారా సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇరాన్ నుంచి అమెరికాకు ప్రతిపాదన రావడం ఇదే మొదటిసారి కాదు. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచి యుద్ధాన్ని ముగించడానికి ఇరాన్ ఇంతకుముందు అంగీకరించింది. కానీ తమ అణు కార్యక్రమంపై చర్చలను వాయిదా వేయాలని షరతు విధించింది. అందుకు అమెరికా ఒప్పుకోలేదు. ఇరాన్‌తో చర్చల ముసాయిదా పత్రంలో అణు కార్యక్రమ అంశాన్ని చేర్చాలంటూ తమ ప్రతినిధి బృందాన్ని అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించారు. చర్చలు కొనసాగుతున్నంత కాలం.. బాంబు దాడికి గురైన ఇరాన్ అణు కర్మాగారాల నుంచి శుద్ధి చేసిన యురేనియంను తరలించడానికి ప్రయత్నించబోమని, లేదా ఆ కర్మాగారాల్లో ఎలాంటి కార్యకలాపాలను పునఃప్రారంభించబోమని ఇరాన్ హామీ ఇవ్వాలని అమెరికా డిమాండ్ చేసింది. దీనిపై ఇరాన్ స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి మళ్లీ కొత్త ప్రతిపాదన రావడం ఆసక్తి కలిగిస్తోంది.

మాతో ఒప్పందానికి ఇరాన్ తహతహ

పశ్చిమాసియాలో ప్రస్తుతం తాత్కాలికంగా నిలిపివేసిన యుద్ధాన్ని పూర్తిగా ముగించే దిశగా తమతో ఒప్పందం చేసుకోవడానికి ఇరాన్ తహతహలాడుతోందని ట్రంప్ అన్నారు. ఇరాన్‌పై వైమానిక దాడులను పునఃప్రారంభించే అవకాశాలు దాదాపుగా లేవని స్పష్టంచేశారు. ఇరాన్‌లో కాల్పుల విరమణను ఉల్లంఘించాలన్న ఆలోచన అమెరికాకు ఉందా? అని ప్రశ్నించగా.. ఆ అవసరం ఉందని తాను అనుకోవడం లేదని ట్రంప్ బదులిచ్చారు. అమెరికా చేపట్టిన సైనిక చర్య ఇరాన్ సైనిక సామర్థ్యాలను ఇప్పటికే తీవ్రంగా దెబ్బతీసిందని పేర్కొన్నారు. ''ఇరాన్ నౌకాదళం, వాయుసేన చాలావరకు ధ్వంసమయ్యాయి. డ్రోన్ ఫ్యాక్టరీలు 82 శాతం నష్టపోయాయి. క్షిపణి ఉత్పత్తి కూడా దారుణంగా పడిపోయింది. క్షిపణి ఫ్యాక్టరీలు దాదాపు 90 శాతం పడిపోయాయి. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని నాశనం చేశాం. హార్మూజ్ జలసంధిపై అమెరికా విధించిన దిగ్బంధనం వల్ల ఇరాన్ ఆర్థిక వ్యవస్థ వేగంగా కుప్పకూలుతోంది''అని ట్రంప్ తేల్చిచెప్పారు.

ఈయూ వాహనాలపై సుంకాల పెంపు

యూరోపియన్ యూనియన్(ఈయూ) నుంచి దిగుమతి అయ్యే కార్లు, ట్రక్కులపై సుంకాలను వచ్చేవారం 25 శాతం పెంచబోతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం తేల్చిచెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. తాము పూర్తిగా అంగీకరించిన వాణిజ్య ఒప్పందాన్ని ఈయూ పాటించడం లేదని ఆక్షేపించారు. అయితే, తమ అభ్యంతరాలు ఏమిటన్నది ఆయన బయటపెట్టలేదు.

దేశంలోనే మొట్టమొదటి బారియర్‌లెస్ టోల్ వ్యవస్థ

గుజరాత్‌లో ప్రారంభించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ రహదారి రవాణా రంగంలో విప్లవాత్మక మార్పునకు నాంది పలుకుతూ, దేశంలోనే తొలి బారియర్‌లెస్ మల్టీ–లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) టోల్ వ్యవస్థ గుజరాత్‌లో మొదలైంది. సూరత్ సమీపంలోని చోర్యాసి టోల్ ప్లాజా వద్ద కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం ప్రారంభించారు. ఎన్‌హెచ్–48పై అమలులోకి వచ్చిన ఈ ఆధునిక విధానంలో వాహనదారులు టోల్ బూత్‌ల వద్ద ఆగాల్సిన అవసరం ఉండదు. నేరుగా వెళ్లిపోవచ్చు. ఈ వ్యవస్థలో ఓవర్‌హెడ్ గ్యాంట్రీలపై ఏర్పాటు చేసిన సెన్సర్లు, హై–రిజొల్యూషన్ కెమెరాలు, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తాయి. ఫాస్టాగ్ ఉన్న వాహనాల నుంచి సెన్సార్‌లు, కెమెరాల ద్వారా టోల్ మొత్తం ఆటోమేటిక్‌గా వసూలవుతుంది. ఫాస్టాగ్ లేని వాహనాల నంబర్ ప్లేట్ల ఆధారంగా డిజిటల్ చలాన్లు జారీ అవుతాయి. దీంతో టోల్ ప్లాజాల వద్ద ఆగే అవసరం ఉండదు, ప్రయాణ సమయం 20 నుంచి 30 శాతం వరకు తగ్గుతుంది.

అతి పెద్ద డ్రగ్స్ దందా గుట్టురట్టు

ముంబైలో రూ. 1,745 కోట్ల కొకైన్ పట్టివేత ● కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణాదారుల ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ)పట్టుకుందని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ముంబైలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల హైగ్రేడ్ కొకైన్‌ను స్వాధీనం చేసుకుందని తెలిపారు. శుక్రవారం ఆయన ఎక్స్‌లో ఈ విషయం తెలిపారు. నార్కోటిక్ ముఠాలపై ఉక్కుపాదం మోపేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని స్పష్టం చేశారు. 'చాలా స్వల్ప మొత్తాల్లో దొరికిన మత్తు పదార్థాల కేసులను ఆధారంగా చేసుకుని ఎన్సీబీ ఎంతో నేర్పరితనంతో ఒక భారీ నెట్‌వర్క్‌ను ఛేదించింది. అందరికీ ఇదొక మార్గదర్శక ఉదాహరణ. ఈ అద్భుతమైన విజయాన్ని సాధించిన టీమ్ ఎన్సీబీకి హృదయపూర్వక అభినందనలు'అని అమిత్ షా పేర్కొన్నారు. పట్టుబడిన కొకైన్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యంత్రాల లోపలి ఖాళీ భాగాల్లో దాచి ఉంచినట్లు ఎన్సీబీ అధికారులు గుర్తించారు. పట్టుబడిన వ్యాన్ డ్రైవర్ వెల్లడించిన వివరాల ఆధారంగా మొత్తం నెట్‌వర్క్ బయటపడిందని మంత్రి వివరించారు. ఏటా సరాసరిన మన అధికారులు 200–300 కిలోల కొకైన్‌ను పట్టుకుంటూ ఉంటారు. కానీ, ఇంత పెద్ద మొత్తంలో బయటపడటం ఇదే మొదటిసారని వివరించారు. వైట్ స్ట్రైక్ పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌కు పక్కా ప్రణాళికతో ఆరునెలలపాటు నిఘా వేశారన్నారు. నవీ ముంబై– థానెలోని కలంబోలి–భివండీ కారిడార్‌లో పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు జరిపారని చెప్పారు. 'మొదటగా కలంబోలిలోని కేడబ్ల్యూసీ వేర్ హౌసింగ్ కాంప్లెక్స్‌లో ఓ మారుతి సుజుకీ కారును పట్టుకున్నారు. అందులో, కిలో చొప్పున బరువున్న 136 ప్యాకెట్ల కొకైన్‌ను పట్టుకున్నారు. క్రికెట్ ప్యాడ్లు, గ్లవ్స్ ఉంచిన అట్టపెట్టెల్లో వీటిని దాచారు. ఆ కారు డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో భివండీలోని లక్ష్మణ్ కాంపౌండ్‌లో ఓ యంత్రంలో దాచిన మరో 213 ప్యాకెట్ల కొకైన్‌ను సీజ్ చేశారు. మామూలుగా చూసినవారు గుర్తించలేనంతగా గ్రీజు తదితర తొమ్మిది పొరల ప్యాకెట్లలో దీన్ని దాచారు. వీటి వెనుక అసలు సూత్రధారులను గుర్తించే పనిలో ఎన్సీబీ ఉంది'అని మంత్రి అమిత్ షా వివరించారు.

ఇరాన్‌పై యుద్ధం ముగిసింది: అమెరికా

వాషింగ్టన్: కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో ఇరాన్‌పై యుద్ధం ముగిసిపోయిందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ చెప్పారు. 1973 నాటి చట్టం ప్రకారం.. ఇతర దేశాలపై 60 రోజులకు పైగా యుద్ధం చేస్తే అమెరికా కాంగ్రెస్(చట్టసభ) నుంచి ప్రభుత్వం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధన నుంచి తప్పించుకోవడానికే ఇరాన్‌పై యుద్ధం ముగిసిందని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తున్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇరాన్‌పై యుద్ధం విషయంలో ట్రంప్ ప్రభుత్వం కాంగ్రెస్ నుంచి ఇప్పటిదాకా ఎలాంటి అనుమతి పొందలేదు. పశ్చిమాసియాలో ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఘర్షణలు ముగిశాయని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు ఏప్రిల్ 7న అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ తర్వాత అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు జరగలేదని గుర్తుచేశారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నగరంపాలెం: విశ్వశాంతిని కాంక్షిస్తూ బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడం లేదు. దిగువకు 400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 33.9760 టీఎంసీలు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.8200, మోడల్ ధర రూ.6000 వరకు పలికింది.

న్యూస్‌రీల్

ముగిసిన నరసింహుని జయంతి వేడుకలు

రాజాధి రాజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణంలో వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న నృసింహుని జయంతి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ నారసింహస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి హోమం, నరసింహ మూలమంత్ర హోమం అనంతరం శాంతి కల్యాణం చేశారు. సాయంత్రం రాజాధిరాజ వాహనంపై స్వామివారు గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జయంతి ఉత్సవాల శాశ్వత కైంకర్యపరులుగా మాల్యవంతం లక్ష్మీ నరసింహాచార్యులు, శేషమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి కోగంటి సునీల్‌కుమార్ పర్యవేక్షించారు.

కమనీయం రంగనాథుడి కల్యాణం

యడ్లపాడు: సొలస గ్రామంలోని శ్రీభూదేవి సమేత రంగనాయకస్వామి దేవస్థానం ఆధ్యాత్మిక శోభతో పరవశించిపోయింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ మండపాన్ని సుగంధభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదికపై నూతన వధూవరులుగా ముస్తాబైన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడి కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ఉలూఖల గౌరీ పూజల అనంతరం వేదమంత్రోచ్ఛారణలు, మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా సాగిన కల్యాణం భక్తులు తిలకించి పులకించిపోయారు. ఎదుర్కోలు ఉత్సవం సందర్భంగా గ్రామ భక్త బృందం చేసిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శుక్రవారం కల్యాణానంతరం హోమం, బలిహరణ కార్యక్రమాలు జరిగాయి. స్వామివారు గరుడ వాహనంపై రథోత్సవంలో పురవీధుల్లో ఊరేగుతుండగా, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నీరాజనాలు అర్పించారు. ఈవో నెమలిరెడ్డి పర్యవేక్షణలో ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్–నాగజ్యోతి దంపతులు, అర్వపల్లి బ్రదర్స్, గ్రామ పెద్దలు ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

వేసవి క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ

గుంటూరు వెస్ట్: వేసవి క్రీడా శిక్షణకు తమ పిల్లల్ని పంపించి వారిలోని సృజనాత్మకతకు, ప్రతిభకు తల్లిదండ్రులు దోహదపడాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ క్రీడా కోచింగ్ క్యాంప్‌ల పోస్టర్‌ను శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, జేసీ అశుతోష్ శ్రీవత్సవ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు సెలవుల్లో కనీస ఆటవిడుపుతోపాటు చక్కని ఆరోగ్యం కూడా వేసవి శిక్షణ ద్వారా లభిస్తాయన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం

- వైభవంగా శ్రీ సాక్షి భావనారాయణ స్వామి రథోత్సవం
- భక్తజన సంద్రంగా మారిన స్వర్ణపురి

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావనారాయణ స్వామివారి దివ్య రథోత్సవం స్వర్ణపురి పుర వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనంతో ప్రధాన వీధులు కిక్కిరిసిపోయాయి. స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పూలతో విశేషంగా అలంకరించిన రథంపై స్వామివారి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ రాజా వాసిరెడ్డి సుధాస్వరూప్ పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, స్వామివారి నామస్మరణతో వీధులన్నీ మార్మోగాయి. ఆలయ ప్రాంగణం నుంచి కసుకర్రు రోడ్డు వరకు రథోత్సవం సాగింది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందారు. భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మజ్జిగ, తాగునీరు అందించారు. డప్పు కళాకారుల సందడి ఆకట్టుకుంది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవదాయ సహాయ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ, ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాథరావు, కాట్రగడ్డ రామచంద్రరావు, గుడివాడ పవన్, ధరణికోట పద్మావతి, ఆకురాతి అనూరాధ, ఊటుకూరి బాజీ శిరీష, కూరాకుల సత్యనారాయణ, సింహాద్రి వెంకటలక్ష్మి, పరాశరం రంగవల్లి, ఎక్స్ అఫీషియో సభ్యులు పొన్నూరు బాలగంగాధర తిలక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీట్‌కు విస్తృత ఏర్పాట్లు

- 3న గుంటూరు జిల్లాలో 24 కేంద్రాల్లో పరీక్ష
- హాజరు కానున్న 8,417 మంది విద్యార్థులు
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష
- ఉదయం 11 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతి
- మధ్యాహ్నం 1.30 గంటల తరువాత ప్రవేశం నిషేధం
- విద్యార్థుల వస్త్రధారణ, ఆభరణాలపై ఆంక్షలు

పరీక్ష రాయడానికి వెళుతున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 3వ తేదీన జరగనున్న జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్ యూజీ–2026)కు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 8,417 మంది విద్యార్థులకు 24 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరగనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిబంధనల మేరకు ప్రతి ఒక్క విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉండటంతో విద్యార్థులు ఉదయం 11 గంటల కల్లా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. మధ్యాహ్నం 1.30 తరువాత కేంద్రాల్లోనికి అనుమతించరు. నీట్ దరఖాస్తు సమయంలో అందజేసిన ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్‌లో పొందుపర్చిన నియమావళిని విధిగా పాటించాల్సి ఉంటుంది.

విద్యార్థుల వస్త్రధారణపై ఆంక్షలు

నీట్‌కు హాజరయ్యే విద్యార్థుల వస్త్రధారణపై ఎన్‌టీఏ ఆంక్షలు విధించింది. విద్యార్థినులు ముక్కుపుడక సహా చెవులకు దిద్దులు, చేతులకు గాజులు సహా ఆభరణాలను ధరించరాదు.

- చేతికి స్మార్ట్‌వాచీతో పాటు సాధారణ వాచీలను సైతం ధరించకూడదు. సమయాన్ని తెలుసుకునేందుకు వీలుగా కేంద్రాల్లోని రూమ్‌లలో గడియారాలను ఏర్పాటు చేస్తున్నారు.
- విద్యార్థులు జీన్స్ ప్యాంట్లు వంటి వస్త్రాలను ధరించకుండా, సాధారణ దుస్తుల్లోనే రావాల్సి ఉంది. తలకు టోపీ, కళ్లకు సన్‌గ్లాసెస్ ధరించకూడదు.
- బ్లూటూత్ వాచీలు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌బ్యాండ్లు, పెన్నులు సహా ఇతర ఎటువంటి వస్తువులను విద్యార్థులు తమ వెంట తీసుకురాకూడదు.

విద్యార్థులు వీటిని వెంట తెచ్చుకోవాలి

విద్యార్థులు ప్రింటవుట్ అడ్మిట్‌కార్డుతో పాటు నీట్ దరఖాస్తు సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తమ వెంట తెచ్చుకోవాలి. మరొక పాస్‌పోర్ట్ సైజు ఫొటోను ఎగ్జామినేషన్ హాల్లో విద్యార్థుల హాజరు నమోదు చేసే సమయంలో అటెండెన్స్ షీట్‌పై అతికించాల్సి ఉంటుంది. దీంతోపాటు పోస్ట్‌కార్డ్ సైజు వైట్ బ్యాక్‌గ్రౌండ్‌తో కూడిన కలర్ ఫొటోను అడ్మిట్‌కార్డుతో పాటు డౌన్‌లోడ్ చేసుకున్న ప్రొఫార్మాపై అతికించి ఇన్విజిలేటర్‌కు అందజేయాలని నియమావళిలో పొందుపర్చారు. అదే విధంగా ప్రభుత్వం జారీ చేసిన ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, 12వ తరగతి అడ్మిషన్ కార్డులో ఏదో ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. శారీరక వైకల్యం గల విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకెళ్లాలి. ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది. పరీక్ష రాసేందుకు అవసరమైన పెన్నులను ఆయా కేంద్రాల్లోనే ఇస్తారు.

రానున్న ఐదు రోజులు ఎండ తీవ్రం

- ఉష్ణోగ్రత 41 – 54 డిగ్రీల సెల్సియస్ వరకు అవకాశం
- జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ

గుంటూరు వెస్ట్: రానున్న ఐదు రోజులపాటు జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉండనుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రానున్న ఐదు రోజులలో వేసవి తీవ్రత (హీట్ ఇండెక్స్) అధికంగా ఉంటుందని సూచించిందన్నారు. 41 – 54 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత ఉండవచ్చని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు, మేడికొండూరు, కొల్లిపర, మంగళగిరి, పొన్నూరు ఫిరంగిపురం, చేబ్రోలు, పెదనందిపాడు, తాడేపల్లి, తాడికొండ, గుంటూరు పశ్చిమం, పెదకాకాని, కాకుమాను, తెనాలి, వట్టిచెరుకూరు, తుళ్ళూరు, దుగ్గిరాల, ప్రత్తిపాడు మండలాలు ఈ ప్రభావానికి లోనయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అత్యవసర పనులు ఉంటే మినహా ప్రజలు ఎవరూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని ఆయన సూచించారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తాగాలని సూచించారు. చిన్నారులు, వయసు మీరినవారు బయటకు వెళ్లకుండా కుటుంబసభ్యులు చూడాలని చెప్పారు. డీ హైడ్రేషన్‌కు గురికాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగవద్దని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు ప్రజలకు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

పింఛన్లు పంపిణీ

ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ శుక్రవారం స్థానిక ఆకులవారి తోటలో పంపిణీ చేశారు. స్థానికుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,53,379 మంది పింఛనుదారులకు రూ.110.50 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు.

జగన్ పాలనలో శ్రమజీవులకు మెరుగైన జీవన ప్రమాణాలు

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో కేక్ కట్ చేస్తున్న మోదుగుల, నూరి ఫాతిమా, మురళీకృష్ణ, డైమండ్‌బాబు

- వైఎస్సార్ సీపీ నేతలు మోదుగుల వేణుగోపాల రెడ్డి, నూరి ఫాతిమా, అంబటి మురళీకృష్ణ
- పార్టీ జిల్లా కార్యాలయంలో మేడే వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో శ్రమ జీవులకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా, పొన్నూరు, తాడికొండ నియోజకవర్గాల సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) అన్నారు. శుక్రవారం బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా ట్రేడ్ యూనియన్ విభాగ అధ్యక్షుడు శేషగిరి పవన్ కుమార్ ఆధ్వర్యంలో మేడే (కార్మికుల దినోత్సవ) వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పార్టీ నేతలు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, షేక్ నూరి ఫాతిమా, అంబటి మురళీకృష్ణ, డైమండ్ బాబులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కార్మిక జెండాను ఆవిష్కరించారు, అనంతరం ఆటో కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నేతలు మాట్లాడుతూ కార్మిక, కర్షక, రైతు సోదరులకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారని చెప్పారు. కార్మికుల సంక్షేమానికి విస్తృత రీతిలో కార్యక్రమాలను అమలు పర్చడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్క కార్మిక కుటుంబానికి నేరుగా నగదు బదిలీ ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేశారని అన్నారు. ప్రస్తుత టీడీపీ పాలనలో కార్మిక, కర్షక, రైతుల సంక్షేమం ఎండమావిగా మారిందని, కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం రోడ్డు ఎక్కి పోరాటాలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో కాంట్రాక్టు ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు న్యాయమైన హక్కుల సాధన కోసం రోడ్లెక్కాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేత నిమ్మకాయల రాజనారాయణ, జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శి పెనుమాల అరుణ్‌కుమార్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిపోయిన వేణుగోపాల్, విద్యార్థి విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి బండ్లమూడి భానుకిరణ్, నగర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మురళి, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు పటాన్ సైదాఖాన్, బాబు, మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జి.ప్రభు, అరవింద్, చింతపల్లి రమణ, అరుణ్, భాను, కేసరి సుబ్బులు, స్వర్ణలత, నందేటి రాజేష్, సురసాని వెంకటరెడ్డి, నాజర్, హనుమంతు గోపి శ్రీనివాస్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఏఐ సరే.. అసలు కారణం పట్టించుకోరే?

- గుంటూరులో ఏఐ డ్రోన్ల సహాయంతో దోమల లార్వా నియంత్రణ
- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమంటూ అధికారుల హడావుడి
- సుమారు 26 ప్రధాన చెరువులు, మురుగునీరు నిల్వ ఉండే లోతట్టు ప్రాంతాలు లక్ష్యం
- చాలా ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా మురుగునీరు పారుదల వ్యవస్థ
- కొన్ని చోట్ల అసలు కాలువలు కూడా దిక్కు లేకపోవడంతో మురుగు నిల్వ

చెరువుల్లో దోమల లార్వా నివారణకు డ్రోన్ ద్వారా మందు పిచికారీ (ఫైల్)

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో దోమల నియంత్రణకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) డ్రోన్‌ల సహాయంతో చర్యలు చేపడుతున్నట్లు అధికారులు ప్రకటించారు. దోమల లార్వా నియంత్రణకు చేపట్టిన ఈ కార్యక్రమాలు కేవలం కొన్ని ప్రాంతాలకు పరిమితం అవుతున్నాయని, అసలు సమస్యకు మూల కారణాలపై దృష్టి పెట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుంటూరు నగరంతో పాటు విలీన గ్రామాల్లోని 26 ప్రధాన చెరువుల్లో, మురుగు నిల్వ ఉండే లోతట్టు ప్రాంతల్లో 174 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ ఆపరేషన్ చేసేందుకు నగరపాలక సంస్థ కార్యాచరణ సిద్ధం చేసింది. అయితే సదరు డ్రోన్ ఆపరేషన్ బాగానే ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు లేకపోవడంతో అక్కడే మురుగునీరు నిల్వ ఉండి దోమల వృద్ధికి కారణం అవుతున్నాయి. ముఖ్యంగా నగరంలోని శివారు ప్రాంతాలతోపాటు విలీన గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో దోమల వృద్ధి మరింత పెరిగిపోతోందని చెప్పుకోవచ్చు.

శుభ్రం చేసే వారే కరువు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 3,129.45 కిలోమీటర్ల పొడవైన డ్రైనేజీ వ్యవస్థ ఉంది. నగర పరిధిలో ప్రజారోగ్య విభాగంలో సుమారు 2 వేల మంది సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొంతమంది డెప్యూటేషన్‌పై నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారుల వద్ద, మరి కొంత మంది అధికారుల ఇళ్లల్లో పనులు చేసుకుంటూ గడిపేస్తున్నారు. మిగిలిన కొంతమందితో నగరం అంతా డ్రైనేజీ వ్యవస్థ శుభ్రం చేయడం కష్టంగా మారిందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు డ్రెయిన్లు శుభ్రం చేసే పరిస్థితి లేదని నగర వాసులు చెబుతున్నారు. అదే విధంగా మలేరియా విభాగంలో పనిచేసే వారు ఫాగింగ్ మిషన్లను ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లోనే ఎక్కువగా తిప్పుతున్నారు. మిగిలిన ప్రాంతాలకు అసలు వెళ్లడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.. దీంతో రాత్రి వేళల్లో నగర వాసులు దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సీతారామ్‌నగర్ మూడవ లైనులో కాలువ లేకపోవడంతో మురుగు నిలిచిన దృశ్యం

శివారు ప్రాంతాలలో అధ్వానం

గుంటూరు నగరంలో విలీనమైన 10 గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేదనే చెప్పుకోవచ్చు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కచ్చా డ్రైనేజీలు దర్శనమిస్తూ.. ఆ డ్రైనేజీలో మురుగు అంతా ఇళ్ల ముందే నిలిచిపోయి దుర్వాసనతోపాటు దోమల వృద్ధికి కారణం అవుతోంది. అదే విధంగా నగరంలో ఖాళీ స్థలాలు 10 వేలకుపైగా ఉన్నాయి. వీటిల్లో చాలా చోట్ల పిచ్చి మొక్కలు, చెట్లు పెరగడంతోపాటు కొన్ని స్థలాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో అవి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు సాధారణంగా చెరువుల్లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క, తూటికాడను తొలగింపజేస్తారు. జీఎంసీ మలేరియా విభాగ సిబ్బంది నేరుగా లోపలికి వెళ్లి మందు చల్లడం ప్రమాదకరంగా మారడంతో ఏఐ డ్రోన్లను వాడుతున్నారు. కానీ డ్రెయిన్లు లేని చోట నిర్మించడంతోపాటు ఉన్న వాటిని సక్రమంగా శుభ్రం చేయించడం ముఖ్యమనే విషయం కూడా అధికారులు మర్చిపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని శుభ్రం చేయించడంతో పాటు ఫాగింగ్ వంటివి కూడా పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తుచేస్తున్నారు. అప్పుడే కొంతలో కొంతైన దోమల నివారణ సాధ్యమవుతుందని నగర వాసులు పేర్కొంటున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రంగురాళ్ల డంపు స్వాధీనం

రంగురాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

దాచేపల్లి: భారీ స్థాయిలో రంగురాళ్ల గుట్టును అధికారులు రట్టు చేశారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఓ గోడౌన్‌లో భద్రపరిచిన రంగురాళ్లను అటవీ శాఖ, విజిలెన్స్ అధికారులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో స్థానిక పోలీసుల సహాయంతో అటవీ శాఖ, విజిలెన్స్ అధికారులు గోడౌన్‌లో భద్రపరిచిన రంగురాళ్లు (క్రిస్టల్ క్వార్ట్జ్) స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లి మండలం శంకరాపురం గ్రామ సమీపంలో ఉన్న కొండ నుంచి ఈ రంగురాళ్లు వెలికి తీసినట్లు అధికారులు గుర్తించారు. రంగురాళ్ల వివరాలు అధికారులు సేకరిస్తున్నారు. పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించిన తరువాత వీటి విలువ ఎంత అనేది తెలుస్తుంది. స్థానికుల సమాచారం సుమారు రూ.కోటి పైనే రంగురాళ్ల విలువ ఉంటుందంటున్నారు. స్థానిక సీఐ రాజేష్, అటవీశాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు సంఘటనా స్థలంలో ఉండి ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా, పంచనామా నిర్వహిస్తున్నామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

క్లుప్తంగా

అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురంలో జరగనున్న అంతర్ జిల్లాల జూనియర్ బాల, బాలికల బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌కు గుంటూరు జిల్లా జట్టు ఎంపిక శుక్రవారం నిర్వహించారు. లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ఏపీ స్టేట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జీఎస్‌సీ బోస్, కోశాధికారి రేవతి, జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, చీఫ్ సెలెక్టర్ గుంటుపల్లి హరగోపాల్ సమక్షంలో శిక్షకులు సీహెచ్ శ్రీనివాసరావు, అనిల్, రవికుమార్ పర్యవేక్షించారు. అంతర్ జిల్లాల జూనియర్ బాల, బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు గుంటూరు జిల్లా జట్టు తరుపున బాలుర విభాగం నుంచి షణ్ముఖ్, రూపేష్, మణికంఠ, అఖిల్, జాన్ ప్రద్దీ పాల్, జయరామ్, అఖిల్, విజయ్, ప్రత్యుష, సత్య, ఈశ్వర్ దినేష్ స్టాండ్ బై గా గిరి, హర్షిత్, ఆకాష్, రుత్విక్, బాలికల విభాగం నుంచి యోగ శ్రీ, మానస, అక్షయ, కుండానే, కావ్య, జుబేరియా, శ్రీ లక్ష్మి, ఫర్హానా, ఈషా, ప్రణతి, సహస్ర, సాయి శ్రీ స్టాండ్ బైగా బృంద, జస్విత, ప్రణీత, బ్లేస్సిలను ఎంపిక చేశారు.

గుంటూరు జీజీహెచ్‌లో వైద్యుల వివాదం

డాక్టర్ తనపై దాడి చేశాడంటూ విభాగాధిపతి ఫిర్యాదు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో విధుల కేటాయింపులో వివాదం ఏర్పడి ఓ డాక్టర్ ఓ విభాగాధిపతిపై దాడిచేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తనపై దాడిచేసిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలంటూ విభాగాధిపతి లిఖితక పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా, ఎమర్జెన్సీ మెడిసిన్ ఇన్‌చార్జిగా డాక్టర్ పాటిబండ్ల అనిల్‌బాబు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఎమర్జెన్సీ మెడిసిన్ ఇన్‌చార్జి విధులు చేపట్టిన డాక్టర్ అనిల్‌బాబు ఎమర్జెన్సీ మెడిసిన్‌లో రోగులకు సత్వర వైద్య సేవలు అందించేందుకు రోడ్డు ప్రమాద బాధితులు, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పలువురు క్యాజువాల్టి మెడికల్ ఆఫీసర్లకు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు (సీఏఎస్) విధులు కేటాయించారు. జీజీహెచ్‌లో క్యాజువాల్టీలో పనిచేస్తున్న సీఏఎస్‌లను క్యాజువాల్టి మెడికల్ ఆఫీసర్ అని కూడా పిలుస్తారు. వీరు మూడు షిఫ్టులు క్యాజువాల్టిలో అందుబాటులో ఉండి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మే నెలకు సంబంధించి డ్యూటీ రోస్టర్ వేసిన పిదప క్యాజువాల్టిలో విధులు నిర్వహించకుండా ఆర్ఎంఓ రూములో డాక్టర్ గురుప్రసాద్ ఉండటంపై డాక్టర్ అనిల్‌కుమార్ ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగి డాక్టర్ గురుప్రసాద్ తనను అసభ్యంగా మాట్లాడి, కర్రతో దాడి చేసేందుకు ప్రయత్నించారని, డ్యూటీలు సక్రమంగా నిర్వహించేలా తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆసుపత్రి అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు.

ఉన్నవ గ్రామంలో చోరీ



యడ్లపాడు: మండల పరిధిలోని ఉన్నవలో పట్టపగలే గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చోరీ చేసినట్లు యడ్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చెన్నుపాటి కృష్ణవేణి రోజువారీ కూలి పనులకు వెళ్లి, సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చారు. ఆ సమయంలో పిల్లలు బయట ఆడుకోవడానికి వెళ్లారు. ఆమె ఇంటి లోపలికి వెళ్లి చూడగా, అల్మారాలోని దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. అల్మారా తలుపులు తీసి ఉండటంతో పాటు, లోపల ఉన్న లాకర్ కూడా తెరిచి ఉండటాన్ని ఆమె గమనించారు. ఆందోళనతో లాకర్‌ను పరిశీలించగా, అందులో దాచిన సుమారు 48 గ్రాముల బంగారం గొలుసు, చెవిపోగులు వంటి విలువైన ఆభరణాలు మాయమైనట్లు గుర్తించారు. బాధితులరాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం శివారు పరిధిలోని వెంకటేశ్వర నగర్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలై మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మోర్ల వెంకటేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన దాసరి మరియబాబు (35) బైకుపై వినుకొండ నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలోని వెంకటేశ్వరనగర్ సమీపాన ఏదురుగా వస్తున్న ఆర్టీసీ ఢీకొనటంతో రోడ్డుపై పడి కుడి కాలు విరిగిపోవటంతో సత్వరమే 108 అత్యవసర వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాల తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రక్తం అధికంగా పోవటంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మోర్ల వెంకటేష్‌బాబు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.ఆర్టీసి డ్రైవరు సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

రాబోయే ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి
- ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి
- బయటకు రావద్దని ప్రజలకు సూచన

మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: రాబోయే ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి వైద్య అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చాంబర్‌లో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ రాబోయే ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు 41 నుంచి 54 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషయంపై వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు బయట సంచరించరాదన్నారు. పల్చని కాటన్, తెల్లని లేదా లేత వర్ణపు దుస్తులు మాత్రమే ధరించాలని, తరరూ ద్రవ రూప పదార్థాలు మంచినీళ్లు, మజ్జిగ, కొబ్బరి బొండం నీళ్లు, ఇంట్లో తయారు చేసుకున్న ద్రవరూప పదార్థాలు తాగుతూ ఉండాలన్నారు. సచివాలయాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యంద్రాల్లో ఓఆర్ఎస్ పాకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఆరోగ్య కేంద్రాలలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఐ.వి ద్రావణాలైన, ఆర్.ఎల్, డి ఎన్ ఎస్, 5 శాతం డెక్స్ట్రోజ్ ద్రావణాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర పరిస్థితుల్లో వడదెబ్బ బాధితుల కోసం రెండు పడకలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. నూనె పదార్థాలు, మాంసాహారాలకు దూరంగా ఉండాలని, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్బీఎస్‌కే పర్యవేక్షణ కోసం కేంద్ర బృందం ఈనెల 5, 6, 7, 8 తేదీల్లో వస్తుందని తెలిపారు. ఈ లోపల స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, ఈ.హెచ్.ఆర్, అభయన్ సి డి, సి డి లను కూడా పర్యవేక్షించి, వీటిని వేగవంతం చేయాలన్నారు. ప్రధానమంత్రి వయో వందన నమోదును వేగవంతం చేయాలని, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఎంఆర్ వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయాలన్నారు. ప్రధానమంత్రి రాహక్ పథకం ద్వారా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి, ఆర్థిక భరోసాలో భాగంగా తక్షణ చికిత్స కోసం రూ.1.5 లక్షల ఉచిత వైద్యాన్ని, ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అందజేస్తారని తెలిపారు. కేపీఐ, హెచ్ఎంఐఎస్, ఆర్‌సీహెచ్ పోర్టల్లలో సేవల నమోదు వేగవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ అన్నపూర్ణ, డీపీఎంఓ డాక్టర్ సుజాత, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీధర్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాష్, డీపీహెచ్ఎన్ఓ ఇన్‌చార్జి డాక్టర్ ప్రియాంక, డెమో శివసాంబిరెడ్డి పాల్గొన్నారు.

సీలింగ్ భూములు క్రమబద్ధీకరణకు అవకాశం

డిసెంబరు 31వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు, వెస్ట్: సీలింగ్ భూములు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ భూ పరిమితులు చట్టం , 1976 ప్రకారం ప్రభుత్వ పరిధిలోనికి వచ్చిన సీలింగ్ భూములు, మిగులు భూములు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందన్నారు. తమ ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన, ఎగువన ఉన్న అందరు నిబంధనల మేరకు అర్హత కలిగి ఉంటారన్నారు. సీలింగు భూములను క్రమబద్ధీకరించుకోవడానికి ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తూ 241 జి.ఓను జారీ చేసిందని చెప్పారు. ఈ ఉత్తర్వుల మేరకు సీలింగ్ భూములను క్రమబద్ధీకరించుకొనుటకు అర్హులైన వ్యక్తులు డిసెంబరు 31వ తేదీలోగా జాయింట్ కలెక్టర్, కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్స్, గుంటూరు వారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరణకు చెల్లించాల్సిన మొత్తాన్ని రెండు దఫాలుగా – దరఖాస్తు సమయంలో 50 శాతం, ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తేదీ నుంచి ఒక నెల గడువు లోపల మిగిలిన 50 శాతం చెల్లించాలని వివరించారు. 150 చదరపు గజాల వరకు అన్ని అర్హతలు గల వారికి ఉచితంగా డి – పట్టా మంజూరు చేస్తారని, 150 నుండి 300 చదరపు గజాల వరకు ప్రాథమిక (బేసిక్) విలువలో 15 శాతం చెల్లించాలని, 300 నుండి 500 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 30 శాతం, 5 వందల చదరపు గజాలకు పైబడి ఉంటే బేసిక్ విలువ శత శాతం చెల్లించాలని వివరించారు. క్రమబద్ధీకరించుకొను అర్హులకు కన్వేయన్స్ డీడ్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. 2019 మే 1వ తేదీకి ముందు రిజిస్టర్ అయిన డాక్యుమెంట్‌లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. క్రమబద్ధీకరణ విలువ చెల్లించిన వారి భూములను వారి సొంత ఖర్చులతో వారి పేరున రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు అవకాశం కల్పించడమే కాకుండా ప్రభుత్వ నిషేధిత భూముల జాబితా నుండి తొలగించుటకు తగు చర్యలు తీసుకుంటారన్నారు. డి – పట్టా పొందిన వారికి, గతంలో 10 సంవత్సరాల తరువాత మాత్రమే బదలాయింపు చేసే అవకాశం ఉండేదని, ప్రస్తుతం 2 సంవత్సరాలకు బదలాయింపు చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.

నగర అభివృద్ధికి సమష్టి కృషి అవసరం

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని

గుంటూరు వెస్ట్: గుంటూరు నగరం రూపురేఖలు మారాలని, సుందరమైన, ఆకర్షణీయంగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు నగర పాలక సంస్థ ప్రగతిపై శుక్రవారం స్థానిక కలెక్టట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ, కమిషనర్ కె.మయూర్ అశోక్, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడాలన్నారు. సురక్షిత తాగునీరు, చక్కని పారిశుద్ధ్యం, ఆహ్లాదాన్ని ఇచ్చే పార్కులు, మంచి రహదారులు, కాలువలు వంటి సౌకర్యాలు సమకూర్చి సుందరమైన పట్టణంగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఆసక్తిగల పౌరులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా వాణిజ్య సంస్థల నుంచి వచ్చే చెత్త నిర్మాణ పట్ల దృష్టి సారించాలన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణను ప్రాధాన్యతగా చేపట్టాలని అన్నారు. ప్రజా వినియోగం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. బొంగరాలబీడు వద్ద మంచి పార్కు అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు అవసరం మేరకు కార్మికులను పెంచాలని, 2027 నాటికి పూర్తి చేయాలని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు వేగంగా పూర్తి చేసేందుకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. గోరంట్ల నీటి పథకం జూన్ మొదటి వారం నాటికి ప్రారంభం కావాలని ఆదేశించారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు నియంత్రణపై అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ మానస సరోవరం అభివృద్ధి పనులను పి.పి.పి మోడ్‌లో చేపట్టే ఆలోచన ఉందన్నారు. అమృత్ 2.0 క్రింద చెరువు పునరుద్ధరణకు అవకాశం ఉందని చెప్పారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు శాస్త్రీయ విశ్లేషణ చేసి ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పా ముసుగులో వ్యభిచారం

గుంటూరు రూరల్: స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తులను గుంటూరు టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు ఇన్నర్ రింగ్‌రోడ్డు రెడ్డిపాలెం సమీపంలో ఐరాస్పా రిలాక్స్ రెన్యూ రిజువంట్ స్పా సెంటర్‌లో నల్లపాడు పోలీసులతో కలిసి దాడిచేయగా మేనేజర్ సూర్యతోపాటుగా ఇతర రాష్ట్రాలకు చెందిన ఇద్దర మహిళలను, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విచారణ నిమిత్తం నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు. నల్లపాడు పోలీసు స్టేషన్‌పరిధిలోని ఇన్నర్‌రింగ్‌రోడ్డు ఫేజ్–2 చిల్లీస్ సెంటర్ ఎదురగల స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందం దాడిచేసి మహిళలు, పురుషులను అదుపులోకి తీసుకున్న సంఘటన శుక్రవారంచోటుచేసుకుంది. చిల్లీ సెంటర్‌లోని ఏ9 బ్యూటీఫుల్ సెలూన్ అండ్ స్పా –2 మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం పోలీసులు దాడిచేశారు. ఏడుగురు పురుషులు, నలుగురు మహిళలు, ఇతర రాష్ట్రానికి చెందిన ఒక మహిళ,11సెల్‌ఫోన్లు, స్పానిర్వాహకుడు ఆదినారాయణలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీజీహెచ్‌లో వైద్య సిబ్బంది ఆకలి కేకలు

- రెండు నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాంట్రాక్టు ఉద్యోగులు

గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: రాష్ట్రవ్యాప్తంగా పేదల పెద్ద ఆసుపత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వేతనాలు రాక అర్ధాకలితో అలమటిస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన యాప్ నిధి ద్వారా వేతన చెల్లింపు ప్రక్రియ నిలిచిపోయినట్లు కాంట్రాక్టు ఉద్యోగులు వాపోతున్నారు. ఉద్యోగులు ఎప్పటి నుంచి ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్నారు, ఏ నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగంలో చేరారు, అపాయింట్‌మెంట్ ఆర్డర్, తదితర వివరాలన్నీ నిధి యాప్‌లో అప్‌లోడు చేస్తేనే వేతనాలు చెల్లిస్తామంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జీజీహెచ్ అధికారులు, రాష్ట్ర స్థాయి డీఎంఈ కార్యాలయం అధికారులు ఒకరిపై నెపాలు వేసుకుంటూ కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల చెల్లింపును మరిచిపోయారు. రెండు నెలలుగా వేతనాలు లేక ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. వీరితోపాటు గుంటూరు జీజీహెచ్‌లో ఏడాది నుంచి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పనిచేస్తున్న 30 మంది ఉద్యోగులకు వేతనాలు రాకపోవడంతో ఉద్యోగాలు మానేసి బయటకు వెళ్లే పరిస్థితి వచ్చింది. గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు ఉద్యోగులు మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు రాక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఏడాది ఫిబ్రవరిలో నిధి యాప్‌ను ప్రవేశపెట్టి వేతనాల చెల్లింపును సదరు యాప్ ద్వారా చేయాలని ఆదేశాలు ఇచ్చింది. నిధి యాప్‌లో వైద్య సిబ్బంది వివరాలు నమోదు ప్రక్రియ రెండు నెలలుగా జాప్యం చేస్తుండటంతో మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది రెండు నెలలు వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారు.

జీజీహెచ్‌లో 700 మందికి పైగా సిబ్బంది

గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు పద్ధతిలో సుమారు 500 మంది స్టాఫ్‌నర్సులు పనిచేస్తున్నారు. దీంతోపాటు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఈసీజీ టెక్నీషియన్లు, ఫార్మాశిస్టులు, సిటీస్కాన్ టెక్నీషియన్లు, ఎమ్మారై టెక్నీషియన్లు, కింది స్థాయి ఉద్యోగులు సుమారు 200 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరికి మార్చి నెల జీతం విడుదల కాలేదు. ఏప్రిల్ నెల కూడా పూర్తయింది. రెండు నెలల వేతనాలు లేకపోవడంతో కాంట్రాక్టు ఉద్యోగులు సకాలంలో ఇళ్ల అద్దెలు చెల్లించలేక, రోజువారి సరుకులు కొనుగోలు చేయలేక అప్పులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీచింగ్ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు నర్సింగ్, పారా మెడికల్ సిబ్బందిది ఇదే పరిస్థితి. రోగులకు నిత్యం అందుబాటులో ఉండి, రెగ్యులర్ ఉద్యోగులకు పోటీగా వైద్య సేవలు అందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు వేతనాలు చెల్లింపు ప్రక్రియను త్వరితగతిన చేయాలని కోరుతున్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్

మాట్లాడుతున్న సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో కార్మికుల పాత్ర ముఖ్యమైనదన్నారు. సమాజంలో కార్మికులకు భద్రతా, పనికి సరిపడా వేతనం కార్మికుల హక్కులని తెలిపారు. ప్రజలందరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ సమాజంలో ఎక్కువగా ఉందని, ఫ్యాక్టరీలు, హోటళ్లలో పిల్లలు కార్మికులుగా మారుతున్నారన్నారు. పేదరికం, అవగాహనా లోపం వలన తల్లిదండ్రులు పిల్లల చదువులు మాన్పించి కార్మికులుగా మారుస్తున్నారని తెలిపారు. బాలకార్మిక నిర్మూలన మనందరి సమష్టి బాధ్యత అన్నారు. బార్ ప్రెసిడెంట్ మధిర నాగేశ్వరరావు, ప్యానెల్ అడ్వకేట్, కార్మిక దినోత్సవంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్ పాండురంగారావు, ఎం.మాధురి, ఏ.సంతోష్‌కుమార్, ఆర్.చేతన్, పి.వీరాంజనేయులు, స్టేక్ హోల్డర్స్, సోప్ వర్కర్స్, మునిసిపల్ వర్కర్స్, ప్యానెల్ అడ్వకేట్స్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విజయకేతనం

విద్యార్థులతో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్లు విజయభాస్కర్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గుంటూరు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్. విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ మెయిన్ క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన సభలో విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు 600 మార్కులకు అత్యధికంగా 597, 594 కైవసం చేసుకున్నారని చెప్పారు. అదే విధంగా ముగ్గురు విద్యార్థులు 593 సాధించగా, 592 మరో ముగ్గురు, ఐదుగురు విద్యారులు 591 కైవసం చేసుకున్నట్లు వివరించారు. 590కు పైగా 17 మంది, 580 పైన 74 మంది, 570 పైన 176 మంది, 560 పైన 271, 550కు పైగా 344, 540కి పైగా 423, 530కి పైగా 490, 520కి పైగా 543 మంది, 510కి పైగా 593, 500కు పైగా 641, 500లోపు 641 మంది విద్యార్థులు విజయం సాధించారని చెప్పారు. 1200 మంది విద్యార్థులకు గాను మ్యాథ్స్‌లో 104 మందికి 100 మార్కులు, 248 మందికి 95 పైన మార్కులు, తెలుగులో 108 మందికి 100 మార్కులు, 357 మందికి 95 మార్కులపైన మరియు సోషల్లో 71 మందికి 100 మార్కులు, 351 మందికి 95 పైన మార్కులు, సైన్స్‌లో 19 మందికి 100 మార్కులు, 243 మందికి 95 పైగా మార్కులు, హిందీలో 19 మందికి 100 మార్కులు, 230 మందికి 95 పైగా మార్కులు, ఇంగ్లీష్‌లో 230 మందికి 95కు పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిరంతర కృషి, తల్లిదండ్రుల సహకారంతో ఆక్స్‌ఫర్డ్ ఘన విజయం సాధించిందని కొనియాడారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ ఎస్.ప్రాన్సిస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అరోన్ రెడ్డి, డైరెక్టర్ జోసఫ్‌రెడ్డి, ఇన్‌చార్జులు మనోజ్, భాస్కర్ విద్యార్థులను అభినందించారు.

శ్రీనివాసరెడ్డి పెయింటింగ్‌కు అవార్డు

ప్రముఖ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డి గీసిన క్రీస్తు రాకడ పెయింటింగ్

చినగంజాం: ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి చిత్ర కళా ప్రదర్శన పోటీల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో చినగంజాంకు చెందిన ప్రముఖ చిత్రకారుడు సూరిన శ్రీనివాసరెడ్డికి అవార్డు దక్కింది. పల్నాడు జిల్లా వినుకొండలో గంగినేని కళ్యాణ మండపంలో శుక్రవారం చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ చిత్రకారుడిగా పేరొందిన వజ్రగిరి జోసెఫ్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వజ్రగిరి జోసెఫ్ యూత్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలో శ్రీనివాసరెడ్డి ప్రదర్శించిన క్రీస్తు రాకడ అనే చిత్రానికి అవార్డు దక్కింది. కార్యక్రమంలో ఆయనకు ద్వితీయ బహుమతి ప్రకటించి గోల్డెన్ ది గ్రేట్ అవార్డు, మెమొంటోను వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అందజేశారు. జస్టిస్ ఆర్ట్స్ అకాడమీ ప్రిన్సిపాల్ బ్యూలా, డైరెక్టర్ డాక్టర్ వీ జస్టిస్‌లు ప్రశంస పత్రం అందించారు. శ్రీనివాసరెడ్డికి అవార్డు దక్కడంపై ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు చిత్రకారులు అభినందనలు తెలిపారు.

నిందితుడి ఆత్మహత్య

చినగంజాం: పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన శుక్రవారం చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదగంజాం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శీలం రమేష్ వివరాల మేరకు.. పెదగంజాం గ్రామ పంచాయతీలోని మాదిగపల్లెకు చెందిన చాట్ల అంజయ్య (59)పై గతంలో పోక్సో కేసు నమోదైంది. ఈనేపథ్యంలో శుక్రవారం ఒంగోలు కోర్టులో విచారణ నిమిత్తం అంజయ్య చిన్న కుమారుడు జాన్ శ్రీను ఇద్దరు కలిసి వెళ్లారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం 2.45 గంటల ప్రాంతంలో అంజయ్య భార్య నాగేంద్రమ్మకు ఫోన్ చేసి తాను కేసు భయంతో చనిపోతున్నాను.. నాకు బతకాలని లేదు అని చెప్పి గ్రామంలో సమాధుల వద్ద ఉన్న జీడితోట వద్దకు రమ్మని చెప్పి ఫోన్ పెట్టేశాడు. భార్య అక్కడకు వెళ్లి చూడగా అంజయ్య పురికొస తాడుతో జీడిచెట్టుకు ఉరివేసుకొని వేలాడుతున్నాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ నర్సింగ్(MPHW), ల్యాబ్ టెక్నీషియన్ (MLT), అగ్రికల్చర్‌అసిస్టెంట్, వెటర్నరీఅసిస్టెంట్, జనరల్ నర్సింగ్(GNM), M.S.M కాలేజ్, గోరంట్ల, GNT. 7386706839, 7780494333, 7386406839

REAL ESTATE

FLAT FOR SALE

■ అమరావతిరోడ్ ఆలా హాస్పిటల్ దగ్గర్లో SL గ్రౌండ్ 3వ ఫ్లోర్ 2BHK N/E కార్నర్ ఫ్లాట్ 46.2 చ॥గ॥ కార్ పార్క్, మున్సిపల్ వాటర్ @ 45 ల॥, స్పాట్ Reg. లోన్ సౌకర్యం. 94911 87347

■ తెనాలి సిద్ధార్థ కాలనీలో ఇళ్ల మధ్యలో కాంపౌండ్ వాల్ కట్టినది పడమర ఫేస్ వెంటనే ఇల్లు కట్టుకునే అవకాశం ఉన్న 125 చ॥ గ॥ స్థలం అమ్మబడును. 9849143309, 7780598846.

HOUSE FOR SALE

■ చీరాల కొత్తపేట RTC కాలనీలో 9 సెంట్లు విస్తీర్ణములో కల 2 అంతస్తుల డాబా ఇల్లు సౌత్ (ఈస్ట్‌రోడ్) అమ్మకానికి కలదు. వివరాలకు సం॥ ✆ 99492 18899, 70933 21399

PLOT FOR SALE

■ గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డుకి 3వ బిట్ ఆగతవరప్పాడు గ్రామం (66×40 కొలతలుగల) 288 చ॥గ॥ల తూర్పు ఫేస్ ఖాళీ స్థలం అమ్మకమునకు కలదు. చ॥గ॥ 37,000/- ✆ 94943 96969, 94944 76303

TOLET

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ వారికి 2027 విద్యా సంవత్సరానికి గాను పలకలూరు లేదా పరిసర ప్రాంతాలలో 50,000 నుండి 60,000 చదరపు అడుగుల బిల్డింగ్ నిర్మించి అద్దెకు ఇవ్వదలచిన సొంత స్థలం యజమానులు లేదా బిల్డర్స్ సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 91541 52894.

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

WANTED

■ ప్రముఖ ఇంటి ఆహార వాణిజ్య సంస్థ హాయ్ ఖాలి గుంటూరు, మంగళగిరి నందు డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీ: 16K-18K, ఫ్యూయల్ ఛార్జెస్ అదనం. 9888562228, 9381982818

■ గుంటూరు శ్రీనివాసరావుపేట ITC వద్ద వర్క్ చేయుటకు హౌస్‌కీపింగ్ 9 గం॥-10800/- సెక్యూరిటీగార్డ్స్-15000/- 12 గం॥ డ్యూటీ అ: 10th, PF,ESI కలదు. సంప్ర:91000 97782

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీలో ఉద్యోగ ఖాళీలు: క్యాంపస్ ఇన్‌చార్జీలు లింగం: పురుషులు మాత్రమే. విద్యార్హతలు: డిగ్రీ, వయస్సు: 25 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య ఉండవలెను. నెలకు జీతం : 25000/- వరకు ఇవ్వబడును. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 22246

■ VS గార్మెంట్స్ నందు పని చేయుటకు టైలరింగ్ అనుభవం వున్న స్త్రీలు కావలెను. కొత్తవారికి ట్రైనింగ్ ఇవ్వబడును. 6304912388, 6309351341

■ రాయల్ స్పోర్ట్స్ షాపు నందు హెల్పర్స్ (లేడీస్/జంట్స్) కావలెను. జీతం: 12k-15k వరకు. బాలాజీ స్వీట్స్ ప్రక్కన, లాడ్జి సెంటర్ దగ్గర గుంటూరు. 63031 12438

■ గుంటూరు: ప్రముఖ సంస్థ వారికి MBA అర్హత గల (M) అభ్యర్థులు (జీతం 15K-20K) & డిగ్రీ-బి.టెక్ అర్హత గల లేడీ టెలికాలర్స్ కావలెను. అనుభవమును బట్టి జీతం: 20K-30K వరకు. 9394 66 77 88

■ Wanted teachers for KG to 10th, PET, Academic Incharges (All Subjects) For the year 26-27, For a School in Gnt. 80969 70673

■ గుంటూరు నాజ్‌సెంటర్‌లోని KSP ప్రైమ్ మాల్ నందు పనిచేయుటకు Mall మేనేజర్స్, పార్కింగ్ మేనేజర్, సెక్యూరిటీగార్డ్స్, PRO, DTP ఆపరేటర్, Fire టెక్నీషియన్స్, ఆఫీస్ స్టాఫ్ కావలెను. spgajeyy@gmail.com సంప్ర: వాట్సాప్ 7981800435, 9515423631

■ Yesspay Digital India Pvt Ltd. వారి యస్ పే యాప్ & QR కోడ్స్‌ను మీ సొంత ఏరియాలోని షాపుల్లో ఇన్‌స్టాల్ చేయుటకు మార్కెటింగ్ స్టాఫ్ (M/F) కావలెను. అ: డిగ్రీ (P/F), జీ: 15k- ఆపైన, వ: 18సం॥ ఆపైన E.V స్కూటీ సౌకర్యం కలదు. సంప్ర॥ 9010156001

■ పిడుగురాళ్ళలో ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు మెస్ సూపర్‌వైజర్స్, మెస్ ఇంఛార్జ్‌లు, వంటవారు (కుక్స్) టిఫిన్ మాస్టర్, కర్రీమాస్టర్, రైస్ మాస్టర్ కావలెను. సెల్: 88856 70754

■ కృష్ణసాయి క్లాత్ సోరీస్ నందు పనిచేయుటకు సేల్స్‌మెన్, హెల్పర్స్ స్త్రీలు/పురుషులు కావలెను. మంచి జీతం. ఇంట్రెస్ట్ వారు మాత్రమే సంప్ర॥ నాయర్‌హోటల్‌సెంటర్,లక్ష్మీపురం.9885513844

■ తెనాలిలోని కృష్ణ టెక్సెస్ పొల్టీ నందు క్యాషియర్ కలెక్షన్ చేయుటకు స్టాఫ్ కావలెను. అ: 10th-డిగ్రీ, జీతం: 15-18వేలు, తెనాలి పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత. సంప్ర॥ 9866424243

■ విజయవాడ-గుంటూరు ప్రాంతాలలో పేషెంట్లని, పెద్దవారిని వారి ఇంటివద్దనే ఉండి చూసుకొనుటకు కాంపౌండర్లు, నర్సులు (M/F), RMPలు కేర్ టేకర్స్ కావలెను. Sal: 25K వరకు, వాట్సాప్ / కాల్ ✆ 97018 57559, 98850 25559

■ తాడేపల్లి, కుంచనపల్లి, దేవేంద్రపాడు ఏరియాలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం॥ డ్యూటీ, 15-17 వేలు శాలరీ అర్హత : టెన్త్, 45 సం॥ లోపు వారు ✆ 88014 97437

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీదే పెట్టుకొని పెన్సిల్స్, కొవ్వొత్తులు, తయారు చేసి మాకు ఇవ్వండి. వీక్లీ పేమెంట్. Ph.9640729906

■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ గుంటూరులో పనిచేయుటకు కావలెను Field Executives (Sal: 15K-20K) + Incentives. Ph: 72079 42933

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ఎడిషన్ రూ. 475/- ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే

గుంటూరు 7075167663 7075167541

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులకు కోరుతున్నాము. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయమును గమనించగోరను.

క్లుప్తంగా

చిన్నవయసు నుంచే ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

మంగళగిరి టౌన్: చిన్నారులకు చిన్నవయసు నుంచే ఆధ్యాత్మికత గురించి వివరించాలని పలువురు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పరిశుద్ధ సెయింట్ పాల్ లూథరన్ టౌన్ చర్చిలో ఐదు రోజులుగా జరుగుతున్న సీబీసీ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణల్లో ఉత్సాహంతో వారు నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. అనంతరం తరగతులకు హాజరైన చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్లను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కంభం వర ప్రసాద్, నామా నవీన్, మువ్వంపూడి దయారత్నం, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను తక్షణమే పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శుక్రవారంతో 514వ రోజుకు చేరుకున్నాయి. మేడే సందర్భంగా యూనియన్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. నారా లోకేష్ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గురవయ్య, సుభాని, సాంబశివరావు, శారమ్మ, సూర్యప్రకాశ్, నాగేశ్వరరావు, సువర్ణకుమారి, నవనీతమ్మ, అన్నమ్మ, ఆరోగ్యం, ఇజ్రాయిల్, హగ్గయ్య, ఇమానుయేల్, రమాదేవి, విజయశ్రీ, రమణమ్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

మంగళగిరి టౌన్: మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం వద్ద శుక్రవారం భక్తులకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సేవాభక్తబృందం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. స్వామివారి దేవస్థానంలో నరసింహస్వామి జయంతి, వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో భక్తబృందం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తబృందం ప్రతినిధులు హనుమంతరావు, విజయ్‌కుమార్, బాలకృష్ణ, సురేష్, రాంప్రసాద్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణితంలో శిక్షణ

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గణితంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలోత్సవం కోశాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గణితంలో మెళకువలను లెనిన్‌బాబు నేర్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.మనోహర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి పేద విద్యార్థుల దత్తత

తాడికొండ: తాడికొండలో ప్రతిభ కలిగిన ఇద్దరు పేద విద్యార్థులను కోటిరెడ్డి ట్రస్టు చైర్మన్ ఏరువ సాయిరాం దత్తత తీసుకున్నారు. 2026–27 ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివిన పేరుబోయిన తేజ 556/600 మార్కులు సాధించగా రెడ్డి స్నేహలత 535/600 మార్కులు సాధించి సత్తా చాటారు. పేద కుటుంబానికి చెందిన వీరి కుటుంబ నేపథ్యం రైతులు, రైతు కూలీలే. వీరిద్దరికీ రానున్న 5 సంవత్సరాల పాటు కోటిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా ఏటా ఉపకార వేతనాలు అందజేస్తున్నారు. అలానే ఎస్వీవీ హైస్కూల్ ఉన్నత పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు మద్దుకూరి చంద్రశేఖర్ సహకారంతో పాఠశాలలో ఏటా పలువురు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు సహకారం అందించిన ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

చెక్కుల పంపిణీ

మంగళగిరి టౌన్: పెదవడ్లపూడి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీ చెక్కులను శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. స్థానికులు సుజాతకు రూ.35,278లు, ప్రసాద్‌కు రూ.21,000లు, హైమావతికి రూ.23,920లు, వెంకటేశ్వరమ్మకు రూ.23,986ల చెక్కులను వారి నివాసాలకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కిరణ్‌కుమార్ తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ర్యాంకుల్లో ప్రథమం.. నియంత్రణలో విఫలం!

నిషేధిత ప్లాస్టిక్ కవర్లలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పూలు

ప్లాస్టిక్ కవర్లలో కూరగాయలు తీసుకువెళుతున్న కొనుగోలుదారులు

- దాడులు చేస్తున్నా ఆగని ప్లాస్టిక్ వినియోగం
- అధికారుల చర్యలు నిష్ఫలం

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ర్యాంకులపై పెట్టే శ్రద్ధ ప్లాస్టిక్‌ను నియంత్రించడంలో విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో అధికారులు దాడులు చేస్తున్నప్పటికీ ప్లాస్టిక్ వినియోగం ఆగడంలేదు. నామమాత్రంగా అధికారులు దాడులు చేసి చేతులు దులుపుకోవడంతో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణలో నగరపాలక సంస్థ విఫలమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి అవసరమైన తక్కువ ధర ప్రత్యామ్నాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల ప్లాస్టిక్ వాడకం పెరుగుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే ప్రమాదాల గురించి నగరపాలక సంస్థ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ వినియోగం మాత్రం ఆగడంలేదు. కూరగాయలు, పండ్లు కొనేందుకు వెళ్లినా.. బయట ఏమి కొనుగోలు చేసినా ఏదో ఒక ప్లాస్టిక్ కవర్‌తోనే ఇంటికి చేరుకుంటున్నారు. చిన్నపాటి అశ్రద్ధ కారణంగా రోజూ పదుల సంఖ్యలో క్యారీబ్యాగ్‌లు వాడుతూ అటు పర్యావరణం, ఇటు మానవ ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నారు. ఫలితంగా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతూ పర్యావరణ ముప్పుగా పరిణమిస్తున్నాయి.

ప్రచారమే తప్పా.. ఆచరణ ఏదీ..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించినా దాన్ని అమలు చేయడంలో విఫలమవుతున్నారు. అధికారులు, కూటమి నాయకులు కలసి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అంటూ ర్యాలీల ద్వారా చేస్తున్న ప్రచారాలు ఆర్భాటానికే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలంటూ ప్రచారం చేయడంతో పాటు హోటళ్లు, దుకాణదారులకు ఎంటీఎంసీ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. వాడకాన్ని నిషేధించాలంటూ దుకాణదారులకు సమయం ఇచ్చి నెలలు గడిచాయే తప్పా ఆచరణలో అధికారులు అలసత్వం వహించారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

యథేచ్ఛగా వాడకాలు..

పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయం, వాడకం యథేచ్ఛగా జరుగుతోంది. నిషేధిత నిబంధనలు ఎక్కడా అమలు కావడంలేదు. స్థానిక డీలర్లు నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను ఇతర ప్రాంతాల నుంచి అక్రమ మార్గాలలో టన్నుల కొద్దీ దిగుమతి చేసుకుని వ్యాపారులకు గుట్టుగా విక్రయిస్తున్నారు. ఫలితంగా రోడ్డుపక్కన చిరు వ్యాపారుల దగ్గర నుంచి ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం కనిపిస్తోంది. అవన్నీ 120 మైక్రాన్‌లలోపు మందం గల నిషేధిత ఉత్పత్తులే. కార్యమేదైనా ప్లాస్టిక్ పేపర్, గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, స్ట్రాలు వంటి వాటిని విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో ఆయా వ్యర్థాలు నగరంలోని మురుగు కాలువల్లో పేరుకుపోతున్నాయి.

చెరుకురసం బండి వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ బాటిళ్లు

ప్లాస్టిక్ బాటిల్స్ విక్రయాలు..

తక్కువ క్వాలిటీ ఉన్న ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను ఎక్కడపడితే అక్కడ విక్రయిస్తున్నారు. చెరుకు రసం, కొబ్బరి నీళ్లు తదితర శీతల పానీయాలు ఆ బాటిళ్లలో నింపి అమ్ముతున్నారు. క్వాలిటీ తక్కువ ఉన్న వాటర్ బాటిళ్లలో శీతల పానీయాలు తాగితే జబ్బులు తథ్యమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏ శీతల పానీయ దుకాణాల వద్ద ప్లాస్టిక్ బాటిళ్లు దర్శనమిస్తున్నా అధికారుల కంటపడకపోవడం శోచనీయం.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

మేడే వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మాట్లాడుతున్న పాశం రామారావు

మంగళగిరి టౌన్: కార్మిక వర్గానికి నష్టం కలిగించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలో శుక్రవారం మేడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. యూనియన్ పెట్టుకునే అవకాశం లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ముజాఫర్ అహ్మద్ మాట్లాడుతూ.. సెక్యూరిటీ సిబ్బంది 12 గంటలు పనిచేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించడం లేదని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కె.రమేష్‌బాబు, గౌరవ అధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బుజ్జిబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుచేసేంత వరకు పోరాటం..

మంగళగిరి టౌన్: కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ రద్దు చేసేంత వరకు కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం మేడే సందర్భంగా సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో పతాకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ఎర్ర జెండా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో ఉందని తెలిపారు. రాష్ట్రంలో 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తానని జీవో తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జేవీ రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, పిల్లలమర్రి బాలకృష్ణ, వీవీ జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

పనిగంటల భారంపై ఐక్యంగా పోరాడాలి

మేడే వేడుకల్లో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వెంకటరెడ్డి

మజ్జిగ పంపిణీ చేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు ఐక్యంగా పోరాడాలని పలువురు సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడ, వడ్డేశ్వరం, ప్రాతూరు, కుంచనపల్లి గ్రామాల్లో సీఐటీయూ నాయకులు మేడేను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండాలను నాయకులు గుడివాడ సామ్యవాదం, సీపీఎం జెండాలను దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. సీపీఎం గ్రామ నాయకులు పిడికిడి నారాయణమూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పని గంటల భారానికి వ్యతిరేకంగా కార్మికుల బలిదానంతో ఎర్రజెండా ఉద్భవించిందని అన్నారు. సీఐటీయూ నాయకులు పల్లె కృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 12 గంటలు పని విధానాన్ని అమలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు నాగపోగు విజయరాజు, బత్తుల సంసోను, మేకల మహేశ్వరరావు, చిన్న, రామకోటి, సాంబశివరావు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

నులకపేటలో..

మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నులకపేటలో ఆటో యూనియన్ కార్యాలయం వద్ద శుక్రవారం మేడే వేడుకలను నిర్వహించారు. యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడ కేఆర్ మార్కెట్, తాడేపల్లిలోని డాల్డా కంపెనీ, మంగళగిరి కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు షేక్ శ్రీను కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. యూనియన్ కార్యదర్శి సైదులు మాట్లాడుతూ.. పలు ధరలు పెరగడం వల్ల ఆటో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి షేక్ ఖాసిం, నాయకులు శ్రీనివాసరావు, వినయ్, బాలు, కృష్ణ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతోనే హక్కుల సాధన

ఆత్మకూరులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఫిరంగిపురంలో జెండాను ఎగురవేస్తున్న కార్మికులు

మంగళగిరి టౌన్: కార్మికుల హక్కుల పరిరక్షణ ఐక్యపోరాటాలతోనే సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఎయిమ్స్ మెయిన్ గేటు, పట్టణంలోని పార్టీ కార్యాలయం, ఇందిరా నగర్ తదితర ప్రాంతాల్లో జెండాలను ఆవిష్కరించారు. మేడే చరిత్ర కార్మికుల హక్కుల సాధనలో విశేష ప్రాధాన్యత కలిగి ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, చిన్ని సత్యనారాయణ, నరసయ్య, బ్రహ్మేశ్వరరావు, మరియదాసు, జాలాది జాన్‌బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు, ఫిరంగిపురం గ్రామాల్లో మేడే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు. సీఐటీయూ నాయకులు, కార్మికులు మాట్లాడుతూ.. 8 గంటల పనికోసం కార్మికులు 140 ఏళ్ల కిందట అనేక పోరాటాలు చేశారని వివరించారు. వారి త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్నామని అన్నారు. ఆనాడు జరిగిన పోరాటాల్లో కార్మికులపై కాల్పులు కూడా జరిపారని.. రక్తంతో తడిసిన బట్టలను ఆనాడు ఎర్రజెండాలుగా ఎగురవేసారని చెప్పారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తిరిగి 12 గంటల పని విధానం అమలు చేస్తున్నాయని.. కార్మికులకు నష్టం కలుగజేసే 4 లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చి వాటిని అమలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎన్.శ్రవాణ్‌కుమార్, గ్రామ కమిటీల నాయకులు సీహెచ్.శ్రీనివాసరావు, మార్పుల వెంగళరెడ్డి, లలితకుమారి, జి.వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, బాలశౌరి, కె.కోటేశ్వరరావు, మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, కార్మికులు పాల్గొన్నారు.

‘భూ సమీకరణలో మాయాజాలం’ కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

తాడికొండ: సాక్షి దినపత్రికలో ‘ముఖ్యనేత సన్నిహితులకు లే అవుట్‌లకు రైట్ రైట్..’ ‘పూలింగ్.. పక్కా ప్లానింగ్!’ ‘రాజధాని రెండో విడత భూసమీకరణలో మాయాజాలం’ శీర్షికలతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి సీఆర్డీఏ వివరణ ఇచ్చింది. కథనంలో ప్రస్తావించిన లేఅవుట్లు అయిన 1168/0032/ఎల్‌పీ/టీహెచ్‌ఎల్‌ఆర్/2024–1168/0165/ఎల్‌పీ/టీహెచ్‌ఎల్‌ఆర్/2025 సంబంధించి ఈ లేఅవుట్ దరఖాస్తులు భూ సమీకరణ నోటిఫికేషన్ విడుదలకు ముందుగానే నిర్దేశిత మొత్తంలో లేఅవుట్ ఫీజులు చెల్లించిన అనంతరం 2024 ఫిబ్రవరి 6.. 2025 మే 14 తేదీల్లో సీఆర్డీఏ దాఖలుపరిచిందని ఏపీ సీఆర్డీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వార్తలో పేర్కొన్న గ్రామంలో భూ సమీకరణ(ల్యాండ్ పూలింగ్) కార్యకలాపాలు ప్రారంభమైన నేపథ్యంలో.. ఆ గ్రామానికి సంబంధించిన అభివృద్ధి దరఖాస్తుల స్వీకరణ ప్రస్తుతం నిలిపివేసినట్లు వివరించారు. ఆయా ప్రాంతాలకు సంబంధించి ఎటువంటి కొత్త దరఖాస్తులను ఏపీ సీఆర్డీఏ అనుమతించలేదని.. అలానే అనుమతించదని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలకు ఏపీ సీఆర్డీఏ అధికారిక ప్రకటనలనే ఆధారంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమతుల్య ఎరువుల వాడకంపై అవగాహన

తాడికొండ: సమతుల్య ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా కేవీకే పనిచేస్తుందని లాం కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త (అగ్రానమీ) డాక్టర్ ఎం.గంగాదేవి అన్నారు. శుక్రవారం తాడికొండలో ఆమె రైతులకు ఎరువుల సమతుల్య వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సరైన నిర్వహణ, భూ సారాన్ని పెంచే పద్ధతులు, వాతావరణ మార్పులకు అనుగుణమైన సాగు విధానాలపై విశదీకరించారు. అధిక మోతాదులో ఎరువులు వాడడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే వేడుకలు

పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దుగ్గిరాలలో జెండాను ఆవిష్కరిస్తున్న బాలరాజు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన మేడే వేడుకల్లో నాయకులు మానికొండ డాంగే జెండాను ఆవిష్కరించారు. నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య జెండాను ఆవిష్కరించారు. గేటు సెంటర్లో శీలం శ్యామ్ ప్రసాద్, ప్రకాష్‌నగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అన్నవరపు ప్రభాకర్‌లు జెండాలను ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం అన్ని కార్మిక సంఘాలు ఏకమై పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు గుద్దంటి శివ, షేక్ బాషా, ప్రసాద్, గౌరి, లక్ష్మి తిరుపతమ్మ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఉండవల్లి సెంటర్‌లో అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని పురస్కరించుకుని మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. పలు మేడే కార్యక్రమాల్లో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, బక్కిరెడ్డి, ఇమ్మానియేలు, వెంకటేశ్వరరావు, ఈమని రామారావు, రామకృష్ణ, సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు కుంభ ఆంజనేయులు, ఆర్వీ రాఘవయ్య, జానీ, చెంచయ్య, మస్తాన్‌రావు, ఎర్రపీరు, బాబూరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా దుగ్గిరాల, చిలువూరు, రేవేంద్రపాడు, తుమ్మపూడి, ఈమని గ్రామాల్లో సీఐటీయూ, సీపీఎం నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించి వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, బి.చిరంజీవి, మురళి, జి.యోహాను, కె.జైపాల్, ఎన్.రవి, పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి పనులు ప్రారంభం

తాడికొండ: రాజధానిలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్–రీసెర్చి ఇనిస్టిట్యూట్ నూతన భవన నిర్మాణ పనులను శుక్రవారం హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం బాలకృష్ణ స్వయంగా ప్రొక్లెయిన్ నడిపి మట్టిని తవ్వి టిప్పర్‌లోకి ఎత్తి పోశారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. తన తల్లి నందమూరి బసవతారకం పేరుతో నిర్మితమవుతున్న ఈ నూతన హాస్పిటల్‌ను రెండు దశల్లో నిర్మిస్తామని తెలిపారు. మొదటి దశలో సుమారు రూ.700 కోట్ల వ్యయంతో 500 పడకల హాస్పిటల్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో బీఐఏసీహెచ్ జెయస్ ట్రస్టుబోర్డు సభ్యులు ఆర్.ప్రసాద్, బీఐఏసీహెచ్–సీవోవో రావి శ్రీనివాసరావు, బీఐఏసీహెచ్–ఆర్ఐ ఎ.బాలసుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రాజెక్ట్ మేనేజర్, అమరావతి, బీఐఏసీహెచ్–ఆర్ఐ, కనకదుర్గ దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ(గాంధీ), విజయవాడ, తుళ్లూరుకు చెందిన పలువురు స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సినీ హీరో నందమూరి బాలకృష్ణ

కార్మికులకు అండగా ఎర్రజెండా

తాడికొండ పంచాయతీ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితి సభ్యులు నాగేశ్వరరావు

తాడికొండ: కార్మికులకు అండ.. ఎర్రజెండా.. అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మేడేను పురస్కరించుకుని తాడికొండ అడ్డరోడ్డు సెంటర్‌లో శుక్రవారం ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మేడే జెండాను నాగేశ్వరరావు ఆవిష్కరించి మాట్లాడారు. పెట్టుబడిదారులు శ్రామికుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. అలానే కార్మికుల ఆధ్వర్యంలో పొన్నెకల్లు సీపీఐ కార్యాలయం, ఉర్దూ స్కూలు, పంచాయతీ కార్యాలయం, తాడికొండ వ్యవసాయ మార్కెట్ సెంటర్‌లో జెండాలను ఆవిష్కరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తాడికొండ పంచాయతీ, అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు జెండా ఆవిష్కరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా నాయకులు పచ్చల సాంబశివరావు, తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు జీవీ రాజు, రేపూడి శ్రీనివాసరావు, గుర్రంకొండ సత్యానందం, నూతక్కి రాము, చింతల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టాలను ప్రభుత్వం గుర్తించాలి

మేడికొండూరు: మండలంలోని మేడికొండూరు, పేరేచర్ల ప్రాంతాల్లో శుక్రవారం మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని.. 8 గంటల పని విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోట్ల రామకృష్ణ మాట్లాడుతూ.. కార్మికుల కష్టసుఖాలు పంచుకునే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల కష్టాలను గుర్తించాలని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని.. వారి హక్కులను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎం బాషా, సాదిక్, పంచాయతీ వర్కర్స్ ఎన్ వెంకటేశ్వర్లు, రమేష్, బెన్నీ జి, ఆశా వర్కర్స్ సుజాత, తాన్య, భవన నిర్మాణ కార్మికులు జానీ, షీలార్, పేరేచర్ల నికో పరిశ్రమ కార్మికులు వెంకటేష్, రహంతుల్లా, మీరాస, సీతాపతి తదితరులు పాల్గొన్నారు. అలానే పేరేచర్ల సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆటో కార్మికులు రాజు, జానీ, కె.ప్రసాద్, రవికుమార్, డి.వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

జనగణన దేశాభివృద్ధికి కీలకం

మంగళగిరి టౌన్: జనగణన–2027 దేశాభివృద్ధిలో కీలకమని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలో రెండు దశల్లో జరిగే జనగణన ప్రక్రియలో భాగంగా శుక్రవారం తొలిదశను ఆయన ప్రారంభించారు. ఎన్యూమినేటర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికి వెళ్లి గృహాల నిర్మాణ విధానం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కుటుంబ సభ్యుల సంఖ్య తదితర ప్రాథమిక వివరాలను తొలిదశలో సేకరించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. తమ ఇంటికి వచ్చే సిబ్బందికి సరైన సమాచారం అందించి ప్రజలు సహకరించాలని కోరారు. రెండో దశలో జనాభా లెక్కల సేకరణ చేపడతామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నెలరోజుల పాటు కొనసాగనున్నదని.. కార్పొరేషన్ పరిధిలో 539 ఎన్యూమినేటర్లు, 57 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ తదితర ఎంటీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

● 'హి'..స్టోరీ

చీరకు జెండర్ లేదు!

నారీ వార్డ్‌రోబ్ లిస్ట్‌లో ఉండే ఎవర్‌గ్రీన్ డ్రెస్.. శారీ. ఇప్పుడిక మగవారి అలంకరణలోనూ ప్రత్యేకంగా నిలుస్తోంది. సంప్రదాయ దుస్తులలో ఈ కళ కొత్తగా మెరిసిపోతోంది. ధోతీగా మారి దావత్‌లలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అవుతోంది. జెండర్ పరిమితులు లేని ఈ స్టైల్‌కి జనాల నుంచి కితాబులూ అందుకోవచ్చు.

ఆరు గజాల చీర ఆడవారి ఆహార్యానికే కాదు, మగవారి రాజసానికి కూడా అలంకరణగా మారింది. యూనీసెక్స్ డిజైన్స్‌లో మేటిగా నిలిచింది. సంప్రదాయ వేడుకలలో స్టైలిష్‌గా నిలుస్తోంది. పట్టు, కాటన్, ఆర్గంజా., శారీస్ లేదా దుపట్టాలతో షర్ట్, ఓవర్ కోట్లను డిజైన్ చేయవచ్చు.. బ్లేజర్ కోసం చీర పల్లూను వాడచ్చు. డిజైన్ బట్టి ఒకే చీరను కుర్తా, పైజామా సెట్‌గా మార్చుకోవచ్చు. ఇందుకు దళసరిగా ఉండే పట్టు, కాటన్ శారీస్‌లో అందమైన డిజైన్స్ ఉన్నవి ఎంచుకోవాలి. చీర కొంగును షర్ట్ కాలర్, కఫ్స్, పాకెట్స్ డిజైన్ చేయడానికి ఉపయోగించవచ్చు. అంతగా ఉపయోగించని, మంచి డిజైన్ ఉన్న శారీస్‌తోనూ మెన్ అండ్ ఉమెన్ సంప్రదాయ దుస్తులను రూపొందించవచ్చు.

బెనారస్ చీరతో ధోతీ

ఇటీవలి నా వివాహానికి రెడీమేడ్‌గా ఉండే కుర్తా పైజామా, ధోతీ డ్రెస్సులను షాపుల్లోనూ, బొటిక్‌లలోనూ చూశాను. ఏదైనా స్పెషల్‌గా డిజైన్ చేయించుకుంటే బాగుంటుంది కదా అని ఆలోచించాను. పెళ్లికి మా అమ్మ కొన్న చీరలను చూసినప్పుడు బ్లూ బెనారస్ శారీ భలే ఆకర్షణీయంగా అనిపించింది. ఆ చీరతో ఏమైనా స్పెషల్ చేయవచ్చా... అని ఆలోచించాను. ఆన్‌లైన్‌లో కనిపించే సంప్రదాయ దుస్తుల డిజైన్స్ చూశాను. టైలర్‌ని కలిసి, నా ఆలోచనను చెప్పాను. ధోతీ, కండువా చేయడానికి టైలర్ ఒప్పుకున్నారు. అలా చీర మిడిల్ పార్ట్‌తో ధోతీ చేయించాను. పల్లూ, బార్డర్ వంటివి ఉపయోగించి దుపట్టా డిజైన్ చేయించాను. కుర్తా కోసం కాంబినేషన్ క్లాత్ కోసం వెతికితే ఆ కలర్ మార్కెట్లో దొరకలేదు. దీంతో వైట్ క్లాత్ తీసుకొని, లైట్ షేడ్ వచ్చేలా డై చేయించాను. ఆ క్లాత్‌తో కుర్తా పూర్తయ్యింది. ఈ సెట్‌కి లైనింగ్ వేయించడం వల్ల డ్రెస్‌కి మంచి ఫాలింగ్ వచ్చింది. సాధారణంగా పెళ్లికి మెన్ ట్రెడిషనల్ వేర్‌కి 50 వేల రూపాయల నుంచి బడ్జెట్ అవుతుందని చెప్పారు. నేను ఇలా డిజైన్ చేయించుకోవడం వల్ల పాతిక వేల రూపాయలలో డ్రెస్ పూర్తయ్యింది. పెళ్లిలో ఈ యునిక్ డిజైన్ గురించి చాలా మంది అడిగారు.

- కృష్ణ సందీప్

కట్టులో ఎన్నో వైవిధ్యాలు

ఈ రోజులను గమనిస్తే 40 ఏళ్ల లోపు మెన్ అండ్ ఉమెన్ వేర్, యాక్సరీస్ చాలా వరకు ఒకే మోడల్స్‌లో ఉంటున్నాయి. హారమ్ ప్యాంట్స్/ ధోతీ అమ్మాయిలు ఉపయోగిస్తున్నారు, అబ్బాయిలు కూడా వాడుతున్నారు. వీటిమీదకు ఇద్దరూ టీ షర్ట్స్, షార్ట్ కుర్తీలూ, షర్ట్స్ వేసుకుంటున్నారు.

● బ్లేజర్స్, టీ షర్ట్స్, ధోతీ, టులిప్ ప్యాంట్స్... ఇలా జెండర్ లేకుండా యూనీసెక్స్ డిజైన్ మంచి ట్రెండింగ్‌లో ఉంది. ఇది డ్రెస్సులకే కాదు కళ్లద్దాలు, వాచీ, ఫుట్‌వేర్ విషయంలో కూడా ఇద్దరి డిజైన్స్ ఒకేలా ఉంటున్నాయి. ● చీరలను కట్ చేసి, కుట్టడం అనే ఆలోచన కూడా దూరమై చీరలనే ధోతీలుగా, లుంగీలుగా కట్టుకుంటున్నారు. ఇందుకు కాటన్, ప్రింటెడ్, సిల్క్... ఇలా ఏ శారీ అయినా ధోతీలాగా మార్చుకుంటున్నారు. ఇలా సంప్రదాయ వేడుకలు, పండుగలలో ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. వీటి మీదకు షార్ట్, లాంగ్ కుర్తీలు, బ్లేజర్లు వేసుకోవచ్చు. ● సాధారణంగా ఆడవాళ్లు నాలుగుసార్లు కట్టాక ఆ చీరను మళ్లీ కొన్నాళ్ల పాటు కట్టరు. అలాగని, ఆ చీరను కట్ చేసి, కుట్టడం అనే దానిని ఆడవాళ్లు ఇష్టపడరు. అందుకని, చీరను ధోతీ, ప్యాంట్‌లాగా విభిన్న పద్ధతులలో కట్టుకుంటున్నారు. చీరను ధోతీలాగా ఎలా కట్టుకోవచ్చో సోషల్‌మీడియాలో చూసి, తెలుసుకోవచ్చు. దీనికి నడుము భాగంలో బెల్ట్ సెట్ చేసుకుంటే సేఫ్టీ ఉంటుంది.

మంగారెడ్డి
ఫ్యాషన్ డిజైనర్

- నిర్మలారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

పరాగ్... పడిలేచిన కెరటం

ముప్పై ఏడు సంవత్సరాల వయసులోనే ట్విటర్ సీయీవోగా 'వావ్' అనిపించుకున్నాడు పరాగ్ అగర్వాల్. ఎలాన్ మస్క్ ట్విటర్‌ను సొంతం చేసుకోవడంతో అవమానకర రీతిలో సంస్థ నుంచి బయటికి వచ్చిన తరువాత 'అయ్యో!' అనిపించుకున్నాడు. అయితే అగర్వాల్ 'ఆహా' 'అయ్యో'లకు అతీతుడు. 'ది బెస్ట్ రివెంజ్ ఈజ్ మాసివ్ సక్సెస్' అని నమ్మినవాడు. తన ఏఐ స్టార్టప్ 'ప్యారలల్ వెబ్ సిస్టమ్స్'తో మరోసారి 'వావ్' అనిపించుకున్నాడు పరాగ్ అగర్వాల్. 19 వేల కోట్ల కంపెనీగా 'ప్యారలల్ వెబ్ సిస్టమ్స్'ను తీర్చిదిద్దాడు...

రాజస్థాన్‌లోని అజ్మీర్ పరాగ్ అగర్వాల్ జన్మస్థలం. ముంబైలోని అటోమిక్ ఎనర్జీ జూనియర్ కాలేజీలో చదువుకునే రోజుల్లో తొలిసారిగా అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్నాడు. టర్కీలో జరిగిన 'ఇంటర్నేషనల్ ఫిజిక్స్ ఒలింపియాడ్'లో బంగారు పతకం గెలుచుకున్నాడు. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ చేసిన అగర్వాల్ పీహెచ్‌డీ కోసం యూఎస్‌కు వెళ్లాడు. ట్విటర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరడానికి ముందు మైక్రోసాఫ్ట్ రీసెర్చ్, యాహూ రీసెర్చ్‌లలో ఇంటర్న్‌షిప్‌లు చేశాడు.

అతడి టైమ్ అలా మొదలైంది...

'నా టైమ్ మొదలైంది' అనుకునే టైమ్ అగర్వాల్‌కు 2017లో వచ్చింది. అగర్వాల్‌ను చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా నియమిస్తున్నట్లు ట్విటర్ ప్రకటించింది. లోప్రొఫైల్‌లో ఉండడం వల్ల కావచ్చు, అగర్వాల్ గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. సీయీవోగా అతడి నియామకం చాలా మందిని ఆశ్చర్యపరిచింది.

ట్విటర్‌లో ఎన్నో వ్యూహాత్మక కార్యక్రమాలలో అగర్వాల్ కీలక పాత్ర పోషించిన విషయం చాలామందికి తెలియదు. అలాగని సీయీవోగా అగర్వాల్ నియామకం రాత్రికి రాత్రి జరగలేదు. 2021లో జాక్ డోర్సీ స్థానంలో ట్విటర్ సీయీవో పదవిలోకి వచ్చాడు అగర్వాల్. తగిన సీయీవో కోసం చాలా ప్రయత్నాలు చేసి విఫలమైన తరువాత 'సీయీవో పోస్ట్‌కు అగర్వాల్ సరియైనవాడు' అని బోర్డ్ నిర్ణయించింది. 'ట్విటర్ కంపెనీని, దాని అవసరాలను అగర్వాల్ ఎంతగా అర్థం చేసుకున్నారనేది మాటలకు అందనిది' అని డోర్సీ ట్వీట్ చేశాడు.

ఎన్నో అడ్డంకులు, ఎన్నో సవాళ్లు....

'తక్కువమంది ఉద్యోగులు ఉన్న రోజుల్లో కంపెనీలో చేరాను. ఒడిదుడుకులను, సవాళ్లను, అడ్డంకులను ఎదుర్కొన్నాను. విజయాలు అందుకున్నాను. అన్నిటికంటే ముఖ్యంగా నేను అడుగడుగునా ట్విటర్ అద్భుత ప్రభావాన్ని, నిరంతర పురోగతిని చూశాను. ఇప్పుడు మన ముందు ఉన్న ఉత్తేజకరమైన అవకాశాలను చూస్తున్నాను' అన్నాడు ట్విటర్ సీయీవోగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంలో అగర్వాల్.

బ్యాడ్ టైమ్ అలా మొదలైంది...

ట్విటర్ కంపెనీని 'టెస్లా' చీఫ్ ఎలాన్ మస్క్ సొంతం చేసుకోవడంతో అగర్వాల్ కెరీర్‌లో ట్విస్ట్ మొదలైంది. సీయీవో పదవి నుంచి అగర్వాల్‌ను తొలగిస్తారనే ఊహాగానాలు నిజం కావడానికి ఎంతో కాలం పట్టలేదు.

సీయీవో సీట్‌లో కూర్చున్న తొలిరోజు ఉద్యోగులను ఉద్దేశించి....

'మన ముందు ఉన్న ఉత్తేజకరమైన అవకాశాలను చూస్తున్నాను' అన్నాడు అగర్వాల్.

ఉత్తేజకరమైన అవకాశాలేమి టోగానీ, ఎలాన్ మస్క్ ట్విటర్‌ను సొంతం చేసుకున్న తరువాత అగర్వాల్‌తో పాటు, ఉద్యోగులకు అవమానాలు ఎదురయ్యాయి. 'మన భవిష్యత్ ఏమిటి?' అనే భయం మొదలైంది. కంపెనీలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులను అవమానకర రీతిలో మస్క్ బయటికి పంపించినట్లు వార్తలు వచ్చాయి.

తిరుగులేని విజయం

'అవమానకర రీతిలో అగర్వాల్‌కు ఉద్వాసన పలికారు' అనే వార్త అగర్వాల్‌పై సానుభూతి కలిగించింది. ఆ సమయంలో అగర్వాల్ మానసిక పరిస్థితి ఏమిటో తెలియదు. తెలియకపోయినా ఒక విషయం మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు... ఎప్పుడూ అధైర్యపడి ఉండడు అని! 'మళ్లీ నన్ను నేను నిరూపించుకుంటాను' అని గట్టిగా అనుకొని ఉంటాడు. 2023లో 'ప్యారలల్ వెబ్‌సిస్టమ్స్' అనే ఏఐ స్టార్టప్‌ను ప్రారంభించాడు. తిరుగులేని విజయాన్ని సాధించాడు. ఇప్పుడు ఈ కంపెనీ విలువ సుమారుగా 19 వేల కోట్లు!

ప్యారలల్‌లో...

ఏఐ ఏజెంట్ల కోసం మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది పరాగ్ అగర్వాల్ నేతృత్వంలోని ప్యారలల్ వెబ్‌సిస్టమ్స్. లీగల్ రిసెర్చ్ నుంచి ఫైనాన్షియల్ ఎనాలసిస్ వరకు దేనినైనా నిర్వహించగలదు. ముందుగా శిక్షణ పొందిన డేటాపై ఆధారపడకుండా, లైవ్ వెబ్‌లో ఏఐ ఏజెంట్లు యాక్టివ్‌గా శోధించడానికి, సమాచారాన్ని సంగ్రహించడానికి(ఎక్స్‌ట్రాక్ట్), సంక్లిష్టమైన వర్క్‌ఫ్లోలను ఎగ్జిక్యూట్ చేయడానికి అనుమతించే సాధనాలను 'ప్యారలల్' నిర్మిస్తోంది. లోతైన పరిశోధన నుంచి వర్క్ ఫ్లో ఆటోమేషన్ వరకు అన్నింటినీ కవర్ చేస్తోంది.

సినిమా

● వెంకట సతీష్, సుకుమార్, బుచ్చిబాబు, రత్నవేలు

పెద్దిలాంటి సినిమా రాలేదు - సుకుమార్

''బుచ్చిబాబు తీసిన 'ఉప్పెన' సినిమా క్లైమాక్స్ చూసినప్పుడు తను ఎలాంటి సినిమా అయినా చేయగలడు అనిపించింది. 'పెద్ది' సినిమా కోసం బుచ్చిబాబు కమర్షియల్, ఎమోషనల్ అంశాలను అద్భుతంగా బ్యాలెన్స్ చేసి, స్క్రిప్ట్ రాశాడు. ఈ మధ్యకాలంలో 'పెద్ది'లాంటి చిత్రం రాలేదు'' అని ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ చెప్పారు. రామ్‌చరణ్, జాన్వీకపూర్ జంటగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహించిన సినిమా 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో 'పెద్ది'ని జూన్ 4న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు మేకర్స్. ఈ మీడియా మీట్‌లో సుకుమార్ మాట్లాడుతూ– ''పెద్ది'లో రామ్ చరణ్ నటన 'రంగస్థలం' సినిమాను దాటి నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. బుచ్చిబాబు, సతీష్‌లకు అవకాశం కల్పించడంతో పాటు 'పెద్ది'లో నన్ను భాగం చేసిన చరణ్‌కు ధన్యవాదాలు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మా మూవీ రిలీజ్ అవుతుంది. హిందీలో జియో సంస్థ విడుదల చేస్తోంది'' అని తెలిపారు. ''పెద్ది' సినిమాను మీ హృదయాల నుంచి తీసేయడం సులభం కాదు'' అన్నారు బుచ్చిబాబు. ''ప్రేక్షకులందరికీ గుర్తుండిపోయే సినిమా ఇది'' అన్నారు నిర్మాత వెంకట సతీష్ కిలారు. ''బుచ్చిబాబుగారి స్క్రిప్ట్, స్క్రీన్ ప్లే, మ్యూజిక్ అన్నీ బాగా కుదిరాయి'' అని తెలిపారు రత్నవేలు.

హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్యా రెడ్డిల వివాహం బుధవారం రాత్రి తిరుపతిలో జరిగిన సంగతి తెలిసిందే. శుక్రవారం హైదరాబాద్‌లో వీరి వెడ్డింగ్ రిసెప్షన్ జరిగింది. చిరంజీవి, నాగార్జున, మోహన్ బాబు, నాగచైతన్య, శ్రీకాంత్, జయసుధ, 'దిల్' రాజు, శిరీష్, గోపీచంద్, అల్లరి నరేశ్, సాహు గారపాటి, అభిషేక్ అగర్వాల్, కాజల్ అగర్వాల్ తదితర సినీ ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు కూడా పాల్గొన్నారు.

● అయాన్, అహల్య బమ్రూ

జూన్‌లో సింగ్ గీతం

మూకీ చిత్రం 'పుష్పక్', టాకీ సినిమాలు 'విచిత్ర సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్', 'ఆదిత్య 369' వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలోని తాజా సినిమాకు 'సింగ్ గీతం' అనే టైటిల్ ఖరారైంది. 94 సంవత్సరాల వయసులో ఆయన దర్శకత్వం వహిస్తున్న ఈ మ్యూజికల్ ఫాంటసీ సినిమాలో అయాన్, అహల్య బమ్రూ, షాలిని కొండేపూడి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పతాకంపై నాగ్ అశ్విన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసి, ఈ సినిమాను జూన్ 11న రిలీజ్ చేయనున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. 'కుబేరపురం... అసలు ఎందుకు వదిలేసి వెళ్లిపోయాడు అంకుల్ మా నాన్న ఈ ఊరిని... రాజా ట్రీట్‌మెంట్ ఇక్కడ..., మనకు ఒక ఫారిన్ డీల్ ఓకే అయ్యింది' అనే డైలాగ్స్ ఈ సినిమా టీజర్‌లో ఉన్నాయి. ''ఒక మిస్టీరియస్ విలేజ్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ప్రతాప్ అనే యువకుడి కథ చుట్టూ తిరుగుతుంది. అవకాశాల కోసం ప్రయత్నించే ప్రతాప్ జీవితం అనుకోని మార్గం లోకి వెళుతుంది. కనిపించేదంతా నిజం కాని ప్రపంచంలోకి అడుగుపెడతాడు. దీంతో ఓ సంఘర్షణలో చిక్కుకుని తన నిర్ణయాలు, నమ్మకాలు, లక్ష్యాలను ప్రశ్నించుకునే పరిస్థితి వస్తుంది. యూనిక్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులకు ఒక మంచి అనుభూతిని ఇస్తుంది. బెనర్జీ, శివనారాయణ, అగు స్టాన్లీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

మేడే స్పెషల్

శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. జానకిరామ్ మారెళ్ళ దర్శకత్వం వహిస్తున్నారు. మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు పోషిస్తున్నారు. కోన వెంకట్ సమర్పణలో స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. మే 1న మేడేని పురస్కరించుకుని ఈ మూవీ నుంచి శ్రీవిష్ణు పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. 1992లో ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని విశాఖ జిల్లా మాడుగుల ప్రాంతం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాలో శ్రీ విష్ణు ద్విపాత్రాభినయం చేస్తున్నారని తెలుస్తోంది. ఈ సినిమాకి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు.

● శ్రీవిష్ణు

జెట్‌లీ ప్రదర్శనను నిలిపివేయడం తగదు - కేతిరెడ్డి శశిధర్

మల్టీప్లెక్స్ తరహాలోనే పర్సెంటేజీ విధానంలో సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్‌లోని 23 సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానులు నిర్ణయించినట్లు 'తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్'(టీఎఫ్‌సీసీ) గతంలో ఓ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ పర్సెంటేజీ బేస్డ్ స్క్రీనింగ్ విధానాన్ని తాము అంగీకరించమని, పాత విధానాన్నే కొనసాగించాలని 'యాక్టివ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్' సభ్యులు 'టీఎఫ్‌సీసీ'కి లేఖ పంపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తెలంగాణలోని సింగిల్ స్క్రీన్ థియేటర్లలో వీకెండ్ రెంటల్స్, రెవెన్యూ షేరింగ్ నిబంధనలపై గత కొంతకాలంగా మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పీ సంస్థకు, ఎగ్జిబిటర్లకు మధ్య భేదాభిప్రాయాలు నడుస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు 'మైత్రి' సినిమాలను సింగిల్ స్క్రీన్లలో ప్రదర్శించకూడదని ఎగ్జిబిటర్లు నిర్ణయించుకున్నారు. అయితే శుక్రవారం మైత్రి సంస్థ నుంచి విడుదలైన 'జెట్‌లీ' సినిమాను పలు మల్టీప్లెక్స్‌లలో ప్రదర్శించలేదట. ఈ విషయంపై మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పీ భాగస్వామి అయిన కేతిరెడ్డి శశిధర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ''సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్యపై మొదటి నుంచి మేము చర్చలకు సిద్ధంగా ఉన్నాం. ఈ సమస్య ఇంకా పరిష్కారం కానప్పటికీ మీ నిర్ణయాన్ని మేము గౌరవించాం. కానీ 'జెట్‌లీ' మూవీ విషయంలో జరిగింది ఆమోదయోగ్యం కాదు. మీ నియంత్రణలో ఉన్న మల్టీప్లెక్స్‌లో మా సినిమా ప్రదర్శనను నిలిపివేశారు. ఈ నిర్ణయం మాపై ఒత్తిడి తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నంలా కనిపిస్తోంది. వెంటనే పునరాలోచించి మల్టీప్లెక్స్‌లలో 'జెట్‌లీ' ప్రదర్శనకు అనుమతించాలి'' అని కోరారు.

● హ్యూమరమరాలు

దెయ్యం కావలెను



కొన్ని సందేహాలు తీర్చుకొనుటకు దెయ్యంతో చిన్న ఇంటర్వ్యూ కావలెను.

సదరు ఇంటర్వ్యూలో ప్రశ్నలు అడుగువాడు మా బుజ్జిగాడు.

వాడి అడ్రస్... బుజ్జిగాడు, ప్రేమ్‌నగర్ కాలనీ, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్, హైదరాబాద్. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ఫలానా... ఫలానా.

మా బుజ్జిగాడు పగలు నిద్రపోయి రాత్రంతా అల్లరిచేస్తూ ఉంటాడు కాబట్టి సంప్రదింపులకు దెయ్యాలకూ వీలుగా ఉంటుంది. ఆసక్తిగల దెయ్యాలు సదరు ఫోన్ నంబరులో నేరుగా సంప్రదించవచ్చు.

ఇట్లు రాంబాబు.

ఈ ప్రకటన చూడగానే మా రాంబాబుగాడికి ఫోన్ చేయక తప్పలేదు.

''ఎందుకురా ఆ ప్రకటన ఇచ్చావ్?'' అంటూ నేనడగ్గానే వాడు భోరుమన్నాడు. తమ బుజ్జిగాడికొచ్చిన డౌట్లు గురించి బిక్కుబిక్కుమంటూ వాడు చెప్పిన వివరాలివి...

★★★

''నాన్నా... దెయ్యాలు ఒరిజినల్‌గా తాము పుట్టినరోజునే బర్త్–డే చేసుకుంటాయా? లేదంటే...



తాము చచ్చిన రోజునే అవి దెయ్యాలై పుడతాయి కాబట్టి తమ డెత్–డే రోజున బర్త్‌డే చేసుకుంటాయా?'' అడిగాడు.

రాంబాబుగాడికి ఏం చెప్పాలో తోచలేదట. బుజ్జిగాడొచ్చి ఈ డౌటడిగాక వాడి సందేహంలోనూ న్యాయముందని అనిపించిందట. అంతే కాదు... తన పుట్టినరోజునే తానూ చచ్చిపోవాలనీ... దాంతో దెయ్యంగా మారాక బర్త్–డే విషయంలో తనకూ పెద్దగా కన్ఫ్యూజన్ ఉండదనీ... పైగా పుట్టిన రోజూ, చచ్చినరోజూ ఒకటే అయితే డేటు మర్చిపోకుండా ఉండేందుకు మాం...ఛి అడ్వాంటేజు కూడా ఉంటుందని అనిపించిందట.

★★★

మరోరోజు బుజ్జిగాడు మరోమారు పరుగెత్తుకుంటూ వచ్చి ''నాన్నా... ఆరోజున నువ్వు మీ ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూ దెయ్యాల్లో... జుట్టుదెయ్యాలూ, గుండు దెయ్యాలూ, కొరివిదెయ్యాలూ, రాచ్చాసులూ, బ్రమ్మరాచ్చసులూ, పిశాచులూ, బేతాళ పిచాచులూ అంటూ రకరకాల కులాలుంటాయని మన బే...ధ్ధ రచయిత పతంజలి గారు చెప్పారంటూ ఎవరికో స్పీచు ఇచ్చావ్ కదా. అప్పుడూ... దెయ్యాల్లో గనకా ఎలచ్చన్లు గట్రా అవుతుంటే ఎక్కడ ఏ క్యాస్టు దెయ్యాలు ఎక్కువో... అక్కడ వాళ్లనే క్యాండిడేటుగా నిలబెడతారు కదా'' అని అడిగాడు బుజ్జిగాడు.

రాంబాబుగాడిక్కూడా అది కరెక్టుగా అనిపించిందట. ఉదాహరణకు 'చింతనిప్పుల' అనే ఓ చింతలతోపు నియోజకవర్గంలో కొరివిదెయ్యాల కులపోళ్లు ఎక్కువగా ఉన్నారనుకుందాం. అక్కడ పిశాచాల కులపు క్యాండిడేటును నిలబెడితే వాడికి ఓట్లు పడతాయా? అలాగే 'మర్రిఊడల' అనే మరో నియోజకవర్గంలో బేతాళ పిశాచాలు ఎక్కువగా ఉంటే అక్కడ మన జుట్టుదెయ్యాలకు ఓటెవడేస్తాడు!! బుజ్జిగాడు చెప్పాక ఈ డౌటు తననూ వేధించిందం'టూ వాడు మధనపడ్డాడు.

★★★

ఇంకోరోజు మా పోర్షన్ కు ముందు ఓ షట్టర్‌లో రెంటుకుండే ఓ టైలర్ గారి దగ్గర వెళ్లి... ''అంకుల్... దెయ్యాలు తమ తెల్లచీరలకు పీకోఫాల్సూ, వాళ్లకు మ్యాచింగు బ్లౌజులూ మీరే కుడతారా?'' అంటూ తనను తరచూ ముద్దుచేస్తుండే ఆ టైలర్‌గారిని అడిగాట్ట. ఆయన దగ్గర ఉండే చనువు కొద్దీ ఈ ప్రశ్నేతే వేశాడుగానీ అతడికీ ఏం చెప్పాలో తెలియలేదు. ''ఏమో... దెయ్యాల జుట్టుకు షాంపూలూ, దువ్వెన్లూ ఎక్కణ్ణుంచి కొంటారో'' అంటూ బుజ్జిగాడు అడిగిన మరో ప్రశ్నకు... సదరు టైలరూ, మా వీధిలోని కిరాణా కొట్టు ఓనర్లతో పాటు నేనూ డౌట్లలో మునిగిపోయాం.

★★★

''దెయ్యాల గురించి మావాడు తరచూ అడిగే ప్రశ్నలకు జవాబులివ్వలేకా... వాడు రోజు విడిచి రోజు... ఈ ప్రశ్నల్తో వేధిస్తుంటే తట్టుకోలేకా ఈ ప్రకటన ఇచ్చాన్రా! ఈ యాడ్ చూసుకొని ఎవడైనా పిల్లపిశాచిగాడో, ఏ దెయ్యప్పిల్లో రెస్పాండ్ అయితే... వాడికీ మా బుజ్జిగాడికీ ఫ్రెండ్‌షిప్పు కుదిర్చేసి నేను హాయిగా, హ్యాపీగా, మనశ్శాంతిగా ఉండొచ్చని ఇచ్చాన్రా ఈ ప్రకటన'' అంటూ భోరుమన్నాడు మా రాంబాబుగాడు.

ఈలోపు నేనూరుకోలేదు. మా రాంబాబుగాణ్ణి మరింత కన్ఫ్యూజన్‌లో పడేస్తూ... ''అన్నట్టూ... దెయ్యాలు న్యూస్ పేపర్లు చదువుతాయంటావా?'' అని అడిగా.

- యాసీన్

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) మే 1న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,52,320	1,40,538	2,44,000
విజయవాడ	1,54,500	1,39,650	2,53,000
విశాఖపట్నం	1,50,380	1,37,850	2,65,000
రాజమండ్రి	1,54,500	1,43,840	2,53,000
ప్రొద్దుటూరు	1,51,600	1,39,470	2,45,000
చెన్నై	1,51,860	1,39,200	2,65,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	గురువారం ముగింపు
సెన్సెక్స్ ▽ 583	76,913
నిఫ్టీ ▽ 180	23,998

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	25,183	△	292
డోజోన్స్	49,676	△	23
ఎఫ్‌టీఎస్ఈ 100	10,380	△	1
డాక్స్ గురువారం ముగింపు	24,292	△	338
షాంఘై గురువారం ముగింపు	4,112	△	5
నికాయ్	59,513	△	228

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	93.08	96.12
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	125.86	130.33
€	యూరో	థామస్‌కుక్	108.75	112.80
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	58.00	58.70
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	65.36	62.00
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	72.08	75.86
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	24.33	25.96
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	24.95	26.23
¥	చైనా యువాన్	థామస్‌కుక్	13.03	14.85

షేర్ల బైబ్యాక్ బూమ్.. కంపెనీల గేమ్ ఆన్

- పన్ను విధానాల్లో మార్పుల దన్ను
- లిస్టులో సైయెంట్, అరబిందో ఫార్మా, విప్రో

సాక్షి, బిజినెస్ డెస్క్: గత రెండేళ్లుగా గణనీయంగా తగ్గిపోయిన షేర్ల బైబ్యాక్ కార్యకలాపాలు మళ్లీ జోరందుకుంటున్నాయి. ఇన్వెస్టర్లకు సానుకూలంగా ఉండే విధంగా పన్నుల విధానాలను క్రమబద్ధీకరించడంతో ఇవి ఆకర్షణీయంగా మారాయి. దీంతో అరబిందో ఫార్మా, సైయెంట్, విప్రోలాంటి కంపెనీలు బైబ్యాక్ ప్రణాళికలను ప్రకటించాయి. గత కొన్నాళ్లుగా బైబ్యాక్‌లలో షేర్లను విక్రయించడంపై వచ్చిన లాభాలను, డీమ్డ్ డివిడెండ్లుగా పరిగణించి, శ్లాబ్ రేట్ల ప్రకారం పన్ను వేస్తుండటంతో ఇన్వెస్టర్లలో వీటిపై పెద్దగా ఆసక్తి వ్యక్తం కావడం లేదు. అయితే ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఫైనాన్స్ యాక్ట్ 2026 చట్టంలోని కొత్త నిబంధనల ప్రకారం, ఇన్వెస్టర్లకు సానుకూలంగా, హేతుబద్ధతతో వీటిని షేర్‌హోల్డర్ల చేతిలో క్యాపిటల్ గెయిన్స్‌గా పరిగణిస్తుండటంతో బైబ్యాక్‌లు కాస్త ఆకర్షణీయంగా మారుతున్నాయి. కంపెనీల నుంచి బైబ్యాక్ ప్రతిపాదనలు వెల్లువెత్తడానికి ఈ పన్నుపరమైన ప్రయోజనాలు కారణమని నిపుణులు చెబుతున్నారు.

రెండేళ్లుగా డౌన్..

గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో బైబ్యాక్స్ గణనీయంగా పడిపోయాయి. 2024-25లో కేవలం రూ. 8,034 కోట్లు, 2025-26లో రూ. 19,500 కోట్లకు పరిమితమయ్యాయి. అదే పన్ను విధానాలు సానుకూలంగా ఉన్నప్పుడు 2023-24లో వీటి పరిమాణం ఏకంగా రూ. 50,750 కోట్లుగా నమోదైంది.

వ్యాపారంపై ధీమా..

కేవలం ట్యాక్స్ ప్రయోజనాల వల్లే కాకుండా ఇతర అంశాలూ బైబ్యాక్‌కి ఊతమిస్తున్నాయి. చాలా మటుకు స్టాక్స్ భారీగా కరెక్షన్‌కి లోనవడం, నిధులు పుష్కలంగా ఉన్న కంపెనీలు తమ స్టాక్స్‌ని చాలా చౌకగా కొనుక్కునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఈ రెండు అంశాలే కాకుండా కంపెనీలు బైబ్యాక్‌లను చేపట్టడమనేది తమ ప్రధాన వ్యాపారాలపై కంపెనీలకి గల నమ్మకాన్ని సూచిస్తోందని నిపుణులు చెప్పారు. తమ షేర్లు ఉండాల్సిన విలువ కన్నా తక్కువ పలుకుతున్నా, ఈపీఎస్ (షేరువారీ ఆర్జన), రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్‌వోఈ) మెరుగుపడే కొద్దీ రేటు మరింత పెరుగుతుందని సంస్థలు ధీమాగా ఉండటాన్ని ఇది తెలియజేస్తోందన్నారు. భారీగా రాబడులిచ్చే అవకాశాలు పరిమితంగా ఉన్న కంపెనీల విషయానికొస్తే, నగదును పక్కన పెట్టుకుని కూర్చోవడానికి బదులు బైబ్యాక్ మంచి ప్రత్యామ్నాయంగా ఉంటుందని పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, గ్లోబల్‌గా అనిశ్చితి నెలకొన్న తరుణంలో వేల్యుయేషన్లను కాపాడుకునేందుకు తోడ్పడుతుందని తెలిపారు. ఓపెన్ మార్కెట్ బైబ్యాక్ రూపంలో కొనుక్కునే వెసులుబాటును తిరిగి ప్రవేశపెట్టాలని సెబీ యోచిస్తున్న నేపథ్యంలో ఈ విధానం మళ్లీ ఆకర్షణీయంగా మారొచ్చని భావిస్తున్నారు.

● ఆటో రంగం శుభారంభం

కారు.. టాప్ గేరు!

కొత్త ఏడాది ఘనంగా బోణీ

- మారుతీ, హ్యుందాయ్, కియా రికార్డు అమ్మకాలు
- ఏప్రిల్‌లో 4.5 లక్షల ప్యాసింజర్ వాహనాల సేల్స్

ముంబై: దేశీయ కార్ల తయారీ సంస్థలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభించాయి. మారుతీ **సుజుకీ, హ్యుందాయ్**, కియా వంటి సంస్థల రికార్డు **స్థాయి విక్రయాల** కారణంగా, ఏప్రిల్‌లో దేశీయ **మార్కెట్లో 4.5 లక్షల** ప్యాసింజర్ వాహనాలు అమ్ముడ**య్యాయి. గతేడాది(2025)** ఇదే నెల అమ్ముడైన 3.54 **లక్షల ప్యాసింజర్** వాహనాలతో పోలిస్తే ఇవి 27% **అధికంగా ఉన్నాయి. జీ**ఎస్‌టీ 2.0 అమలుతో నెలకొన్న **సానుకూల పరిస్థితులు,** ఆర్‌బీఐ రెపో రేట్ల తగ్గింపు, **ఆదాయ పన్ను రాయితీ** అంశాలతో వాహన పరిశ్రమకు **ప్రయోజనం చేకూరింద**ని మారుతీ సుజుకీ ఇండియా **సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్** పార్థో బెనర్జీ తెలిపారు.

➤ **మారుతీ సుజుకీ దేశీయ** అమ్మకాల్లో సరికొత్త రికార్డు **సృష్టించింది. గతేడాది** డిసెంబర్ నాటి 1,82,165 **యూనిట్ల గరిష్ట స్థాయి** అధిగమిస్తూ.. ఈ ఏప్రిల్‌లో **1,91,122 వాహనాలను** విక్రయించింది. గత ఏప్రిల్‌తో **(1,42,053 యూనిట్లు)** పోలిస్తే వృద్ధి 34.54 శాతంగా **నమోదైంది. ప్రస్తుతం** మారుతీ వద్ద 1.65 లక్షల బుకింగ్స్ పెండింగ్‌లో ఉన్నాయి.

➤ మహీంద్రా అండ్ మహీంద్రా(ఎం అండ్ ఎం) ఏప్రిల్‌లో దేశీయంగా 56,331 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలో అమ్మిన 52,330 వాహనాలతో పోలిస్తే ఇవి 8% అధికంగా ఉన్నాయి. కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27) 'సానుకూల దృక్పథం'తో ప్రారంభమైందని సంస్థ ఆటోమోటివ్ విభాగం సీఈఓ నళినీకాంత్ గొల్లగుంట తెలిపారు.

➤ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్(టీఎంపీవీ) అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 30.5% పెరిగి 45,199 నుంచి 59,000 యూనిట్లకు చేరాయి.

➤ ప్రభుత్వ పాలసీ మద్దతుతో హ్యుందాయ్ మోటార్ ఇండియా సరికొత్త రికార్డు సృష్టించింది. ఏప్రిల్ 2026లో 17% వార్షిక వృద్ధితో దేశీయంగా 51,902 యూనిట్ల విక్రయాలు జరిపింది. సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి ఏప్రిల్ నెలలో నమోదైన అత్యధిక అమ్మకాలు ఇవే.

➤ కియా ఇండియా ఏప్రిల్‌లో 16% వృద్ధితో అదరగొట్టింది. గతేడాది ఏప్రిల్‌లో 23,623 యూనిట్లు అమ్ముడవగా.. ఈసారి 27,286 వాహనాలతో సంస్థ చరిత్రలోనే అత్యధిక ఏప్రిల్ విక్రయాలను నమోదు చేసింది.

➤ టయోటా కిర్లోస్కర్ మోటార్ 21 శాతం వృద్ధితో సత్తా చాటింది. గతేడాది ఏప్రిల్‌లో 24,833 యూనిట్లు అమ్ముడవగా, ఈసారి ఆ సంఖ్య 30,159కి చేరింది.

➤ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఈ ఏప్రిల్‌లో 3 శాతం వృద్ధితో 6,018 వాహనాలను డీలర్లకు పంపింది.

➤ రెనో ఇండియా అమ్మకాల్లో ఏకంగా రెండింతల వృద్ధిని నమోదు చేసింది. గతేడాది 2,602 యూనిట్లు అమ్ముడవగా, ఈసారి ఆ సంఖ్య 5,413కి చేరింది.

➤ నిస్సాన్ మోటార్ ఇండియా దేశీయ విక్రయాలు 3,203 యూనిట్లుగా నమోదయ్యాయి.

ఏప్రిల్ వాహన విక్రయాలు (ఎగుమతులు సహా)..

కంపెనీ	2026	2025	వృద్ధి/క్షీణత (%)
మారుతీ	2,39,646	1,79,791	33.29
ఎం అండ్ ఎం	94,627	83,006	14.00
టాటామోటార్స్ పీవీ	59,701	45,532	31.11
హ్యుందాయ్	65,610	60,774	7.96
కియా	27,286	23,623	16
టయోటా	32,086	27,329	17
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ	6,108	5,829	3.24
రెనో ఇండియా	5,413	2,602	108
నిస్సాన్	5,388	-	-
ద్విచక్ర వాహనాలు			
హీరో మోటోకార్ప్	5,66,086	3,05,406	85
హోండా మోటార్‌సైకిల్	5,63,000	4,84,000	17
సుజుకీ మోటార్‌సైకిల్	1,17,514	1,12,948	4
రాయల్ ఎన్‌ఫీల్డ్	1,13,164	86,559	31
వాణిజ్య వాహనాలు			
టాటామోటార్స్ సీవీ	34,833	27,221	28
ఐషర్ మోటార్స్	7,318	6,846	6.9

టెక్ మహీంద్రా చేతికి అవాంట్

తొలుత 85 శాతం వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా కెనడా కంపెనీ అల్లూరి టెక్నాలజీస్ ఇంక్(అవాంట్)ను కొనుగోలు చేయనుంది. ఇందుకు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనిలో భాగంగా తొలుత 85% వాటాను సొంతం చేసుకోనుంది. ఇందుకు 2.8 కోట్ల కెనడియన్ డాలర్లు(రూ. 171 కోట్లు) వెచ్చించనుంది. మూడేళ్ల తదుపరి మిగిలిన 15% వాటాను ముందుగా నిర్ణయించిన ధర ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు టెక్ మహీంద్రా పేర్కొంది. అవాంట్‌తో.. సొంత అనుబంధ కంపెనీ టెక్ మహీంద్రా కన్సల్టింగ్ గ్రూప్(టీఎంసీజీ) వాటా కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. తాజా కొనుగోలుతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) విభాగంలో మరింత బలపడే వీలున్నట్లు తెలియజేసింది. 2029 జూన్ 30కల్లా మిగిలిన 15% వాటా సైతం దక్కించుకోనున్నట్లు వెల్లడించింది.

జీఎస్‌టీ వసూళ్ల రికార్డ్

- ఏప్రిల్‌లో రూ.2.43 లక్షల కోట్లు
- నెలవారీ ఆల్‌టైమ్ గరిష్టం

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ద్వారా ఏప్రిల్ నెలలో రూ.2.43 లక్షల కోట్ల స్థూల ఆదాయం వసూలైంది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూళ్ల రూ.2.23 లక్షల కోట్లతో పోల్చిచూస్తే 8.7 శాతం పెరుగుదల నమోదైంది. ఇది ఒక నెలలో అత్యధిక వసూళ్ల రికార్డు. దేశీ విక్రయాలపై జీఎస్‌టీతో పోల్చి చూస్తే, దిగుమతులపై పన్ను ఆదాయమే ఎక్కువ వృద్ధి చూపించడం గమనార్హం.

→ దేశీ విక్రయాలపై జీఎస్‌టీ 4.3 శాతం పెరిగి రూ.1.85 లక్షల కోట్లకు చేరింది.

→ దిగుమతులపై జీఎస్‌టీ 25.8 శాతం పెరిగి రూ.57,580 కోట్లు వసూలైంది.

→ సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) రూ.52,140 కోట్లు రాగా, స్టేట్ జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) రూ.61,331 కోట్లుగా ఉంది.

→ ఐజీఎస్‌టీ రూ.1.29 లక్షల కోట్లు వసూలైంది.

→ రిఫండ్‌లు (పన్ను చెల్లింపుదారులకు వాపసు) 19.3 శాతం పెరిగి రూ.31,793 కోట్లకు చేరాయి.

→ రిఫండ్‌లు సర్దుబాటు అనంతరం నికర జీఎస్‌టీ వసూళ్లు ఏప్రిల్‌లో రూ.2.11 లక్షల కోటు.

→ ఈ ఏడాది మార్చి నెలకు స్థూల జీఎస్‌టీ వసూళ్లు రూ.2,00,064 కోట్లుగా ఉండడం గమనార్హం.

7-8 శాతం వృద్ధి సాధారణమే

జీఎస్‌టీ 2.0 అనంతరం ప్రతి నెలా పన్నుల ఆదాయం 7-8 శాతం మేర వృద్ధి చెందడం సాధారణంగా మారినట్టు ప్రైస్ వాటర్‌హౌస్ అండ్ కో ఎల్ఎల్‌పీ పార్ట్‌నర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. ఇది బడ్జెట్ అంచనాలకు అనుగుణంగానే ఉన్నట్టు చెప్పారు. దిగుమతులపై ఆదాయం దేశీ లావాదేవీలను మించడం అన్నది దేశీ వినియోగం కొంత నిదానించడాన్ని తెలియజేస్తోందని జైన్ చెప్పారు.

భారత జట్టు ఎంపిక నేడు

ముంబై: మహిళల టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టును ఈరోజు ప్రకటిస్తారు. ఇంగ్లండ్‌వేదికగా ఈ ఏడాది జూన్12 నుంచి జూలై 5 వరకు టి20 ప్రపంచకప్ జరగనుంది. ఇప్పటి వరకు జరిగిన తొమ్మిది టి20 ప్రపంచకప్‌లలో ఆడిన భారత జట్టు నాలుగుసార్లు (2009, 2010, 2018, 2023లో)సెమీఫైనల్‌కు చేరుకొని, ఒకసారి (2020లో) రన్నరప్‌గా నిలిచింది.

నాకౌట్ దశకు భారత టీటీ జట్లు

లండన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించాయి. పురుషుల విభాగం గ్రూప్-7లో... మహిళల విభాగం గ్రూప్-6లో భారత జట్లు అగ్రస్థానాన్ని సంపాదించి తదుపరి దశకు చేరుకున్నాయి. చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో భారత పురుషుల జట్టు 3-0తో గ్వాటెమాల జట్టుపై... భారత మహిళల జట్టు 3-0తో రువాండా జట్టుపై విజయం సాధించాయి.

అదరగొట్టిన భారత్

- క్వార్టర్ ఫైనల్లో చైనీస్ తైపీపై 3-0తో విజయం
- సెమీఫైనల్ బెర్త్‌తో టీమిండియాకు పతకం ఖాయం

హోర్‌సెన్స్ (డెన్మార్క్): తమదైన రోజున సహజశైలిలో చెలరేగితే... ప్రత్యర్థి జట్టులో తమకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ఆటగాళ్లు ఉన్నా... అద్భుత ఫలితం సాధించవచ్చని భారత షట్లర్లు నిరూపించారు. ప్రతిష్టాత్మక థామస్ కప్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో తమ అసాధారణ ప్రదర్శనతో భారత పురుషుల జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టీమిండియా 3-0తో చైనీస్ తైపీ జట్టును చిత్తు చేసింది. ఈ విజయంతో సెమీఫైనల్‌కు చేరుకున్న భారత జట్టుకు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. జపాన్, ఫ్రాన్స్ జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ విజేతతో నేడు జరిగే సెమీఫైనల్లో భారత జట్టు తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో చైనా 3-0తో మలేసియాపై గెలిచింది. థాయ్‌లాండ్, డెన్మార్క్ జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ విజేతతో నేడు జరిగే సెమీఫైనల్లో చైనా ఆడుతుంది. 2022లో తొలిసారి థామస్‌కప్ చాంపియన్‌గా అవతరించిన భారత జట్టు 2024లో మాత్రం క్వార్టర్ ఫైనల్లో చైనా జట్టు చేతిలో ఓడిపోయింది.

2 మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని...

చైనీస్ తైపీతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో తొలి మ్యాచ్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్ లక్ష్య సేన్ 88 నిమిషాల్లో 18-21, 22-20, 21-17తో ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ తియెన్ చెన్‌ను ఓడించాడు. ఈ పోరులో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని లక్ష్య సేన్ నెగ్గడం విశేషం. తొలి గేమ్ కోల్పోయిన లక్ష్య సేన్ రెండో గేమ్‌లో 18-20తో వెనుకబడి ఓటమి అంచుల్లో నిలిచాడు. ఈ దశలో సంయమనం కోల్పోకుండా ఆడిన లక్ష్య సేన్ వరుసగా 4 పాయింట్లు నెగ్గి 22-20తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో లక్ష్య సేన్ 10-6తో ఆధిక్యంలోకి వెళ్లి ఆ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని అందుకున్నాడు. రెండో మ్యాచ్‌లో ప్రపంచ 4వ ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 23-21, 19-21, 21-12తో ప్రపంచ 14వ ర్యాంక్ జంట చియు సియాంగ్ చెయి-వాంగ్ చి లిన్‌పై గెలిచి భారత ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. మూడో మ్యాచ్‌లో ఆసియా చాంపియన్‌షిప్ రన్నరప్, ప్రపంచ 18వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టి 48 నిమిషాల్లో 21-16, 21-17తో ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్, ప్రపంచ 8వ ర్యాంకర్ లిన్ చున్ యిని బోల్తా కొట్టించి భారత్‌కు సెమీఫైనల్ బెర్త్‌ను అందించాడు. ఫలితం తేలిపోవడంతో మిగతా రెండు మ్యాచ్‌లు నిర్వహించలేదు.

సీఓఈ శిబిరానికి అనన్య ఎంపిక



సాక్షి, హైదరాబాద్: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించే హై పెర్ఫార్మెన్స్ క్యాంప్‌కు హైదరాబాద్ స్పిన్ బౌలర్ అనన్య దుండు ఎంపికైంది. అండర్-15 బాలికల విభాగంలో ఆమెకు ఈ అవకాశం దక్కింది. బెంగళూరులోని బీసీసీఐ-సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఈ నెల 18 నుంచి 11 జూన్ వరకు ఈ క్యాంప్ జరుగుతుంది. ఇటీవల జరిగిన బీసీసీఐ అండర్-15 వన్డే ట్రోఫీ (ఎలైట్)లో అనన్య 6 మ్యాచ్‌లలో 16 వికెట్లు పడగొట్టి టోర్నీ టాపర్‌గా నిలిచింది. బోర్డు అపెక్స్ కౌన్సిల్ మెంబర్ వి.చాముండేశ్వరనాథ్ పర్యవేక్షణలో నగరంలోని రామానాయుడు క్రికెట్ అకాడమీలో ప్రస్తుతం అనన్య శిక్షణ పొందుతోంది.

ఢిల్లీ గెలిచిందోచ్...

వరుస పరాజయాలకు విరామం

- 7 వికెట్లతో రాజస్తాన్ చిత్తు
- రాణించిన రాహుల్, నిసాంక, స్టార్క్

264 పరుగులు చేసినా ఓడిపోయె... ఆపై 75 పరుగులకు కుప్పకూలె... అటు బ్యాటర్లు, ఇటు బౌలర్ల పేలవ ప్రదర్శన... టీమ్‌లో గందరగోళ స్థితిలో వరుసగా మూడు ఓటములు... ఇలాంటి స్థితిలో స్థైర్యం కోల్పోయిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎట్టకేలకు ఒక విజయంతో ఊరట లభించింది. సమష్టి ప్రదర్శనతో రాజస్తాన్ రాయల్స్‌ను ఓడించడంలో సఫలమైంది. మరోవైపు గత మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై 223 పరుగుల లక్ష్యాన్ని అందుకొని సత్తా చాటిన రాజస్తాన్ ఈసారి 225 పరుగుల స్కోరును నిలబెట్టుకోలేక పోయింది.

జైపూర్: ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కీలక విజయం దక్కింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (50 బంతుల్లో 90; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీ అవకాశం కోల్పోగా... ధ్రువ్ జురేల్ (30 బంతుల్లో 42; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 59 బంతుల్లో 102 పరుగులు జోడించారు. చివర్లో డొనొవాన్ ఫెరీరా (14 బంతుల్లో 47 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) విధ్వంసకర బ్యాటింగ్‌తో జట్టు భారీ స్కోరు సాధించింది. అనంతరం ఢిల్లీ 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 226 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కేఎల్ రాహుల్ (40 బంతుల్లో 75; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), పతుమ్ నిసాంక (33 బంతుల్లో 62; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 57 బంతుల్లోనే 110 పరుగులు జోడించి విజయానికి బాటలు వేశారు.

ఫెరీరా దూకుడు...

ఆసీస్ దిగ్గజ బౌలర్ స్టార్క్ ఈ సీజన్‌లో తొలిసారి ఐపీఎల్‌లో బరిలోకి దిగాడు. అతడు వేసిన ఇన్నింగ్స్ తొలి బంతికే యశస్వి జైస్వాల్ (6) సిక్స్ కొట్టినా... మూడో బంతికే వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్లో జేమీసన్ పదునైన యార్కర్‌తో వైభవ్ సూర్యవంశీ (4) ఆట ముగించాడు. ఈ దశలో జురేల్, పరాగ్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. జేమీసన్ ఓవర్లో పరాగ్ వరుసగా 6, 4, 6 కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 56 పరుగులకు చేరింది. అక్షర్ ఓవర్లోనూ రెండు వరుస సిక్స్‌లు బాదిన అతను 32 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. జురేల్‌ను అక్షర్ వెనక్కి పంపగా, రవీంద్ర జడేజా (20) ప్రభావం చూపలేదు. జేమీసన్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన పరాగ్ 90కి చేరుకున్నాడు. అయితే తర్వాతి ఓవర్ వేసిన స్టార్క్... జడేజా, పరాగ్‌లను వెనక్కి పంపించాడు. 17 ఓవర్లలో జట్టు స్కోరు 173/5. అయితే చివరి 3 ఓవర్లలో ఫెరీరా చెలరేగిపోవడంతో రాజస్తాన్ 52 పరుగులు రాబట్టింది. కుల్దీప్ ఓవర్లో 3 సిక్సర్లు బాదిన అతను, స్టార్క్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టాడు. నటరాజన్ వేసిన ఆఖరి ఓవర్లోనూ 2 సిక్స్‌లు, ఫోర్‌తో సత్తా చాటాడు.

పరాగ్

మెరుపు ఆరంభం...

ఛేదనలో ఢిల్లీకి నిసాంక, రాహుల్ సరైన ఆరంభాన్ని అందించారు. ఆర్చర్ తొలి 2 ఓవర్లలో వీరిద్దరు కలిసి 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 26 పరుగులు రాబట్టారు. బర్గర్ తొలి ఓవర్లో రాహుల్ 2 ఫోర్లు కొట్టగా, తర్వాతి ఓవర్లో నిసాంక 2 సిక్స్‌లు బాదాడు. పవర్‌ప్లేలో జట్టు 70 పరుగులు చేయగా, 23 బంతుల్లో నిసాంక అర్ధసెంచరీ సాధించాడు. ఆ తర్వాత బిష్ణోయ్ ఓవర్లోనూ రాహుల్ ఫోర్, 2 సిక్స్‌లతో చెలరేగాడు. శతక భాగస్వామ్యం తర్వాత నిసాంకను అవుట్ చేసి జడేజా ఈ జోడీని విడదీయగా, 27 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. క్రీజ్‌లో ఉన్నంత సేపు నితీశ్ రాణా (17 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిని ప్రదర్శించాడు. రాహుల్, రాణా ఆరు పరుగుల వ్యవధిలో అవుట్ కావడంతో ఢిల్లీపై ఒత్తిడి పెరిగింది. అయితే అశుతోష్ శర్మ (15 బంతుల్లో 25 నాటౌట్; 4 ఫోర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (11 బంతుల్లో 18 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) నాలుగో వికెట్‌కు 24 బంతుల్లో అభేద్యంగా 49 పరుగులు జత చేసి జట్టును గెలిపించారు.

రాహుల్

నిసాంక

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి అండ్ బి) స్టార్క్ 6; వైభవ్ (బి) జేమీసన్ 4; జురేల్ (సి) స్టబ్స్ (బి) అక్షర్ 42; పరాగ్ (సి) అక్షర్ (బి) స్టార్క్ 90; జడేజా (సి) అశుతోష్ (బి) స్టార్క్ 20; ఫెరీరా (నాటౌట్) 47; శుభమ్ దూబే (సి) అశుతోష్ (బి) నటరాజన్ 6; ఆర్చర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 225. వికెట్ల పతనం:** 1-6, 2-12, 3-114, 4-167, 5-168, 6-208. **బౌలింగ్:** స్టార్క్ 4-0-40-3, జేమీసన్ 4-0-48-1, అక్షర్ 4-0-39-1, కుల్దీప్ 4-0-41-0, నటరాజన్ 4-0-54-1. **ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్:** నిసాంక (ఎల్బీ) (బి) జడేజా 62; రాహుల్ (సి) ఫెరీరా (బి) ఆర్చర్ 75; రాణా (సి) జురేల్ (బి) తుషార్ 33; స్టబ్స్ (నాటౌట్) 18; అశుతోష్ (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (19.2 ఓవర్లలో 3 వికెట్లకు) 226. వికెట్ల పతనం:** 1-110, 2-171, 3-177. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-46-1, బర్గర్ 3-0-41-0, తుషార్ 4-0-38-1, బ్రిజేశ్ 3.1-0-35-0, బిష్ణోయ్ 2-0-28-0, జడేజా 3-0-33-1.

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × ముంబై ; వేదిక: చెన్నై

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్-2026 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	ర.రే
పంజాబ్	8	6	1	1	13	1.043
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	9	6	3	0	12	0.832
రాజస్తాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	9	5	4	0	10	-0.192
ఢిల్లీ	9	4	5	0	8	-0.895
చెన్నై	8	3	5	0	6	-0.121
కోల్‌కతా	8	2	5	1	5	-0.751
ముంబై	8	2	6	0	4	-0.784
లక్నో	8	2	6	0	4	-1.106

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, ర.రే-నెట్ రన్‌రేట్

బౌండరీ మీటర్

4	1354	790	6

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కుట్రపన్ను.. కొల్లగొట్టు!

- రవాణాలో ట్యాక్స్ డీల్
- కీలక నేతకు రూ.18 కోట్ల ముడుపుల మూట..!
- ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.100 కోట్ల గండి

సాక్షి, అమరావతి: 'ప్రభుత్వ ఖజానా నిండితే నాకేంటీ... నా సొంత ఖజానా కళ కళలాడాలి గానీ' అని ప్రభుత్వంలో ఓ కీలక నేత భావించారు. రాయలసీమకు చెందిన ఆయన అందుకే ప్రైవేట్ ట్రావెల్స్ సిండికేట్‌తో భారీ డీల్ కుదుర్చుకున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ ప్రైవేట్ ట్రావెల్స్‌పై పన్నులు తగ్గించేందుకు పచ్చ జెండా ఊపారు. ప్రతిగా రూ.18కోట్ల డీల్ సెటిల్ చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో తమ బస్సుల రిజిస్ట్రేషన్‌ను రాష్ట్రానికి మార్చాల్సిన అనివార్యతను ఏపీ ప్రయోజనాలకు అనుకూలంగా అమలు చేసి, రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని తెచ్చే సదవకాశాన్ని కాలరాశారు. రవాణా శాఖలో చర్చనీయాంశంగా మారిన వ్యవహారం ఇదిగో ఇలా ఉంది...

ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్... ఏపీలో సర్వీసులు

రాష్ట్రంలో సర్వీసులు నిర్వహిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులన్నీ ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవనే విషయం బహిరంగ రహస్యం. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ప్రధాన రాష్ట్రాల్లో పన్నుల కంటే ఈశాన్య రాష్ట్రాల్లో పన్నులు తక్కువగా ఉండటమే అందుకు కారణం. ప్రైవేట్ బస్సుల్లో ఒక్కో సీటుకు త్రైమాసికానికి రూ.4వేలు చొప్పున పన్ను చెల్లించాలి. ఆ లెక్కన ఒక్కో బస్సుకు మూడు నెలలకు రూ.1.50 లక్షల చొప్పున ఏడాదికి రూ.6 లక్షలు చెల్లించాలి. కాగా ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్‌లో బస్సుకు రూ.56 వేలు, అరుణాచల్ ప్రదేశ్‌లో రూ.50 వేలు మాత్రమే పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఈశాన్య రాష్ట్రాల్లో పర్యాటక రంగం అభివృద్ధి కోసం ఆ నిర్ణయం తీసుకున్నారు. అందుకే రాష్ట్రానికి చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ తదితర ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించి ఏపీలో సర్వీసులు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో చేసిన విధాన నిర్ణయాన్ని తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. వన్ నేషన్.. వన్ పర్మిట్ కింద కేంద్ర ప్రభుత్వానికి రూ.90 వేలు చెల్లిస్తే చాలు ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసినా దేశవ్యాప్తంగా సర్వీసులు నిర్వహించుకోవచ్చు. రాష్ట్రంలో సర్వీసులు నిర్వహిస్తున్న 2,200 ప్రైవేటు బస్సుల్లో 1,800 బస్సులకు పైగా ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసినవే కావడం గమనార్హం. ఈ విధానంతో రాష్ట్ర ఖజానా ఏటా రూ.100కోట్ల మేర నష్టపోతోంది.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ట్రావెల్స్ దందాకు చెక్

రాష్ట్ర అధికారులు కచ్చితంగా వ్యవహరిస్తే చాలు

కాగా అఖిల భారత పర్మిట్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల తన విధాన నిర్ణయాన్ని సవరించింది. ఏ రాష్ట్రంలో బస్సులను రిజిస్ట్రేషన్ చేస్తారో... ఆ రాష్ట్రంలో నెలలో కనీసం అయిదు రోజులపాటు సర్వీసులు నిర్వహించాలని పేర్కొంది. దాంతో ప్రైవేట్ ట్రావెల్స్ సిండికేట్ దందాకు చెక్ పడింది. ఎందుకంటే నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ తదితర ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసిన బస్సులను నెలలో అయిదు రోజులపాటు ఆ రాష్ట్రాల్లో తిప్పాలి. ఆ రాష్ట్రాలకు వెళ్లి వచ్చేందుకు కనీసం మరో అయిదు రోజులు పడుతుంది. అంటే నెలలో పది రోజులపాటు ఆంధ్ర ప్రదేశ్‌కు వెలుపల బస్సులు ఉండాలి. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆ రాష్ట్రాలకు ప్రయాణికులు దాదాపు ఉండరు. ఇది ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులకు ఆర్థికంగా పెనుభారంగా మారుతుంది. పది రోజుల సర్వీసుల రాబడి కోల్పోవడంతోపాటు ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లి వచ్చేందుకు అయ్యే ఖర్చుతో తడిసిమోపెడవుతుంది. ఈశాన్య రాష్ట్రాల్లో తక్కువ పన్నులతో వచ్చే మిగులు కంటే ఈ ఆర్థిక భారం అధికం. దీంతో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు తమ బస్సుల రిజిస్ట్రేషన్‌ను ఆంధ్రప్రదేశ్‌కు మార్చుకోవాల్సిన అనివార్యత ఏర్పడింది. రాష్ట్ర రవాణా శాఖ అధికారులు చేయాల్సింది... కేంద్రం తాజాగా జారీ చేసిన నిబంధనలను ట్రావెల్స్ యజమానులు కచ్చితంగా పాటిస్తున్నారా లేదా అంటే.. నెలలో అయిదు రోజులపాటు ఈశాన్య రాష్ట్రాల్లో సర్వీసులు నిర్వహిస్తున్నారా లేదా అని విస్తృతంగా తనిఖీలు చేయడమే. నిబంధనలను పాటించని బస్సులపై జరిమానాలు విధించడమే. దాంతో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు తమ బస్సుల రిజిస్ట్రేషన్‌ను ఆంధ్రప్రదేశ్‌కు మారుస్తారు.

కీలక నేత రూ.18 కోట్ల డీల్ ... ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.100 కోట్ల గండి

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రైవేట్ బస్సులపై పన్నులు తగ్గించాల్సిన అవసరం ఆంధ్రప్రదేశ్‌కు గానీ ఇతర దక్షిణ భారత రాష్ట్రాలకు ఏమాత్రం లేదు. ప్రస్తుతం ఉన్న పన్నుల విధానం కొనసాగిస్తే చాలు.. ఖజానాకు ఆదాయం వస్తుంది. ఇదే విషయాన్ని రవాణా శాఖ అధికారులు ప్రభుత్వానికి చెప్పారు. కానీ 'ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వస్తే నాకేంటీ అని ప్రభుత్వంలో ఓ కీలక నేత భావించారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి తన సొంత ఖజానా నింపుకునే పనిలో పడ్డారు. అదే విషయాన్ని తనతో సంప్రదింపులు జరిపిన ట్రావెల్స్ సిండికేట్‌కు స్పష్టం చేశారు. తనకు భారీగా ముడుపులు ముట్టజెప్పితే ట్రావెల్స్ బస్సులపై పన్నులు తగ్గిస్తానని ఆఫర్ ఇచ్చారు. ఒక్కో బస్సుకు రూ.లక్ష చొప్పున ఇస్తే.. ఒక్కో సీటుపై పన్నును రూ.4వేల నుంచి రూ.2,500కు తగ్గిస్తామని ఆయన తన రేటు స్పష్టం చేశారు. అందుకు ట్రావెల్స్ సిండికేట్ సమ్మతించింది. ఈశాన్య రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో రాష్ట్రంలో దాదాపు రూ.1,800 ట్రావెల్స్ బస్సులు ఉన్నాయి. బస్సుకు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.18కోట్లకు డీల్‌ను సూత్రప్రాయంగా ఆమోదించారు. దీంతో పన్ను రేట్లు తగ్గిస్తూ ప్రతిపాదనలు రూపొందించాలని కీలక నేత రవాణా శాఖ అధికారులను మౌఖికంగా ఆదేశించారు. ఇక పన్ను రేట్లు తగ్గిస్తూ ఉత్తర్వులు వెలువడటం.. కీలక నేతకు రూ.18కోట్లు ముడుపులు ముట్టడమే మిగిలింది. కానీ ప్రభుత్వ ఖజానాకు మాత్రం ఏటా రూ.100 కోట్ల గండి పడనుంది.

క్లుప్తంగా...

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల సమీకృత బీటెక్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 2026–27 విద్యా సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన అభ్యర్థుల జాబితాను జూన్ 12న విడుదల చేస్తారు. జూన్ 19, 20 తేదీల్లో నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లకు ఎంపికైన అభ్యర్థులకు నూజివీడు, ఇడుపులపాయలలో, జూన్ 22, 23 తేదీల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఎచ్చెర్లలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు జూన్ 5 నుంచి 8 వరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. ఒక్కో క్యాంపస్‌లో ఉన్న వెయ్యి సీట్లకు అదనంగా మరో వంద చొప్పున ఈడబ్ల్యూఎస్ సీట్లను భర్తీ చేస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు జూలై 1న ఆయా క్యాంపస్‌లలో రిపోర్ట్ చేయాలి.

విశాఖలో ఎన్ఐఏ పోలీస్ స్టేషన్

సాక్షి, అమరావతి : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విభాగాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసింది. రాష్ట్రం యూనిట్‌గా విశాఖపట్నంలోని రుషికొండ ప్రాంతంలోని భారతీనగర్‌లో ఎన్ఐఏ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర హోం శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉగ్రవాద కార్యకలాపాలు నిర్మూలన లక్ష్యంగా ఈ పోలీస్ స్టేషన్ విధులు నిర్వహిస్తుంది సూపరింటెండెంట్ స్థాయి అధికారితో పాటు ఇతర అధికారులు, సిబ్బందిని ఎన్ఐఏ కేటాయించింది.

ఉత్తమ ఉపాధ్యాయులకు సింగపూర్‌లో శిక్షణ

4 నుంచి 8 వరకు టూర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను శిక్షణ నిమిత్తం ప్రభుత్వం సింగపూర్ తీసుకెళ్తోంది. ఈ నెల 4 నుంచి 8 వరకు సింగపూర్‌లోని జాతీయ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దే అంశాలపై శిక్షణ అందించనుంది. దీని కోసం 37 మంది టీచర్లను ఎంపిక చేశారు. సింగపూర్ వెళ్లే బృందంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌తో కూడిన 42 మంది ఉన్నారు.

'నీట్' నిర్వహణలో ఎన్‌టీఏ మార్గదర్శకాలు పాటించాలి

గోసలైట్స్ చైర్మన్ నరేంద్రబాబు

పెనమలూరు: అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల ప్రవేశం కోసం నిర్వహించే నీట్ యూజీ–2026 పరీక్షల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) మార్గదర్శకాలు విధిగా పాటించాలని గోసలైట్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ నరేంద్రబాబు అన్నారు. శుక్రవారం ఆయన కృష్ణా జిల్లా పోరంకిలో మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనివార్య కారణాలతో ఇన్విజిలేటర్ల ప్రక్రియ ఆలస్యమైతే విద్యార్థులకు అదనపు సమయం ఇవ్వాలని కోరారు. ఎన్‌టీఏ మార్గదర్శకాల ప్రకారం పరీక్ష గదిలో డిజిటల్ గడియారాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

నేడు దేశవ్యాప్తంగా సెల్ బ్రాడ్‌కాస్ట్ టెస్ట్ అలర్ట్

సాక్షి, హైదరాబాద్: జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ఆధ్వర్యంలో శనివారం దేశవ్యాప్తంగా సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ వ్యవస్థపై అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, రాజధాని నగరాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పౌరుల మొబైల్ ఫోన్లకు అత్యవసర అలర్ట్ నోటిఫికేషన్ గట్టిగా శబ్దం లేదా వైబ్రేషన్‌తో రావచ్చని అగ్నిమాపకశాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఇది అలర్ట్ వ్యవస్థ సమర్థతను పరీక్షించేందుకు పంపే సందేశం మాత్రమేనని, ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదని అధికారులు స్పష్టం చేశారు.

జీఎస్టీ ఢమాల్

ఏప్రిల్‌లో 2.7 శాతం తగ్గిన రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు

రూ.4,686 కోట్ల నుంచి రూ.4,323 కోట్లకు పడిపోయిన ఏప్రిల్ జీఎస్టీ వసూళ్లు



రాష్ట్రం	ఏప్రిల్ జీఎస్టీ రూ. కోట్లలో	వృద్ధి
ఆంధ్రప్రదేశ్	4,323	-2.7% ▼
కర్ణాటక	18,939	14.5% ▲
తెలంగాణ	7,181	12.6% ▲
కేరళ	3,845	12.4% ▲
తమిళనాడు	13,561	4.3% ▲

సాక్షి, అమరావతి: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు అధికారం చేపట్టినప్పటి నుంచి జీఎస్టీ వసూళ్లు తిరోగమన దిశలోనే పయనిస్తున్నాయి. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్‌లో రాష్ట్ర స్థూల జీఎస్టీ వసూళ్లు 2.7 % తగ్గినట్లు కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన గణాంకాల్లో పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం రూ.4,686 కోట్లుగా ఉన్న స్థూల జీఎస్టీ వసూళ్లు ఈ ఏడాది రూ.4,323 కోట్లకు పడిపోయాయి. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా 4.3% వృద్ధి నమోదైంది.

పొరుగు రాష్ట్రాల్లో వృద్ధి

కర్ణాటకలో 14.5 శాతం, తెలంగాణ 12.6 శాతం, కేరళ 12.4 శాతం, తమిళనాడు 4.3 శాతం చొప్పున జీఎస్టీ వసూళ్లలో వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. కాగా రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు తగ్గడానికి వాహనాలు, సిమెంట్, లోహాల ధరలు క్షీణించడమే కారణమని రాష్ట్ర ప్రధాన పన్నుల అధికారి ఎ.బాబు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్టీ ఆదాయం (2025–26 లో) 5.41 శాతం క్షీణించి రూ.44,825 కోట్ల నుంచి రూ.42,397 కోట్లకు పడిపోయిన సంగతి తెలిసిందే.

ఆదాయం పెరిగినట్టు చూపడానికి ఆపసోపాలు

జీఎస్టీ ఆదాయం పడిపోవడంతో లెక్కలు పెంచడానికి ప్రభుత్వం ఆపసోపాలు పడింది. పెట్రోలియం, లిక్కర్‌పై వ్యాట్‌తో పాటు వృత్తిపన్ను వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఆదాయం ఏప్రిల్‌లో 12.08 శాతం పెరిగినట్లు రాష్ట్ర ప్రధాన పన్నుల అధికారి ఎ.బాబు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది రూ.4,946 కోట్లుగా ఉన్న వాణిజ్యపన్నుల శాఖ వసూళ్లు ఈ ఏడాది రూ.5,543 కోట్లకు చేరినట్లు తెలిపారు. రాష్ట్రంలో జీఎస్టీ ఎగవేతలను అరికట్టడానికి ఏఐ ఆధారిత టెక్నాలజీని వినియోగిస్తున్నామని పేర్కొన్నారు.

కూలిపనికి వెళ్లి కుప్ప'కూలీ'

ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో వడగాడ్పులకు ఇద్దరు ఉపాధి కూలీల మృతి

మస్తాన్‌వలి మృతదేహం

సంతమాగులూరు (అద్దంకి)/ రైల్వేకోడూరు అర్బన్: బతుకు పోరాటంలో భాగంగా కూలి కోసం వెళ్లిన ఇద్దరు కూలీలు మే డే రోజే కుప్పకూలిపోయారు. వడగాడ్పులకు పిట్టల్లా రాలిపోయారు. మే డే రోజున కూలీలు చనిపోవడం విషాదం నింపింది. వివరాలు.. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కొమ్మాలపాడుకు చెందిన మస్తాన్‌వలి (56) ఉపాధి హామీ పనికి వెళ్లాడు. అక్కడ పనిచేస్తూ ఉన్నట్లుండి కుప్పకూలి పడిపోయాడు. తోటి కూలీలు గ్రామంలోని వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎంపీడీవో జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి తేజస్విని సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

తిరుపతి జిల్లాలో మహిళ మృతి

తురక నాగమణి (54)

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండలం ఓకొత్తపల్లి పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన ఉపాధి కూలీ తురక నాగమణి (54) పని ముగించుకుని ఇంటికి వస్తుండగా వడదెబ్బబారిన పడి కుప్పకూలి పోయింది. తోటి కూలీలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే నాగమణి మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఉపాధి పనులు చేస్తున్న చోట ప్రభుత్వం సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతోనే కూలీలు మృతి చెందుతున్నారని పలువురు మండిపడుతున్నారు.

చండ ప్రచండ భానుడు!

- రాష్ట్రంలో మంటలు పుట్టిస్తున్న ఎండలు
- తీవ్ర వడగాడ్పులు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనం
- పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత
- 252 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఎండలు మరింత తీవ్రతరమయ్యాయి. మండుతున్న ఎండలకు తోడు వడగాడ్పులు, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 252 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో గరిష్టంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎండ ప్రభావం తీవ్రంగా ఉంటోంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకూ అయితే ఇళ్లల్లోంచి జనం బయటకు రావడానికే భయపడిపోతున్నారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో 45.5, కృష్ణా జిల్లా పెదపారుపూడి, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు 45.1, ప్రకాశం జిల్లా అద్దంకిలో 44.6, ఏలూరు జిల్లా అల్లిపల్లి, మార్కాపురం జిల్లా పెద్దచేర్లోపల్లిలో 44.5, తిరుపతి జిల్లా వెంకటగిరి 44.4, గుంటూరు జిల్లా చేబ్రోలు 44.1, బాపట్ల జిల్లా కారంచేడు 44, నంద్యాలజిల్లా సంజామల, వైఎస్సార్ కడప జిల్లా కోడూరు 43.2, పోలవరం జిల్లా కూనవరంలో 42.6, చిత్తూరు జిల్లా తవణంపల్లె, విశాఖ జిల్లా ములగాడలో 42.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు దక్షిణ ఒడిశా నుంచి తెలంగాణ, ఏపీ, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో పలుచోట్ల అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఆది, సోమవారాల్లో కొన్ని జిల్లాల్లో ఎండతీవ్రత స్వల్పంగా తగ్గి ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

సజ్జల రామకృష్ణారెడ్డితో శ్రీహరి తదితరులు

మాట్లాడుతున్న న్యాయవాది సుధాకర్‌రెడ్డి

కోర్టులు చీవాట్లు పెట్టినా..
మారని పోలీసులు

- న్యాయ రక్షణ కోసం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ పోరాటం
- సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- పూడి శ్రీహరి రిమాండ్‌ను తిరస్కరించిన గుంటూరు కోర్టు

సాక్షి అమరావతి/పట్నంబజారు /నగరంపాలెం: రాష్ట్రంలో పోలీసులు ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలు విస్మరిస్తూ.. ప్రభుత్వ పెద్దల ప్రయోజ నాల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నారని సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి విమర్శించారు. కేసులు వీగిపోతే అవే కేసులు మళ్లీ నమోదు చేయడం దేశ చరిత్రలో ఎక్కడా చూడలేదన్నారు. అయితే పాలకుల సేవలో పోలీ సుల అత్యుత్సాహానికి కోర్టులు అడ్డుకట్ట వేస్తున్నా యని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి(మీడియా వ్యవహారాలు) పూడి శ్రీహరికి రిమాండ్‌ను తిరస్కరిస్తూ గుంటూరు కోర్టు ఆదేశాలు ఇచ్చిన అనంతరం పొన్నవోలు మీడియాతో మాట్లాడుతూ న్యాయ రక్షణ కోసం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ మా నాయకులు, కార్యకర్తలపై చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కుతోందన్నారు. పూడి శ్రీహరి మాట్లాడుతూ తనపై ఇటువంటి కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి. మాజీ డీఎస్పీ సుదర్శనరెడ్డి, గుంటూరు తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చి పంపించండి

కాగా గురువారం కుప్పంలో అరెస్ట్ చేసి గుంటూరు తీసుకొచ్చిన శ్రీహరిని పోలీసులు శుక్రవారం ఉదయం గుంటూరు జీజీహెచ్‌కు వైద్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్లారు. ఈ క్రమంలో శ్రీహరిని పరామర్శించడానికి వచ్చిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని పోలీసులు అనుమతించలేదు. ఈ సందర్భంగా కొంత ఉద్రిక్తత నెలకొంది. అక్కడి నుంచి శ్రీహరిని జిల్లా కోర్టుకు తరలించి, నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రవేశపెట్టారు. పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితర సీనియర్ న్యాయవాదులు శ్రీహరి తరపున సుదీర్ఘ వాదనలు వినిపించారు. అనంతరం శ్రీహరికి రిమాండ్‌ను జడ్జి తిరస్కరించారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు జారీ చేయాలని ఆదేశాలిచ్చారు. శ్రీహరికి కోర్టుల రిమాండ్ తిరస్కరణ పక్షం రోజుల వ్యవధిలో ఇది మూడోసారి. ఇప్పటికే రెండు సార్లు కుప్పం కోర్టు ఆయనకు రిమాండ్ తిరస్కరించిన సంగతి తెలిసిందే.

నోటీసులు ఇవ్వండి.. హైకోర్టు ఆదేశం

కాగా, శ్రీహరికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని నల్లపాడు పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మే 5కి వాయిదా వేసింది. అలాగే, శ్రీహరిపై గుంటూరు, కొత్తపేట పోలీసులు నమోదు చేసిన కేసులో విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పాక్ జలసంధిని ఈదిన ఇషాంక్ సింగ్

ఏడేళ్ల బాలుడి సరికొత్త రికార్డు

సాక్షి, చెన్నై : జార్ఖండ్ రాజధాని రాంచీకి చెందిన ఏడేళ్ల బాలుడు ఇషాంక్ సింగ్ సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించాడు. అత్యంత ప్రమాదకరమైన పాక్ జలసంధిని ఈది దాటిన అతి పిన్న వయస్కుడిగా సరికొత్త చరిత్ర లిఖించాడు. శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి భారతదేశంలోని ధనుష్కోటి వరకు ఉన్న 29 కిలోమీటర్ల సముద్ర మార్గాన్ని ఈ చిన్నారి విజయవంతంగా దాటాడు. ఇషాంక్‌సింగ్ ఈ 29 కిలోమీటర్ల కఠినమైన సముద్ర మార్గాన్ని కేవలం 9 గంటల 50 నిమిషాల్లో ఈది ముగించాడు. గురువారం తెల్లవారు జామున 4 గంటలకు తలైమన్నార్ (శ్రీలంక) తీరంలో తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఇషాంక్ మధ్యాహ్నం 1.50 గంటల ప్రాంతంలో ధనుష్కోటిలోని అరిచల్‌మునై (భారతదేశం) తీరానికి చేరుకున్నాడని శుక్రవారం వివరాలను ప్రకటించారు. సముద్రంలో ఎదురయ్యే బలమైన అలలు, ప్రమాదకరమైన జెల్లీఫిష్‌లు, ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుని ఈ ఘనత సాధించాడు. ఈ అద్భుతమైన ప్రదర్శనకుగాను యూనివర్సల్ రికార్డ్స్ ఫోరమ్ ఇషాంక్ సింగ్‌కు 'యంగెస్ట్ అండ్ ఫాస్టెస్ట్ పాక్ స్ట్రెయిట్ స్విమ్మర్' అనే ప్రపంచ రికార్డు సర్టిఫికెట్‌ను అందజేసింది. ఇషాంక్ ధనుష్కోటి తీరానికి చేరుకోగానే అక్కడి భారత కోస్ట్ గార్డ్ సిబ్బంది, అధికారులు, ప్రజలు అతనికి హారతి ఇచ్చి ఘనస్వాగతం పలికారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈ అసాధారణ ప్రతిభపై స్పందిస్తూ ఏడేళ్ల వయసులోనే ఇషాంక్ ఇంతటి కఠినమైన రికార్డును సాధించడం జార్ఖండ్ రాష్ట్రానికే కాకుండా దేశానికే గర్వకారణమని ప్రశంసించారు.

నిత్యానందరెడ్డి విషయంలో చట్ట ప్రకారం నడుచుకోండి

కడప రిమ్స్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి అమరావతి: రియల్ ఎస్టేట్ వ్యాపారి, పెద దస్తగిరి హత్య కేసుకు సంబంధించి నిత్యానంద రెడ్డి విషయంలో చట్ట ప్రకారం నడుచుకోవాలని కడప రిమ్స్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ (35)ఏ కింద నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని నిత్యానందరెడ్డికి నిర్దేశించింది. తదుపరి విచారణను వేసవి సెలవుల తరువాతకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దస్తగిరి హత్య కేసులో తనపై నమోదు చేసిన అక్రమ కేసును కొట్టేయాలని కోరుతూ నిత్యానందరెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఆయన తరపున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ, 'పోలీసులు మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిత్యానందరెడ్డి పేరు లేదు. ఆ తరువాత రాజకీయ కారణాలతో నిందితునిగా చేర్చారు. హత్యకు పాల్పడిన వారికి ఆశ్రయం కల్పించారన్నదే పిటిషనర్‌పై ఆరోపణ. ఈ ఆరోపణలకు సంబంధించిన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షను మాత్రమే నిర్దేశిస్తున్నాయి' అని పేర్కొన్నారు.

ఈ షాడో మంత్రి ఓ కంత్రీ!

విద్యాశాఖలో మంత్రి ఓఎస్డీ ఓవరాక్షన్

సాక్షి, అమరావతి : అతనో కంత్రి.. కానీ, తానే మంత్రినన్నట్లుగా పెత్తనం. ప్రభుత్వోద్యోగాన్ని అడ్డం పెట్టుకుని సాగించిన అవినీతి అంతా ఇంతా కాదు. గ్రూప్–1 అధికారిగా తోటి ఉద్యోగులనే వేధించి డబ్బుల కోసం పీడించిన ఘన చరిత్ర ఆయనది. అందుకే మంత్రి ఓఎస్డీగా నియమిస్తున్నప్పుడు రాష్ట్ర నిఘా వ్యవస్థ అతనిపై నెగిటివ్ రిపోర్టు ఇచ్చింది. అయితే, విద్యాశాఖ మంత్రి ఇష్టపడి మరీ ఓఎస్డీగా పెట్టుకోవడంతో ఉన్నత విద్యకు ఆయన రాక పెనుశాపంగా మారింది. ప్రస్తుతం విద్యాశాఖలో షాడో మంత్రిగా చక్రం తిప్పుతున్న సదరు ఓఎస్డీ తన హోదాను మరిచి ప్రవర్తిస్తుండటం, నిబంధనలను బేఖాతరు చేస్తూ ఆదేశాలిస్తుండడంతో ఉద్యోగులు, విద్యావేత్తలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తనకు సంబంధంలేని అంశాల్లో పదేపదే తలదూరుస్తూ నోటికొచ్చినట్లు తూలనాడడం ఉద్యోగులను కలవరపరుస్తోంది. ఉన్నత విద్యా వ్యవస్థల్లో సర్వసాధారణంగా చేపట్టే పనులను సైతం తన అనుమతిలేకుండా చేస్తే 'సార్ ఊరుకోవట్లేదు'.. 'రూల్స్ మాట్లాడొద్దు.. నా మాటే రూల్' అంటూ శాసించే స్థాయికి ఆయన వచ్చేశారు.

అంతు చూస్తానని బెదిరింపులు..

వాస్తవానికి.. ఉన్నత విద్యా మండలి చైర్మన్ హోదా కార్యదర్శి కంటే పెద్దది. అలాంటి చోట గౌరవ మర్యాదలతో వ్యవహరించాల్సిన గ్రూప్–1 కేడర్‌కు చెందిన ఈ ఓఎస్డీ.. తాను ఫోన్‌చేస్తే మంత్రితో ఎలా వ్యవహరిస్తారో అలాగే నడుచుకోవాలని హుకుం జారీచేస్తున్నారు. అర్ధరాత్రి.. అపరాత్రి తేడా లేకుండా ఫోన్లు చేసి మరీ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని వర్సిటీల అధికారులు, ఉన్నత విద్యామండలి అధికారులు గగ్గోలు పెడుతున్నారు. నోట్‌ఫైల్ ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తూ నోటిమాట ద్వారా తాను చెప్పింది చేసేయాలని లేకుంటే ఉద్యోగాలు ఊడగొడతానంటూ బెదిరింపులకు తెగబడుతున్నారు. ఇది తప్పని ఎవరైనా చెబితే అంతుచూస్తానంటూ హెచ్చరించడం సర్వసాధారణమైపోయింది. ఒక వ్యవస్థ దగ్గర లేని అధికారానికి బాధ్యతను అంటగట్టి బలిపశువును చేస్తూ ఫోన్లో ఇష్టమొచ్చినట్లు చిందులేయడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఉన్నత విద్యాశాఖలో జీఓ నెం–3 ద్వారా వర్సిటీల పర్యవేక్షణ బాధ్యత పూర్తిగా ఉన్నత విద్యా కమిషనరేట్‌కు బదిలీ అయ్యింది. అయితే, సదరు ఓఎస్డీ ఉన్నత విద్యామండలికి ఫోన్‌చేసి వర్సిటీ సమగ్ర డేటాను తీసుకురావాలని మౌఖికంగా ఆదేశించారు. ఇది తమ పరిధిలో లేదని, చైర్మన్ అనుమతిలేకుండా ఎలాంటి డేటా ఇవ్వలేమని చెప్పడంతో సదరు ఓఎస్డీ ఫోన్‌లోనే వీరంగం వేసేశారు.

ఓఎస్డీ ఆడింది ఆట.. పాడింది పాట..

గతేడాది ఓఏఎండీసీ (డిగ్రీ) ప్రవేశాల సమయంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి అనుమతులు ఇవ్వడంలో జాప్యంచేస్తే సదరు ఓఎస్డీ ఉన్నత విద్యామండలి అధికారులను నోటికొచ్చినట్లు తిట్టిపోశారు. ఇలా 20–30 ఏళ్ల సుదీర్ఘ పరిపాలన, విద్యా రంగంలో అనుభవం కలిగిన వ్యక్తులను సైతం అత్యంత హేయమైన పదజాలంతో మాట్లాడడం తమను మానసిక క్షోభకు గురిచేస్తోందని వారు వాపోతున్నారు. కొందరైతే.. ఓఎస్డీ నుంచి ఫోన్ వస్తే చాలు భయంతో వణికిపోయి అనారోగ్యం పాలవుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల నుంచి రూ.1,500 కోట్ల మేర నిధులు లాక్కోవడంలో సదరు ఓఎస్డీ చేసిన హంగామా అంతాఇంతా కాదు. డబ్బులిచ్చే వరకు ఉన్నత విద్యామండలి, వర్సిటీల అధికారులను మాటలతో చిత్ర హింసలకు గురిచేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తొలుత ఏపీ స్టేట్ ఫైనాన్సియల్ కార్పొరేషన్‌లో నిధులు డిపాజిట్ చేస్తే 7.75 శాతం వడ్డీ ఇస్తామని నమ్మబలికి ఆ తర్వాత 7.55 శాతానికే పరిమితం చేసేశారు. ఇప్పుడది మార్చుమని వర్సిటీలు, అధికారులు కోరుకుంటే సదరు ఓఎస్డీ 'నన్నే ప్రశ్నిస్తారా? మీ సంగతి తేలుస్తా'నని హెచ్చరించడం కొసమెరుపు.

మంత్రి అపాయింట్‌మెంటూ దొరకట్లేదు

ఇదిలా ఉంటే.. తమ సమస్యలు చెప్పుకునేందుకు మంత్రి అపాయింట్‌మెంట్ కూడా ఈయనవల్ల దొరకట్లేదు. ఎంతటివారైనా ఓఎస్డీని కలవాల్సిందే. వినతిపత్రాలు ఆయనకే ఇవ్వాలి. అందుకే ఓఎస్డీ ఆడింది ఆట.. పాడింది పాటగా మారిపోయింది. పాఠశాలలు, కళాశాలల అనుమతులను కావాలనే అడ్డుకోవడం ద్వారా భారీగా ముడుపులు దండుకోవడం రివాజైపోయింది. అలాంటి ఓఎస్డీ ఉన్నత విద్యాశాఖను శాసిస్తుండడం విద్యా వ్యవస్థకు ఎనలేని చేటుచేస్తోంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey No. 766/2, Ankireddypalem Village, Guntur Rural, Guntur District. Andhra Pradesh. and Printed at Jagati Publications Limited, D.No. 5 - 25, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, A.P. & Jagati Publications Limited, Sakshi Press, Sy.No. 766/2, Ankireddypalem Village, Guntur Rural, Guntur District. A.P. EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

డీఎంఈగా డాక్టర్ రాధికారెడ్డి

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)గా డాక్టర్ రాధికారెడ్డికి ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఇస్తూ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. డీఎంఈ డాక్టర్ రఘునందన్ శుక్ర వారం నుంచి రెండు వారాల పాటు వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో అడిషనల్ డీఎంఈ రాధికారెడ్డికి ఎఫ్ఏసీ ఇచ్చినట్టు తెలిసింది.

సిఫారసు బదిలీలు ఆపాలి: రూసో

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ బదిలీల చట్టానికి తూట్లు పొడుస్తూ దొడ్డిదారిన చేస్తున్న సిఫారసు బదిలీలను వెంటనే ఆపాలని రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాల యునైటెడ్ ఆర్గనైజేషన్(రూసో) చైర్మన్ సీవీ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. షెడ్యూల్ బదిలీలకు విరుద్ధంగా అక్రమ బదిలీలు చేస్తే ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలలో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పోస్టింగ్ ఆర్డర్లను వెంటనే రద్దు చేయాలన్నారు. రాజధానికి దగ్గరగా ఉన్న జిల్లాల్లో సిఫారసు బదిలీలు ఎక్కువగా జరుగుతున్నట్టు వస్తున్న వార్తలపై విద్యాశాఖ స్పందించాలన్నారు. కొత్త జిల్లాలకు కేడర్ వారీగా సీనియారిటీ, విల్లింగ్ ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని కోరారు.

కార్మికుల హక్కుల కోసం ఐక్యపోరాటాలు: సీపీఎం

సాక్షి, అమరావతి: హక్కుల కోసం కార్మికులు, శ్రామికులు, గిగ్ వర్కర్లు, వ్యవసాయ కార్మికులు ఐక్యపోరాటాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా విజయవాడలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం వద్ద శుక్రవారం పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌ల ప్రమాదం ప్రతి ఒక్కరూ గుర్తించాలని, దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. లేబర్ కోడ్‌లు వచ్చిన తరువాత టాప్ 50 కార్పొరేట్ కంపెనీల ఆదాయం మూడు శాతం పెరిగిందన్నారు.

ఆలయాల అభివృద్ధికి అధికారుల కమిటీ

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని వివిధ ఆలయాల అభివృద్ధి పనులకు సంబంధించి గతంలో తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌లను సమీక్షించడం.. అవసరమైన ఆలయాలకు కొత్త మాస్టర్ ప్లాన్లు రూపొందించేందుకు అధికారులతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ ఆరునెలల్లో ఆయా ఆలయాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్లకు తుదిరూపు ఇవ్వాలని పేర్కొంది.

అరణ్యం వదిలి.. జనారణ్యంలోకి!



చిత్తూరు జిల్లాలో పెరుగుతున్న చిరుతల రాక

అడవుల్లో ఉండాల్సిన చిరుత పులులు జనారణ్యంలోకి వస్తున్నాయి. ఆహారం, నీరు లేక నీరసించి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నాయి. ఇలాంటి ఘటనే ఇప్పుడు చిత్తూరులో చోటు చేసుకుంది. ఇటీవల వరుసగా రెండు చిరుత పులులు జనారణ్యంలోకి వచ్చి మృత్యువాత పడ్డాయి. మరికొన్ని అక్కడక్కడా తచ్చాడుతూ జనాల్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అటవీశాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

గజగజా వణుకుతున్న చిత్తూరు ప్రజలు

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల చిత్తూరు నగరంలోని సీజీపల్లెలో చిరుతపులి మెట్లులేని పాడుబడిన బావిలో పడి ప్రమాదవశాత్తు మరణించింది. అలాగే గత ఆదివారం దొడ్డిపల్లె హౌసింగ్ కాలనీలో గాయపడి ఆహారం లేక ప్రాణాలు విడిచింది. ఇది ఒక్క చిత్తూరులోని పరిస్థితే కాదు.. జిల్లా వ్యాప్తంగా ఉన్న దుస్థితి. అభయారణ్యంలో సరైన ఆహారం, నీరు దొరకకపోవడంతో చిరుతలు, క్రూరమృగాలు జనావాసాల్లోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. 2011 నవంబర్ 29 నుంచి 2026 ఏప్రిల్ 19 వరకు తొమ్మిది చిరుత పులులు ప్రాణాలు విడిచాయి. వీటి సంరక్షణ, కట్టడి గురించి అటవీశాఖ లైట్ తీసుకుంటోందన్న వాదన బలంగా వినిపిస్తోంది.

పులుల లెక్క తేలేదెట్టా?

జిల్లాలో మొత్తం 1.95 లక్షల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. చిత్తూరు ఈస్ట్, వెస్ట్, కార్వేటినగరం, పలమనేరు, పుంగనూరు, కుప్పంతో మొత్తం 6 రేంజ్‌లున్నాయి. మొత్తం 24 సెక్షన్లు, 84 బీట్లు ఉన్నాయి. కానీ అధికారికంగా జిల్లాలో ఎన్ని పులులు ఉన్నాయంటే అటవీశాఖ అధికారుల వద్ద ప్రాథమిక సమాచారం లేదు. ఇటీవల జరిగిన జంతుగణనలో కూడా సరైన సమాచారం దొరకలేదు. ఎక్కువగా తిరుపతి, తమిళనాడు అటవీ ప్రాంతం నుంచి ఇటువైపు చిరుతలు వస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కాలక్రమేణా వాటి సంతతి పెరగడంతో వందల సంఖ్యలో జిల్లాలోని అడవుల్లో పులులు సంచరిస్తున్నట్లు సమాచారం.

వలయాల ఆక్రమణ

పులుల వయస్సు ఐదేళ్లు దాటేసరికి తమకంటూ ఓ వలయాన్ని సృష్టించుకుంటాయి. ఆ పై మరో పదేళ్ల పాటు ఆ వలయంలో జీవిస్తాయి. ఇవి ఆక్రమణలకు గురైతే వాటి ఆవాసం ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ సమయంలో అడవులను దాటి జనావాసాలకు వస్తుంటాయి. ఇలా 2011 నుంచి ఇప్పటి వరకు అనేక కారణాలతో చిరుతలు మృతిచెందాయి.

సిబ్బంది కొరత

పులుల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా సిబ్బంది అంటూ లేరు. వాటి సంరక్షణకు చర్యలు పెద్దగా లేవు. ప్రస్తుతం ఉన్న కింద స్థాయి సిబ్బందితోనే పనులు చేస్తున్నారు. ఉదాహరణకు చిత్తూరు ఈస్ట్, వెస్ట్ పరంగా ఎఫ్‌బీఓ, ఏబీఓలు 65 మంది ఉండాల్సి ఉండగా దాదాపు 30 మంది వరకు సిబ్బంది కొరత

చిత్తూరులోని సీజీపల్లెలో మరణించిన చిరుత

ఆ అడవుల నుంచే!

తిరుపతి, తమిళనాడు, కర్ణాటక అడవుల నుంచి చిరుతలు వచ్చినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. ఎండకాలం కావడంతో అడవిలో మరింత వేడిగా ఉండడం, నీరు దొరకకపోవడంతో అటవి నుంచి బయటకు వస్తున్నట్లు భావిస్తున్నారు. కొందరు ఆకతాయిలు అడవుల్లో నిప్పు పెట్టడంతో భయాందోళనకు గురై బయటకు వస్తున్నట్టు తెలుస్తోంది. ఎక్కువగా అడవి పక్కన ఉండే ప్రాంతాలు, గ్రామాలకు ఇవి వస్తున్నాయి. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండే పొలాలు, స్థలాలు, ఇళ్ల వద్ద ఉండే వారు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉన్నారు. అలాగే ఔట్‌సోరింగ్ సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చిరుతల కట్టడి కష్టమే మరి..!

యాదమరి కీనాటంపల్లె ఉచ్చులో మరణించిన పులి (ఫైల్)

జాగ్రత్తలు తప్పనిసరి

- అడవిలో ఎక్కడైనా జింక, పశువు చనిపోయి ఉంటే సమీపంలో పులి ఉంటుందని సంకేతం.
- అలాగే పక్షులు, నెమళ్ల అరుపులు వినిపిస్తే అప్రమత్తం కావాలి.
- పెద్ద పులి, చిరుత వచ్చేటప్పుడు అలారంలా నెమళ్లు అరుపులతో హెచ్చరికలు చేస్తాయి.
- అడవుల్లో పొదలు, గుహలు వంటి చీకటి ప్రదేశాలు పులులకు ఆవాసాలు.
- అడవిలోకి ఒంటరిగా వెళ్లొద్దు. చేతిలో బలమైన వెదురు కర్ర ఉండాలి. సమీప గ్రామస్తుల్ని వెంట తీసుకువెళ్లాలి.
- పులిని చూసేటప్పుడు అసలు భయపడకూడదు. పులిని చూసిన వెంటనే పరుగెత్తకూడదు.
- పులి సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఉదయం, సాయంత్రం, చీకటి పడిన తర్వాత పులి కదలికలు ఎక్కువగా ఉంటాయి. రాత్రివేళ మరింత చురుగ్గా ఉంటాయి. ఈ సమయాల్లో ఎక్కువగా తిరగకూడదు.
- రంగు రంగుల దుస్తులు కాకుండా లేత రంగుల దుస్తులు ధరించాలి.
- చీకటిలో ఆరుబయట బహిర్భూమికి వెళ్లరాదు.
- పులి కదలికలు ఉండే ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లరాదు.

నిస్సహాయ స్థితి

పులులు వస్తున్నా అటవీశాఖ వాటి కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతోంది. వేలాది ఎకరాల్లో అటవీ ప్రాంతం ఉందని, అవి ఏ పక్క నుంచి వస్తాయో తెలుసుకోవడం కష్టమంటున్నారు. అనుమానిత ప్రాంతాల్లో ట్రాప్‌కెమెరాలు పెడుతున్నా.. అందులో వాటి జాడ తెలియడం లేదని చెబుతున్నారు. పులి వచ్చినప్పుడు వాటికి గన్‌ద్వారా మత్తు మందు ఇవ్వాలన్నా తిరుపతి జూపార్కు నుంచి వైద్యబృందం వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. రాయలసీమ మొత్తానికి ఈ వైద్య బృందం మాత్రమే ఉంది. జిల్లాకు రెస్క్యూ వాహనం అయిన హనుమాన్‌ను ప్రభుత్వం కేటాయించింది. కానీ అవి పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లో మాత్రమే ఉన్నాయి. జిల్లా కేంద్రంలో లేవు. ఇక్కడ ఉన్న సిబ్బంది వద్ద తగిన పరికరాలు లేవు. దొడ్డిపల్లెలో పులి కొన ఊపిరితో ఉన్నా రెస్క్యూటీం వచ్చే వరకు ప్రాణభయంతో సిబ్బంది నీరుకూడా పోయ లేని పరిస్థితి. పలమనేరు నుంచి వాహనం చిత్తూరుకు చేరుకున్న క్షణాల్లో చిరుత తుదిశ్వాస విడిచింది. జిల్లా కేంద్రములో రెస్క్యూవాహనాలు, డాక్టర్ లేకపోవడం నిస్సయంగా మారింది.

చిత్తూరులోని దొడ్డిపల్లెలో చనిపోయిన చిరుత

వ్యక్తిగత అభిరుచులకే ఎక్కువ సమయం

- రోజులో దాదాపు 11.50 గంటలు వెచ్చిస్తున్న పురుషులు
- 11.10 గంటలు కేటాయిస్తున్న మహిళలు
- కేంద్ర గణాంకాల శాఖ నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: పురుషులు, మహిళలు వ్యక్తిగత అభిరుచులకే రోజులో ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. అయితే ఇందులో మహిళల కన్నా పురుషులే స్వల్పంగా ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన 'దేశంలో మహిళలు–పురుషులు–2025' నివేదిక వెల్లడించింది. దీని తర్వాత రోజులో అత్యధిక సమయం నైపుణ్యాభివృధి, ఉపాధి కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. ఇప్పటికీ మహిళలు మాత్రమే ఇంటి పనులకు అత్యధిక సమయం వెచ్చిస్తున్నారు. ఈ విషయంలో మహిళలకు, పురుషులకు భారీ వ్యత్యాసం ఉంది. ఇంటి పనులకు మహిళలు రోజులో సుమారు 5 గంటలు వెచ్చిస్తుంటే పురుషులు కేవలం 1.18 గంటలు మాత్రమే కేటాయిస్తున్నారు.

రోజులో మహిళలు, పురుషులు వివిధ కార్యకలాపాల్లో గడుపుతున్న సగటు సమయం (గంటల్లో)

కార్యకలాపాలు	మహిళలు	పురుషులు
వ్యక్తిగత అభిరుచులు	11.10	11.50
సాంస్కృతిక, సోషల్ మీడియా, క్రీడలు	2.10	2.25
మతపరమైన విషయాలు	2.19	2.18
నైపుణ్యాభివృద్ధి	6.18	6.32
స్వచ్ఛంద సేవ, శిక్షణ	1.48	2.19
గృహ సభ్యుల సంరక్షణ సేవలు	2.17	1.15
ఇంటిపనులు	4.49	1.18
సొంత అవసరాలకు వస్తువులు సమకూర్చుకోవడం	1.44	1.57
ఉపాధి కార్యకలాపాలు	5.41	7.28

దివ్యాంగ విద్యార్థులు ఆదర్శప్రాయులు

విద్యార్థి బృందంతో సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: వైకల్యాన్ని జయించి అకుంఠిత దీక్షతో సముద్ర మట్టానికి 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌పై రాష్ట్ర కీర్తిని చాటిన 21 మంది ప్రత్యేకావసరాలు గల విద్యార్థులు ఆదర్శప్రాయులని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ప్రశంసించారు. నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించి, శుక్రవారం విజయవాడ చేరుకున్న విద్యార్థుల బృందం సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో ఎస్పీడీని కలిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ 16 రోజుల సాహస యాత్రలో ఎదురైన సవాళ్లను, అనుభవాలను పంచుకున్నారు.

మున్సిపల్ దుకాణాల అద్దె విధానంలో మార్పు

ఇక నుంచి ఏటా 7 శాతం అద్దె పెంపు

సాక్షి, అమరావతి: మున్సిపల్ దుకాణాల అద్దె విధానంలో కొత్త మార్గదర్శకాలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త విధానం ప్రకారం ఇకపై అద్దెను ఒక్కసారిగా పెంచకుండా ఏటా 7 శాతం చొప్పున పెంచనున్నట్లు వెల్లడించింది. గ్రౌండ్ ఫ్లోర్ దుకాణాలకు ప్రాథమిక అద్దె ఉంటుంది. ఫస్ట్ ఫ్లోర్ దుకాణాలకు 20 శాతం తక్కువ. రెండో అంతస్తు, ఆ పైన ఉన్న దుకాణాలకు 30 శాతం తక్కువ అద్దె విధిస్తామని తెలిపింది. మూడేళ్లకోసారి 33 శాతం పెంచేలా రూపొందించిన మునుపటి విధానంలో భారీగా అద్దె పెంపు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 584 మంది లీజుదారులు కోర్టులను ఆశ్రయించగా, సుమారు రూ.9.43 కోట్ల అద్దె బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

పొగాకు రైతుకు.. ధరల మసి..!

కొనుగోళ్లలో రైతులను ముంచేస్తున్న కంపెనీలు

వేలం చివరిలో రేట్లు పెంచి మాయ చేస్తున్న వ్యాపారులు

పొగాకు రైతులను కొనుగోలు కంపెనీలు ముంచేస్తున్నాయి. రెండేళ్లుగా వేలం కేంద్రాల్లో అమ్మకాలను పరిశీలిస్తే అవుననే అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. వ్యాపారులు కొన్నదే నాణ్యమైన పొగాకు..వారు ఇచ్చిందే రేటు అన్నరీతిలో దోపిడీ చేస్తున్నారు. రైతుల వద్ద పొగాకు ఉత్పత్తులు ఉన్న సమయంలో రేట్లు పెంచకుండా వేలం చివరి దశలో అన్నీ అమ్ముకున్న తరువాత రేట్లు పెంచుతూ మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. గత ఏడాది వేలాన్ని పరిశీలించినా, ప్రస్తుతం చివరి దశలో ఉన్న కర్ణాటక పొగాకు వేలాన్ని పరిశీలించినా వేలంలో వ్యాపారులు చేస్తున్న మోసం అర్థమవుతుంది. ప్రస్తుతం ఇక్కడ గ్రేడ్-1 కిలో పొగాకుకు రూ.250 ఇస్తుండగా, అదే చివరి దశలో ఉన్న కర్ణాటక మార్కెట్‌లో మాత్రం రూ.320ల వరకు ఇస్తున్నారు. వ్యాపారులకు ఒక వైపు పాలకుల అండ, మరో వైపు బోర్డు అధికారులతో కుమ్మక్కు వెరసి రైతులు దగా పడుతున్నాడు. ఆర్థికంగా కుదేలై నష్టాల పాలవుతున్నాడు.

- రైతుల వద్ద ఉత్పత్తులు ఉన్న సమయంలో రేట్లు తగ్గించేసి..
- గతేడాది వేలంలోనూ, ప్రస్తుతం చివరి దశలో ఉన్న కర్ణాటక అమ్మకాల్లోనూ ఇదే తంతు
- రీజియన్ పరిధిలో వేలం ప్రారంభమై 28 రోజులు గడుస్తున్నా ధరల్లో కానరాని మార్పు
- వేలం ప్రారంభంలో గ్రేడ్-1 పొగాకు కిలో రూ.250
- కర్నాటకలో ప్రస్తుతం కిలో పొగాకు రూ.350
- మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా వ్యాపారులు ధరలు పెంచడం లేదన్న ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రస్తుతం పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో అమ్మకాలు సాగుతున్నాయి. 2025–26 ఏడాది పొగాకు సీజన్‌కు సంబంధించిన వేలం ప్రక్రియ రెండు విడతలుగా ప్రారంభించారు. గత నెల 25వ తేదీన కందుకూరు–1, పొదిలి కేంద్రాల్లో వేలాన్ని ప్రారంభించారు. ఈ నెల 9వ తేదీన ఒంగోలు, కొండపి, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, వెల్లంపల్లి వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రీజియన్ పరిధిలో కొనుగోళ్లు ప్రారంభమై దాదాపు 28 రోజులు గడుస్తున్నా కొన్ని కంపెనీలు మాత్రమే వేలంలో పాల్గొంటున్నాయి. మిగతా కంపెనీలు కర్నాటకలో పాల్గొంటున్నాయి. కందుకూరు–1, పొదిలి కేంద్రాల్లో కేజీకి కేవలం రూ.250 ధరతో ప్రారంభమైంది. అదీ నాణ్యమైన బ్రైట్‌గ్రేడ్ పొగాకు రూ.250 మాత్రమే ఇచ్చారు. ప్రస్తుతం అన్ని కేంద్రాల్లో గ్రేడ్–1 పొగాకు కిలోకి రూ.250 పలుకుతోంది. మిగిలిన గ్రేడ్‌లు రూ.220– రూ.240 మధ్యలో కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కిలో సరాసరి ధర రూ.248లు వస్తుంది. ప్రస్తుతం గ్రేడ్–1 పొగాకు కొనుగోళ్లలోనే పరిస్థితి ఇలా ఉంది. ఇక లోగ్రేడ్ పొగాకు కొనుగోలు ప్రారంభమైతే సరాసరి ధరలు మరింత పతనమయ్యే అవకాశాలు ఉన్నాయి. 2024–25 పొగాకు సీజన్ ప్రారంభంలో కిలో పొగాకు రూ.280లకు కొనుగోలు చేశారు. మధ్యలో ధరలు తగ్గించేశారు. అంతర్జాతీయ మార్కెట్‌ను బూచిగా చూపించి రేటు తగ్గించేశారు. ధరల మాయాజాలంపై వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆందోళన చేపట్టారు. పొదిలి కేంద్రానికి వచ్చి దోపిడీకి గురవుతున్న రైతులను పలకరించి వెళ్లారు. ఆయన వస్తున్న సందర్భంగా కంపెనీలు రేట్లు పెంచి మాయచేశాయి. తర్వాత క్రమంగా రేట్లు తగ్గించి దోపిడీకి తెరతీశాయి. తక్కువ ధరలకే రైతులు సరుకును తెగనమ్ముకున్నారు. ధరలు చూసి కొంతమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కడుపుమండిన రైతన్న రోడ్డెక్కాడు. మద్దతు ధర కోసం ఆందోళనలు చేశాడు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటనలు చేసింది. పాలకుల సహకారంతో కొన్ని కంపెనీలు రైతును నట్టేట ముంచేశాయి. బోర్డు అధికారులు సైతం వ్యాపారులకే పరోక్షంగా సహకరించారన్న ఆరోపణలు సైతం వచ్చాయి. వేలం చివరి దశలో కిలో రూ.341ల వరకు కూడా గ్రేడ్–1 పొగాకును కొనుగోలు చేసి, తరువాత దాన్ని రూ.315లకు తీసుకొచ్చారు. ప్రస్తుతం చివరి దశలో ఉన్న కర్నాటక మార్కెట్‌లో కూడా ఇదే దోపిడీ జరుగుతోంది. నిన్నటి వరకు జరిగిన వేలంలో అక్కడ కిలో రూ.280 మాత్రమే ఇచ్చారు. ప్రస్తుతం అది ఏకంగా రూ.320లకు పెంచారు. అంటే అక్కడ బ్రైట్ గ్రేడ్ పొగాకు మొత్తం అమ్మిన తరువాత చివరిలో రైతుల వద్ద ఉత్పత్తులు లేని సమయంలో ధరలు పెంచారు. ఇలా వేలం చివరిలో ధరలు పెంచుతూ మరో సీజన్‌కు రైతులు సిద్ధమయ్యే విధంగా వ్యాపారులు చేసే మోసమని రైతు సంఘాలు మండిపడుతున్నాయి.

వ్యాపారుల మాయలో పడొద్దు

పొగాకు కొనుగోళ్లలో వ్యాపారులు ఆడుతున్న ఈ నాటకాన్ని గమనిస్తున్న రైతు సంఘాల నాయకులు.. రైతులు వ్యాపారుల మాయలో పడొద్దని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ధరలు లేనందున తమ వద్ద ఉన్న బ్రైట్ గ్రేడ్ పొగాకును అమ్ముకోవద్దని, కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసుకోవాలని సూచిస్తున్నారు. వ్యాపారులు ధరలు పెంచినప్పుడే అమ్ముకోవాలని చెప్తున్నారు. అదే సందర్భంలో డిమాండ్ లేని ఉత్పత్తులను అమ్ముకునే ప్రయత్నం చేయాలని, వేలం చివరి వరకు వేచి చూసే ధోరణిని రైతులు అవలంబించాలని సూచిస్తున్నారు. ఒకవేళ ఈ ఏడాది వ్యాపారులు ధరలు పెంచకపోతే వచ్చే ఏడాది క్రాప్ హాలిడే ప్రకటించేందుకు సిద్ధమవ్వాలని చెబుతున్నారు. అంతర్జాతీయ పొగాకు మార్కెట్ ఆశాజనకంగానే ఉన్నా డిమాండ్ లేదనే సాకు చూపి రైతులను దోచుకుంటున్నారని, ప్రారంభంలో లేని డిమాండ్ వేలం చివరి దశకు చేరే సరికి ఏవిధంగా వస్తుందని ప్రశ్నిస్తున్నారు.

130 మిలియన్ కేజీల ఉత్పత్తి

ప్రకాశం రీజియన్ పరిధిలో 2025–26 సీజన్‌కు సంబంధించి 90.20 మిలియన్ కేజీల పొగాకును అధికారికంగా అమ్ముకునేందుకు అనుమతి ఉంది. అయితే అనధికారికంగా పండించిన పొగాకును కలిపితే 130 మిలియన్ కేజీల వరకు ఉండవచ్చని అంచనా. ప్రస్తుతం అన్ని వేలం కేంద్రాల్లోను బ్రైట్ గ్రేడ్ పొగాకు అమ్మకాలు మాత్రమే సాగుతున్నాయి. ప్రారంభం నుంచి ఒకటే ధర కిలోకి రూ.250 ఇస్తున్నారు. అంతకు మించి ఒక్క రూపాయి కూడా వేలంలో ధర పెరగడం లేదు. అయితే సరాసరి ధరలు మాత్రం రోజు రోజుకూ తగ్గుతున్నాయని చెప్తున్నారు. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేయాలి



ప్రస్తుతం పొగాకు మార్కెట్ ఏమాత్రం ఆశాజనకంగా లేదు. వ్యాపారులు ధరలు పెంచడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు నేరుగా వేలంలో పాల్గొని కొనుగోలు చేస్తే అప్పుడే వ్యాపారులు ధరలు పెంచుతారు. రూ.250లతో వేలం ప్రారంభిస్తే సరాసరి ధర చివరికి వచ్చే సరికి క్వింటా రూ.20 వేల కంటే దిగువకు వస్తుంది. దీన్ని వల్ల రైతులకు కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదు. ప్రభుత్వాలు మేల్కొని పొగాకు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

– మాదాల రమణయ్య, రైతు సంఘం నాయకుడు

సరాసరి ధరలు పడిపోకుండా చూడాలి

వేలం ప్రారంభంలోనే క్వింటాకు రూ.25 వేలు ఇస్తే వేలం చివరికి వచ్చే సరికి అది రూ.15 వేలకు పడిపోయినా ఆశ్చర్యం లేదు. ఏదో కొన్ని బేళ్లకు చివరిలో ధరలు ఇచ్చి రైతులను మోసం చేయడం సరైన విధానం కాదు. రెండేళ్లుగా వ్యాపారులు ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలు పెరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ఈ ఏడాది పొగాకు రైతుల పరిస్థితి దారుణంగా ఉంటుంది.

– కట్టా హనుమంతరావు, పొగాకు రైతు

● తిందామా...

బాబోయ్... మూర పొడవు ఐస్‌క్రీమ్...

చూడగానే నోరూరుతోందా? కావాలనిపిస్తోందా? అయితే మలేసియా వెళ్లాల్సిందే. మలేసియాలోని కౌలాలంపూర్‌లో లాట్ 10 షాపింగ్‌మాల్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఒక షాపులో మాత్రమే ఇది దొరుకుతుంది. ఎంత పొడవో తెలుసా? 32 సెంటీమీటర్లు. అంటే పొడవు స్కేల్ అంత. మీ చేయి మూర అంత. చేతిలో పట్టుకుంటే మొహం సగం కనపడదు. కాబట్టి దీనిని 'టవర్ ఐస్‌క్రీం' అని కూడా పిలుస్తారు. దీని ధర పదిహేడు రింగిట్లు. అంటే సుమారు 350 రూపాయలు. ఇది దక్షిణ కొరియాలో మొదట ఫేమస్. వాళ్లు ఈ బ్రాండ్‌ని తయారు చేస్తే మలేసియా వాళ్లు ఫాలో అవుతున్నారు. చాక్లెట్, మామిడి, స్ట్రాబెర్రీ లాంటి పదికి పైగా రుచులు ఉంటాయి. దీనిని పట్టుకుని ఫోటోలు దిగుతూ తినడం ఆలస్యం చేస్తే కరిగిపోతుంది, ఒక్కరు తినలేరు. ఇద్దరు ముగ్గురు కలిసి పంచుకుంటేనే మంచిది. ఎవరితో కలిసి తింటారు?

● సైంటిస్ట్

సౌరశక్తిని ఎవరు కనిపెట్టారో తెలుసా?



సౌరశక్తితో కరెంటు తయారు చేయవచ్చు అని మొదట కనిపెట్టింది ఎడ్మండ్ బెకరెల్. ఫ్రాన్స్ దేశస్థుడు. ఇది జరిగింది 1839లో. ఆ రోజుల్లో ఎడ్మండ్ తన ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తుండేవాడు. ఒక పరీక్షలో రెండు లోహపు రేకులను యాసిడ్ ద్రావణంలో ముంచాడు. వాటి మీద సూర్యకాంతి పడగానే అక్కడ చిన్నగా కరెంటు పుట్టింది. కాంతితో విద్యుత్ వస్తుందని అప్పటి దాకా ఎవ్వరికీ తెలీదు. ఆ విచిత్రాన్ని చూసి ఎడ్మండ్ ఆశ్చర్యపోయాడు. దానికే 'ఫోటోవోల్టాయిక్ ఎఫెక్ట్' అని పేరు పెట్టాడు. ఫోటో అంటే కాంతి, వోల్టాయిక్ అంటే విద్యుత్ అని అర్థం.ఆ కాలంలో ఈ కనిపెట్టిన కరెంటు చాలా చాలా తక్కువ. ఒక చిన్న బల్బు కూడా వెలిగేది కాదు. అందుకే చాలా ఏళ్లు దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. కానీ ఎడ్మండ్ వేసిన పునాది మీదనే తర్వాత శాస్త్రవేత్తలు పెద్ద పెద్ద సోలార్ సెల్స్ కట్టారు. 1883లో చార్లెస్ ఫ్రిట్స్ అనే అమెరికన్ మొదటి సోలార్ సెల్ తయారు చేశాడు. సెలీనియం మీద బంగారం పూత వేసి చేసిన ఆ సెల్‌కి సామర్థ్యం కేవలం ఒక శాతం మాత్రమే. అయినా అదే మొదటి అడుగు. అసలు పనికొచ్చే సోలార్ ప్యానెల్ మాత్రం 1954లో బెల్ ల్యాబ్స్‌లో పుట్టింది. డారిల్ చాపిన్, కాల్విన్ ఫుల్లర్, జెరాల్డ్ పియర్సన్ అనే ముగ్గురు శాస్త్రవేత్తలు సిలికాన్‌తో మొదటి మంచి సోలార్ సెల్ చేశారు. దాని సామర్థ్యం ఆరు శాతం. అప్పటి నుంచి సోలార్ ప్యానెళ్లు ఇళ్ల మీదకు, ఉపగ్రహాల్లోకి ఎక్కాయి. ఎడ్మండ్ బెకరెల్ కనిపెట్టిన చిన్న నిప్పురవ్వే ఇవాళ కోట్ల ఇళ్లకు వెలుగు ఇస్తోంది. ఆయన కొడుకు హెన్రీ బెకరెల్ కూడా పెద్ద శాస్త్రవేత్త అయ్యాడు. రేడియోధార్మికత కనిపెట్టి నోబెల్ బహుమతి గెలిచాడు. తండ్రి కొడుకులు ఇద్దరూ సైన్స్‌కి వెలుగు ఇచ్చారు. చూశారా పిల్లలూ... సందేహించకుండా ప్రయత్నిస్తే సూర్యుడంత ఫలితం వస్తుంది.



● ప్రాణి ప్రపంచం

చేపలకు దొంగ కళ్లు

పిల్లలూ... మనం ఆత్మరక్షణ కోసం జూడో, కరాటే లాంటివి నేర్చుకుంటాం. మరి సముద్రంలో చేపలు ఏం చేయాలి? వాటికి కర్రసాము రాదు కదా. అందుకని కొన్ని చేపలు ఒక ట్రిక్ చేస్తాయి. ఒంటి మీద దొంగ కళ్లు తెచ్చుకుంటాయి. అంటే ఒంటిపై పెద్ద పెద్ద కళ్లలాంటి చుక్కలు. వీటిని ఐ స్పాట్స్ అంటారు.షార్క్ లాంటి పెద్ద చేపలు వీటిని తినడానికి వస్తాయి కదా. అప్పుడు ఈ దొంగ కళ్లు షార్క్‌ని భయపెడతాయి. 'అమ్మో, ఇది చాలా పెద్ద చేప, దీని తల ఎక్కడ ఉంది' అని షార్క్ కన్ఫ్యూజ్ అయిపోతుంది. సీతాకోకచిలుకల రెక్కల మీద కూడా ఇలాంటి కళ్లే ఉంటాయి. స్వీడన్ శాస్త్రవేత్తలు 'స్కేట్స్', 'రేస్' అనే చేపల్ని అధ్యయనం చేస్తే ఈ విషయం తెలిసింది. వాటికి విషపు ముల్లు లేదు. కరెంట్ కొట్టినట్టు అటాక్ చేయలేవు. మరి శత్రువుల నుంచి ఎలా తప్పించుకోవాలి? అందుకే వాటికి దేవుడు దొంగ కళ్లు ఇచ్చాడు. రెండు వందల మీటర్ల లోతు లోపు ఉండే చేపలకే ఈ కళ్లు ఎక్కువగా ఉంటాయట. ఎందుకంటే అక్కడ వెలుతురు ఎక్కువ కాబట్టి దొంగ కళ్లు బాగా కనిపించి శత్రువును బురిడీ కొట్టిస్తాయి. కానీ లోతులో, చీకట్లో ఉండే చేపలకు ఈ కళ్లు అవసరం లేదు. నీతి ఏంటంటే బలం లేకపోయినా తెలివితో బతికేయొచ్చు.

బీర్బల్ ఎవరో తెలుసా పిల్లలూ?

అక్బర్ చక్రవర్తి గురించి విన్నారు కదా. ఆయన కొలువులో తొమ్మిది మంది గొప్పవాళ్లు ఉండేవారు. వాళ్ళనే 'నవరత్నాలు' అని పిలిచేవారు. ఆ తొమ్మిది మందిలో తెలివికి పెట్టింది పేరు బీర్బల్.

అతని అసలు పేరు మహేష్ దాస్. 1528 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్‌లోని కాల్పి అనే ఊరిలో ఒక పేద కుటుంబంలో పుట్టాడు. చిన్నప్పటి నుంచి చాలా తెలివైనవాడు. హిందీ, పర్షియన్ భాషలు బాగా నేర్చుకున్నాడు. 'బ్రహ్మ' అనే పేరుతో కవిత్వం చెప్పేవాడు. ఒకసారి అక్బర్ చక్రవర్తి దర్బార్‌లో కవిత్వం చదివితే ఆ చమత్కారానికి, సమయస్ఫూర్తికి ముగ్ధుడై అక్బర్ తన కొలువులో చేర్చుకున్నాడు. అప్పుడే 'బీర్బల్' అనే బిరుదు ఇచ్చాడు. 'బీర్బల్' అంటే 'ధైర్యవంతుడు' అని అర్థం.

అక్బర్ ఏదైనా కష్టమైన ప్రశ్న అడిగితే బీర్బల్ నవ్వుతూ, చమత్కారంగా జవాబు చెప్పేవాడు. రాజ్యంలో ఎవరికైనా తగాదా వస్తే బీర్బల్ కథలతో, ఉదాహరణలతో న్యాయం చెప్పేవాడు. రాజు తప్పు చేసినా భయపడకుండా నిజం చెప్పేవాడు. అందుకే అక్బర్‌కు బీర్బల్ అంటే చాలా ఇష్టం.

బీర్బల్‌కు సైన్యం లేదు. పెద్ద పదవి లేదు. కానీ అక్బర్‌కు అత్యంత నమ్మకమైన సలహాదారు, స్నేహితుడు అక్బర్ కొత్తగా మొదలుపెట్టిన 'దీన్-ఇ-ఇలాహి' అనే మతంలో బీర్బల్ కూడా చేరాడు. అందరూ కలిసి ఉండాలని కోరుకునేవాడు. చివరి రోజుల్లో అక్బర్ బీర్బల్‌ను కొన్ని తెగలతో యుద్ధానికి పంపాడు. 1586 సంవత్సరంలో ఆఫ్ఘనిస్తాన్ దగ్గర స్వాత్ లోయలో జరిగిన యుద్ధంలో బీర్బల్ చనిపోయాడు. బీర్బల్ చనిపోయాడని తెలిసి అక్బర్ చాలా బాధపడ్డాడు. రెండు రోజులు అన్నం, నీళ్లు ముట్టుకోలేదు. 'బీర్బల్ లేని దర్బార్ వెలవెలబోతోంది' అని ఏడ్చాడట.



అక్బర్–బీర్బల్ జోడి అజరామరమైనది. ఇవాళ్టికి 'అక్బర్–బీర్బల్' కథలు ఎంతో ఇష్టంగా అందరూ చదువుతారు. ఈ సెలవుల్లో మీరు కూడా అక్బర్ బీర్బల్ కథలు సంపాదించి చదవండి.

నా రూటు... సపరేటు...

సిటీ బస్ ఎక్కి తిరగాలంటే మనమే అప్పుడప్పుడు కన్ఫ్యూజ్ అవుతుంటాం. అమెరికాలోని ఈ కుక్క మాత్రం కరెక్టుగా కావాల్సిన బస్సు ఎక్కి కావాల్సిన చోటులో దిగిపోతుంది. సంగతి వినండి. సియాటిల్ నగరంలో ఉండే ఈ కుక్క పేరు ఎక్లిప్స్. అది రోజూ ఓనర్‌తో పాటు బస్సెక్కి డాగ్ పార్క్‌కి వెళ్లేది. అక్కడ తోటి కుక్కలతో ఆడుకునేది. దానికి చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు. ఒక రోజు ఓనర్ లేట్ అయ్యాడు. ఎక్లిప్స్‌కు విసుగొచ్చింది. అసలే అక్కడ ఫ్రెండ్స్ వెయిటింగ్. ఓనర్ లేకపోతే ఏముందిలే నాకు దారి తెలుసుగా అని ఒక్కతే బస్‌స్టాప్‌కి వెళ్లి బస్ ఎక్కేసింది. డ్రైవర్‌కి తన మెడలో ఉన్న సీజన్ కార్డు చూపించింది. కరెక్ట్ స్టాప్‌లో దిగి పార్క్‌కి వెళ్లి ఆడుకుంది. తర్వాత ఇంటికి వెళ్లే బస్ ఎక్కి వచ్చేసింది. ఓనర్ మొదట ఆశ్చర్యపోయినా ఇదే బెటరని వదిలేశాడు. అప్పటి నుంచి ఎక్లిప్స్ రోజూ సొంతంగా బస్‌లో పార్క్‌కి వెళ్తుంది. బస్ డ్రైవర్లందరికీ ఎక్లిప్స్ ఫ్రెండ్ అయిపోయింది. పాసింజర్లు దానితో సెల్ఫీలు దిగుతారు. ఎక్లిప్స్‌కి రూట్ నంబర్, స్టాప్ బాగా తెలుసు. ఒక్కసారి కూడా స్టాప్ మిస్ అవ్వలేదట.

● కథ

చీమ బలం వంతెన

ఆఫ్రికాలోని కెన్యాలో అడవి దగ్గర ఒక చిన్న పల్లెటూరు. ఆ ఊరిలో అకిని అనే ఆరేళ్ల పాప ఉండేది. వాళ్ల ఊరికి ఒక పెద్ద సమస్య. వర్షాకాలం వస్తే చాలు నది పొంగి ఊరికి, పొలానికి మధ్య ఉన్న చెక్క వంతెన కొట్టుకుపోతుంది. దాంతో పిల్లలు బడికి వెళ్లలేరు, రైతులు టౌనుకు వెళ్లి సంతలో పండ్లు అమ్మలేరు. ఆ ఏడు కూడా అంతే. వానలకు వంతెన విరిగిపోయింది. స్కూల్ మానేసి అకిని ఏడుస్తూ కూర్చుంది. అప్పుడు అక్కడ ఒక చీమ మీద అకిని చూపు పడింది. ఆ చీమ అనానాస్ ముక్కను లాక్కుని వెళ్తోంది. అనానాస్ ముక్క చీమకంటే పది రెట్లు పెద్దది. అయినా చీమ ఆగలేదు. పడింది, లేచింది, మళ్లీ లాగింది. చివరకు తన గూటికి ఆ ముక్కను పట్టుకుని వెళ్లింది.

అది చూసిన అకినికి ఒక ఆలోచన వచ్చింది. వెంటనే ఊళ్లో ఉన్న పిల్లలందరినీ పిలిచింది. 'మనమందరం చీమలమవుదాం. ఒక్కొక్కరం ఒక కర్ర పట్టుకురండి' అని చెప్పింది. పిల్లలు, ఆడవాళ్లు, ముసలివాళ్లు అందరూ కర్రలు, తాళ్లు, రాళ్లు మోసుకొచ్చారు. అందరూ కలిసి వారం రోజులు పని చేశారు. చిన్న చిన్న కర్రలతో, బలమైన లతలతో ఒక గట్టి తాత్కాలిక వంతెన కట్టారు. వర్షం వచ్చినా అది కదలలేదు. ఆ వంతెన మీద నుంచే పిల్లలు బడికి వెళ్లారు. రైతులు అనానాస్, మామిడి పండ్లు టౌను సంతకు తీసుకెళ్లారు. ఊరి పెద్ద వచ్చి అకిని తల నిమిరి 'నువ్వు మా ఊరి చీమవమ్మా. చిన్నదానివైనా పెద్ద పని చేశావు' అని మెచ్చుకున్నాడు. ఆ రోజు నుంచి ఆ ఊరిలో ఎవరైనా 'నావల్ల కాదు' అంటే 'అనానాస్‌ని మోసిన చీమను గుర్తుతెచ్చుకో' అని చెప్పేవారు.

తెలుసుకుందాం

ఏయే గ్రహాల మీద నక్షత్రాలు కనిపిస్తాయి?



భూమి మీద రాత్రి పూట తల పైకెత్తి చూస్తే చుక్కలు మిలమిలా మెరుస్తుంటాయి. మరి మనం రాకెట్‌లో వెళ్లి వేరే గ్రహం మీద దిగితే అక్కడి నుంచి కూడా నక్షత్రాలు కనిపిస్తాయా? అన్ని గ్రహాల మీద ఒకేలా కనిపించవు.

ముందుగా బుధగ్రహం సంగతి చూద్దాం. బుధుడి మీద అసలు గాలి అంటూ లేదు. అందుకే అక్కడ రాత్రి పూట ఆకాశం ఎప్పుడూ నల్లగా, కారు చీకటిగా ఉంటుంది. గాలి లేకపోవడం వల్ల సూర్యుడి కాంతి చెదిరిపోదు. అందుకే బుధుడి మీద రాత్రి పూట నక్షత్రాలు చాలా స్పష్టంగా తళతళా మెరిసిపోతూ కనిపిస్తాయి. పగటి పూట మాత్రం సూర్యుడు చాలా ప్రకాశవంతంగా ఉంటాడు కాబట్టి నక్షత్రాలు కనిపించడం చాలా కష్టం.

ఇక శుక్రగ్రహం పరిస్థితి పూర్తిగా వేరు. శుక్రుడి చుట్టూ చాలా చిక్కటి మేఘాలు, విషపూరితమైన గాలి ఉంది. ఆ మేఘాలు ఎంత దట్టంగా ఉంటాయంటే పగటి పూట సూర్యుడు కూడా సరిగ్గా కనిపించడు. అలాంటప్పుడు రాత్రి పూట నక్షత్రాలు కనిపించే అవకాశమే లేదు. శుక్రుడి మీద నుంచి చూస్తే ఆకాశం ఎప్పుడూ తెల్లటి పొగమంచు కప్పేసినట్టు ఉంటుంది. కాబట్టి శుక్రుడి మీద నక్షత్రాలను చూడలేం.

అంగారకుడు అంటే మార్స్ మీదకు వద్దాం. మన రోవర్లు అక్కడ దిగి ఎన్నో ఫోటోలు పంపించాయి. అంగారకుడి మీద గాలి చాలా పల్చగా ఉంటుంది. భూమి గాలి కంటే వంద రెట్లు పల్చన. అక్కడి ఆకాశం పగలు లేత ఎరుపు రంగులో లేదా బురద రంగులో ఉంటుంది. ఎందుకంటే గాల్లో ఎర్రటి దుమ్ము ఎగురుతూ ఉంటుంది. కానీ రాత్రి అయ్యేసరికి ఆకాశం నల్లగా మారిపోతుంది. అప్పుడు నక్షత్రాలు భూమి మీద కంటే ఇంకా స్పష్టంగా, ఇంకా ఎక్కువగా కనిపిస్తాయి.

మన చందమామ సంగతి కూడా ఒకసారి చూద్దాం. చందమామకు కూడా గాలి లేదు. అందుకే వ్యోమగాములు చందమామ మీద దిగినప్పుడు రాత్రి పూట ఆకాశం కారు నలుపు రంగులో ఉంటుంది. రాత్రి పూట నక్షత్రాలు చాలా బాగా కనిపిస్తాయి. కానీ పగలు మాత్రం సూర్యుడి కాంతి ఎక్కువగా ఉండటం వల్ల నక్షత్రాలు కనిపించవు. నక్షత్రాలను బాగా చూడాలంటే చీకటి ఉండాలి, వెలుతురు కాలుష్యం ఉండకూడదు.

మరి భూమి మీద నుంచి చూస్తే చుక్కలు మినుకు మినుకుమని ఎందుకు అంటాయి? మన చుట్టూ ఉన్న గాలి ఒకేలా ఉండదు. కొన్ని చోట్ల వేడి గాలి, కొన్ని చోట్ల చల్లని గాలి పైకి కిందకి తిరుగుతూ ఉంటుంది. నక్షత్రాల కాంతి మన కంటికి రావాలంటే ఈ గాలి పొరల గుండా రావాలి. గాలి కదులుతూ ఉండటం వల్ల ఆ కాంతి కాస్త అటూ ఇటూ వంగుతుంది. అందుకే నక్షత్రం వెలుగు ఒక్కోసారి ఎక్కువ, ఒక్కోసారి తక్కువ అవుతూ రెప్పలు కొడుతున్నట్టు మినుకు మినుకు అంటుంది. దీన్ని శాస్త్రంలో వాతావరణ వక్రీభవనం అంటారు.

● సీజన్

టెంక లేని మామిడి పండోచ్!

మామిడి పండు తింటే నోరంతా తీపి, చేతులంతా రసం, చివరికి మిగిలేది పెద్ద టెంక కదా. మరి టెంకే లేని మామిడి పండు ఉందా? ఉంది! దాని పేరే 'సింధు మామిడి'. ఇది పూర్తిగా మన ఇండియా సైంటిస్టుల మ్యాజిక్. మహారాష్ట్రలోని కొంకణ్ కృషి విద్యాపీఠ్‌లో శాస్త్రవేత్తలు టెంక లేకుండా తయారు చేసిందే ఈ సింధు. ఈ పండులో టెంక ఉండదు. ఉన్నా అది కాగితంలా పల్చగా, కేవలం ఆరు గ్రాముల బరువు మాత్రమే ఉంటుంది. టెంక లేదు కాబట్టి పండులో డెబ్బై నుంచి ఎనభై శాతం కమ్మటి గుజ్జే ఉంటుంది. పీచు అసలే ఉండదు. నోట్లో వేసుకుంటే వెన్నలా కరిగిపోతుంది. పండు సగటు బరువు రెండు వందల గ్రాములు. పసుపు రంగులో మెరిసిపోతూ ఉంటుంది. జూలై నెలలో పండుతుంది. గుత్తులు గుత్తులుగా కాస్తుంది. జ్యూస్, ఐస్‌క్రీం, మామిడి తాండ్ర చేయడానికి ఇది బెస్ట్. ఇప్పుడు బీహార్, మహారాష్ట్ర రైతులు దీన్ని పండిస్తున్నారు. విదేశాలకు కూడా పంపుతున్నారు.

గేయం

వేసవిలో నీడ పరుద్దాం

సెలవులు వచ్చేశాయ్ హాయ్ హాయ్
పుస్తకాలకు బాయ్ బాయ్
బడి గంటలు మాయం
రోజంతామామిడి పండ్లు తిందాం

అమ్మమ్మ ఊరు వెళదాం
కథలు వింటూ నిదురపోదాం
తాతయ్యతో తోటలో తిరుగుదాం
సీతాకోకచిలుకలు పట్టుకుందాం

టీవీ చూడం ఫోన్ ముట్టం
చెట్టు నీడన ఆడుకుందాం
చేతులతో మట్టి బొమ్మలు
మనసునిండా తీపి గుర్తులు

సెలవులు అయిపోకముందే
ఒక మొక్కైనా నాటుదామా

వచ్చే వేసవికి అది నీడై
మళ్లీ మనతో ఆడుతుంది

సెలవులు వచ్చేశాయ్ హాయ్ హాయ్
నవ్వుల పువ్వులు పూయ్ పూయ్
య్ హాయ్
నవ్వుల పువ్వులు పూయ్ పూయ్

అథ్లెట్లూ... జర జాగ్రత్తా!

జాతీయ టోర్నీలలో పాల్గొనకుంటే చర్యలు: ఏఎఫ్ఐ

న్యూఢిల్లీ: డోపింగ్ పరీక్షలు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న అథ్లెట్లపై చర్యలు తీసుకునేందుకు భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) సిద్ధమైంది. ఇకపై జాతీయ టోర్నీలలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకొని సరైన కారణం లేకుండా గైర్హాజరయ్యే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించిది. ఈ నెల 22 నుంచి 25 వరకు రాంచీ వేదికగా జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్ జరగనుంది. ఈ టోర్నీలో పాల్గొననున్నట్లు వెల్లడించిన అథ్లెట్‌లు... సరైన కారణాలు లేకుండా హాజరుకాకుంటే తదుపరి ఈవెంట్‌లలో వారిపై నిషేధం విధిస్తామని ఏఎఫ్ఐ శుక్రవారం ప్రకటించింది. గత కొన్నేళ్లుగా పలువురు అథ్లెట్లు తొలుత పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ... జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) పరీక్షలు నిర్వహిస్తుందనే భయంతో పోటీలకు హాజరు కావడం లేదు. దీంతో చాలా తక్కువ మంది మాత్రమే జాతీయ ఈవెంట్‌లలో పాల్గొంటున్నారు. 'టోర్నీలో పేరు నమోదు చేసుకున్న అనంతరం ఏ అథ్లెట్ అయినా సహేతుక కారణం లేకుండా అందులో పాల్గొనకపోతే... తదుపరి ఈవెంట్‌లో అతడిని అనుమతించం' అని సమాఖ్య స్పష్టంచేసింది. అలాగే ఏడాదిలో ఏఎఫ్ఐ నిర్వహించే రెండు పోటీలలో పాల్గొన్న అథ్లెట్లను మాత్రమే ఫెడరేషన్ కప్‌లో పాల్గొనడానికి అనుమతించనుంది. సస్పెన్షన్ పూర్తి చేసుకున్న అథ్లెట్లు... జాతీయ చాంపియన్‌షిప్‌లలో పోటీపడాలనుకుంటే... నిషేధానికి ముందు ఏడాది సాధించిన ప్రదర్శనలకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని ఏఎఫ్ఐ తెలిపింది.

మూడో స్థానంలోనే భారత్

న్యూఢిల్లీ: గతేడాది ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టు... ఐసీసీ వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలోనే కొనసాగుతోంది. వరల్డ్‌కప్ అనంతరం ఇప్పటి వరకు మూడు వన్డేలు మాత్రమే ఆడిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా మూడింట్లోనూ ఓడింది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ 124 పాయింట్లతో 3వ ర్యాంక్‌లో ఉండగా... ఇంగ్లండ్ 128 పాయింట్లతో రెండో 'ప్లేస్'లో కొనసాగుతోంది. 163 పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. 'ప్రపంచ చాంపియన్ భారత్ కంటే ఇంగ్లండ్ నాలుగు పాయింట్లు ముందుంది. భారత్ మూడో స్థానంలో కొనసాగుతుండగా... దక్షిణాఫ్రికా (100 పాయింట్లు), న్యూజిలాండ్ (93 పాయింట్లు), శ్రీలంక (89 పాయింట్లు), బంగ్లాదేశ్ (73 పాయింట్లు), పాకిస్తాన్ (72 పాయింట్లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి' అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. గత ర్యాంకింగ్స్‌తో పోల్చుకుంటే ఆస్ట్రేలియా నాలుగు పాయింట్లు కోల్పోయినా... అగ్రస్థానాన్ని మాత్రం పదిలం చేసుకుంది.

పరాగ్ సంగక్కర

'జట్టుకు చెడ్డపేరు వస్తోంది'

వివాదాలపై రాజస్తాన్ రాయల్స్ హెడ్ కోచ్ సంగక్కర వ్యాఖ్య

జైపూర్: రాజస్తాన్ రాయల్స్‌కు సంబంధించి ఈ ఐపీఎల్‌లో బయటికొచ్చిన వివాదాలపై టీమ్ హెడ్ కోచ్ కుమార్ సంగక్కర స్పందించాడు. ఇవి జట్టుకు చెడ్డ పేరు తెస్తున్నాయని అతను అభిప్రాయపడ్డాడు. టీమ్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో 'వేపింగ్' చేస్తూ పట్టుబడగా, కొద్ది రోజుల క్రితమే టీమ్ మేనేజర్ రోమి భిందర్ డగౌట్‌లో ఫోన్ వాడుతూ కనిపించాడు. ఈ రెండు ఘటనలపై బీసీసీఐ చర్య తీసుకుంటూ జరిమానాలు విధించింది. 'ఏ రకమైన వివాదమైనా జట్టుపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ఈ రెండింటిపై బీసీసీఐ చర్య తీసుకుంది. మా జట్టులో మంచి విలువలు, సంస్కృతి ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. మీరు చేసే ఏ పనైనా ఫ్రాంచైజీకి చెడ్డ పేరు తెస్తుంది కాబట్టి బాధ్యతగా ఉండమని ఆటగాళ్లకు చెబుతున్నాం' అని సంగక్కర వ్యాఖ్యానించాడు.

పరాగ్ అలా చేయాల్సింది కాదు: అశ్విన్

చెన్నై: డ్రెస్సింగ్‌రూమ్‌లో 'వేపింగ్' చేస్తూ రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ పట్టుబడటం దురదృష్టకర ఘటనగా భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభివర్ణించాడు. పరాగ్ అలా చేయాల్సింది కాదని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. యువ ఆటగాళ్లు తమ చర్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని అతను సూచించాడు. 'ఇది అన్ని విధాలుగా నివారించి ఉండాల్సిన ఘటన. ఇలాంటి విషయాల్లో పడరాదని యువ ఆటగాళ్లకు చెబుతున్నా. ఇది వ్యక్తిగత ఇష్టాలకు సంబంధించిన విషయమే. కానీ ఇవి వ్యక్తిగతంగానే ఉండాలి. బహిరంగ ప్రదేశాల్లో ఇలా చేయడం సరైంది కాదు. ఒక అన్నలాగా పరాగ్‌ను నేను సలహా ఇస్తున్నా. నీ వ్యక్తిగత జీవితంలో ఏం చేసినా ఎవరూ పట్టించుకోరు. కానీ ఒక ఐపీఎల్ టీమ్‌కు కెప్టెన్‌గా ఇలా చేయవద్దు. చాలా మంది యువ ఆటగాళ్లు నిన్ను స్ఫూర్తిగా తీసుకుంటారు. కాబట్టి మరింత బాధ్యతగా మెలగడం అవసరం. ఈ రోజుల్లో దేనినీ దాచలేం. కాబట్టి మున్ముందు తప్పునుంచి నేర్చుకోవాలంటే తగిన శిక్ష వేయడం కూడా అవసరం. పరాగ్ విషయంలో అదే జరిగింది' అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

చరిత్రకు చేరువలో...

- వరుసగా ఐదో మాస్టర్స్ టైటిల్‌కు విజయం దూరంలో సినెర్
- మాడ్రిడ్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరిన ఇటలీ టెన్నిస్ స్టార్

సినెర్

మాడ్రిడ్: ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న ఇటలీ టెన్నిస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ కొత్త చరిత్ర సృష్టించేందుకు విజయం దూరంలో నిలిచాడు. వరుసగా ఐదు మాస్టర్స్ సిరీస్-1000 టైటిల్స్ గెలిచిన తొలి ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పేందుకు సినెర్ సిద్ధమయ్యాడు. మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో టాప్ సీడ్ సినెర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో సినెర్ 6-2, 6-4తో ఆర్థర్ ఫిల్స్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. సినెర్ కెరీర్‌లో ఇది 350వ విజయం కావడం విశేషం. 86 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో సినెర్ నాలుగు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశాడు. తొలి సర్వీస్‌లో 21 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 15 పాయింట్లు సాధించాడు. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని సినెర్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. అలెగ్జాండర్ బ్లాక్స్ (బెల్జియం), అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో సినెర్ తలపడతాడు. గత ఏడాది పారిస్ ఓపెన్ మాస్టర్స్ టైటిల్ గెలిచిన సినెర్... ఈ ఏడాది ఇండియన్ వెల్స్, మయామి ఓపెన్, మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీల్లోనూ విజేతగా నిలిచాడు. మాడ్రిడ్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరడం ద్వారా... ఏటీపీ సర్క్యూట్‌లోని తొమ్మిది మాస్టర్స్ సిరీస్ టోర్నీల్లో ఫైనల్ చేరిన నాలుగో ప్లేయర్‌గా, అతి పిన్న వయస్కుడిగా 24 ఏళ్ల సినెర్ గుర్తింపు పొందాడు. గతంలో రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), రాఫెల్ నాదల్ (స్పెయిన్) మాత్రమే ఈ ఘనత సాధించారు.

ముగిసిన పొటపోవా పోరాటం

మాడ్రిడ్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో 'లక్కీ లూజర్' అనస్తాసియా పొటపోవా పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పొటపోవా 2-6, 6-1, 1-6తో మార్టా కొస్టుక్ (ఉక్రెయిన్) చేతిలో ఓడిపోయింది. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ)-1000 టోర్నీల చరిత్రలో 'లక్కీ లూజర్' హోదాలో సెమీఫైనల్‌కు చేరిన తొలి ప్లేయర్‌గా పొటపోవా గుర్తింపు పొందింది. కొస్టుక్‌తో 96 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో పొటపోవా ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఆరు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. సెమీ ఫైనల్లో ఓడిన పొటపోవాకు 2,97,550 యూరోల (రూ. 3 కోట్ల 31 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 390 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ధోనీలా ఐదు ట్రోఫీలు గెలవడమే లక్ష్యం

ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ రాహుల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ట్రోఫీలు గెలవకుండా ఎన్ని వ్యక్తిగత మైలురాళ్లు సాధించినా వాటికి విలువ ఉండదని ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్, భారత సీనియర్ క్రికెటర్ కేఎల్ రాహుల్ అన్నాడు. ఐపీఎల్ తాజా సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్న రాహుల్... ఇటీవలే లీగ్‌లో అత్యధిక పరుగుల వీరుల జాబితాలో మహేంద్ర సింగ్ ధోనీని అధిగమించాడు. ఐపీఎల్‌లో ధోనీ 5439 పరుగులు చేయగా... తాజాగా రాహుల్ అతడిని దాటేశాడు. ఈ నేపథ్యంలో రాహుల్ మాట్లాడుతూ... 'ఐపీఎల్‌లో మహీ భాయ్ పరుగులను దాటేశానని కూడా నాకు తెలియదు. వ్యక్తిగత మైలురాళ్లు మంచివే. సరైన దిశలోనే ఉన్నామని అవి భరోసా ఇస్తాయి. కానీ అసలైంది మాత్రం నిలకడగా ట్రోఫీలు గెలవడమే. ధోనీ గెలిచినన్ని ఐపీఎల్ ట్రోఫీలు గెలవడమే నాకు నిజమైన ఆనందాన్ని ఇస్తుంది. క్రికెట్ వ్యక్తిగత క్రీడ కాదు. టీమ్ స్పోర్ట్. అందుకే విజయవంతమైన జట్లలో భాగం కావాలని ఎల్లప్పుడూ కోరుకుంటూ ఉంటా' అని రాహుల్ అన్నాడు. చిన్నప్పటి నుంచి బెంగళూరు చిన్నస్వామి స్టేడియంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని... అందుకే అక్కడ మ్యాచ్ అంటే భావోద్వేగానికి గురవుతానని రాహుల్ చెప్పాడు. 'కేవలం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లోనే అని కాదు. చిన్నస్వామి స్టేడియంలో అంతర్జాతీయ మ్యాచ్ ఆడినా నా పరిస్థితి ఇలాగే ఉంటుంది. కొన్ని ప్రదేశాల్లో మీరు చాలా సౌకర్యవంతంగా భావిస్తారు. నాకు బెంగళూరు అలాంటిదే. అక్కడ క్రీజులో అడుగుపెట్టిన ప్రతిసారి ఏదో ఒకటి ప్రత్యేకంగా చేయాలని అనుకుంటా. కొత్తతరం ప్లేయర్లు బౌలర్ చరిత్ర చూసి షాట్‌లు ఆడటం లేదు' అని రాహుల్ వివరించాడు. వైభవ్ సూర్యవంశీ వంటి యువ ఆటగాళ్లు... ప్రపంచస్థాయి బౌలర్లయిన బుమ్రా, కమిన్స్‌లను ఎదుర్కొనేటప్పుడు ఏమాత్రం తడబడటం లేదని... అవకాశం ఉంటే తొలి బంతి నుంచే భారీ షాట్‌లు కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని... ఆధునిక టి20 క్రికెట్‌కు ఇలాంటి మనస్తత్వమే అవసరమని రాహుల్ వెల్లడించాడు. వైభవ్, ఆయుశ్ మాత్రే వంటి వాళ్లు టి20లు ఆడే విధానాన్ని మార్చేస్తున్నారని రాహుల్ చెప్పుకొచ్చాడు.

నిషికోరి వీడ్కోలు

ఈ ఏడాది తర్వాత టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పనున్న జపాన్ స్టార్

టోక్యో: పురుషుల టెన్నిస్‌లో ఆసియా అత్యుత్తమ ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న జపాన్ ప్లేయర్ కి నిషికోరి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ ఏడాది తర్వాత టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పనున్నానని తెలిపాడు. 36 ఏళ్ల నిషికోరి 2014లో యూఎస్ ఓపెన్ ఫైనల్లో మారిన్ సిలిచ్ (క్రొయేషియా) చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు. తద్వారా గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన తొలి ఆసియా ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. 2007లో ప్రొఫెషనల్‌గా మారిన నిషికోరి 2016 రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచాడు. కాంస్య పతక మ్యాచ్‌లో అతను స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్‌ను మూడు సెట్‌లలో ఓడించాడు. 2017లో కెరీర్ బెస్ట్ 4వ ర్యాంక్ అందుకున్న నిషికోరి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాలుగుసార్లు (2012, 2015, 2016, 2019)... ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడు సార్లు (2015, 2017, 2019)... వింబుల్డన్ టోర్నీలో రెండుసార్లు (2018, 2019) క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. కెరీర్ మొత్తంలో 12 ఏటీపీ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన నిషికోరి 451 మ్యాచ్‌ల్లో గెలిచి, 231 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. 2019లో చివరిసారి బ్రిస్బేన్ ఓపెన్‌లో టైటిల్ నెగ్గిన నిషికోరి ఆ తర్వాత మరో టోర్నీలో విజేతగా నిలువలేదు. భుజం గాయంతో బాధపడుతున్న నిషికోరి గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో, ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఆడలేదు. ప్రస్తుతం 464వ ర్యాంక్‌లో ఉన్న ఈ జపాన్ ప్లేయర్ చాలెంజర్ టోర్నీల్లో ఆడుతున్నాడు. ఈ సీజన్‌లో ఐదు చాలెంజర్ టోర్నీల్లో పోటీపడ్డ నిషికోరి ఒక్క దాంట్లోనూ కనీసం క్వార్టర్ ఫైనల్ చేరలేకపోయాడు.

సన్‌రైజర్స్ జట్టులో అంబరీశ్

శివమ్ మావి స్థానంలో ఎంపిక

హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌లో ఒక మార్పు చోటు చేసుకుంది. గాయపడిన పేసర్ శివమ్ మావి స్థానంలో తమిళనాడుకు చెందిన యువ ఆటగాడు ఆర్‌ఎస్ అంబరీశ్‌ను రైజర్స్ టీమ్‌లోకి తీసుకుంది. తన కనీస విలువ రూ. 30 లక్షలతో అంబరీశ్ హైదరాబాద్ జట్టులోకి వచ్చాడు. వేలంలో రూ.75 లక్షలకు తీసుకున్న మావి ఫిట్‌నెస్ సమస్యల కారణంగా ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇటీవల జరిగిన అండర్-19 ప్రపంచ కప్‌లో అంబరీశ్ భారత్ తరఫున అత్యధిక వికెట్లు (11) తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు. అంతకుముందు అండర్-19 జట్టు తరఫున అతను ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలలో పర్యటించడంతో పాటు ఆసియా కప్‌లో కూడా ఆడాడు. కుడి చేతి వాటం బౌలర్ అయిన అంబరీశ్ ఎడం చేతితో బ్యాటింగ్ చేస్తాడు.

సాంట్నర్ నెల రోజుల పాటు...

ఆటకు దూరం కానున్న న్యూజిలాండ్ కెప్టెన్

ఆక్లాండ్: భుజం గాయంతో బాధపడుతున్న న్యూజిలాండ్ వన్డే, టి20 క్రికెట్ జట్టు కెప్టెన్ మిచెల్ సాంట్నర్ నెల రోజుల పాటు ఆటకు దూరం కానున్నాడు. ఐపీఎల్‌లో భాగంగా వారం రోజుల క్రితం చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో క్యాచ్ అందుకునే క్రమంలో ముంబై ప్లేయర్ సాంట్నర్ భుజానికి గాయమైంది. ఆ మ్యాచ్ నుంచి మధ్యలోనే తప్పుకున్న అతను లీగ్‌కు కూడా పూర్తిగా దూరమయ్యాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో అతను నాలుగు మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవలే స్వదేశానికి చేరుకున్న సాంట్నర్‌కు పరీక్షలు నిర్వహించిన క్రికెట్ న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు (ఎన్‌జెడ్‌సీ) అతని గాయం విషయంపై స్పష్టమైన ప్రకటన ఇచ్చింది. 'శుక్రవారం ఉదయమే ప్రత్యేక వైద్య నిపుణుడిని సాంట్నర్ కలిశాడు. గాయం నుంచి కోలుకునే క్రమంలో తగినంత విశ్రాంతితో పాటు రీహాబిలిటేషన్ కూడా అవసరం అని వారు తేల్చారు' అని ఎన్‌జెడ్‌సీ వెల్లడించింది. తాజా పరిణామాల కారణంగా ఐర్లాండ్‌తో జరిగే ఏకైక టెస్టుతో పాటు లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగే తొలి టెస్టు నుంచి అతను తప్పుకోవడం ఖాయమైంది. గాయం నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధిస్తే సాంట్నర్‌ను ఇంగ్లండ్‌తో తర్వాతి రెండు టెస్టుల్లో ఆడించాలా లేదా అనేదానిపై టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంటుంది. 2026 టి20 ప్రపంచకప్‌లో సాంట్నర్ సారథ్యంలోనే కివీస్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

కోచ్‌లు కావలెను

తమిళనాడు క్రికెట్ సంఘం ప్రకటన

చెన్నై: దేశవాళీ టోర్నీల్లో సత్తా చాటలేక పోతున్న తమిళనాడు... శిక్షణ బృందాన్ని బలోపేతం చేసే పనిలో పడింది. గత రంజీ సీజన్‌లో గ్రూప్ దశలో ఆరో స్థానంతో సరిపెట్టుకున్న తమిళనాడు జట్టు... సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్‌లో సూపర్ లీగ్ దశకు చేరలేకపోయింది. దీంతో కోచింగ్ స్టాఫ్‌ను మార్పు చేయాలని భావించిన తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ) కొత్త కోచ్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పురుషుల, మహిళల విభాగాల్లో సీనియర్, జూనియర్ జట్లకు కొత్త కోచ్‌లను నియమించనుంది. అలాగే సెలెక్షన్ కమిటీ సభ్యులను సైతం ఎంపిక చేయనుంది. ఈ నెల 10 దరఖాస్తులకు చివరి తేదీ కాగా... పరిమిత ఓవర్లకు, టెస్టు ఫార్మాట్‌కు వేర్వేరు కోచ్‌లను ఎంపిక చేయనుంది. 60 సంవత్సరాలకు లోబడి ఉండి బీసీసీఐ లెవల్-2 కోచింగ్ సర్టిఫికెట్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని టీఎన్‌సీఏ ఒక ప్రకటనలో తెలిపింది. 'నిబంధనల ప్రకారం కొత్త కోచ్‌ల నియామకం చేపడతాం. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం తదుపరి పరీక్షలు నిర్వహిస్తాం' అని టీఎన్‌సీఏ కార్యదర్శి భగవాన్ దాస్ తెలిపారు. ప్రస్తుతం తమిళనాడు జట్లకు సెంథిల్‌నాథన్, వెంకట రమణ కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు.

ఇరాన్‌లోని హార్మూజ్ జలసంధిలో సరుకు నౌకలు, ట్యాంకర్లు బారులు తీరి కనిపిస్తుండగా ఆ పక్కనే బందర్‌అబ్బాస్ తీరంలో ఊయల ఊగుతున్న బాలలు

ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున శుక్రవారం కోల్‌కతా హోల్‌సేల్ మార్కెట్‌లో కూరగాయలున్న భారీ మూటను తరలిస్తున్న కార్మికులు

న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్‌లో అధ్యక్షుడు ట్రంప్, నేరగాడు ఎప్‌స్టీన్‌ల బిల్‌బోర్డ్. లింకన్ ప్రాజెక్టు సంస్థ దీనిని ఏర్పాటు చేసింది

లక్నో ‘హెలెన్ కెల్లర్’

చూడలేదు.. వినబడదు.. 12వ తరగతిలో 98% మార్కులు

లక్నో: చిన్న చిన్న శారీరక లోపాలకే జీవితం అయిపోయిందనుకునేవారు అనేకం. చిన్న ఓటమితోనే జీవితాన్ని చాలించేవాళ్లనీ చూస్తున్నాం. కానీ, ఈ యూపీ యువతి అందుకు విభిన్నం. పరీక్షలను కేవలం తన ప్రతిభకు కొలమానంగా చూడలేదు. తన సంకల్ప బలం ఎంత గొప్పదో సమాజానికి చెప్పాలనుకుంది. ఇటీవల విడుదలైన 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించింది. లక్నోలోని క్రైస్ట్ చర్చ్ కాలేజీ టాపర్‌గా నిలిచింది.

పదో తరగతిలోనూ ప్రతిభ..

లక్నోకు చెందిన సారా మోయిన్ పుట్టుకతోనే అంధురాలు. మూడో తరగతిలో ఉండగా అరుదైన వ్యాధి సార్కోయిడోసిస్ సోకడంతో ఆమె వినికిడి శక్తి కోల్పోయింది. ఎంతమంది డాక్టర్ల దగ్గరకు వెళ్లినా ఫలితం లేదు. ఆమెలోని లోపాల వల్ల 2014లో ఆమెను చేర్చుకోవడానికి నగరంలోని పలు పాఠశాలలు నిరాకరించాయి. అయినా ఆమె వెనుకడుగు వేయలేదు. కూతురుకు బాసటగా నిలవడానికి తండ్రి మోయిన్ ఇద్రిసీ ప్రభుత్వ ఉద్యోగం నుంచి స్వచ్ఛంద విరమణ తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఆమె తల్లి జూలీ హమీద్.. సారాకు అండగా నిలిచారు. 2024లో ఐసీఎస్ఈ 10వ తరగతి పరీక్షల్లోనూ 95శాతం మార్కులు సాధించింది.

అరచేతిపై అక్షరాలు అర్థం చేసుకుని..

ఆ ఫలితం ఆమెకు మరింత ప్రోత్సాహాన్నిచ్చింది. తండ్రి ఆమెను క్రైస్ట్ చర్చ్ కాలేజీలో చేర్పించారు. ప్రిన్సిపల్ రాకేస్ చత్రీ, ఉపాధ్యాయుడు సల్మాన్ అలీ ఖాజీ ఆమెలోని సామర్థ్యాన్ని గుర్తించారు. అప్పటికే ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతి గదిలో ఆయన బోధిస్తున్నారు. అయితే, ఆ విద్యార్థుల్లో రెండు వైకల్యాలున్న ఏకైక విద్యార్థిని సారా. బ్రెయిలీ కీబోర్డుతో కూడిన ల్యాప్‌టాప్‌ను పోలిన ఆర్బిట్ రీడర్ పరికరాన్ని ఉపయోగించి ఆమెకు బోధించారు. ఈ ప్రయాణం అంత సులభమేమీ కాదు. పుస్తకాల్లోని మొత్తం సమాచారాన్ని స్కాన్ చేసి వర్డ్ ఫైల్స్‌గా మార్చాల్సి వచ్చేది. వాటిని ఆర్బిట్ రీడర్‌కు అనుసంధానించి, బ్రెయిలీ కీబోర్డుపై వేళ్లు పెట్టి ఆమె చదవగలిగేది. పునశ్చరణకోసం తల్లి సారా అరచేతిపై అక్షరాలను గీస్తూ ప్రశ్నిస్తే.. ఆమె వాటిని వాక్యాలుగా మార్చుకుని సమాధానాలు ఇచ్చేది. స్కూల్లో సల్మాన్ సార్ ఆమెకు బోధిస్తే.. ఇంట్లో తల్లి, తండ్రి ఆమెకు చేయూతనిచ్చారు. తనకున్న ప్రతికూలతలను అధిగమించి అద్భుతమైన ప్రతిభను కనబరిచింది. ఐఎస్‌సీ 12వ తరగతి పరీక్షల్లో నాలుగు సబ్జెక్టుల్లో ఉత్తమ స్కోరు, తనకు నచ్చిన ఐదు సబ్జెక్టుల్లో 98.2 శాతం మార్కులు సాధించింది. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ముద్దుగా ‘హెలెన్ కెల్లర్’అని పిలుచుకునే సారా కాలేజీ టాపర్‌గా నిలిచింది.

ఐఏఎస్ కావాలని..

సారా.. ఐఏఎస్ అధికారి కావాలని, దివ్యాంగ పిల్లలకోసం పనిచేయాలనే సంకల్పంతో ఉందని ఆమె తండ్రి మోయిన్ తెలిపారు. సారా వంటి అభ్యర్థులు పరీక్షల్లో సహాయకుల(స్క్రైబ్స్)పై ఆధారపడకుండా, ల్యాప్‌టాప్‌లు, బ్రెయిలీ డిస్‌ప్లేల వంటి సహాయక పరికరాలను ఉపయోగించుకోవడానికి పరీక్షా సంస్థలు అనుమతించాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి పిల్లలు తమను తాము వ్యక్తపరచుకోవడానికి సాధనాలు అందుబాటులో ఉండాలని చెబుతున్నారు.

లద్దాఖ్ ధర్మభూమి: అమిత్ షా

లేహ్/జమ్మూ: శతాబ్దాలుగా బౌద్ధ జ్ఞానాన్ని పరిరక్షించి, పోషించి లద్దాక్ ‘సజీవ ధర్మభూమి’గా నిలిచిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. బౌద్ధమతం సంక్షోభాలను ఎదుర్కొన్నప్పుడల్లా బుద్ధుని బోధనలను పరిరక్షించడానికి ఈ నేల కృషి చేసిందని, పరిరక్షించిన ఆ జ్ఞానాన్ని విస్తరించడానికి సహాయపడిందని కొనియాడారు. 75 ఏళ్ల తర్వాత బుద్ధ భగవానుడి పవిత్ర అవశేషాలు లద్దాఖ్‌కు తిరిగి రావడాన్ని ‘చారిత్రక పునఃకలయిక’గా ఆయన అభివర్ణించారు. ఈ అవశేషాల పునరాగమనం లద్దాఖ్ ప్రజలకు బుద్ధ పౌర్ణమి ప్రాముఖ్యతను మరింత పెంచిందన్నారు. 2569వ బుద్ధ పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం లేహ్‌లోని జీవేత్సల్‌లో తథాగతుని పవిత్ర అవశేశాల ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో బుద్ధుని బోధనల ప్రాముఖ్యతను షా నొక్కి చెప్పారు. జ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని, దానిని అంతర్భాగం చేసుకోనంత వరకు మోక్షం సాధ్యం కాదన్నారు. ‘ఆధ్యాత్మిక సాధన లేకుండా జ్ఞానం అసంపూర్ణం. జ్ఞానం లేని ఆధ్యాత్మిక సాధన అంధకారం. ఆధ్యాత్మిక సాధన, జ్ఞానం కలయికే సరైన మార్గం. ఇవన్నీ ఉన్నా నైతిక క్రమశిక్షణ లేకపోతే, జ్ఞానవంతమైన జీవితాన్ని గడపలేరు. నైతిక క్రమశిక్షణే జ్ఞానవంతమైన జీవితానికి ఆధారం’అని షా పేర్కొన్నారు. భారత్‌లో ఉద్భవించిన బుద్ధుని బోధనలు లద్దాఖ్ ద్వారా చైనా, అనేక ఇతర దేశాలకు వ్యాపించాయని, ఎంతో మంది జీవితాలకు మార్గదర్శకంగా మారాయని చెప్పారు. కశ్మీర్, లేహ్, యార్కండ్, ఖోటాన్, టిబెట్‌లను కలిపే సిల్క్ రూట్ వాణిజ్యానికి మాత్రమే కాకుండా, ఆలోచనలకు, గ్రంథాలకు, కళాత్మక సంప్రదాయాలకు వ్యాప్తికి ఒక మార్గంగా మారిందన్నారు. లేహ్‌లో పలు డైరీ ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం సభలో షా మాట్లాడారు. దేశ సరిహద్దులను కాపాడటంలో లద్దాఖ్, కార్గిల్ ప్రజలు చూపిన దేశభక్తిని, త్యాగాలను ప్రశంసించారు. సరిహద్దు నుంచి ప్రమాదం పొంచి ఉన్నప్పుడల్లా సైన్యం రావడానికి ముందు స్థానిక ప్రజలే దేశ రక్షణకు నిలబడ్డారని కొనియాడారు. ఏడేళ్ల తర్వాత తాను ఈ ప్రాంతాన్ని సందర్శించడం, బుద్ధ పౌర్ణమి నాడు ఇక్కడ ఉండటం ఆనందంగా ఉందన్నారు.

పవన్ ఖేరాకు ముందస్తు బెయిల్

రాజకీయ శత్రుత్వానికి సంబంధించిన అంశంగా పేర్కొన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ భార్యపై చేసిన ఆరోపణల కేసులో అత్యున్నత న్యాయస్థానం ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ధర్మాసనం గురువారం ఈ కేసులో ఇరుపక్షాల వాదనలను విని, తీర్పు రిజర్వు చేయడం తెల్సిందే. ఇది రాజకీయ శత్రుత్వానికి సంబంధించిన అంశమని జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌ల ధర్మాసనం శుక్రవారం వ్యాఖ్యానించింది. ఖేరా, అస్సాం సీఎం శర్మ పరస్పరం ఆరోపణలు చేసుకున్నారని తెలిపింది. ‘వ్యక్తిగత స్వేచ్ఛ అత్యంత విలువైన ప్రాథమిక హక్కు. దానికి భంగం కలిగించే ఎలాంటి చర్యకైనా అదేస్థాయిలో సమర్థన కూడా ఉండాలి. ముఖ్యంగా, అందుకు దారి తీసిన పరిస్థితుల వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని భావించినప్పుడు, మరింత లోతుగా సమీక్షించాల్సి ఉంటుంది’అని ధర్మాసనం పేర్కొంది. ముందస్తు బెయిల్ దరఖాస్తును విచారించేటప్పుడు నిష్పక్షపాత దర్యాప్తుకు వీలు కల్పించడంతోపాటు, రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తిగత స్వేచ్ఛ అనే ప్రాథమిక హక్కు మధ్య సమతుల్యత ఉండాలని తెలిపింది. సీఎం హిమంత బిశ్వ శర్మ భార్య వద్ద చట్ట విరుద్ధంగా అనేక దేశాల పాస్ పోర్టులున్నాయని, విదేశాల్లో ఆమె ఆస్తులను కూడబెట్టారని పవన్ ఖేరా చేసిన ఆరోపణలు తీవ్ర వివాదానికి కారణమయ్యాయి. అస్సాం క్రైం బ్రాంచి పోలీసులు విచారణ చేపట్టారు. అరెస్టయిన పక్షంలో పవన్ ఖేరాను ముందస్తు బెయిల్‌పై విడుదల చేయాలని ధర్మాసనం అస్సాం క్రైం బ్రాంచి పోలీసులను ఆదేశించింది. ముందస్తు బెయిల్‌కు తగిన నిబంధనలు, షరతులను సంబంధిత అధికారి నిర్ణయిస్తారని తెలిపింది. విచారణకు సహకరించాలని, అధికారులు కోరినప్పుడు పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని ఖేరాను ఆదేశించింది. విచారణ సమయంలో సాక్ష్యాలను ప్రభావితం చేయడం, తారుమారు చేయడం వంటివి చేయరాదని స్పష్టం చేసింది. కోర్టు అనుమతి లేకుండా దేశం వదిలి వెళ్లరాదని కూడా ఆదేశించింది. విచారణ సమయంలో అవసరమనిపిస్తే ఖేరాకు ఇతర షరతులను విధించే అధికారం కూడా దిగువ కోర్టుకు ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

మొజ్తబా ఖమేనీ సురక్షితంగా, ఆరోగ్యంగా ఉన్నారు

- శత్రువులు ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- ఖమేనీ మిత్రుడు అయతొల్లా మోసెన్ ఖోమీ ఆగ్రహం

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా మొజ్తబా ఖమేనీ ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాలను ఆయన సన్నిహితుడు అయతొల్లా మోసెన్ ఖోమీ ఖండించారు. ఖమేనీ ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంగా, సురక్షితంగా ఉన్నట్లు స్పష్టంచేశారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఖమేనీ అనారోగ్యంతో బాధపడుతున్నారంటూ అమెరికా చేసిన ప్రకటనలో ఎంత మాత్రం వాస్తవం లేదని వివరణ ఇచ్చారు. ఊహాగానాలు, వదంతులు నమ్మొద్దని కోరారు. ఖమేనీ ఆచూకీ తెలుసుకోవడం కోసం శత్రువులు ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసిన ఖమేనీకి ముప్పేమీ ఉండదని తేల్చిచెప్పారు. ప్రజలంతా కలిసి ఆయనను కాపాడుకుంటారని ఉద్ఘాటించారు. అమెరికా దాడుల్లో గాయపడినప్పటికీ ఖమేనీ వేగంగా కోలుకున్నారని, ప్రస్తుతం తన రోజువారీ కార్యకలాపాలు చక్కగా నిర్వహించుకుంటున్నారని మోసెన్ ఖోమీ తెలియజేశారు. షియాలకు ప్రతినిధి అయిన ఖమేనీని దేవుడు రక్షించాడని చెప్పారు.

ఆర్మీ కార్యాచరణ సన్నద్ధతను మెరుగు పర్చండి

ఆర్మీ ట్రెయినింగ్ కమాండ్‌కు రాష్ట్రపతి ముర్ము పిలుపు

ఆర్‌ట్రాక్ కార్యాలయంలో సందర్శకుల పుస్తకంలో సంతకం చేస్తున్న రాష్ట్రపతి ముర్ము

సిమ్లా: భారత ఆర్మీ కార్యాచరణ సన్నద్ధతను మరింత మెరుగుపరిచేందుకు ఉత్సాహంతో కృషి కొనసాగించాలని ఆర్మీ ట్రెయినింగ్ కమాండ్(ఆర్‌ట్రాక్)కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఐదు రోజుల పర్యటనలో ఆఖరి రోజైన శుక్రవారం ఆర్‌ట్రాక్ ప్రధాన కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఆమెకు హిమాచల్ గవర్నర్ కవీందర్ గుప్తా, ఆర్‌ట్రాక్ కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర శర్మ ఆమెకు ఘన స్వాగతం పలికారు. లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర శర్మ ప్రధానకార్యాలయంలోని వివిధ విభాగాలను ఆమెకు వివరించారు. అందులో పనిచేస్తున్న అన్ని విభాగాల సైనికులు, రక్షణ సిబ్బందిని వారు చేస్తున్న అద్భుతమైన కృషికిగాను ఆమె అభినందించారు. అలాగే, భవిష్యత్తులోనూ ఇదే విధమైన రెట్టింపు ఉత్సాహం, పట్టుదలతో కృషిని కొనసాగించాలని ఆమె వారిని కోరారని రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్‌ట్రాక్ ఇటీవల చేపట్టిన కార్యక్రమాలను లెఫ్టినెంట్ జనరల్ శర్మ వివరించారు. డ్రోన్ శిక్షణకు ఇస్తున్న ప్రాధాన్యతను, అత్యాధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడానికి తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు. అలాగే, సైన్యంలో ’రెడ్ టీమింగ్’ అనే భావనను ప్రవేశపెట్టడం, డిజిటైజేషన్, ఆటోమేషన్ దిశగా సాగుతున్న ప్రయత్నాలను వివరించారని రక్షణ శాఖ తెలిపింది. యుద్ధ వ్యూహాల రూపకల్పనతోపాటు సైన్యానికి అవసరమైన వనరులను అభివృద్ధి చేయడంతో ఆర్‌ట్రాక్ కీలకంగా ఉందని రాష్ట్రపతి ప్రశంసించారు. స్నేహపూర్వక దేశాలతో, ఇతర రక్షణ విభాగాలతో సమన్వయం సాధించడంలో వంటివాటిలోనూ ఎనలేని పాత్ర పోషిస్తోందని ఆమె కొనియాడారు. సైన్యంలో శిక్షణ, నాయకత్వ పటిమను పెంపొందించే అత్యున్నత సంస్థల్లో ఒకటైన సిమ్లాలోని ఆర్మీ ట్రైనింగ్ కమాండ్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సందర్శించారని రాష్ట్రపతి భవన్ తెలిపింది. రాష్ట్రపతి ముర్ము స్థానికంగా అనేక కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో ఢిల్లీకి పయనమయ్యారు. సిమ్లాలోని అన్నాడేల్ హెలిప్యాడ్ వద్ద గవర్నర్ కవీందర్ గుప్తా, సీఎం సుఖు ఇతర ఉన్నతాధికారులు ఆమెకు వీడ్కోలు పలికారు.

పెట్రోల్ పంపు వద్ద క్యూలో మృతదేహం

రెండుగంటలు వేచి ఉన్నా అంబులెన్స్‌కు దొరకని పెట్రోల్

మహారాజ్‌గంజ్: దేశంలో ఇంధన కొరతకు అద్దం పట్టే ఘటన ఇది. పికప్ వ్యానులో మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తరలిస్తుండగా అందులో ఇంధనం అయిపోయింది. దీంతో డ్రైవర్ వాహనాన్ని పెట్రోల్ పంపు వద్ద ఆపాడు. అప్పటికే అక్కడ భారీ క్యూ కొనసాగుతోంది. తన వ్యాన్‌లో మృతదేహం ఉందని చెప్పినప్పటికీ వాహనదారులు కనికరం దాల్చలేదు. బంక్ నిర్వాహకులు పట్టించుకోలేదు. అలా, మృతదేహాన్ని ఉంచిన వాహనం రెండు గంటలపాటు క్యూలోనే ఉండిపోయింది. చివరికి, పెట్రోల్ అయిపోయిందని చెప్పి నిర్వాహకులు పంపును మూసివేశారు. ఈ విషాద ఘటనకు సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరలవుతోంది. చివరికి మృతదేహాన్ని కూడా క్యూలోనే ఉంచారంటూ పలువురు వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్‌లో చోటుచేసుకుంది. నిచ్‌లౌల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిధావె గ్రామానికి చెందిన సర్వేశ్ కసౌధన్ బుధవారం చనిపోయారు. అతడి మృత దేహాన్ని ఉంచిన పికప్ వ్యాన్ నిచ్‌లౌల్– చియుటహాన్ రోడ్డులో ఉన్న శ్మశాన వాటికకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతదేహం ఉంచిన వాహనాన్ని పెట్రోల్ పంప్ వద్ద క్యూలో ఉంచడంపై సమాచారం అందిందని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ సిద్ధార్థ గుప్తా స్పందించారు. పెట్రోల్ పంప్ నిర్వాహకులకు నోటీసు ఇచ్చామన్నారు. నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

భూమిలోకి కుంగిపోతున్న మెక్సికో సిటీ

ప్రతిఏటా 10 అంగుళాల చొప్పున కిందికి..

- అమెరికా ఉపగ్రహ చిత్రాల ద్వారా గుర్తింపు
- భూగర్భ జలాల విచ్చలవిడి వినియోగం వల్లే సమస్య
- సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలంటున్న ప్రజలు

మెక్సికో సిటీ: ఉత్తర అమెరికా ఖండంలోని మెక్సికో దేశ రాజధాని మెక్సికో సిటీ క్రమంగా భూమిలోకి కుంగిపోతోంది. ప్రతిఏటా 10 అంగుళాల చొప్పున కుంగిపోతున్నట్లు నిపుణులు గుర్తించారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ ‘నాసా’ఈ వారం విడుదల చేసిన కొత్త ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఈ విషయం తేల్చారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా కుంగిపోతున్న మహానగరాల్లో ఒకటిగా మెక్సికో సిటీ నిలుస్తోంది. ప్రపంచంలోనే అత్యంత విస్తారమైన, జనసాంద్రత కలిగిన నగరాల్లో ఒకటైన ఈ సిటీ విస్తీర్ణం 7,800 చదరపు కిలోమీటర్లు. ఇక్కడ సుమారు 2.2 కోట్ల జనాభా నివసిస్తోంది. మెక్సికన్ సిటీ, దాని చుట్టుపక్కల నగరాలు ఒక పురాతన లేక్ బెడ్‌పై నిర్మితమయ్యాయి. ఈ సిటీలో అనేక వీధులు ఒకప్పుడు కాలువలుగా ఉండేవి. కాలువలు పూడ్చేసి రహదారులు నిర్మించారు.

మరో వందేళ్లలో 39 అడుగులు!

భూగర్భ జలాల విచ్చలవిడి వినయోగం, పట్టణాభివృద్ధి చర్యల కారణంగా భూగర్భ జలవనరులు గణనీయంగా తగ్గిపోయాయి. దాంతో మెక్సికో సిటీ ఒక శతాబ్దానికి పైగా కుంగిపోతోంది. 1573లో నిర్మాణం ప్రారంభమైన మెట్రోపాలిటన్ కేథడ్రల్ వంటి అనేక స్మారక చిహ్నాలు. పురాతన భవనాలు స్పష్టంగా ఒక వైపుకు వంగిపోయి కనిపిస్తున్నాయి. క్షీణిస్తున్న భూగర్భ జలవనరులు కూడా దీర్ఘకాలిక నీటి సంక్షోభానికి కారణమయ్యాయి. ఈ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. మెక్సికో సిటీ వేగంగా కుంగిపోతుండడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాన్ని అంతరిక్షం నుంచి కూడా గుర్తించవచ్చు. పరిస్థితి తీవ్రతను దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. నాసా తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. మెక్సికో సిటీలో కొన్ని ప్రాంతాలు నెలకు సగటున 0.78 అంగుళాల చొప్పున కుంగిపోతున్నాయి. ఎయిర్‌పోర్టుతోపాటు కొన్ని ప్రధాన కట్టడాలు ఆయా ప్రాంతాల్లోనే ఉన్నాయి. కుంగుబాటు రేటు ఏడాదికి కనీసం 9.5 అంగుళాలుగా ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. మరో వందేళ్లలో నగరం 39 అడుగుల మేర కుంగిపోవచ్చని అంచనా వేస్తున్నారు. మెక్సికో సిటీపై నాసా 2025 అక్టోబర్ నుంచి 2026 జనవరి వరకు అధ్యయనం చేసింది. ఇందుకోసం శక్తివంతమైన నిసార్ ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించింది. మెక్సికో సిటీ భూమి కుంగిపోయే సమస్యను పరిష్కరించడంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం ఇన్నాళ్లూ నిర్లక్ష్యం చేయడం వల్లే పరిస్థితి ఇక్కడి దాకా వచ్చిందని అంటున్నారు.

రన్‌వేపై కోతులు!

లక్నో: అసలే కోతులు.. ఆపై విమానాశ్రయ రన్‌వేపైకి వచ్చాయి. ఇంకేముంది విమానం టేకాఫ్ రద్దయ్యింది, ఈ ఘటన లక్నో విమానాశ్రయంలో గురువారం జరిగింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో రాయ్‌పూర్‌కు వెళ్తున్న ఇండిగో విమానం సుమారు 150 మంది ప్రయాణికులతో టేకాఫ్‌కు సిద్ధమైంది. రన్‌వే మీద కొంత దూరం కూడా వెళ్లింది. ఇంతలో రన్‌వేపైకి కోతులు వచ్చాయి. అది గమనించిన పైలట్లు వెంటనే టేకాఫ్‌ను రద్దు చేసి, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం అందించారు. విమానాన్ని వెనక్కి రప్పించిన ఏటీసీ, ఇంధనం నింపుకొన్న తర్వాత సుమారు గంట ఆలస్యంగా క్లియరెన్స్ ఇచ్చింది. ఇండిగో విమానం ఆలస్యం మరికొన్ని విమానాల షెడ్యూల్‌పై ప్రభావం చూపింది. ఈ ఘటనకు కొద్ది ముందే, రన్‌వే సమీపంలో కోతులు ఉన్నాయని విమానాశ్రయంలో ల్యాండ్ అయిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఒకటి అధికారులను అప్రమత్తం చేసిందని, దీంతో బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న ఇండిగో విమానం టేకాఫ్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. విమానాశ్రయం ఉన్న అమౌసి సమీపంలో ఉన్న రహీమాబాద్ గ్రామంలోని పండ్ల తోటల నుంచి కోతులు విమానాశ్రయ ప్రాంగణంలోకి ప్రవేశించి ఉండవచ్చన్నారు. కోతుల వల్ల విమానాలకు అంతరాయం కలిగిన ఘటనలు చాలా అరుదు.

‘వాలీ ఆఫ్ ఫ్లవర్స్’ తరహాలో మరో రెండు పూల తోటలు

లేహ్: కశ్మీర్ లోయలో ‘వాలీ ఆఫ్ ఫ్లవర్స్’తరహాలో మరో రెండు ప్రాంతాలు కనువిందు చేయనున్నాయి. పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూనే లోయలో సహజ సౌందర్యాన్ని పెంచడానికి మరో రెండు ప్రదేశాలను ‘పువ్వుల లోయ’లుగా మార్చే ప్రణాళిక సిద్ధమవుతోంది. లేహ్‌లోని చోగ్లమ్‌సర్, వారి లా ప్రాంతాల్లో ఈ పూల తోటలను ఏర్పాటు చేస్తున్నారు. తీవ్రమైన చలి, తక్కువ ఆక్సిజన్ స్థాయిలు సహా లద్దాఖ్‌లోని కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకోగల అనేక రకాల పూల మొక్కలను నాటుతున్నారు. ఈ పరిస్థితులను తట్టుకుని పెరిగే, ఎత్తైన ఈ భూభాగానికి అనువైన పూల మొక్కల జాతులను గుర్తించడానికి ఇప్పటికే నిపుణులతో సంప్రదింపులు జరిగాయి. ఈ ప్రాజెక్టును వేగవంతం చేయడానికి యంత్రాంగం కృషి చేస్తోందని, ఎంపిక చేసిన ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా చెప్పారు. జూన్ నెలాఖరు నాటికి మెరిసిపోయే పూల తోటలు రూపుదిద్దుకుంటాయని, లేహ్, లద్దాఖ్‌లోని ఇతర ప్రాంతాలను సందర్శించే పర్యాటకులకు ఇవి ప్రధాన ఆకర్షణలుగా మారతాయని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ తోటలు స్థానికంగా ఉపాధి సృష్టించడంతోపాటు, లోయ సహజ ప్రకృతికి మరిన్ని అందాలను జోడిస్తాయన్నారు. లద్దాఖ్‌లో పచ్చదనాన్ని పెంచడమే తమ లక్ష్యమని సక్సేనా తెలిపారు.

అమెరికాలో కూలిన విమానం.. ఐదుగురు మృత్యువాత

వింబర్లీ: అమెరికాలోని టెక్సాస్‌లో చిన్న విమానం కూలిన ఘటనలో అందులోని మొత్తం ఐదుగురూ ప్రాణాలు కోల్పోయారు. ఆస్టిన్‌కు 64 కిలోమీటర్ల దూరంలోని వింబర్లీ వద్ద గురువారం రాత్రి ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన సెస్నా 421సీ రకం విమానంలో మొత్తం ఐదుగురు ఉన్నట్లు హేస్ కౌంటీ జడ్జి రుబెన్ బెసెర్రా తెలిపారు. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. మృతుల వివరాలను వెల్లడించలేదు. ప్రమాదానికి ముందు ఆ విమానం చాలా వేగంతో ప్రయాణించినట్లు తెలిసిందన్నారు. అదే మార్గంలో ప్రయాణించిన మరో విమానం సమీపంలోని శాన్ ఆంటోనియోలో సురక్షితంగా ల్యాండైనట్లు వెల్లడించారు.

న్యూయార్క్‌లోని నివాసంలో భారీ పేలుడు

8 మంది పోలీసులకు గాయాలు

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ నగరంలో భారీ పేలుడుతో పోలీసులకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. గురువారం వేకువజామున 3 గంటల సమయంలో అందిన ఫిర్యాదు మేరకు క్వీన్స్‌లోని ఒక నివాసం వద్దకు 8 మంది పోలీసులు చేరుకున్నారు. గ్యాస్ వాసన వస్తుండటంతో మెల్లిగా తలుపు తెరిచారు. దీంతో, ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఆ తీవ్రతకు పోలీసులు ఎగిరి గేటు అవతలపడ్డారు. దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. మంటలు అంటుకుని కూలిపోయే స్థితిలో ఉన్న ఆ ఇంట్లోకి పోలీసులు ప్రవేశించి ఇద్దరు చిన్నారులను, మరికొందరిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. నిందితుడు ఏసీ యూనిట్‌ను పగులగొట్టి బేస్‌మెంట్ అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించాడని, అతడి వద్ద కత్తి, గుర్తుతెలియని పదార్థం ఉన్న రెండు సంచులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం అతడి జాడ తెలియడం లేదని చెప్పారు. కాలిన గాయాలైన పోలీసులకు ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు.

స్కూల్‌లో సహచరులపై విద్యార్థి కత్తితో దాడి

వాషింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని ఓ స్కూల్‌లో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. గురువారం మధ్యాహ్నం టకోమాలోని హైస్కూల్‌లో ఓ విద్యార్థి సహచరులపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులు, ఒక సెక్యూరిటీ గార్డు గాయపడ్డారు. నిందితుడిగా గుర్తించిన విద్యార్థి కూడా గాయాలయ్యాయి. అతడిని అదుపులోకి తీసుకున్నట్లు టకోమా పోలీసు విభాగం తెలిపింది. క్షతగాత్రులంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించింది. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఇతర వివరాలను వెల్లడించలేదు. ఘటన నేపథ్యంలో స్కూలుకు సెలవు ప్రకటించారు.

రష్యా ఆయిల్ రిఫైనరీపై నాలుగోసారి ఉక్రెయిన్ దాడి

కీవ్: నల్లసముద్ర తీరంలోని రష్యా నగరం టువాప్సేపై గురువారం రాత్రి ఉక్రెయిన్ మరోసారి డ్రోన్ దాడి చేసింది. నగరంలోని చమురు శుద్ధి కేంద్రంపై రెండు వారాల వ్యవధిలో జరిగిన నాలుగో దాడి ఇది. దాడి ఫలితంగా రిఫైనరీ నుంచి పెద్ద ఎత్తున మంట, పొగ వ్యాపించినట్లు ఉక్రెయిన్ ఆర్మీ పేర్కొంది. ఈ కేంద్రంపై ఏప్రిల్, 16, 20, 28వ తేదీల్లో దాడులు జరిపినట్లు గుర్తు చేసింది. దాడితో చెలరేగిన మంటలను అదుపు చేసినట్లు రష్యా అధికారులు ప్రకటించి 24 గంటలు గడవక మునుపే మరోసారి బాంబులు పేలడం గమనార్హం. మరో వైపు రష్యా, శుక్రవారం ఉక్రెయిన్‌లోని టెర్నోపిల్ నగరంలోని లక్ష్యాలపై 50కిపైగా డ్రోన్లను ప్రయోగించింది. దాడుల ఫలితంగా మౌలిక వనరులతోపాటు పారిశ్రామిక కేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తీర నగరం ఒడెసాపైకి కూడా రష్యా డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, పలు బహుళ అంతస్తుల నివాస భవనాలతోపాటు పోర్టులోని వనరులు దెబ్బతిన్నాయని అధికారులు వివరించారు. ఈ దాడుల్లో ఐదుగురు గాయపడినట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఖర్కీవ్ ప్రాంతంతోపాటు క్రివీరిహ్ నగరంపైనా రష్యా దాడి చేసిందన్నారు. రష్యా ప్రయోగించిన మొత్తం 210 షహీద్ డ్రోన్లకు గాను సుమారు 140 వరకు తమ బలగాలు కూల్చి వేశాయన్నారు.

ఇజ్రాయెల్ దాడులతో లెబనాన్‌లో నలుగురు మృతి

టైర్: దక్షిణ లెబనాన్‌లోని మూడు గ్రామాలపై శుక్రవారం ఇజ్రాయెల్ చేపట్టిన వైమానిక దాడుల్లో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఏప్రిల్ 17వ తేదీ నుంచి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ దాడులు జరగడం గమనార్హం. నబాటియే నగరానికి సమీపంలోని హబ్బౌష్ గ్రామ ప్రజలను ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా ఇజ్రాయెల్ ఆర్మీ శుక్రవారం మధ్యాహ్నం హెచ్చరికలు చేసింది. అక్కడే ఉన్న హెజ్‌బొల్లా స్థావరాలపై దాడులు చేస్తామని తెలిపింది. అనంతరం దాడులను కొనసాగించింది. ఇందుకు ప్రతిగా హెజ్‌బొల్లా సాయుధులు ఇజ్రాయెల్ భూభాగంపైకి రాకెట్లు, డ్రోన్లు ప్రయోగించారు. మర్గాలియోట్ సమీపంలో జరిగిన డ్రోన్ దాడిలో మంటలు చెలరేగాయని, ఇద్దరు సైనికులు స్వల్పంగా గాయపడ్డారని ఇజ్రాయెల్ మీడియా తెలిపింది.

‘మహాక్షత్రాంతక’ అనేది ఎవరి బిరుదు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

కళింగ యుద్ధం అశోకుడు పూర్తిగా ధర్మం వైపుగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ధర్మ ప్రచారం కోసం ఈయన ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను నియమించాడు. వీరిని పశ్చిమాసియా, శ్రీలంకకు పంపించాడు. మానవుడిని నైతికంగా, ఉన్నతంగా చేసేవిధంగా, సమాజాన్ని ఉద్ధరించేలా దమ్మ సూత్రాలను రూపొందించాడు. అంతేగాని ప్రజలపై మతాన్ని రుద్దడం వీటి ఉద్దేశం కాదు.

జైనమతం (క్రీ.పూ. 540-468)

జైనమత స్థాపకుడు రుషభనాథుడు. జైన ప్రవక్తలను ‘తీర్థంకరులు’ అంటారు. మొత్తం 24 మంది తీర్థంకరులు ఉండేవారు. రుషభనాథుడు మొదటి తీర్థంకరుడు. 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు. చివరివారైన 24వ తీర్థంకరుడు మహావీరుడు.

మహావీరుడు క్రీ.పూ. 540లో వైశాలి నగరానికి సమీపాన ఉన్న ‘కుంద’ గ్రామంలో క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు సిద్ధార్థుడు, వైశాలి. మహావీరుడి భార్య యశోధ, కుమార్తె ప్రియదర్శిని. ఈయన జీవిత సుఖాలతో తృప్తి చెందక కొంత కాలం దిగంబరుడిగా కఠోర నియమాలను పాటించి తపస్సు చేశాడు. ‘జృంబిక’ గ్రామంలో పరిపూర్ణజ్ఞానాన్ని పొందిన తర్వాత ‘మహావీరుడు’గా పేరు పొందాడు. ఈయన ప్రబోధించిన సరైన క్రియ, సరైన విశ్వాసం, సరైన జ్ఞానం అనే మూడు అంశాలను ‘త్రిరత్నాలు’గా పేర్కొంటారు. పంచవ్రతాల ద్వారా మోక్షాన్ని సాధించవచ్చని మహావీరుడు ప్రవచించాడు. ఈయన తన 72వ ఏట క్రీ.పూ. 468లో ‘పావాపురి’ వద్ద నిర్యాణం చెందాడు.

జైనులు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. ఉపవాసాలు చేసి శరీరాన్ని కృశింపజేసుకొని మరణించడాన్ని ‘సల్లేఖన వ్రతం’గా పేర్కొంటారు. చాలా మంది రాజులు జైనమతాన్ని ఆదరించి అభివృద్ధి చేశారు. చంద్రగుప్త మౌర్యుడు ఈ మతాన్ని అనుసరించి, అన్నింటినీ త్యజించి శ్రావణ బెళగొళలో మరణించాడు. జైనులు ప్రజల భాష అయిన ప్రాకృతంలో తమ సందేశాన్ని ప్రచారం చేశారు. చంద్రగుప్తుడి కాలంలో పాటలీపుత్రంలో స్థూలభద్ర ఆధ్వర్యంలో జైనమత మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జైనమత బోధనలను 12 అంగాలుగా విభజించి క్రోడీకరించారు. కొంతకాలం తర్వాత వస్త్రధారణ విషయంలో అభిప్రాయభేదాలు తలెత్తడం వల్ల జైనమతం దిగంబర, శ్వేతాంబర శాఖలుగా చీలిపోయింది. రెండో జైన సంగీతి క్రీ.శ. 512లో వల్లభి (గుజరాత్)లో దేవార్థి క్షమపణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ‘గంధర్వ’ అనే పవిత్ర గ్రంథాలను క్రమానుసారంగా రాశారు. జైనులు శిల్పకళను అభివృద్ధి చేశారు.

క్రీ.పూ. 4వ శతాబ్దం చివరి రోజుల్లో గంగా లోయ ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చాలామంది జైన గురువులు, సన్యాసులు దక్షిణ భారతదేశానికి తరలివెళ్లారు. ముఖ్యంగా శ్రావణ బెళగొళ ప్రాంతానికి ఎక్కువ మంది వచ్చారు. దక్షిణానికి వచ్చినవారిలో భద్రబాహుడు, చంద్రగుప్త మౌర్యుడు లాంటి ప్రముఖులు ఉన్నారు. మగధలో ఉన్న జైనులు శ్వేతాంబరులయ్యారు. వీరికి గురువు స్థూల బాహుడు.

జైనమత మహత్వ సూత్రాలు:

1) అహింస
2) సత్యభాషణ
3) అపరిగ్రహం (దొంగిలించకపోవడం)
4) అస్తేయం (ఆస్తి లేకుండా ఉండటం)
5) బ్రహ్మచర్యం

వీటిలో మొదటి నాలుగు సూత్రాలు మహావీరుడి ముందు కాలం నుంచే అమల్లో ఉన్నాయి. మహావీరుడు బ్రహ్మచర్యాన్ని పంచమ సూత్రంగా కలిపాడు.

జైనుల ప్రధాన కట్టడాలు:

- అబూ పర్వతం–మహావీరుడి దేవాలయం
- శ్రావణ బెళగొళ–గోమతేశ్వరుడి విగ్రహం
- అజంతా, ఎల్లోరా, ఉదయగిరి గుహలు
- బాదామి – జైన దేవాలయాలు

అజీవికులు: గోశాల మస్కారిపుత్రుడు అజీవిక మతశాఖను స్థాపించారు. ఇది జైన మత సిద్ధాంతాలకు సన్నిహితంగా ఉంది. అశోకుడి కాలంలో ఇది బాగా వ్యాప్తి చెందింది.

హర్యాంక వంశం (క్రీ.పూ.542-490)

క్రీ.పూ. 542–490 మధ్య కాలంలో రాజకీయంగా అనేక పరిణామాలు సంభవించాయి. ఉత్తర భారతదేశంలో మహాజనపదాలుగా పేర్కొనే పదహారు పెద్ద రాజ్యాలు ఏర్పడ్డాయి. వీటినే ‘షోడశ మహాజనపదాలు’ అంటారు. వీటిలో మగధ రాజ్యం శక్తిమంతమైంది. గిరివ్రజం, పాటలీపుత్రం దీని రాజధాని నగరాలు. మొదటగా దీన్ని బృహద్రథ వంశస్థులు పాలించారు. తర్వాత హర్యాంక వంశస్థులు పరిపాలించారు. వీరిలో బింబిసారుడు గొప్పవాడు. ఈయన తర్వాత అజాతశత్రువు పాలించాడు.

అజాతశత్రువు పాలనా కాలం క్రీ.పూ. 495–464. ఈయన హర్యాంక వంశ స్థాపకులైన బింబిసారుడి కుమారుడు. అజాతశత్రువు భార్య వజీరాదేవి. ఈమె కోసలరాజు ప్రసేనజిత్తు కుమార్తె. అజాతశత్రువు వజ్జి గణరాజ్య సమాఖ్యతో 16 ఏళ్ల యుద్ధం చేసి జయించాడు. కంటక శిల, కంటక బోధన అనే రాళ్లు, విసరు రథాలను యుద్ధంలో ఉపయోగించి శత్రురాజులను జయించాడు. ఈయన పాటలీపుత్రాన్ని నిర్మించాడు. ఈయనకు కుణిక అనే పేరు కూడా ఉంది. ఉదయనుడు ఈయన వారసుడు. అజాతశత్రువు గౌతమబుద్ధుడి సమకాలీకుడు. హర్యాంక వంశం తర్వాత మగధను శిశునాగవంశం (క్రీ.పూ. 490–458) పాలించింది. వీరి తర్వాత నంద వంశస్థులు రాజ్యానికి వచ్చారు. నంద వంశంలో మహాపద్మనందుడు గొప్పరాజుగా పేరు పొందాడు. ఈయనకు ‘మహాక్షత్రాంతక’ అనే బిరుదు ఉంది. ఆ తర్వాత చంద్రగుప్త మౌర్యుడు చాణక్యుని సహాయంతో నందవంశాన్ని నిర్మూలించి మౌర్యవంశాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు (క్రీ.పూ. 327–325):

భారతదేశంలో రాజకీయ అనైక్యత కారణంగా విదేశీయులు దండయాత్రలు ప్రారంభించారు. పారశీకులు మొదటగా భారత్‌పై దండయాత్ర చేశారు. వీరిలో ‘సైరస్’, ‘డేరియస్’ గొప్పవారు. పారశీక చక్రవర్తి ‘సైరస్’ గాంధారను జయించారు. వీరి తర్వాత గ్రీకులు భారతదేశంపై దండెత్తారు. గ్రీకు రాజ్యాల్లో అగ్రగామి అయిన మాసిడోనియా చక్రవర్తి అలెగ్జాండర్ విశ్వవిజేతగా పేరు పొందారు. గ్రీకు దండయాత్రల ఫలితంగా భారతదేశానికి, యూరప్ దేశాల మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. భారతీయులు గ్రీకుల నుంచి నాణేల ముద్రణ; శిల్ప, ఖగోళ శాస్త్రాలను నేర్చుకున్నారు.

మౌర్య సామ్రాజ్యం (క్రీ.పూ. 322)

మౌర్యుల చరిత్రకు ఆధారాలు:

విదేశీ గ్రంథాలు: మెగస్తనీస్ (గ్రీకు రాయబారి) రాసిన ‘ఇండికా’, స్ట్రాబో, డియోడరస్, ఏరియస్, ప్లీనీ రచనలు మౌర్యుల చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

సాహిత్య ఆధారాలు: కౌటిల్యుడి ‘అర్థశాస్త్రం’, విశాఖదత్తుడి ‘ముద్రారాక్షసం’.

మత సంబంధ ఆధారాలు: పురాణాలు, బౌద్ధుల దివ్య వదన, అశోకవదన, శ్రీలంకకు సంబంధించిన దీపవంశ, మహావంశ, జైనులకు సంబంధించిన పరిశిష్ట పర్వణ్ మొదలైనవి కూడా మౌర్యుల చరిత్రను తెలుసుకోవడానికి దోహదపడుతున్నాయి. వీటితో పాటు శిలా శాసనాలు, రాతి చెక్కడాలు, గుహలు కూడా మౌర్యుల చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి.

చంద్రగుప్త మౌర్యుడు: ఈయన మౌర్యవంశ స్థాపకుడు. చంద్రగుప్త మౌర్యుడు తన చివరి రోజుల్లో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో జీవించాడు. ‘సల్లేఖన వ్రతం’ ద్వారా మరణించాడు. ఈయన క్రీ.పూ. 303లో ‘సెల్యూకస్ నికేటర్’తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మౌర్య సామ్రాజ్యానికి ఎక్కువ ప్రయోజనం కలిగింది.

బిందుసారుడు (క్రీ.పూ. 298–273): ఈయన చంద్రగుప్త మౌర్యుడి కుమారుడు. బిందుసారుడికి ‘అమిత్రఘాత’, ‘సింహసేనుడు’ అనే బిరుదులు ఉన్నాయి. ఈయన రాజ్యాన్ని మైసూరు వరకు విస్తరించాడు. చాణక్యుడు కొంత కాలంపాటు బిందుసారుడికి కూడా మహామంత్రిగా ఉండి ఆయనకు రాజ్య రక్షణలో సాయపడినట్లుగా టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ పేర్కొన్నారు. బిందుసారుడి పాలనా కాలంలో తక్షశిలలో తిరుగుబాటు జరిగింది. ఈయన ఆజ్ఞ ప్రకారం అశోకుడు తక్షశిలకు వెళ్లి శాంతి నెలకొల్పాడు. బిందుసారుడు గ్రీకు రాజ్యాలతో స్నేహ సంబంధాలు పెంపొందించాడు.

అశోకుడు (క్రీ.పూ. 273–232): ఈయన బిందుసారుడి కుమారుడు. అశోకుడు పట్టాభిషేకం చేసుకున్న తొమ్మిదేళ్లకు (క్రీ.పూ. 262– 61లో) సామ్రాజ్యకాంక్షతో కళింగ రాజ్యంపై దండెత్తి జయించాడు. ఈ యుద్ధం ‘ధర్మాశోకుడు’గా పూర్తిగా పరివర్తనం చెందడానికి కారణమైంది. ఆ తర్వాత ఉపగుప్తుడు అనే బౌద్ధ ఆచార్యుడి వద్ద అశోకుడు బౌద్ధమత దీక్ష స్వీకరించాడు. ధర్మప్రచారానికి పూనుకొని ‘దేవానాం ప్రియ’, ‘ప్రియదర్శిని’ బిరుదులు పొందాడు. బానిసలు, సేవకుల పట్ల కరుణ, తల్లిదండ్రులు, పెద్దల పట్ల విధేయత, గురువుల పట్ల గౌరవం, స్నేహితులు, బంధువులు, పరిచయస్థుల పట్ల ఔదార్యం, పురోహితులు, భిక్షువుల పట్ల ఆదరణ అనేవి అశోకుడు ప్రబోధించిన ‘ధర్మం’లోని సూత్రాలు. ‘అహింసా’ అనేది ‘ధర్మం’లోని ముఖ్యసూత్రం. అశోకుడు 42 ఏళ్లు పరిపాలించి క్రీ.పూ. 232లో మరణించాడు.

వివిధ శాసనాల ఆధారంగా అశోకుడి సామ్రాజ్య సరిహద్దుల గురించి తెలుస్తోంది. షహబద్‌గిరి, మాన్‌షేరా శాసనాలు వాయవ్య సరిహద్దును, రుమిందై శాసనం ఈశాన్య సరిహద్దును, సోపారా, గిర్నార్ శాసనాలు పశ్చిమ సరిహద్దును తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. బబ్రూ శాసనం అశోకుడి బౌద్ధమత స్వీకారం గురించి, ధౌలీ, జునాగడ్ శాసనాలు ఉదాత్త రాజ ధర్మ స్వరూపం గురించి, బరాబర్ శాసనం పరమత సహనం గురించి, 13వ శిలాశాసనం కళింగ యుద్ధం గురించి తెలుపుతున్నాయి. మస్కీలో అశోక అనే పదం ఉంది. కళింగ యుద్ధం తర్వాత అశోకుడి పాలన గురించి కళింగ శాసనం ద్వారా తెలుస్తోంది. రుమిందై, ఇగ్లివ శాసనాలు అశోకుడికి బుద్ధుడిపై ఉన్న గౌరవాన్ని వివరిస్తాయి. తరాయి శాసనం అశోకుడికి బౌద్ధమతంపై ఉన్న గౌరవాన్ని తెలుపుతుంది.

అన్ని మతాల సారాంశం ఆధారంగా అశోకుడు కొన్ని సూత్రాలతో దమ్మను తయారు చేశాడు. ఈయన దమ్మ ప్రచారం కోసం ధర్మమహామాత్రులు అనే ప్రచారకులను పంపిస్తే వారు బౌద్ధ మతాన్ని ప్రచారం చేశారు. భారత ఉపఖండంలో అశోకుడు వేయించిన 14 ప్రధాన శిలా శాసనాలు, ఏడు స్తంభ శాసనాలు, అనేక చిన్నరాతి శాసనాలు లభించాయి. ఇందులో చాలావాటిపై ప్రజల కోసం చేసిన ప్రకటనలు చెక్కారు. 14 శిలా శాసనాలు అశోకుడి దమ్మ సూత్రాల గురించి తెలుపుతున్నాయి. మస్కీ శాసనంలో ‘దేవానాం ప్రియ’ అని ఉంది.

మౌర్య వంశ చివరి పాలకులు (క్రీ.పూ. 232 – 185): అశోకుడి తర్వాత వచ్చిన రాజులు అర్ధ శతాబ్దం పాటు పాలించారు. మౌర్య వంశ చివరి రాజైన బృహద్రథుడిని ఆయన సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించడంతో వీరి పాలన అంతమైంది.

మౌర్యుల పాలనా వ్యవస్థ

భారతదేశంలో ప్రప్రథమంగా కేంద్రీకృత అధికారాలు కలిగిన నిర్దిష్టమైన పరిపాలన రూపొందించింది మౌర్య చక్రవర్తులే. వీరికి పాలనలో సలహా కోసం మంత్రితో పాటు పరిషత్తు ఉండేది. పాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించి వాటికి రాజప్రతినిధులను నియమించారు. భూమిశిస్తు ప్రభుత్వ ప్రధాన ఆదాయం. పంట దిగుబడిలో 4 నుంచి 6వ వంతు వరకు శిస్తు వసూలు చేసేవారు. పాటలీపుత్ర నగర పాలన ముప్పై మంది సభ్యులున్న బోర్డు నిర్వహణలో ఉండేది. వర్తకుల ‘శ్రేణులు’ బ్యాంకులుగా పనిచేశాయి. సమాజంలో బహు భార్యత్వం, కన్యల విక్రయం, సతీసహగమనం లాంటి దురాచారాలు ఉండేవి. ఈ కాలంలో స్త్రీల స్థాయి తగ్గింది. మౌర్యులు ఎక్కువగా ప్రజల భాష అయిన ప్రాకృతాన్ని ఉపయోగించారు. శిలా శాసనాల్లో ‘ఖరోష్టి’, ‘బ్రాహ్మీ’ లిపులను వాడారు....

అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?

ఆధునిక కవితోద్యమాలు

భావ కవిత్వం

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. తొలి తెలుగు భావ కవితా రచన రాయప్రోలు రాసిన ‘లలిత’.

భావ కవిత్వాన్ని వివిధ కవులు వివిధ పేర్లతో పిలిచారు.

1. రాయప్రోలు సుబ్బారావు – అభినవ కవిత
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి – కాల్పనిక కవిత్వం
3. నోరి నరసింహశాస్త్రి – నవ్య కవిత్వం
4. దువ్వూరి రామిరెడ్డి – గీత కవిత్వం

- భావ కవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డాక్టర్ గిడుగు సీతాపతి ‘హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్’ అనే గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆంగ్లంలోని **‘లిరికల్ పోయెట్రీ’**నే తెలుగులో **‘భావ కవిత్వం’** అని పిలుస్తున్నారు.
- ‘లిరిక్’ అంటే **‘గాన గుణం అమరిన రచన’** అని అర్థం.
- భావ కవులు వియోగ శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.
- తెలుగులో నవ్య కవిత్వానికి కట్టమంచి రామలింగారెడ్డి **‘ముసలమ్మ మరణం’** నాందిగా చెప్పవచ్చు.
- భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్తగా **కట్టమంచి రామలింగారెడ్డిని** పిలుస్తారు.
- తెలుగులో నవ్య సాహిత్య యుగానికి **రాయప్రోలు, గురజాడను** ఆద్యులుగా చెబుతారు.
- తెలుగులో భావ కవిత్వానికి మూలం కాల్పనికవాదం. దీనికి మూల పురుషుడు **రూసో.**
- ఆధునిక కాల్పనికతకు న్యాయనిర్ణేత – **రూసో.**
- ఫ్రెంచ్ సాహిత్యంలో జనించిన **‘రొమాంటిసిజమ్’**ను అనుసరించిన కవులనే **‘కాల్పనికవాద కవులు’** అంటారు.
- రొమాంటిసిజంనే ఆంగ్ల సాహిత్యంలో లిరికల్ పోయేట్రిగా పిలుస్తారు.
- **‘లిరికల్ పోయెట్రీ’**ని తెలుగులో **ఆత్మాశ్రయ కవిత్వం** అంటారు.
- కాల్పనికోద్యమ పితామహునిగా **రూసో**ను (1712–88) పాశ్చాత్యులు అంగీకరించారు.
- రూసో ‘న్యూ హెలాయిన్’ రచనలో ప్రణయతత్వాన్ని, ‘సోషల్ కాంట్రాక్ట్’ గ్రంథంలో మానవతావాదాన్ని ప్రతిపాదించారు.
- కాల్పనికోద్యమానికి మూలసూత్రం – **ఆత్మాశ్రయ సిద్ధాంతం.**
- భావకవితోద్యమం మూడు (1910–40) దశాబ్దాల పాటు విలసిల్లింది.

భావ కవిత్వం - నిర్వచనాలు

1. ‘కవికి తన్మయజ్యోతి మెఱుపువలె చటాలున ఒక్కసారి మెరయును. దానికి ప్రతిఫలమే ఉత్తమ కవిత లేక భావకవిత’ – **వేలూరి శివరామశాస్త్రి** (1929 భారతి ప త్రికలో)
2. ‘కవి అవిసృష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వం’ – **విశ్వనాథ సత్యనారాయణ.**
3. ‘కవి హృదయంలో తటిల్లత లాగా అప్రయత్నంగా మెరసిపోయిన భావాల అక్షరాకృతి భావ కవిత’ – **శ్రీశ్రీ.**
4. ‘వస్తు, భావ రచనల్లో భావానికి ప్రాధాన్యత అగ్రతాంబూలమిచ్చిన కవిత భావకవిత్వం’ – **సి.నా.రె.**

భావ కవిత్వం - శాఖలు

- డాక్టర్ సి.నారాయణరెడ్డి భావ కవిత్వాన్ని ఆరు శాఖలుగా విభజించారు.
- భావ కవిత్వంలోని ప్రధాన శాఖలు
 1) ప్రకృతి కవిత్వం 2) ప్రణయ కవిత్వం
 3) సంఘ సంస్కరణ కవిత్వం
 4) దేశ భక్తి కవిత్వం
 5) స్మృతి కవిత్వం 6) మర్మ కవిత్వం

సుప్రసిద్ధ భావకవులు - వారి రచనలు

రాయప్రోలు సుబ్బారావు – లలిత, అనుమితి, తృణకంకణము, ఆంధ్రావళి, మధుకలశం, స్నేహలత, కష్టకమల, వనమాల, జడకుచ్చులు మొదలైనవి.

బసవరాజు అప్పారావు – సెలయేటి గానం, ప్రేమతత్వం, బసవరాజు అప్పారావు గీతాలు.

పింగళి – కాటూరి కవులు – తొలకరి, సంక్రాంతి, సౌందర నందనం.

కాటూరి వెంకటేశ్వరరావు – గుడిగంటలు, పౌలస్త్య హృదయం.

దేవులపల్లి కృష్ణశాస్త్రి – కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి, సంస్కర్త మొదలైనవి.

దువ్వూరి రామిరెడ్డి – పానశాల, భగ్నహృదయం, కడపటి వీడ్కోలు, స్వప్నశేషం, నలజారమ్మ అగ్ని ప్రవేశం, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన మొదలైనవి.

టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

తెలుగు

నండూరి సుబ్బారావు – యెంకి పాటలు

నాయని సుబ్బారావు – సౌభద్రుని ప్రణయ యాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం, వేదనా వాసుదేవం, భాగ్యనగర కోకిల మొదలైనవి.

వేదుల సత్యనారాయణశాస్త్రి – దీపావళి, ముక్తఝరి.

అబ్బూరి రామకృష్ణారావు – మల్లికాంబ, జలాంజలి, ఊహాగానం, నదీ సుందరి, ఎర్రగన్నేరు, రసపిపాసి, కాపుపాలు, మాతృ భూమి, తిక్కన మొదలైనవి.

అడవి బాపిరాజు – శశికళ, గోధూళి, గంగిరెద్దు, వరద గోదావరి, చిగురుటాకులు, గడ్డిపూల పళ్ళెం, తరంగిణి, శిల్పబాల.

విశ్వనాథ సత్యనారాయణ – ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, వరలక్ష్మి త్రిశతి, శశిదూతం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, గిరికుమారుని ప్రేమగీతాలు, భ్రష్టయోగి.

అభ్యుదయ కవిత్వం

సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవితోద్యమం **అభ్యుదయ కవిత్వం.** ఇది ఆంధ్రదేశంలో 1940 నుంచి 1960 చివర వరకు ఉధృతంగా సాగింది. అభ్యుదయం అనే పదానికి **మంగళం, శుభం** అనే నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లంలోని **‘ప్రోగ్రెస్’** అనే పదానికి సమానార్థకంగా తెలుగులో **‘అభ్యుదయం’** అనే పదాన్ని వాడుతున్నారు. ప్రస్తుతం ఈ పదానికి **‘పురోగమనం, ప్రగతి శీలం, చైతన్యం’** అనే స్థూలార్థాలను గ్రహిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను ప్రవేశపెట్టింది **అభ్యుదయ కవిత్వమే.**

- సంస్కృతి పరిరక్షణ కోసం 1935లో **‘పారిస్’**లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది.
- 1935లో డిసెంబర్‌లో అలహాబాద్‌లో **‘ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్’**ను ఏర్పాటు చేశారు.
- 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే **‘ది డెయిలీ ట్రిబ్యూన్’** పత్రికలో భారత అభ్యుదయ రచయితల ప్రణాళికను ప్రకటించారు.
- 1936 ఏప్రిల్ 9, 10 తేదీల్లో లక్నోలో **‘మున్షీ ప్రేమ్ చంద్’** అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ నిర్వహించారు.
- 1932లో ఆడెన్ తదితర కవులు ఆంగ్లంలో **‘న్యూ సిగ్నేచర్స్’** అనే కవితా సంకలనాన్ని వెలువరించారు.
- 1850 దశకంలో వెలువడిన కారల్ మార్క్స్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా కవులు, కళాకారుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.
- తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి **మార్క్సిజమే** పునాది. 1943లో **అభ్యుదయ రచయితల సంఘాన్ని** ఏర్పరిచారు.
- 1943లో తెనాలిలో జరిగిన తొలి అభ్యుదయ రచయితల మహాసభలకు **తాపీ ధర్మారావు** అధ్యక్షత వహించారు.
- 1955లో బెజవాడలో **శ్రీశ్రీ** అధ్యక్షతన 5వ మహాసభలు జరిగాయి.
- చిట్టచివరి సమైక్య అభ్యుదయ రచయితల సభలను 1974లో **చాగంటి సోమయాజులు** అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు.

అభ్యుదయ కవిత్వం - నిర్వచనాలు

1. ‘ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించిందీ, సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటధారిని చేసిందీ అభ్యుదయ కవిత్వం’.
2. ‘ధనిక సమాజం మారాలనుకోవడమే అభ్యుదయం’ – **దేవులపల్లి కృష్ణశాస్త్రి.**
3. ‘చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం’ – **వేల్చేరు నారాయణరావు.**

భావ కవిత్వం లక్షణాలు

1) ఆత్మాశ్రయత
2) ప్రకృతి ప్రీతి
3) స్వేచ్ఛాప్రియత్వం
4) ప్రణయం
5) దేశభక్తి
6) సంఘ సంస్కరణాభిలాష
7) స్త్రీ ఉదాత్త చిత్రణ
8) మానవ సామాజిక స్పృహ
9) మార్మికత
10) స్మృతి

అభ్యుదయ కవిత్వం - లక్షణాలు

1. అంతర్జాతీయ దృక్పథంలో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజాన్ని నెలకొల్పడం.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడం.
4. వర్ణ, వర్గ రహిత సమ సమాజ స్థాపన.
5. శ్రమ దోపిడీ లేని సమాజం.
6. దేశ పారిశ్రామికీకరణం.
7. నవసమాజ నిర్మాణం.

తెలుగులో అభ్యుదయ కవిత్వ ప్రస్థానం

- తెలుగునాట అభ్యుదయ సాహిత్య మూలవిరాట్ – **శ్రీశ్రీ** అని సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు.
- శ్రీశ్రీ 1934 ఏప్రిల్ 12న మహాప్రస్థానం గేయాన్ని రాశారు. ఇది ముద్దుకృష్ణ **‘జ్వాల’** పత్రికలో మొదటగా ప్రచురితమైంది.
- తెలుగులో వెలువడిన తొలి అభ్యుదయ కవితా సంకలనం **‘నయాగరా’**. 1944లో దీన్ని బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం కలసి రచించారు.
- శ్రీశ్రీ మహాప్రస్థానం సంపూర్ణ కావ్యంగా 1950లో ప్రచురితమైంది.

ప్రసిద్ధ కవులు - అభ్యుదయ రచనలు

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ): మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి

ఆరుద్ర: త్వమేవాహం, సినీవాలి, గాయాలు – గేయాలు

ఆవంత్స సోమసుందర్: వజ్రాయుధం (తెలంగాణ సాయుధ పోరాటం)

కాళోజీ నారాయణరావు: నా గొడవ (అభ్యుదయ కవితా సంపుటాలు)

దాశరథి కృష్ణమాచార్యులు: అగ్నిధార, రుద్రవీణ, పునర్నవం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, మహాంధ్రోదయం.

రెంటాల గోపాలకృష్ణ: సర్పయాగం, సంఘర్షణ

అనిసెట్టి సుబ్బారావు: అగ్నివీణ

కె.వి. రమణారెడ్డి: అడవి, భువనఘోష, అంగారవల్లరి

సి. నారాయణరెడ్డి: మంటలు – మానవుడు, అక్షర గవాక్షం, విశ్వంభర, ప్రపంచ పదులు, నాగార్జున సాగరం, సినారె గజళ్ళు.

పురిపండా అప్పలస్వామి: పులిపంజా, అనల పతాకం, సంధ్యావందనం, స్వర్గానికి – నరకానికి.

పఠాభి: ఫిడేలు రాగాల డజన్, పఠాభి పంచాంగం (1964)

శిష్ట్లా ఉమామహేశ్వరరావు: నవమిచిలుక, విష్ణుధనువు

శ్రీరంగం నారాయణబాబు: మౌనశంఖం, రుధిరజ్యోతి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆధునిక కవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు మొదటగా లేవనెత్తిన ప్రణయ సిద్ధాంతం?
 1) కులపాలికా ప్రణయం
 2) కరుణ విప్రలంభం
 3) అమలిన శృంగారం
 4) విప్రలంభ శృంగారం
2. ‘కవి అవిసృష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢ తాపం ఒక చిన్న కావ్యంలో ఊదబడితే’ అది?
 1) విప్లవ కవిత్వం
 2) అభ్యుదయ కవిత్వం
 3) ఆధ్యాత్మిక కవిత్వం
 4) భావ కవిత్వం
3. ‘వేదాంతాలు జీవితాన్నీ, ప్రకృతినీ అవగాహన చేసుకున్నారు; మేం లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతినీ కూడా మారుస్తాం’ అనే శ్రీ రంగం నారాయణ బాబు మాటలు దేనికి ప్రాతినిధ్యం వహిస్తాయి?
 1) దిగంబర కవిత
 2) అభ్యుదయ కవిత
 3) భావ కవిత
 4) విప్లవ కవిత
4. అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?
 1) వర్గ సామరస్యం
 2) వర్గ సంఘర్షణ
 3) ప్రణయ బోధన
 4) దేశభక్తి ప్రబోధం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2.

దేశంలో అత్యధికంగా జీడిపప్పును పండించే రాష్ట్రం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం- వ్యవసాయం

మనదేశంలోని ఆహార పంటలు మొత్తం పంటల సాగు విస్తీర్ణంలో 75 శాతం. వ్యవసాయ ఉత్పత్తుల్లో వీటి విలువ 50 శాతం. ఆహార పంటలను కాయధాన్యాలు, పప్పు ధాన్యాలుగా విభజించవచ్చు.

1. **కాయధాన్యాలు:** వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి, బార్లీ.
2. **పప్పుధాన్యాలు:** పెసలు, కందులు, మినుములు, ఉలవలు, సెనగలు మొదలైనవి.

వరి: మనదేశంలో వరి ముఖ్యమైన ఆహారపంట. ఇది ప్రధానంగా ఖరీఫ్ కాలానికి చెందిన పంట. కానీ రబీలోనూ పండిస్తున్నారు.

వరి పండించడానికి అనువైన పరిస్థితులు:

1) ఒండలి నేలలు అనుకూలం.
2) వార్షిక వర్షపాతం 150 సెం.మీ. నుంచి 200 సెం.మీ. వరకు ఉండాలి.
3) 22° సెంటీగ్రేడ్ నుంచి 32° సెంటీ గ్రేడుల ఉష్ణోగ్రత ఉండాలి.
4) వ్యవసాయ కూలీల లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాలు ఈ పంటకు అను వైనవి.

- వరి ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది.
- భారతదేశంలో ఉత్పత్తి పరంగా పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో, ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- దేశంలో వరిని అధికంగా ఉత్పత్తి చేసే ప్రాంతం గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతం.

గోధుమ: గోధుమ ప్రధానంగా 'రబీ' కాలపు పంట. శీతాకాలం ఈ పంటకు అనుకూలమైంది. విస్తీర్ణపరంగా, ఉత్పత్తిపరంగా వరి తర్వాత ఇది రెండో ప్రధాన ఆహార పంట.

- గోధుమ ఉత్పత్తిలో చైనా మొదటిస్థానంలో ఉంది. రెండో స్థానంలో భారత్ ఉంది.
- గోధుమ పంట ఉత్పత్తి పరంగా భారత్‌లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో, పంజాబ్ రెండో స్థానంలో ఉన్నాయి.
- వరి, గోధుమ పంటలకు సంబంధించి భారతదేశంలో ఎక్కువ ఉత్పత్తి 1960వ దశాబ్దంలో (1965 తర్వాత) ప్రారంభమైంది. దీన్నే 'హరిత విప్లవం' అంటారు.

భారతదేశంలో హరిత విప్లవం (1965-66)

పురాతన వ్యవసాయ పద్ధతులకు స్వస్తి పలుకుతూ.. అధిక దిగుబడినిచ్చే వంగడాలు, రసాయనిక ఎరువులు, నీటిపారుదల వసతులను ఉపయోగించి, కొత్త సాంకేతిక పద్ధతులతో చేసే వ్యవసాయాన్ని హరిత విప్లవం (Green Revolution) అంటారు. దీన్నే సస్యవిప్లవం అని కూడా అంటారు.

- ఇందులో భాగంగా 1965–66లో అధిక దిగుబడులనిచ్చే వంగడాల కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రవేశ పెట్టారు.
- హరిత విప్లవం అనే పదాన్ని మొదటగా వాడిన వ్యక్తి విలియం గాండ్.
- హరిత విప్లవాన్ని మొదటిసారిగా ప్రపంచంలో వ్యాప్తి చేసిన వ్యక్తి నార్మన్ బోర్లాగ్ (మెక్సికో).
- భారత్‌లో హరిత విప్లవాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన వ్యక్తి M.S. స్వామినాథన్. ఈయననే భారతదేశ హరిత విప్లవ పితామహుడు అంటారు.
- హరిత విప్లవం వల్ల అధికంగా ప్రయోజనం పొందిన పంటలు వరుసగా..
  1. గోధుమ, 2. వరి,
  3. జొన్న,
  4. మొక్కజొన్న.
- దీనివల్ల తక్కువ ప్రయోజనం పొందిన పంటలు 1. పప్పుధాన్యాలు,
  2. నూనెగింజలు.

రెండో హరిత విప్లవం (2006):

2004లో వాజ్‌పేయి ప్రభుత్వం రెండో హరిత విప్లవం గురించి 11వ ప్రణాళికలో పేర్కొన్నప్పటికీ అది అమలు కాలేదు.

- 2006 మే 26న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ దీన్ని ప్రకటించాడు.
- భారతదేశంలో వర్షపాతం తక్కువగా ఉండే మెట్ట ప్రాంతాల్లో చిరుధాన్యాలను పండిస్తున్నారు. చిరుధాన్యాల్లో ముఖ్యమైనవి.. జొన్నలు, కొర్రలు, సజ్జలు, రాగులు, మొక్కజొన్న.
- ప్రోటీన్లు అధికంగా ఉండే 'లెగుమినేసి' కుటుంబానికి చెందిన పంటలన్నీ పప్పుధాన్యాల కిందకి వస్తాయి. వీటిలో ముఖ్యమైనవి సెనగలు, కందులు, పెసలు, మినుములు.

వాణిజ్య లేదా నగదు పంటలు

భారతదేశంలో నగదు పంటలు మొత్తం పంట విస్తీర్ణంలో 15 శాతం ఆక్రమిస్తూ, ఉత్పత్తిలో 40 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

- పత్తిని 'తెల్లబంగారం' అంటారు.
- భారతదేశంలో ఎక్కువగా పొడుగు గింజ, మధ్యరకం గింజ పత్తిని పండిస్తున్నారు.
- పత్తి ప్రధానంగా నల్లరేగడి నేలలో పండుతుంది.
- భారతదేశంలో అధికంగా రబ్బరు ఉత్పత్తి (దాదాపు 85 శాతం) కేరళలో జరుగుతోంది.
- దేశంలో మొదటిసారిగా తేయాకు సాగుచేసిన ప్రాంతం అసోం.

శ్వేత విప్లవం (White Revolution)

- పాల ఉత్పత్తిలో అధిక దిగుబడులను తీసుకు రావడానికి శ్వేత విప్లవాన్ని ప్రవేశ పెట్టారు.
- దీని ముఖ్య ఉద్దేశం.. గ్రామీణ ఉత్పత్తి దారులు, పట్టణ వినియోగదారులను కలపడం.
- ఇందులో భాగంగా 1970లో 'ఆపరేషన్ ఫ్లడ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- శ్వేత విప్లవ పితామహుడు – వర్గీస్ కురియన్
- ప్రస్తుతం ప్రపంచంలో పాల ఉత్పత్తిలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది.
- ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఉత్పత్తిపరంగా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

నీలి విప్లవం (Blue Revolution)

ఇది చేపల ఉత్పత్తిలో పెరుగుదల కోసం చేపట్టిన కార్యక్రమం.

- చేపల పెంపకాన్ని 'పిసికల్చర్' అంటారు.
- చేపల గురించి చేసే అధ్యయనాన్ని 'ఇక్తియాలజీ' అంటారు.
- చేపల ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా, జపాన్ తర్వాత భారతదేశం ఉంది.
- పట్టు పురుగుల పెంపకాన్ని 'సెరికల్చర్' అంటారు.
- తేనేటీగల పెంపకాన్ని 'ఎపికల్చర్' అంటారు.

వివిధ పంటలు - పరిశోధనా సంస్థలు

- జాతీయ వరి పరిశోధనా కేంద్రం – కటక్ (ఒడిశా)
- అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రం – మనీలా (ఫిలిప్పీన్స్)
- భారత చెరకు పరిశోధనా సంస్థ – లక్నో (ఉత్తరప్రదేశ్)
- సుగంధ ద్రవ్యాల పరిశోధనా కేంద్రం – కాలికట్ (కేరళ)
- కేంద్రీయ పత్తి పరిశోధనా కేంద్రం – నాగపూర్ (మహారాష్ట్ర)
- ఇక్రిసాట్ (International Crops Research Institute for Semi Arid Tropics - ICRISAT) – హైదరాబాద్
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ – న్యూ ఢిల్లీ
- తేయాకు పరిశోధనా కేంద్రం – జోర్హట్ (అసోం)
- భారత ప్రభుత్వం 2000 జనవరి 28న మొదటిసారిగా 'జాతీయ వ్యవసాయ విధానాన్ని' ప్రకటించింది. ఇందులో భాగంగా 'ఇంద్రధనస్సు' విప్లవాన్ని ప్రకటించింది. ఈ విప్లవంలో మిశ్రమ వ్యవసాయం కూడా ఒక భాగం.

భారతదేశంలో వివిధ రకాల పంటలు - అధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రాలు

పంట	రాష్ట్రాలు
1. వరి	1. పశ్చిమ బెంగాల్ 2. ఉత్తరప్రదేశ్
2. గోధుమ	1. ఉత్తరప్రదేశ్ 2. పంజాబ్
3. జొన్న	1. మహారాష్ట్ర 2. కర్ణాటక
4. రాగి	1. కర్ణాటక 2. తమిళనాడు
5. వేరుసెనగ	1.గుజరాత్ 2. తమిళనాడు
6. పత్తి	1. గుజరాత్ 2.మహారాష్ట్ర
7. జనుము	1. పశ్చిమ బెంగాల్ 2. బిహార్
8. చెరకు	1. ఉత్తర ప్రదేశ్ 2. మహారాష్ట్ర
9. కాఫీ	1. కర్ణాటక 2. కేరళ
10. తేయాకు	1. అసోం 2. పశ్చిమబెంగాల్
11. రబ్బరు	1. కేరళ
12. పాలు	1. ఉత్తరప్రదేశ్ 2. గుజరాత్

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారతదేశ 'స్పైస్ గార్డెన్'గా పేరు పొందిన రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్–2012)
   1) కేరళ 2) ఆంధ్రప్రదేశ్
   3) తమిళనాడు 4) కర్ణాటక
2. కిందివాటిలో ఏ రాష్ట్రం సోయాబీన్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తుంది? (డిప్యూటీ జైలర్స్ –2012)
   1) బిహార్ 2) మధ్యప్రదేశ్
   3) ఉత్తరప్రదేశ్ 4) పశ్చిమ బెంగాల్
3. జతపరచండి.

పంట	ముఖ్య ఉత్పాదక రాష్ట్రం
ఎ. కాఫీ	1. కేరళ
బి. పత్తి	2. గుజరాత్
సి. పెండలం	3. ఆంధ్రప్రదేశ్
డి. పొగాకు	4. తమిళనాడు
ఇ. మిరప	5. కర్ణాటక

   (డిప్యూటీ జైలర్స్–2012)
   1) ఎ–1, బి–2, సి–3, డి–4, ఇ–5
   2) ఎ–4, బి–5, సి–3, డి–2, ఇ–1
   3) ఎ–3, బి–5, సి–3, డి–2, ఇ–1
   4) ఎ–5, బి–2, సి–1, డి–3, ఇ–4
4. భారతదేశ సహజ సిద్ధ రబ్బరు అవసరాలను ఎక్కువగా తీర్చే రాష్ట్రం ఏది? (డిప్యూటీ జైలర్స్ –2012)
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) ఏదీకాదు
5. ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ భాగంతో పాటు హరిత విప్లవం వల్ల ముందు లబ్ధి పొందిన రాష్ట్రాలు? (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్–2013)
   1) పంజాబ్, హర్యానా
   2) పంజాబ్, మహారాష్ట్ర
   3) హర్యానా, ఆంధ్రప్రదేశ్
   4) మహారాష్ట్ర, కర్ణాటక
6. కిందివాటిలో సిల్క్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం? (కానిస్టేబుల్–2012)
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) అసోం
7. భారతదేశంలో అత్యధికంగా జీడిపప్పును పండించే రాష్ట్రం ఏది? (కానిస్టేబుల్–2012)
   1) ఆంధ్రప్రదేశ్ 2) అసోం
   3) కేరళ 4) కర్ణాటక
8. భారతదేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం దేని ఎగుమతి ద్వారా లభిస్తుంది? (కానిస్టేబుల్–2012)
   1) ఇనుము 2) టీ
   3) జనపనార 4) పంచదార
9. నీలి విప్లవం అంటే ఏమిటి? (కానిస్టేబుల్–2013)
   1) వాణిజ్య పంటల ఉత్పత్తి
   2) నీలి మందుల ఉత్పత్తి
   3) నీలి లోహ ఉత్పత్తి
   4) చేపల ఉత్పత్తి
10. కిందివాటిలో ఏ పంటకు ఒక హెక్టార్‌కు ఎక్కువ నీరు అవసరం? (కానిస్టేబుల్– 2013)
    1) చెరకు 2) గోధుమ
    3) మొక్కజొన్న 4) బార్లీ
11. హరిత విప్లవానికి కారణమైన వ్యవసాయ శాస్త్రజ్ఞుడు ఎవరు? (జైల్ వార్డెన్–2012)
    1) కురియన్ 2) ఎస్.ఎస్. భట్నాగర్
    3) శాంతి స్వరూప్ 4) నార్మన్ బోర్లాగ్

సమాధానాలు

1) 1; 2) 2; 3) 4; 4) 1;
5) 1; 6) 3; 7) 3; 8) 2;
9) 4; 10) 1; 11) 4.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో వరి ఉత్పత్తిలో అగ్రస్థా నంలో ఉన్న రాష్ట్రం ఏది?
   1) అసోం 2) పశ్చిమ బెంగాల్
   3) ఆంధ్రప్రదేశ్ 4) ఉత్తరప్రదేశ్
2. భారతదేశంలో తేయాకును ఎక్కువగా ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది?
   1) ఉత్తరాంచల్ 2) తమిళనాడు
   3) అసోం 4) పశ్చిమ బెంగాల్
3. భారత కేంద్రీయ వరి పరిశోధనా సంస్థ ఎక్కడ ఉంది?
   1) కటక్ 2) మైసూర్
   3) కోల్‌కతా 4) బెంగళూరు
4. గ్రీన్ రివల్యూషన్ ప్రభావం దేనిపై ఎక్కువగా కనిపిస్తుంది?
   1) పప్పుధాన్యాలు 2) గోధుమలు
   3) వరి 4) నూనె గింజలు
5. క్షీర విప్లవ పితామహుడు ఎవరు?
   1) రామన్ కురియన్
   2) రామనాథ్ కృష్ణన్
   3) వర్గీస్ కురియన్ 4) జె.ఎం. జోసఫ్
6. పట్టు ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్న రాష్ట్రం ఏది?
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 2;
5) 3; 6) 2.

What does "$" mean in a code language?

BANK EXAMS
REASONING

Model Questions

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "β64@%". How is "DELAY" written in that code?
   1) β4H2%
   2) β4@2%
   3) %42@β
   4) %4@2β
   5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
   1) None 2) One 3) Two
   4) Three 5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
   1) Cousin
   2) Nephew
   3) Aunt
   4) Data inadequate
   5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:

394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
   1) 632 2) 783
   3) 576
   4) 895 5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
   1) 895 2) 394
   3) 576
   4) 632 5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
   1) 576 2) 895
   3) 783
   4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
   1) 81 2) 79
   3) 77
   4) 80
   5) None of these
8. Which of the following pairs of words have the same relationship as FAN : HEAT?
   1) Water : Drink
   2) Light : Night
   3) Teach : Student
   4) Air : Breathe 5) Food : Hunger
9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
   1) V 2) T
   3) S
   4) Data Inadequate
   5) None of these
10. If "B × C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B – C" means "B is the sister of C", then what does "M + N – P × Q" mean?
    1) M is the brother-in-law of Q
    2) M is the uncle of Q
    3) M is the son-in-law of Q
    4) Q is the mother-in-law of M
    5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement carefully and answer the questions given below:

R D A K 5 B I 2 M J E N 9 7
U Z V 1 W 3 H 4 F Y 8 P 6 T G

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
    1) None 2) One
    3) Two
    4) Three 5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
    1) M 2) J
    3) 8
    4) 5
    5) None of these
13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
    1) E 9 J 2) Z 1 U
    3) H W 4
    4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
    1) 5 2) Z 3) V
    4) I 5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three

Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:

1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
    I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
    II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
    I) P is heavier than M and T.
    II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
    I) "5 $ # 3" means "flowers are really good".
    II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
    I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
    II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end..

Key And Explanations

1. Ans: 4

P	L	A	N	T	Y	I	E	D
$	@	2	✶	©	β	6	4	%

∴ DELAY ⇒ %4@2β

2. Ans: 3. TRAIL, TRIAL,
3. Ans: 2. A's father
   = the only brother of D's sister's son
   = D's sister's son
   = D's nephew
4. Ans: 5. Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. Ans: 1. 895 ⇒ 8 + 9 = 17 is not divisible by 3.
6. Ans: 1. Look for the highest third digit.
7. Ans: 2. In general, n^{th} letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. Ans: 5. The first dispels the second.
9. Ans: 4. V > Q > R; T > R; S > V Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. Ans: 3.

```
                 Q
                 |
M(+) ⇔ N(–)<—>P(–)
```

11. Ans: 1.
12. Ans: 1. 8^{th} to the left of 17^{th} from left = 17 – 8 = 9^{th} from the left = M
13. Ans: 5. In all others, the first and third elements are consecutive ones.
14. Ans: 3. 6^{th} to the right of 19^{th} from the right = 19 – 6 = 13^{th} from the right = V
15. Ans: 4. M, F and T
16. Ans: 4. Only two words are common between I and II.
17. Ans: 5. From I: P > M, T
    From II: J > W > P
    Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. Ans: 5.
    From I: 5$#3 = flowers are really good ... (i)
    From II: 7#35 = good flowers are available ... (ii)
    From I and II: 5#3 = flowers are good ... (iii)
    Putting (iii) in (i), we get: $ = really.
19. Ans: 1. **From I:** Suresh = 12^{th} from left
    Mohan = 17^{th} from right
    ∴ No. of students between them = 50 – 29 (12+17) = 21
    From II: No data about Mohan.